
ఈనాడు

విజయవాడ 23-5-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 283
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛాంపియన్



పూరన్ 56 నాటౌట్

ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన సన్‌రైజర్స్ హైదరాబాద్, గత మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను ఇంటిముఖం పట్టిస్తే.. ఇప్పుడు గుజరాత్ టైటాన్స్‌కు లఖ్‌నవూ చెక్ పెట్టింది. మరో విజయంతో పట్టికలో అగ్రస్థానాన్ని పదిలం చేసుకోవాలని చూసిన టైటాన్స్‌కు ఎల్‌ఎస్‌జీ షాకిచ్చింది. మిచెల్ మార్ష్ విధ్వంసక శతకానికి మిగతా బ్యాటర్ల మెరుపులూ తోడవడంతో లఖ్‌నవూ ఏకంగా 235 పరుగులు చేసింది. ఛేదనలో టైటాన్స్ కొంత పోరాడినా ఓటమి తప్పలేదు.

గుజరాత్‌కు పంచ్

- లఖ్‌నవూ చేతిలో ఓటమి
- మార్ష్ మెరుపు సెంచరీ
- మెరిసిన పూరన్



మార్ష్ 117


1 ఐపీఎల్‌లో సెంచరీలు సాధించిన తొలి సోదర ద్వయంగా షాన్ మార్ష్, మిచెల్ మార్ష్ రికార్డు నెలకొల్పారు. షాన్ 2008లో పంజాబ్ తరఫున శతకం సాధిస్తే.. ప్రస్తుతం మిచెల్ లఖ్‌నవూకు ఆడుతూ సెంచరీ కొట్టాడు.

అహ్మదాబాద్

ఐపీఎల్-18 ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించినా లఖ్‌నవూ జూలు విదిల్చింది. టేబుల్ టాపర్ గుజరాత్ టైటాన్స్‌ను గురువారం ఆ జట్టు 33 పరుగుల తేడాతో మట్టికరిపించింది. మొదట మిచెల్ మార్ష్ (117; 64 బంతుల్లో 10×4, 8×6) మెరుపు శతకం సాధించడంతో ఎల్‌ఎస్‌జీ 2 వికెట్లకు 235 పరుగుల భారీ స్కోరు సాధించింది. నికోలస్ పూరన్ (56 నాటౌట్; 27 బంతుల్లో 4×4, 5×6), మార్‌క్రమ్ (36; 24 బంతుల్లో 3×4, 2×6) కూడా రాణించారు. అనంతరం ఛేదనలో గుజరాత్ 9 వికెట్లకు 202 పరుగులే చేయగలిగింది. షారుఖ్ ఖాన్ (57; 29 బంతుల్లో 5×4, 3×6) టాప్‌స్కోరర్. ఎల్‌ఎస్‌జీ బౌలర్లలో ఒరూర్క్ (3/27), ఆయుష్ బదోని (2/4) రాణించారు. 13 మ్యాచ్‌ల్లో గుజరాత్‌కిది 4వ ఓటమి కాగా.. అన్నే మ్యాచ్‌లు ఆడిన లఖ్‌నవూ ఆరో విజయం నమోదు చేసింది.

బదులు.. సరిపోలేదు: ఛేదనలో గుజరాత్ కూడా దాటిగానే ఆడింది. టాప్-5 బ్యాటర్లలో అందరూ చెప్పుకోదగ్గ స్కోర్లే సాధించారు. కానీ షారుఖ్ ఖాన్ మినహా ఎవ్వరూ అర్ధశతకం సాధించలేకపోయారు. లక్ష్యం మరీ పెద్దది కావడంతో టైటాన్స్‌కు ఓటమి తప్పలేదు. ఈ సీజన్లో నిలకడగా మెరుపులు మెరిపిస్తూ నిలిచిన సాయి సుదర్శన్ (21) ఇన్నింగ్స్‌ను మెరుగ్గానే ఆరంభించినా ఎక్కువసేపు నిలవలేకపోయాడు. అయితే శుభ్‌మన్ (35; 20 బంతుల్లో 7×4), బట్లర్ (33; 18 బంతుల్లో 3×4, 2×6) దాటిగా ఆడి జట్టును రేసులో నిలిపారు. 7 ఓవర్లకు ఆ జట్టు 76/1తో మెరుగ్గా కనిపించింది. శుభ్‌మన్, బట్లర్ తక్కువ వ్యవధిలో వెనుదిరగడంతో టైటాన్స్ కష్టాల్లో పడింది. ఆ జట్టుకు పెద్ద ఓటమి తప్పదనుకుంటే.. రూథర్‌ఫర్డ్, షారుఖ్ ఖాన్ జోడీ మెరుపులతో పరిస్థితి మార్చేసింది. ఇద్దరూ పోటీపడి భారీ షాట్లు ఆడడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. 14-16 మధ్య 3 ఓవర్లలోనే 53 పరుగులు రావడంతో సమీకరణం 4 ఓవర్లలో 54గా మారింది. రూథర్‌ఫర్డ్, షారుఖ్ ఉన్న ఊపులో టైటాన్స్‌ను గెలిపించేలానే కనిపించారు. కానీ తర్వాతి ఓవర్లో ఒరూర్క్.. రూథర్‌ఫర్డ్ (33; 22 బంతుల్లో 1×4, 3×6), తెవాతియా (2)లను ఔట్ చేసి టైటాన్స్ ఆశలపై నీళ్లు చల్లాడు. షారుఖ్ కూడా తర్వాత ఎంతోసేపు నిలవలేదు. చివరి 4 ఓవర్లలో మొత్తం 6 వికెట్లు కోల్పోయిన గుజరాత్ 20 పరుగులే చేయగలిగింది. పార్ట్‌టైమ్ స్పిన్నర్ బదోని చివరి ఓవర్లో 4 పరుగులే ఇచ్చి రబాడ (2), సాయికిశోర్ (1)లను బౌల్డ్ చేశాడు.

మార్ష్ ధ్వంసరచన: గత మ్యాచ్‌తో ప్లేఆఫ్స్ రేసుకు దూరమైన లఖ్‌నవూ.. ఈ మ్యాచ్‌లో గుజరాత్‌పై చెలరేగిపోయింది. లీగ్‌లో అత్యుత్తమ బౌలింగ్ దళాల్లో ఒకటైన టైటాన్స్ బృందాన్ని ఎల్‌ఎస్‌జీ బ్యాటర్లు మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్, మార్‌క్రమ్ ఉతికారేశారు. కేవలం ఈ ముగ్గురే జట్టు స్కోరును 200 దాటించేశారు. సూపర్ ఫామ్‌లో ఉన్న మార్ష్, మార్‌క్రమ్.. ఆరంభం నుంచే దాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. గుజరాత్ బౌలర్లలో సిరాజ్ ఒక్కడే కొంచెం మెరుగ్గా (ఎకానమీ 9.25) బౌలింగ్ చేశాడు. మిగతా బౌలర్లంతా ఓవర్‌కు 11 పరుగులకు తక్కువ కాకుండా సమర్పించుకున్నారు. ఆరంభంలో, 12వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన స్పిన్నర్ రషీద్ ఖాన్ బౌలింగ్‌లో మార్ష్ వరుసగా 6, 4, 6, 4, 4 బాదడం విశేషం. ఈ సీజనంతా ఎంతో నిలకడగా వికెట్లు తీస్తూ పొదుపుగా బౌలింగ్ చేస్తున్న ప్రసిద్ధ్ కృష్ణ సైతం ఎల్‌ఎస్‌జీ బ్యాటర్ల దాటికి వికెట్ లేకుండా 44 ఇచ్చుకున్నాడు. మార్ష్, మార్‌క్రమ్ పోటాపోటీగా షాట్లు ఆడడంతో లఖ్‌నవూ వికెట్ కోల్పోకుండా 9 ఓవర్లకే 83 పరుగులు చేసింది. తర్వాతి ఓవర్లో మార్‌క్రమ్‌ను సాయికిశోర్ ఔట్ చేసినా.. టైటాన్స్‌కు ఉపశమనం లేకపోయింది. ఎదుర్కొన్న తొలి బంతికే సిక్సర్ బాదిన పూరన్.. మార్‌క్రమ్‌ను మించి రెచ్చిపోయాడు. అతను 22 బంతుల్లోనే అర్ధశతకం సాధించడం విశేషం. మరో ఎండ్‌లో మార్ష్ తగ్గేదే లేదన్నట్లు దూసుకెళ్లాడు. 33 బంతుల్లో అర్ధశతకం సాధించిన అతను.. రషీద్ ఓవర్లో సాగించిన విధ్వంసంతో చూస్తుండగానే 80ల్లోకి వెళ్లిపోయాడు. 56 బంతుల్లో అతడి శతకం పూర్తయింది. ఆ తర్వాత కూడా దూకుడు కొనసాగించిన మార్ష్.. అర్షద్ ఖాన్ వేసిన 19వ ఓవర్లో వెనుదిరిగాడు. ఆఖర్లో పంత్ రెండు కళ్లు చెదిరే సిక్సర్లు బాదడంతో స్కోరు 230 దాటింది.



ఒరూర్క్ 3/27

● లఖ్‌నవూ ఇన్నింగ్స్ రెండో ఓవర్లో బౌలింగ్ చేస్తూ గుజరాత్ పేసర్ అర్షద్ ఖాన్ రెండుసార్లు జారి పడ్డాడు. స్టంప్స్ దగ్గర ప్రదేశంలో అతడి కాలు జారింది. ఒకటికి రెండుసార్లు ఇలా జరిగి అర్షద్ దెబ్బలు తాకడంతో అంపైర్లు ఆటను ఆపి.. ఆ ప్రదేశంలో మట్టి వేయించారు. ఆ తర్వాత అర్షద్ ఇబ్బంది లేకుండా బౌలింగ్ చేశాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
గుజరాత్	13	9	4	0	18	0.602
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబయి	13	8	5	0	16	1.292
దిల్లీ	13	6	6	1	13	-0.019
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
హైదరాబాద్	12	4	7	1	9	-1.005
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

ఆరెంజ్ క్యాప్
సాయిసుదర్శన్ (గుజరాత్) 638 పరుగులు
ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌కు ఇచ్చే టోపీ

పర్పుల్ క్యాప్
ప్రసిద్ధ్ కృష్ణ (గుజరాత్) 21 వికెట్లు
ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు ఇచ్చే టోపీ

దిగ్వేశ్ లేడు కానీ..

లఖ్‌నవూ యువ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠి 'నోట్‌బుక్' సంబరాలు ఈ సీజన్లో ఎంత చర్చనీయాంశమయ్యాయో తెలిసిందే. బ్యాటర్లను కవ్వించేలా సాగిన అతడి సంబరాలపై వివాదాలు కూడా చెలరేగాయి. ఒకటికి మూడుసార్లు అతడికి జరిమానా కూడా పడింది. దీంతో పాటు అయిదు అయోగ్యతా పాయింట్లు కూడా ఖాతాలో చేరడంతో ఓ మ్యాచ్ నిషేధం ఎదుర్కొన్నాడు దిగ్వేశ్. అయితే గురువారం టైటాన్స్‌తో మ్యాచ్‌లో అతను లేకపోయినా.. 'నోట్‌బుక్' సంబరాలు మాత్రం ఆగలేదు. బట్లర్‌ను బౌల్డ్ చేసిన ఎల్‌ఎస్‌జీ పేసర్ ఆకాశ్ సింగ్.. సంతకం చేస్తున్నట్లుగా డగౌట్ వైపు చూపిస్తూ దిగ్వేశ్‌ను గుర్తుకు తెచ్చాడు.

లఖ్‌నవూ ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) షారుఖ్ (బి) సాయికిశోర్ 36; మిచెల్ మార్ష్ (సి) రూథర్‌ఫర్డ్ (బి) అర్షద్ ఖాన్ 117; పూరన్ నాటౌట్ 56; పంత్ నాటౌట్ 16; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (20 ఓవర్లలో 2 వికెట్లకు) **235; వికెట్ల పతనం:** 1-91, 2-212; **బౌలింగ్:** సిరాజ్ 4-0-37-0; అర్షద్ ఖాన్ 3-0-36-1; రబాడ 4-0-45-0; ప్రసిద్ధ్ 4-0-44-0; సాయి కిశోర్ 3-0-34-1; రషీద్ ఖాన్ 2-0-36-0

గుజరాత్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) మార్‌క్రమ్ (బి) ఒరూర్క్ 21; గిల్ (సి) సమద్ (బి) అవేష్ ఖాన్ 35; బట్లర్ (బి) ఆకాశ్ సింగ్ 33; రూథర్‌ఫర్డ్ (సి) బిష్ణోయ్ (బి) ఒరూర్క్ 38; షారుఖ్ ఖాన్ (సి) బిష్ణోయ్ (బి) అవేష్ ఖాన్ 57; తెవాతియా (సి) హిమ్మత్ (బి) ఒరూర్క్ 2; అర్షద్ ఖాన్ (సి) ఒరూర్క్ (బి) షాబాజ్ 1; రషీద్ ఖాన్ నాటౌట్ 4; రబాడ (బి) బదోని 2; సాయి కిశోర్ (బి) బదోని 1; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **202; వికెట్ల పతనం:** 1-46, 2-85, 3-96, 4-182, 5-186, 6-193, 7-197, 8-200, 9-202; **బౌలింగ్:** ఆకాశ్ సింగ్ 3.1-0-29-1; ఆకాశ్‌దీప్ 4-0-49-0; ఒరూర్క్ 4-0-27-3; అవేష్ ఖాన్ 3.5-0-51-2; షాబాజ్ 4-0-41-1; బదోని 1-0-4-2



శ్రీకాంత్

క్వార్టర్స్‌లో శ్రీకాంత్

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. అగ్రశ్రేణి ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లగా.. హెచ్.ఎస్.ప్రణయ్, కరుణాకరన్, ఆయుష్ శెట్టి టోర్నీ నుంచి నిష్క్రమించారు. గురువారం పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్ 23-21, 21-17తో నుయెన్ (ఐర్లాండ్)పై విజయం సాధించాడు. ప్రణయ్ 9-21, 18-21తో యుషి తనక (జపాన్) చేతిలో, కరుణాకరన్ 14-21, 16-21తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో, ఆయుష్ 13-21, 17-21తో టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం చవిచూశారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో జోడీ 21-17, 18-21, 21-15తో జూలియెన్ మైవో- లియా పాలెర్మో (ఫ్రాన్స్) జంటపై నెగ్గి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రేరణ ఆల్వేకర్- మృణ్మయి దేశ్‌పాండే జోడీ 9-21, 14-21తో సు యిన్- లిన్ యున్ (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓడింది.

ఐపీఎల్‌లో ఈనాడు
బెంగళూరు × హైదరాబాద్
వేదిక: లఖ్‌నవూ, రా॥ 7.30

టాప్-2లోనే నిలవాలని..

లఖ్‌నవూ: ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ చేరడం ఒకెత్తయితే.. లీగ్ దశలో టాప్-2లో నిలవడం మరో ఎత్తు. తొలి రెండు స్థానాల్లో నిలిస్తే ఒక్క విజయంతో ఫైనల్ చేరొచ్చు, ఒక మ్యాచ్ ఓడినా ఫైనల్ చేరేందుకు మరో అవకాశముంటుంది. అందుకే ఇప్పుడు ప్లేఆఫ్స్ చేరిన జట్లన్నింటి లక్ష్యం.. టాప్-2లో నిలవడమే. ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. . టాప్-2లో స్థానాన్ని పదిలపరుచుకునే లక్ష్యంతో శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఢీకొంటోంది. 12 మ్యాచ్‌ల్లో 17 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు చేరిన ఆర్సీబీ.. రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. చివరి మ్యాచ్‌లో ఆ జట్టు లఖ్‌నవూతో తలపడనుంది. సన్‌రైజర్స్‌తో మ్యాచ్ సొంతగడ్డపై ఆడాల్సి ఉన్నప్పటికీ బెంగళూరులో వర్ష సూచన దృష్ట్యా వేదికను లఖ్‌నవూకు మార్చారు. తన చివరి మ్యాచ్‌లో లఖ్‌నవూను ఓడించి ఆ జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలకు తెరదించిన ఎస్ఆర్‌హెచ్.. ఇప్పుడు ఆర్సీబీ టాప్-2 ఆశలకు గండికొట్టే అవకాశాలను కొట్టి పారేయలేం. ప్లేఆఫ్స్ అవకాశాలు చేజారాక ఆ జట్టు స్వేచ్ఛగా ఆడుతోంది.

ఇంగ్లాండ్ పర్యటనకు భారత జట్టు ఎంపిక రేపు

ముంబయి: ఇంగ్లాండ్‌లో అయిదు టెస్టుల సిరీస్ ఆడే భారత జట్టును శనివారం ప్రకటిస్తారు. శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా కెప్టెన్సీ కోసం పోటీలో ఉన్నారు. సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి టెస్టు జట్టులో చోటు దక్కడం ఖాయం. కోహ్లి, రోహిత్‌ల రిటైర్మెంట్ తర్వాత తొలిసారి భారత జట్టు ఎంపిక జరగనుంది.

ఒక్కరోజులో 498

జింబాబ్వేపై చెలరేగిన ఇంగ్లాండ్



ఒలీ పోప్

నాటింగ్‌హామ్: ఒక్క రోజులో దాదాపు 500 పరుగులు! టెస్టుల్లో కొన్నేళ్లుగా దూకుడుగా ఆడుతున్న ఇంగ్లాండ్ మరోసారి అదరగొట్టింది. జింబాబ్వేతో ఏకైక టెస్టు తొలిరోజే పరుగుల వరద పారించింది. ముగ్గురు బ్యాటర్లు శతకాలు చేశారు. దీంతో మొదటి ఇన్నింగ్స్‌లో ఆట చివరికి ఇంగ్లాండ్ 3 వికెట్లకు 498 పరుగులు చేసింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (124), బెన్ డకెట్ (140) సెంచరీలు సాధించడమే కాక.. తొలి వికెట్‌కు 231 పరుగులు జత చేసి గట్టిపునాది వేశారు. ఒలీ పోప్ (169 బ్యాటింగ్) కూడా అజేయ సెంచరీ బాదడంతో ఇంగ్లాండ్ 500 పరుగులకు చేరువైంది. రూట్ (34) ఔట్ అయ్యాడు. ఆట ఆఖరికి పోప్‌కు తోడుగా బ్రూక్ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. 500 పరుగుల మైలురాయిని అందుకునే అవకాశాన్ని ఇంగ్లాండ్ కొద్దిలో కోల్పోయింది. టెస్టు చరిత్రలో అయిదు సందర్భాల్లో మాత్రమే ఒక్కరోజులోనే 500 స్కోరు నమోదైంది.

రైజాకు రజతం



రైజా

షల్ (జర్మనీ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్ ఖాతాలో మూడో పతకం చేరింది. మహిళల స్కీట్‌లో రైజా ఢిల్లాన్ రజతంతో మెరిసింది. 60 షాట్ల ఫైనల్లో ఆమె 51 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. క్వాలిఫయింగ్‌లో 116 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన రైజా.. ఫైనల్లోనూ గట్టిగానే పోరాడింది. కానీ కొద్దిలో పసిడి పతకానికి దూరమైంది. ఫోబి స్కాట్ (బ్రిటన్, 53 పాయింట్లు) స్వర్ణాన్ని గెలవగా.. అనాబెల్ హెట్‌మెర్ (జర్మనీ, 38) కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో కనక్ (మహిళల ఎయిర్ పిస్టల్)లో స్వర్ణం నెగ్గగా.. అడ్రియన్ కర్మాకర్ (పురుషుల రైఫిల్ ప్రోన్) రజతం సాధించాడు.

ఆయుష్‌కు అండర్-19 పగ్గాలు

- వైభవ్ సూర్యవంశీకి చోటు
- ఇంగ్లాండ్ పర్యటనకు భారత జట్టు



ఆయుష్

దిల్లీ: వచ్చే నెలలో ఇంగ్లాండ్‌లో పర్యటించే భారత అండర్-19 జట్టుకు ముంబయి ఆటగాడు ఆయుష్ మాత్రే కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. 14 ఏళ్ల బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీకి కూడా ఈ జట్టులో చోటు లభించింది. ఐపీఎల్‌లో చెన్నై తరఫున మాత్రే, రాజస్థాన్ తరఫున వైభవ్ రాణించిన సంగతి తెలిసిందే. వైభవ్.. గుజరాత్ టైటాన్స్‌పై 35 బంతుల్లోనే సెంచరీ చేసి సంచలనం సృష్టించాడు. అతడు బిహార్ తరఫున అయిదు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, ఒక లిస్ట్-ఎ మ్యాచ్ కూడా ఆడాడు. 17 ఏళ్ల మాత్రే 9 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, ఏడు లిస్ట్-ఎ మ్యాచ్‌లు ఆడాడు. ఇక ముంబయి వికెట్‌కీపర్ బ్యాటర్ అభిజ్ఞాన్ కుందు అండర్-19 జట్టు వైస్‌కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. జూన్ 24న మొదలయ్యే ఇంగ్లాండ్ పర్యటనలో భారత్ ఒక 50 ఓవర్ల వార్మప్ మ్యాచ్, 5 యూత్ వన్డేల సిరీస్, రెండు బహుళ రోజుల మ్యాచ్‌లు ఆడుతుంది.

భారత్ అండర్-19 జట్టు: ఆయుష్ మాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, మౌల్యరాజ్‌సిగ్ చావ్డా, రాహుల్ కుమార్, అభిజ్ఞాన్ కుందు (వైస్‌కెప్టెన్), హర్‌వంశ్ సింగ్, అంబ్రిష్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్, హెనిల్ పటేల్, యుధజిత్ గుహ, ప్రణవ్ రాఘవేంద్ర, మహ్మద్ ఎనాన్, ఆదిత్య రాణా, అన్మోల్‌జీత్ సింగ్.

బెతెల్ స్థానంలో సీఫర్ట్

దిల్లీ: న్యూజిలాండ్ వికెట్ కీపర్- బ్యాటర్ టిమ్ సీఫర్ట్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తీసుకుంది. జాతీయ జట్టు బాధ్యతల కారణంగా జట్టుకు దూరంకానున్న ఇంగ్లాండ్ బ్యాటర్ జాకబ్ బెతెల్ స్థానంలో సీఫర్ట్‌ను బెంగళూరు ఎంపిక చేసుకుంది. రూ.2 కోట్లకు అతడితో ఒప్పందం చేసుకుంది. శనివారం నుంచి ఆర్సీబీకి సీఫర్ట్ అందుబాటులో ఉంటాడని బీసీసీఐ పేర్కొంది. శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే మ్యాచే ఈ సీజన్‌లో బెతెల్‌కు ఆఖరిది. కివీస్ తరఫున 66 టీ20 మ్యాచ్‌లాడిన సీఫర్ట్ 1540 పరుగులు సాధించాడు. ఐపీఎల్‌లో కేవలం మూడు మ్యాచ్‌లే ఆడిన అతడు.. 2022లో చివరి సారిగా పొట్టి లీగ్‌లో బరిలో దిగాడు.

యూఏఈ మరో సంచలనం

బంగ్లాదేశ్‌పై సిరీస్ విజయం

షార్జా: టీ20 క్రికెట్లో యూఏఈ సంచలనం సృష్టించింది. పొట్టి ఫార్మాట్లో తొలిసారిగా బంగ్లాదేశ్‌పై సిరీస్ విజయం సాధించింది. మొన్న తొలిసారి బంగ్లాను ఓడించిన యూఏఈ.. నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకుంది. టీ20ల్లో ఐసీసీ పూర్తి స్థాయి సభ్య దేశంపై యూఏఈకి ఇదే మొట్టమొదటి ద్వైపాక్షిక సిరీస్ విజయం. తంజిద్ హసన్ (40; 18 బంతుల్లో 4×4, 4×6), జాకిర్ అలీ (41; 34 బంతుల్లో 1×4, 3×6), హసన్ మహమూద్ (26 నాటౌట్; 15 బంతుల్లో 3×6) రాణించడంతో తొలుత బంగ్లా 20 ఓవర్లలో 9 వికెట్లకు 162 పరుగులు సాధించింది. బదులుగా మరో 5 బంతులు మిగిలి వుండగానే యూఏఈ లక్ష్యాన్ని ఛేదించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అలీషాన్ షరాఫు (68 నాటౌట్; 47 బంతుల్లో 5×4, 3×6), ఆసిఫ్ ఖాన్ (41 నాటౌట్; 26 బంతుల్లో 5×6) సత్తాచాటడంతో యూఏఈ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

టొటెన్‌హమ్‌దే ఐరోపా ట్రోఫీ



బిల్బావో: ఐరోపా లీగ్ టైటిల్‌ను టొటెన్‌హమ్ కైవసం చేసుకుంది. 17 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆ జట్టు ఓ మేజర్ టోర్నీ గెలిచింది. ఫైనల్లో 1-0తో మాంచెస్టర్ యునైటెడ్‌ను ఓడించింది. 42వ నిమిషంలో గోల్ కొట్టిన బ్రెనెన్ జాన్సన్.. టొటెన్‌ను విజయపథంలో నడిపించాడు. గోల్‌పోస్టు సమీపంలో ల్యూక్ షా ఇచ్చిన పాస్‌ను అందుకున్న జాన్సన్.. బంతిని లక్ష్యానికి చేర్చాడు. 2008లో ఇంగ్లిష్ లీగ్ కప్‌ను సాధించిన తర్వాత టొటెన్ గెలుచుకున్న పెద్ద టోర్నీ ఇదే. తాజా విజయంతో వచ్చే సీజన్లో జరిగే ఛాంపియన్స్ లీగ్ బెర్తును కూడా ఖరారు చేసుకుంది.

ప్రొ లీగ్‌కు భారత హాకీ జట్టిదే

దిల్లీ: ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో పాల్గొనే భారత పురుషుల హాకీ జట్టును హాకీ ఇండియా (హెచ్ఐ) గురువారం ప్రకటించింది. జూన్ 7న ప్రారంభమయ్యే ఐరోపా దశ టోర్నీకి నెదర్లాండ్స్, బెల్జియం ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ పర్యటనలో నెదర్లాండ్స్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బెల్జియంతో భారత్ రెండేసి మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ ఏడాది ఆరంభంలో భువనేశ్వర్‌లో జరిగిన లీగ్‌లో భారత్ 8 మ్యాచ్‌ల్లో అయిదింట్లో నెగ్గింది. 15 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతుంది. **జట్టు: గోల్‌కీపర్లు:** క్రిషన్ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కేరా, **డిఫెండర్లు:** సుమిత్, అమిత్ రోహిదాస్, జుగ్‌రాజ్ సింగ్, నీలమ్ సంజీప్ ఎక్సెస్, హర్మన్‌ప్రీత్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్, సంజయ్, యశ్‌దీప్ సివాచ్, **మిడ్ ఫీల్డర్లు:** రాజ్‌కుమార్ పాల్, నీలకంఠ శర్మ, హార్దిక్ సింగ్, రాజిందర్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, షంషేర్ సింగ్, **ఫార్వర్డ్లు:** గుర్జంత్ సింగ్, అభిషేక్, శిలానంద్ లక్రా, మన్‌దీప్ సిగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, దిల్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్

ఆసియా పసిడి నిలబెట్టుకుంటా

దిల్లీ: రాబోయే ఆసియా ఛాంపియన్‌షిప్‌లో పసిడి పతకం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా బరిలో దిగుతున్నానని తెలుగమ్మాయి, 100 మీటర్ల హర్డిల్స్ జాతీయ ఛాంపియన్ జ్యోతి యర్రాజి చెప్పింది. ఈనెల 27న దక్షిణ కొరియాలో ఈ పోటీలు ఆరంభం కాబోతున్న నేపథ్యంలో ఆమె ఇలా వ్యాఖ్యానించింది. "రేసు ఆరంభంలో తొలి హర్డిల్‌ను అధిగమించే ముందు వేసే అడుగులను ఎనిమిది నుంచి ఏడుకు మార్చుకున్నా. 2024 పారిస్ ఒలింపిక్స్ ముంగిట ఈ మార్పు జరిగింది. గాయాలను దృష్టిలో పెట్టుకుని రాబోయే టోర్నీల్లో మళ్లీ పాత టెక్నిక్ (ఎనిమిది అడుగులు)నే అనుసరించాలని నిర్ణయించా. ఏడు అడుగుల విధానం చాలా శక్తివంతమైంది. అయితే పొడవాటి కాళ్లు ఉండడం వల్ల గాయాలు అవుతున్నాయి. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో పసిడి నిలబెట్టుకోవడమే లక్ష్యంగా బరిలో దిగుతున్నా. తప్పులను దిద్దుకుని ముందుకు సాగాలి" అని జ్యోతి తెలిపింది. గాయాలు కాకుండా ఫిట్‌గా ఉంటే 13 సెకన్లలోపు టైమింగ్‌ను స్థిరంగా నమోదు చేయొచ్చని ఆమె పేర్కొంది. గత ఆసియా ఛాంపియన్‌షిప్‌లో జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్‌లో 13.09 సెకన్లలో లక్ష్యాన్ని చేరి పసిడి నెగ్గింది. ప్రస్తుతం ఆమె జాతీయ రికార్డు 12.78 సెకన్లుగా ఉంది. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి 59 మంది అథ్లెట్లు పోటీపడుతున్నారు.



జ్యోతి యర్రాజి

నీరజ్‌పైనే దృష్టి

ఓర్లెన్ అథ్లెటిక్స్ మీట్




నీరజ్

హజో (పోలెండ్): చాన్నాళ్లుగా ఊరిస్తున్న 90 మీటర్ల మైలురాయిని ఎట్టకేలకు దోహా డైమండ్ లీగ్‌లో చేరుకున్న భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా మరో పోరుకు సిద్ధమయ్యాడు. శుక్రవారం జరిగే ఓర్లెన్ అథ్లెటిక్స్ మీట్‌లో అతడు పోటీపడనున్నాడు. దోహాలో జావెలిన్‌ను 90.23 మీటర్లు వేసినా.. నీరజ్‌కు అగ్రస్థానం దక్కలేదు. జర్మనీ ఆటగాడు జులియన్ వెబర్ (91.06 మీ).. అతడిపై పైచేయి సాధించాడు. ఓర్లెన్ మీట్‌లో మరోసారి వెబర్‌తోనే నీరజ్‌కు సవాల్ ఎదురు కానుంది. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), పోలెండ్ జాతీయ ఛాంపియన్ మారిన్ కుకోస్కి (పోలెండ్) కూడా గట్టిపోటీదారులే. దోహాకు మించిన ప్రదర్శన చేయగలనని ఇటీవలే చోప్రా చెప్పిన నేపథ్యంలో ఓర్లెన్‌లో అతడెలా రాణిస్తాడో చూడాలి.



ఈనాడు



విజయవాడ 23-5-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 283
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

3.58 లక్షల జీబీల డేటా నాశనం చేసిన వైకాపా మద్యం ముఠా

ఆ డేటా 375 కోట్ల పేజీలు, రికార్డులు, డాక్యుమెంట్లకు సమానం

వేల కోట్లు దోచేసి.. ఆధారాలు చెరిపేసి..

ఓ భారీ కుంభకోణంలో ఈ స్థాయి డేటా విధ్వంసం.. బహుశా దేశ చరిత్రలో ఇదే ప్రథమం!



- మద్యం కుంభకోణం ఆనవాళ్లు కూడా దొరక్కుండా పన్నాగం
- 2019 నుంచి 2024 ఎన్నికల ముందు వరకూ కొనసాగిన విధ్వంసం
- ఫోరెన్సిక్ రికవరీకి కూడా వీల్లేకుండా చెరిపివేత
- దర్యాప్తు ప్రక్రియకు తీవ్ర అవరోధాలు
- వాటన్నింటినీ అధిగమించి కేసు కొలిక్కి తెచ్చిన సిట్
- మొత్తం రికార్డులు లభ్యమై ఉంటే.. మరిన్ని మూలాలు వెలుగులోకి!

ఈనాడు – అమరావతి

నూతన మద్యం విధానం ముసుగులో రూ. వేల కోట్ల దోపిడీకి తెగబడ్డ 'వైకాపా మద్యం ముఠా' అందుకు సంబంధించిన కీలక ఆనవాళ్లు, ఆధారాలేవీ లభించకుండా పెద్ద ఎత్తున ధ్వంసం చేసింది. ఒకటో, రెండో కాదు ఏకంగా 350 టెరాబైట్లు.. అంటే 3.58 లక్షల జీబీల డేటాను నామరూపాల్లేకుండా నాశనం చేసింది. ఫోరెన్సిక్ రికవరీకి కూడా వీల్లేకుండా వాటన్నింటినీ చెరిపేసింది. ధ్వంసం చేసిన డేటా పరిమాణం కనీసం 375.80 కోట్లకు పైగా పేజీలు, రికార్డులు, డాక్యుమెంట్లంత (ఒక్కోటి 100 కేబీ లెక్కన) ఉంటుందని అంచనా. 2019 నుంచి 2024 మధ్య ఎప్పటికప్పుడు వ్యవస్థీకృతంగా ఈ డేటా ధ్వంసానికి పాల్పడ్డారు. ఇదంతా వివిధ కంపెనీలకు సంబంధించి మద్యం ఉత్పత్తి, సరఫరా, ఎగుమతులు, సుంకం రహిత కొనుగోళ్లు, ఎక్సైజ్ మినహాయింపులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమాచారమే. ఏపీఎస్‌బీసీఎల్ నిర్వహించిన ఆడిట్ ట్రయల్స్, సిట్, సీఐడీ చేసిన తనిఖీల్లో ఈ రికార్డుల ధ్వంసం విషయం వెలుగుచూసింది. లభ్యమైన, అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా దర్యాప్తు చేస్తేనే ఈ కుంభకోణంలో రూ.వేల కోట్లు కొల్లగొట్టినట్లు తేలింది. ధ్వంసమైన డేటా, రికార్డులు కూడా దొరికి, వాటిని విశ్లేషించి ఉంటే.. ఈ కుంభకోణంలోని మరిన్ని మూలాలు బయటకొచ్చి ఉండేవి. దేశ చరిత్రలోనే ఈ స్థాయిలో ఓ భారీ కుంభకోణానికి సంబంధించిన డేటా విధ్వంసం జరగటం బహుశా ఇదే తొలిసారి. ఈ నేరపూరిత కుట్రలో నాటి ప్రభుత్వ పెద్దలు, వారి సంబంధీకులతో కూడిన ముఠా సభ్యులు, ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు, పలు మద్యం కంపెనీల ప్రతినిధులు, విదేశీ సాఫ్ట్‌వేర్ నిపుణులు కొందరు భాగస్వాములుగా ఉన్నట్లు తేలింది.

ఆర్థిక లావాదేవీల ఆనవాళ్లు లేకుండా చేసేందుకే..

- తాము చేస్తున్నది భారీ ఆర్థిక కుంభకోణమని, భవిష్యత్తులో రాష్ట్రంలో రాజకీయ అధికారం మారితే ఎప్పటికైనా ఇబ్బంది తప్పదని ఈ ముఠా ముందే ఊహించిందో ఏమో.. కుంభకోణం మొదలైన 2019 నుంచే డిజిటల్ ఆధారాల ధ్వంసాన్ని మొదలుపెట్టింది. ఒక్కోసారి ఒక్కో తరహాలో దోచుకోవటం, వాటి ఆధారాల్ని చెరిపేయటం.. ఇలా ఈ ప్రక్రియను 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు జనవరి, ఫిబ్రవరి వరకూ సాగించింది.
- మద్యం కంపెనీల ద్వారా సొత్తు కొల్లగొట్టేందుకు వీలుగా ఈ ముఠా

(మిగతా 6లో)

విదేశీ సాఫ్ట్‌వేర్ నిపుణులను ఉపయోగించుకుని విధ్వంసం

సెక్యూర్ యాక్సెస్ ఛానల్స్‌ను ఉపయోగించుకుని రిమోట్ విధానం ద్వారా మొత్తం డేటా లాగ్స్‌ను చెరిపేశారు. ఆడిట్ ట్రయల్స్‌ను ఒక పద్ధతి ప్రకారం తుడిచేశారు. విదేశీ సాఫ్ట్‌వేర్ నిపుణుల సహకారంతో ఇదంతా చేశారు. ఫోరెన్సిక్ రికవరీకి అవకాశం లేకుండా ఎన్‌క్రిప్టెడ్ డేటా సెట్స్‌ను కూడా డిలీట్ చేసేశారు.

- 2020 జులై 6, అక్టోబరు 20, 2021 సెప్టెంబరు 1 సహా పలు తేదీల్లో లాగిన్లు, యూసేజ్ లాగ్స్, ఆడిట్ ట్రయల్స్, సిస్టమ్ ఫైల్స్‌ను డిలీట్ చేసినట్లు సిట్ గుర్తించింది.
- ఎగుమతులు, సుంకం రహిత కొనుగోళ్లు, ఎక్సైజ్ మినహాయింపులు తదితర అంశాలకు సంబంధించిన వందలాది లావాదేవీలను ధ్వంసం చేశారు.
- ఈ డేటా తొలగింపు ఏదో యాదృచ్ఛికంగా జరగలేదు. కుట్రపూరితంగానే కేంద్ర డేటా బేస్‌ల నుంచి ఈ సమాచారం మాయం చేశారు.

3.58 లక్షల జీబీ డేటా లెక్క ఇదీ..

- 1024 ఎంబీ (మెగాబైట్స్) = 1 జీబీ (గిగాబైట్స్)
- 1024 జీబీ = 1 టీబీ (టెరాబైట్)
- 350 టీబీ = 3,58,400 జీబీ
- ఒక్కో పేజీ 100 కేబీ (కిలోబైట్స్) పరిమాణంలో ఉందనుకుంటే 3.58 లక్షల జీబీ డేటాలో 375.80 కోట్ల పత్రాలు ఉంటాయని అంచనా. అన్ని పత్రాలు ధ్వంసమయ్యాయి.

27 సంవత్సరాలపాటు నిరంతరాయంగా చూడగలిగే వీడియోల డేటాకు సమానం..

- ఒక గంట నిడివి కలిగిన హెచ్‌డీ వీడియో = 1.5 జీబీ
- 3,58,400 జీబీల డేటా అంటే 2,38,933 గంటల నిడివి ఉన్న హెచ్‌డీ వీడియోలతో సమానం.
- ఇది 27 ఏళ్లపాటు నిరంతరం చూసేంత నిడివి కలిగిన డేటాకు సమానం.

నా రక్తనాళాల్లో ప్రవహించేది రుధిరం కాదు.. సిందూరం

- మన దళాలు పాక్‌ను మోకాళ్లపై నిలబెట్టాయి
- వారి వైమానిక స్థావరాలను మన వాయుసేన ధ్వంసం చేసింది
- రాజస్థాన్ పర్యటనలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- 18 రాష్ట్రాల్లో 103 అమృత్ భారత్ స్టేషన్లు వర్చువల్‌గా ప్రారంభం



జైపుర్

సిందూరం గన్ పౌడర్‌గా మారితే పర్యవసానం ఎలా ఉంటుందో ప్రపంచంతో సహా శత్రువులకు అర్థం అయ్యిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తన రక్తనాళాల్లో ప్రవహిస్తున్నది రుధిరం కాదు సిందూరమని భావోద్వేగంగా తెలిపారు. పాకిస్థాన్‌ను మోకాళ్లపై నిలబెట్టాయంటూ భద్రతా దళాలపై ప్రశంసలు కురిపించారు. ఇకపై పాక్ పాల్పడే ప్రతి ఉగ్రదాడికి ఆ దేశానికి భారీ మూల్యం తప్పదని హెచ్చరించారు. పహల్గాం ముష్కరదాడికి ప్రతిగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా 22 నిమిషాల్లో తొమ్మిది భారీ ఉగ్రస్థావరాలను నేలమట్టం చేశామని వెల్లడించారు. ఆ చర్య ద్వారా మన మహిళల సిందూరాన్ని చెరిపేసిన వాళ్లను మట్టిలో కలిపేసినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన 103 అమృత్ భారత్ రైల్వే స్టేషన్లను రాజస్థాన్‌లోని బీకానేర్‌లో గురువారం మోదీ వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని ప్రసంగించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం రాజస్థాన్‌లో రూ.26 వేల కోట్లతో చేపట్టనున్న వేర్వేరు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

(మిగతా 6లో)

ఐదేళ్లలో రాష్ట్రానికి రూ.50 వేల కోట్ల రైల్వే నిధులు



సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ ముఖద్వారం

కేంద్ర మంత్రి పెమ్మసాని

ఆధునికీకరించిన సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ ప్రారంభం

6లో

అరెస్టు చేస్తారా.. నేనిక్కడే విజయవాడలోనే ఉన్నా

- మద్యం దస్త్రాలపై నా సంతకం ఒక్కటైనా చూపించగలరా?
- మాజీ సీఎం జగన్ సవాల్
- చంద్రబాబే మద్యం కుంభకోణం కేసులో బెయిల్‌పై ఉన్నారు
- ఆ కేసును నీరుగార్చేందుకే మాపై కేసు పెట్టారు
- ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి మచ్చలేని అధికారులన్న జగన్



ఈనాడు, అమరావతి: 'మద్యం కుంభకోణం అసలు ఎక్కడ జరిగింది? తప్పుడు కేసు పెట్టి రాజకీయ కక్షకు దిగారు. భయపెట్టి, ప్రలోభపెట్టి, తప్పుడు వాంగ్మూలాలు సృష్టించి అరెస్టులు చేస్తున్నారు.. మద్యం వ్యవహారానికి సంబంధించి ఒక్క దస్త్రమైనా సీఎంఓకు వచ్చినట్లు గానీ, వాటిపై నాది ఒక్క సంతకం గానీ చూపించగలరా' అని మాజీ ముఖ్యమంత్రి జగన్ సీఎం చంద్రబాబుకు సవాల్ విసిరారు. 'అసలు మద్యం కుంభకోణం చేసిందే చంద్రబాబు. 2014-19 మధ్య జరిగిన మద్యం కుంభకోణం కేసులో ఆయన బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆ కేసును రద్దు చేయించుకునేందుకు ప్రయత్నిస్తూ, తిరిగి వైకాపాపై మద్యం కేసు పెట్టారు. బెయిల్ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందుకు బెయిల్ రద్దయి ఆయన అరెస్టవరా' అని వ్యాఖ్యానించారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో.. ఎంపిక చేసిన కొందరు విలేకర్లతో మాట్లాడారు. మద్యం కేసులో అరెస్టు చేస్తారని భయపడుతున్నారా అని ఒక విలేకరి అడగ్గా.. 'నేను ఇక్కడే విజయవాడలో ఉన్నా, రమ్మనండి. వాళ్లను ఆపిందెవరు' అని జగన్ సమాధానమిచ్చారు.

విజయసాయిరెడ్డి వాంగ్మూలానికి విలువేముంటుంది?

'విజయసాయిరెడ్డి చంద్రబాబుకు లొంగిపోయిన వ్యక్తి. రాజ్యసభ సభ్యుడిగా మూడున్నరేళ్ల పదవీ కాలం ఉన్నా, తన రాజీనామాతో చంద్రబాబు- కూటమికి మేలు జరుగుతుందని ప్రలోభాలకు లోనై పదవిని అమ్మేసిన అలాంటి వ్యక్తి ఇచ్చే స్టేట్‌మెంట్లకు ఏం విలువ ఉంటుంది? బెవరేజస్ కార్పొరేషన్‌లో సాధారణ ఉద్యోగులు సత్యప్రసాద్, అనూషలను బెదిరించి వాంగ్మూలం తీసుకోవడమేంటి? ఆ కార్పొరేషన్ మాజీ ఎండీని బెదిరించి స్టేట్‌మెంట్ తీసుకున్నాకే.. ఆయన్ను కేంద్ర సర్వీసులకు తిరిగి వెళ్లేందుకు అనుమతించారు. రాజ్ కసిరెడ్డి కొవిడ్

(మిగతా 6లో)

మద్యం కుంభకోణంలో.. మీ పాత్రపై విచారణ ఎందుకు కోరడం లేదు?

అసెంబ్లీకి వెళ్లి అడగరెందుకు?

'మీ హయాంలో డిజిటల్ చెల్లింపులు ఎందుకు లేవు?

జగన్‌నుద్దేశించి షర్మిల వ్యాఖ్యలు



ఈనాడు, అమరావతి: 'మద్యం కుంభకోణంలో మీపై ఆరోపణలొస్తే సీబీఐని పిలిపిస్తారా? సిటింగ్ జడ్జితో విచారణ చేయిస్తారా? ఏ విచారణనైనా చేసుకోండి... అని అసెంబ్లీకి వెళ్లి ఎందుకు అనలేకపోతున్నారు? తప్పు ఉంటే ఉరితీయండని అనలేకపోతున్నారంటే మీరే దోషి అని ప్రజలకు అర్థమవుతోంది' అని మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి ఏపీసీసీ అధ్యక్షురాలు

(మిగతా 6లో)

'మద్యం' అరెస్టులతో జగన్‌కు వణుకు!

మంత్రి సత్యకుమార్

కల్తీ మద్యంతో ప్రాణాలు తీసిన జగన్


తెదేపా ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, నక్కా ఆనంద్‌బాబుల ధ్వజం

6లో

ఆర్థికసాయం కోరేందుకు... పెట్టుబడులు తెచ్చేందుకు..

దిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబు

ఏడుగురు కేంద్ర మంత్రులతో భేటీ నేడు



ఈనాడు, దిల్లీ: రాష్ట్రానికి సంబంధించిన ముఖ్య అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చించేందుకు, నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు గురువారం రాత్రి దిల్లీ చేరుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకూ హోంమంత్రి అమిత్‌షా సహా ఏడుగురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. ఉదయం 10 గంటలకు కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషీ, 11 గంటలకు రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, మధ్యాహ్నం 12 గంటలకు జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఒంటి గంటకు కేంద్ర శాస్త్ర సాంకేతిక వ్యవహారాల శాఖ మంత్రి జితేంద్రసింగ్, 3 గంటలకు ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్, సాయంత్రం 4 గంటలకు అమిత్‌షా, రాత్రి 9 గంటలకు ఎలక్ట్రానిక్స్, ఐటీ, రైల్వే శాఖల మంత్రి అశ్వినీవైష్ణవ్‌లను సీఎం చంద్రబాబు కలవనున్నారు. గ్రీన్‌ఎనర్జీ, ఆంధ్రప్రదేశ్‌లో రక్షణ ఉత్పత్తుల తయారీ, ఏరోస్పేస్ హబ్ ఏర్పాటు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, జల్‌జీవన్ మిషన్ అమలుకు సహకారం, రాష్ట్రానికి మెరుగైన ఆర్థికసాయం, ఎలక్ట్రానిక్స్, ఐటీ పరిశ్రమల ఏర్పాటులో సహకారం, కొత్త క్రిమినల్ చట్టాల అమలు గురించి చర్చించనున్నారు. రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున అందుకు కేంద్రం తరఫున సహకారం అందించాలని చంద్రబాబు కోరనున్నారు. సాగునీరు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి ఆర్థికంగా, అనుమతుల పరంగా వేగంగా చేయూతను ఇవ్వాలని విజ్ఞప్తి చేయనున్నారు. పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలనూ కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు

(మిగతా 6లో)

శాస్త్రీయ విధానంలో పంటల సాగు ప్రణాళిక

అంతర్జాతీయ పరిణామాలు, మార్కెట్ ఒడుదొడుకులను గమనించాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

వ్యవసాయ రంగ అంశాలపై సబ్‌కమిటీతో టెలికాన్ఫరెన్స్

3లో

లోపలి పేజీల్లో



రాంగోపాల్‌నాయుడికి కీర్తిచక్రను అందిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

కీర్తిచక్ర... రాంగోపాల్‌నాయుడు

ధైర్య సాహసాలతో ఉగ్రవాదులను మట్టుబెట్టిన సిక్కోలు వాసి

దిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కార ప్రదానం

కాల్పుల్లో ఇద్దరు ఇజ్రాయెలీ దౌత్యవేత్తల మృతి

వాషింగ్టన్‌లో దుశ్చర్య

యూదు మ్యూజియం బయట కాల్పులు జరిపిన దుండగుడు

పోలీసులకు లొంగిపోయే ముందు 'ఫ్రీ పాలస్తీనా' అంటూ అరుపులు

ఇదీ సంగతి!



మీరు సినిమా చూపిస్తా.. సినిమా చూపిస్తా.. అంటుంటే వాళ్ల థియేటర్‌లో అభివృద్ధి సినిమా చూపిస్తున్నారు సార్!

ఐక్యతతో అభివృద్ధి సాధిద్దాం

మన ఊరు-మాటామంతి కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

2లో

రావివలస ప్రగతికి రూ.15 కోట్లు మంజూరు


పంచాయతీ ప్రజలతో వర్చువల్‌గా సమావేశం



పవన్‌తో మాట్లాడటానికి టెక్కలి భవానీ థియేటర్‌కు వచ్చిన రావివలస ప్రజలు. గ్రామస్థులు చెబుతున్న సమస్యలను నోట్ చేసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్


అందానికే కాదు.. అమ్మతనానికి కూడా..!

సన్నజాజి తీగలా నాజూగ్గా మారాలని ఏ అమ్మాయికి మాత్రం ఉండదు..! చక్కటి శరీరాకృతి కోసం ఉపవాసాల నుంచి యోగాసనాల దాకా వారు రకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. అందంగా కనిపించాలనే కాదు... అమ్మగా మారాలన్నా బరువు తగ్గడమే మార్గమని తెలుసుకున్న నవతరం యువతులు ఇప్పుడు జిమ్‌ల బాట పడుతున్నారు...



పూర్తి కథనం 6లో

విశాఖలో యువతికి కరోనా



నిలకడగా ఆమె ఆరోగ్యం • ఆసుపత్రి నుంచి డిశ్చార్జి

ఈనాడు – అమరావతి

విశాఖపట్నంలో కొవిడ్ కేసు నమోదైంది. నగరంలోని మద్దిలపాలెంకు చెందిన 23 ఏళ్ల యువతి కార్పొరేట్ ఆసుపత్రిలో 4 రోజుల కిందట జ్వరంతో చేరినప్పుడు.. అనుమానంతో కరోనా నిర్ధారణ పరీక్ష చేయగా పాజిటివ్ అని తేలింది. ఇదే నమూనాను విశాఖ కేజీహెచ్‌లోని వైరాలజీ ల్యాబ్‌లోనూ పరీక్షించి కరోనా పాజిటివ్ అని నిర్ధారించారు. ఆరోగ్యం నిలకడగా ఉన్నందున ఆ యువతిని గురువారం సాయంత్రం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ఆమె ప్రయాణం చేయలేదని కుటుంబసభ్యులు చెప్పారని వెల్లడించారు. ముందు జాగ్రత్తగా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఆదేశించామన్నారు.

ఈ జాగ్రత్తలు పాటించండి

కరోనా వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్య, ఆరోగ్య శాఖ కోరింది.

- జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి లక్షణాలు కనిపిస్తే ఇంట్లో విడిగా ఉండాలి.
- వైద్యుల సలహాలు, సూచనలు అనుసరించి మందులు వాడాలి.
- ప్రయాణాల్లోనూ.. జనసమూహాల్లో ఉన్నప్పుడు మాస్కులు వాడాలి.
- కొవిడ్ కేసుల ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చినవారు అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.
- తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి.

మా పేరు బాంటం చూసేందుకు బాగుంటాం!



పట్టులాంటి ఈకలు.. దృఢమైన దేహంతో చూడటానికి అచ్చం బొమ్మలాగే ఉన్న ఈ కోడిని చైనీస్ బాంటం(సిల్కీ) అంటారు. తల మొదలు కాలి వేళ్ల వరకు మృదువైన తెల్లటి ఈకలు ఉన్నా.. దాని దేహం మాత్రం పూర్తిగా నల్లగా ఉండి. అనంతపురం నగరానికి చెందిన ఇర్ఫాన్ దీన్ని కేరళలో చూసి ముచ్చటపడి రూ.10 వేలు వెచ్చించి తెచ్చుకున్నారు. కోడి వెరైటీగా ఉండటంతో చూసేందుకు చాలా మంది ఇంటికి వస్తున్నారని ఇర్ఫాన్ తెలిపారు. వీటి మాంసాన్నీ తినొచ్చని.. కానీ, చాలా మంది పెంచుకునేందుకే ఇష్టపడతారని వివరించారు. ఇవి అధిక వేడి తట్టుకోలేవని, 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే వాటి ప్రాణాలకు ప్రమాదమని తెలిపారు.

– ఈనాడు, అనంతపురం

ఐక్యతతో అభివృద్ధి సాధిద్దాం

- మన ఊరు-మాటామంతి కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అధికారులతో కలిసి రావివలస గ్రామస్థులతో వర్చువల్‌గా మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

టెక్కలి, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే నిధులొక్కటే సరిపోవని, ప్రజలందరి ఐక్యత, భాగస్వామ్యం, చొరవ అవసరమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఊరు అభివృద్ధి చెందాలంటే ప్రతి అంశాన్నీ మనదిగా భావించాలని, 'మన ఊరు-మాటామంతి' కార్యక్రమం ఉద్దేశం అదేనని ఆయన చెప్పారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి భవాని థియేటర్ వేదికగా గురువారం మన ఊరు-మాటామంతి కార్యక్రమం ఆత్మీయంగా సాగింది. టెక్కలి మండలం రావివలస పంచాయతీ గ్రామస్థులను టెక్కలిలోని భవానీ థియేటర్‌కు పిలిపించి, అక్కడ కూర్చోబెట్టగా.. పవన్ కల్యాణ్ అమరావతి నుంచి వారితో వర్చువల్‌గా మాట్లాడారు. పెద్ద తెరపై పవన్ కనపడుతూ మాట్లాడుతుంటే, గ్రామస్థులు మైకులో మాట్లాడారు. ఇదంతా వారికి ఒక వినూత్న అనుభవంగా మిగిలింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "పార్టీలకతీతంగా గ్రామాల్లో ఐక్యంగా ఉండాలి. పిల్లలు సెల్‌ఫోన్లు చూసుకోకుండా, టీవీలకు అతుక్కోకుండా ఆడుకునేలా చూడాలి. వారికి దేహదారుఢ్యం చాలా అవసరం. ఆడపిల్లలకు రక్షణ కవచంగా నిలవాలి. పారిశుద్ధ్యంలో ప్రజల భాగస్వామ్యం ఉండాలి. ఊరి నుంచి ఉన్నతస్థాయికి వెళ్లినవారు ఊరికి కొంత కేటాయించాలి. ముఖ్యమంత్రి ఆలోచన కూడా అదే" అని తెలిపారు. గ్రామస్థులు చెప్పిన సమస్యలను విని, పరిష్కారానికి రూ.15 కోట్లు మంజూరు చేశారు.

జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్ఎల్ నాయుడు మాట్లాడుతూ, రావివలస ఎండల మల్లన్న ఆలయానికి వెళ్లే రహదారులు ఇరుగ్గా ఉన్నాయని, పంచాయతీలో కాలువల వ్యవస్థ లేదని.. రావివలస, దామోదరపురం గ్రామాల్లో శ్మశానవాటికలకు రహదారులు లేవని చెప్పారు. మొత్తం రహదారుల నిర్మాణానికి రూ.5.31 కోట్లు అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలపగా, వెంటనే మంజూరుచేస్తున్నట్లు పవన్‌కల్యాణ్ తెలిపారు. జగదీశ్వరి అనే మహిళ తాగునీటి సమస్య గురించి ప్రస్తావిస్తూ తడబడడంతో ఉపముఖ్యమంత్రి కలగజేసుకుని, 'ఇంట్లో ఎలా మాట్లాడతారో అలానే మాట్లాడండి. తిట్టాలనిపిస్తే తిట్టండి' అనడంతో నవ్వులు విరిశాయి. నీళ్లు సన్నగా వస్తున్నాయని ఆమె చెప్పడంతో కొత్త ట్యాంకు మంజూరు చేస్తున్నట్లు పవన్‌కల్యాణ్ తెలిపారు.

ఇప్పిలి జగదీశ్వరరావు: మాకు అక్షరజ్ఞానం తక్కువ. గతంలో పశు నష్టనివారణ పథకం ఉండేది. దాన్ని పునరుద్ధరించాలి.
పవన్‌కల్యాణ్: మీకు అక్షరజ్ఞానం తక్కువ అని నాకు అనిపించడం లేదు. (నవ్వులు..)
జగదీశ్వరరావు: లైవ్‌స్టాక్ మిషన్ పథకం కోసం రూ.10 లక్షల సెక్యూరిటీ చూపించాలంటున్నారు. గ్రామీణ ప్రాంత ఆస్తులను బ్యాంకులు ష్యూరిటీగా తీసుకోవడం లేదు.
పవన్ కల్యాణ్: అది వ్యవసాయ శాఖకు సంబంధించిన అంశం. ఆ మంత్రితో మాట్లాడతాను.
జగదీశ్వరరావు: 80% ప్రజలు వ్యవసాయ ఆధారంగా ఉన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి ఏటా మరో 50 రోజులు పని కల్పించాలి. కేంద్రం మీ మాట వింటుంది. ప్రధాని మోదీకి చెప్పండి.
పవన్ కల్యాణ్: కేంద్రం మీ మాటే వింటుంది.. నా మాట ఎందుకు వింటుంది? (నవ్వులు..)

పిల్లల ఉన్నత చదువుకు రుణాలిస్తే తనలాంటి డ్వాక్రా మహిళలకు మేలు కలుగుతుందని దాసరి భారతి అనే మహిళ చెప్పగా, ఫీజుల సమస్య ఉంటే తాను చూస్తానని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి గ్రంథాలయం కావాలని నర్సు కృష్ణారావు కోరగా, ఏర్పాటుచేస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇంకా పలువురు గ్రామస్థులు పలు సమస్యలను ప్రస్తావించారు.

మాటామంతి కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. గ్రామాభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరయ్యాయి. సర్పంచి సర్జాన బాలకృష్ణ పేరును పవన్ కల్యాణ్ రెండుసార్లు ప్రస్తావించినా, వైకాపా మద్దతుదారుడైన ఆయన ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. ఆయన్ను అడిగినట్లు చెప్పాలని ఉప ముఖ్యమంత్రి చెప్పమన్నారు. జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పర్యటనలో ఉండటంతో వర్చువల్‌గా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఏపీ ఎస్ఐఆర్‌డీ కమిషనర్ ఆర్.ముత్యాలరాజు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ విధానంలో స్త్రీనిధి చెల్లింపులు: మంత్రి కొండపల్లి



స్త్రీ నిధి యాప్ ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: డ్వాక్రా సభ్యులు స్త్రీనిధి బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాన్ని డిజిటల్ రూపంలో చెల్లించేలా కొత్త విధానానికి శ్రీకారం చుట్టినట్టు గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ(సెర్ప్) శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. డ్వాక్రా సభ్యులు కట్టే డబ్బు పక్కదారి పట్టకుండా పారదర్శకత కోసమే ఈ విధానం తీసుకొస్తున్నట్లు వివరించారు. విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో గురువారం ఆయన డిజిటల్ విధానంలో స్త్రీనిధి చెల్లింపులకు యాప్‌ను ప్రారంభించారు.

ఉద్యోగ అవకాశాలు



రాష్ట్రానికి 4 టీఎంసీలు

నీటిని కేటాయిస్తూ కృష్ణా బోర్డు నిర్ణయం

ఈనాడు, అమరావతి: తాగునీటి అవసరాల కోసం మన రాష్ట్రానికి 4 టీఎంసీలు, తెలంగాణకు 10.26 టీఎంసీల నీటిని కృష్ణా బోర్డు కేటాయించింది. తెలంగాణకు 10.26 టీఎంసీలు, ఏపీకి 10 టీఎంసీలు కావాలని రెండు రాష్ట్రాలూ బోర్డుకు తెలపగా.. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లోని నిల్వలను పరిగణనలోకి తీసుకుని బోర్డు గురువారం నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం జలాశయంలో కనీస మట్టం +800 అడుగుల వద్ద 8.422 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో కనీస మట్టం +505 అడుగుల వద్ద 12.793 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నట్లు తేల్చారు. రెండు జలాశయాల్లో 21.215 టీఎంసీలు ఉన్నట్లు లెక్కించి, ఆవిరి ఇతరత్రా నష్టాలకు 4.243 టీఎంసీలను మినహాయించారు. మిగిలిన 16.972 టీఎంసీలు.. వరద ప్రవాహాలొచ్చే వరకు జలాశయాల్లో అందుబాటులో ఉంటుందని పరిగణనలోకి తీసుకుని కేటాయింపులు చేశారు. ఈ నీటిని తాగునీటి అవసరాలకే వాడాలి. మనకు కేటాయించిన 4 టీఎంసీలను రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున నాగార్జునసాగర్ కుడి కాలువకు విడుదల చేస్తారు. తెలంగాణ అవసరాలను శ్రీశైలం జలాశయం నుంచి తీర్చుకోవాలని జులై 31 వరకు ప్రాజెక్టులో +800 మట్టం వద్ద నీరుండేలా చూడాలని బోర్డు పేర్కొంది. 10 టీఎంసీలను కోరితే నాలుగే ఇచ్చారని, రాష్ట్ర అవసరాలకు మరో 4 టీఎంసీలనైనా కేటాయించాలంటూ రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ ఛీఫ్ నరసింహమూర్తి గురువారం కృష్ణా బోర్డుకు లేఖ రాశారు.



శక్తి, భావోద్వేగాలపై నియంత్రణ ఉంటే..

ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రశాంతంగా ఉండగలగడం ఒక శక్తిమంతమైన నైపుణ్యం. దాన్ని సముపార్జించుకోవడంపై దృష్టి పెట్టండి. మీ శక్తిపై, భావోద్వేగాలపై మీకు పూర్తి నియంత్రణ ఉన్నట్లయితే- బహిర్గత శక్తులేవీ మీ అంతర్గత శాంతికి భంగం కలిగించవు.

– జూలియన్ గ్రోస్, గ్రోత్ మెంటార్

గ్రహం అనుగ్రహం

23–5–2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, వైశాఖ మాసం, బహుళపక్షం
ఏకాదశి: సా. 6-34 తదుపరి ద్వాదశి
ఉత్తరాభాద్ర: మ. 12-29 తదుపరి రేవతి
వర్జ్యం: రా. 11-43 నుంచి 1-13 వరకు
అమృత ఘడియలు: ఉ. 7-56 నుంచి 9-27 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-04 నుంచి 8-56 వరకు తిరిగి మ. 12-22 నుంచి 1-13 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5.30; **సూర్యాస్తమయం:** సా.6.23
సర్వఏకాదశి

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తాడేపల్లిగూడెం	38.1	27.4
తిరుపతి	36.7	25.6
కడప	36.0	26.0
కర్నూలు	35.3	25.2
నెల్లూరు	35.2	25.6
ఒంగోలు	34.7	24.8
విజయవాడ	34.7	24.2
అనంతపురం	34.5	23.5
శ్రీకాకుళం	34.0	27.0
గుంటూరు	34.0	26.0
నరసాపురం	32.4	26.2
విజయనగరం	32.0	26.0
రాజమహేంద్రవరం	32.0	23.0
విశాఖపట్నం	31.6	26.0

అన్ని హద్దులు మీరుతున్న ఈడీ

- రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ప్రాంగణంలో సోదాలెలా చేస్తారు?
- తమిళనాడు ప్రభుత్వ టాస్మాక్‌పై మనీలాండరింగ్ దర్యాప్తు నిలిపివేత
- కేంద్ర దర్యాప్తు సంస్థకు నోటీసు జారీ

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)పై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో మండిపడింది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థపై నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద దాడులు ఎలా చేస్తారని నిలదీసింది. సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తికే విఘాతం కలిగిస్తోందని, ఈడీ అన్ని హద్దులు దాటుతోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. తమిళనాడులో మద్యం దుకాణాలకు అనుమతులు మంజూరు చేసే రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ (టాస్మాక్)పై ఈడీ దర్యాప్తును నిలిపివేస్తూ ఆదేశాలిచ్చింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం గురువారం ఈడీకి నోటీసు జారీ చేసింది. తదుపరి విచారణను వేసవి సెలవుల అనంతరం చేపడతామని తెలిపింది.

టాస్మాక్ అక్రమాల వ్యవహారమై ఈడీ దర్యాప్తునకు సహకరించాలంటూ ఏప్రిల్ 23న మద్రాసు హైకోర్టు వెలువరించిన ఉత్తర్వులను తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అమిత్ ఆనంద్ తివారీ వాదనలు వినిపించారు. రాష్ట్రంలోని మద్యం దుకాణాలకు అనుమతులివ్వడంలో 2014-2021 మధ్య కాలంలో జరిగిన అక్రమాలు, వాటికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వమే 41 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసిందన్నారు. ఈ వ్యవహారంలో ఇటీవల జోక్యం చేసుకున్న ఈడీ... టాస్మాక్ ప్రధాన కార్యాలయం, ఇతర ప్రాంగణాల్లో మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు 60 గంటల పాటు జరిపిన సోదాల చట్టబద్ధతను ప్రశ్నించారు. మద్యం దుకాణాల వివాదంలో చివరి ఎఫ్ఐఆర్ 2021లో దాఖలు కాగా నాలుగేళ్ల తర్వాత ఈడీ రంగంలోకి దిగడంలోని ఉద్దేశాలపై పిటిషనర్ల తరఫు న్యాయవాదులు సందేహం వ్యక్తం చేశారు. నమోదైన 41 ఎఫ్ఐఆర్‌లలో ఏ ఒక్కదానిలోనూ టాస్మాక్ నిందితుల జాబితాలో లేదని, పైగా కొన్ని కేసులలో ఫిర్యాదుదారుగా ఉందని తెలిపారు. టాస్మాక్‌పై పీఎంఎల్‌ఏ కింద దర్యాప్తు చేసే అధికారం ఈడీకి లేదన్నారు. స్పందించిన సీజేఐ.. 'ఈడీ వ్యక్తులపై కేసు నమోదు చేయొచ్చు. కానీ ఒక కార్పొరేషన్‌పై క్రిమినల్ కేసు ఎందుకు' అని అడిగారు. ఈడీ అన్ని పరిమితులు దాటుతోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. దేశ సమాఖ్యతత్వాన్ని దర్యాప్తు సంస్థ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. టాస్మాక్ పిటిషన్‌పై ఈడీకి నోటీసులు జారీ చేయాలని ధర్మాసనం నిర్ణయించింది. దర్యాప్తు పరంగా తాము (ఈడీ) హద్దు మీరలేదని, టాస్మాక్ స్కాంలో రూ.1000 కోట్ల అవినీతి జరిగిందని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు కోర్టుకు విన్నవించారు. లెక్కలో లేని నగదు సృష్టించారని చెప్పారు. ఈ సమాచారాన్ని ప్రమాణపత్రంలో చేరుస్తామని చెప్పగా ధర్మాసనం అంగీకరించింది.

డీఎంకే హర్షం

సుప్రీంకోర్టు ఉత్తర్వులపై డీఎంకే హర్షం వ్యక్తం చేసింది. తమిళనాడు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు భాజపా చేస్తున్న కుట్రలకు ఇది చెంపపెట్టు లాంటిదని దుయ్యబట్టింది. ఈడీని అడ్డుపెట్టుకుని తమ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నిస్తోందని డీఎంకే కార్యదర్శి ఆర్.ఎస్. భారతి ఆరోపించారు.

పజిల్స్‌తో మెదడు చురుకుదనం

- చెస్ గ్రాండ్‌మాస్టర్ అక్కాతమ్ముళ్లు వైశాలి, ప్రజ్ఞానంద
- క్యూఆర్ కోడ్ ఎడ్యూగేమ్స్‌ను ప్రవేశపెట్టిన క్లాస్‌మేట్స్



క్యూఆర్ కోడ్‌లతో ఉన్న కొత్త నోట్ పుస్తకాల్ని విడుదల చేస్తున్న చెస్ గ్రాండ్ మాస్టర్లు వైశాలి, ప్రజ్ఞానంద. చిత్రంలో క్లాస్‌మేట్ జీఎం అయాన్ చౌదరి, సీఈవో వికాస్‌గుప్తా

ఈనాడు-చెన్నై: తమకు పజిల్స్ అంటే ఎంతో ఇష్టమని, చిన్నతనం నుంచి వాటిని ఆడేవాళ్లమని చెస్ గ్రాండ్ మాస్టర్లు అక్కాతమ్ముళ్లు వైశాలి, ప్రజ్ఞానంద తెలిపారు. క్లాస్‌మేట్ సంస్థ కొత్తగా మార్కెట్లో ప్రవేశపెడుతున్న క్యూఆర్ కోడ్ 'ఎడ్యూగేమ్స్' సిరీస్ నోట్ పుస్తకాల్ని చెన్నైలో వారు విడుదల చేశారు. ఈనెల 24 నుంచి 7 రాష్ట్రాల్లోని 30 నగరాల్లో ఈ సంస్థ నిర్వహించనున్న ప్రచారాన్ని ప్రారంభించారు. వైశాలి మాట్లాడుతూ.. భోజన విరామ సమయంలో స్నేహితులతో కలిసి పజిల్స్ ఆడేవాళ్లమన్నారు. వాటి ద్వారా మెదడు చురుకుదనం అలవడుతుందని తెలిపారు. విద్యార్థులు మొబైల్ స్క్రీన్‌టైమ్ తగ్గించుకుని ఇలాంటి విద్యా సంబంధ ఆటలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రజ్ఞానంద మాట్లాడుతూ.. లాజికల్ పజిల్స్, సుడోకు అంటే తనకు ఇష్టమని వివరించారు. క్లాస్‌మేట్ సీఈవో వికాస్‌గుప్తా మాట్లాడుతూ.. ఈ నోట్ బుక్స్‌లోని చివరి పేజీలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా రోజూ విజ్ఞాన సంబంధమైన 11 కొత్త పజిల్స్ ఆడవచ్చని, ఎన్నో బహుమతులతో పాటు హాంకాంగ్‌లోని డిస్నీల్యాండ్‌కు వెళ్లే అవకాశాన్ని గెలుచుకోవచ్చని తెలిపారు. తెలంగాణలోని హైదరాబాద్, కరీంనగర్‌లోనూ 'ఎడ్యూగేమ్స్ ఇన్ఫినిటీ' పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సంస్థ జీఎం అయాన్ చౌదరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'అరేబియా'లో వాయుగుండం.. బంగాళాఖాతంలో అల్పపీడనం!

- 26, 27 తేదీల్లో రాష్ట్రానికి భారీ వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: అరేబియా సముద్రంలో అల్పపీడనం కొనసాగుతోంది. ఇది ఉత్తర దిశగా కదులుతూ శుక్రవారం సాయంత్రానికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అక్కడి పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో తర్వాత తీవ్ర వాయుగుండం లేదా తుపానుగా బలపడే అవకాశాలున్నాయి. దీని ప్రభావంతో రాబోయే 6 రోజుల్లో గుజరాత్, గోవా, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ◆ ఈ నెల 27 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. ఆ తర్వాత రెండు రోజుల్లో మరింత బలపడుతుందని ఐఎండీ అంచనా. అనంతరం ఉత్తర దిశగా పయనించి.. బంగ్లాదేశ్, మయన్మార్ వైపు వెళ్తుందని నిపుణులు భావిస్తున్నారు. దీని ప్రభావంతో రాబోయే 3 రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు రావొచ్చంటున్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 26 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని ఐఎండీ హెచ్చరించింది. ◆ రాబోయే 2 రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించే అవకాశముందని ఐఎండీ ప్రకటించింది. మాల్దీవులు, కొమొరిన్, లక్షద్వీప్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, బంగాళాఖాతం, ఈశాన్య రాష్ట్రాల్లో మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉంటాయని తెలిపింది.

ఇక డిజిటల్ విధానంలోనే ప్రభుత్వ సేవలు

అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశం

ఈనాడు, అమరావతి: పాలనలో పారదర్శకత కోసం ప్రతి స్థాయిలో ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విధానాన్ని అమలు చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీని కోసం అన్ని విభాగాల్లో మాన్యువల్ విధానంలో సేవలు అనేది లేకుండా చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దరఖాస్తు దగ్గరి నుంచి సేవలు అందించడం వరకు డిజిటలైజేషన్ విధానం అమలు చేయాలని తెలిపింది. గవర్నమెంట్ టు గవర్నమెంట్, గవర్నమెంట్ టు సిటిజన్, గవర్నమెంట్ టు బిజినెస్ సేవలు మొత్తం డిజిటల్ విధానంలోనే ఉండాలని పేర్కొంది. డిజిటల్ సేవలు అందించడం సాధ్యం కాదని భావించిన శాఖలకు ఆర్‌టీజీఎస్‌ను వినియోగించుకోవాలని సూచించింది. ధ్రువీకరణలు, ఫిర్యాదుల స్వీకరణ, వాటి ప్రస్తుత స్థితి వంటి సేవలను తప్పనిసరిగా మన మిత్ర వాట్సప్ ప్లాట్‌ఫాంకు అన్ని ప్రభుత్వ శాఖలు అనుసంధానించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

రూ.2,065 కోట్లతో పారిశ్రామిక నోడ్‌ల అభివృద్ధి

పనులకు టెండర్లు పిలిచిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక నోడ్‌లను రూ.2,065 కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (నిక్‌డిట్) ఆమోదించింది. ఓర్వకల్లు నోడ్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.1,120.81 కోట్లు, కొప్పర్తిలో రూ.944.30 కోట్లను ఖర్చు చేయనుంది. ప్రాజెక్టు మొదటి దశలో సర్వే, డిజైన్లు, నిర్మాణం, టెస్టింగ్, రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, వంతెనలు, పార్కులోని పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరా పనులు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, విద్యుత్ సరఫరా పనులకు ఈ మొత్తాన్ని ఖర్చుచేయనుంది. మల్టీ ప్రొడక్ట్ ఇండస్ట్రియల్ క్లస్టర్లుగా నోడ్‌ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదించింది. రెండు నోడ్‌లు అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు, ఎగుమతులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం పేర్కొంది.

సీఎంకు సచివాలయ ఉద్యోగుల కృతజ్ఞతలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందిని తొలగించబోమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయడంపై ఏపీ ఐకాస అమరావతికి అనుబంధమైన సచివాలయాల ఉద్యోగుల సంక్షేమ సంస్థ హర్షం వ్యక్తం చేసింది. సీఎం చంద్రబాబు, మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి సచివాలయ ఉద్యోగుల తరఫున సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఎ, బి, సి కేటగిరీలుగా సచివాలయాల విభజన, సిబ్బంది సర్దుబాటు చేశాకే బదిలీలు చేపడతామని, సచివాలయాల పని తీరు పర్యవేక్షణకు మూడంచెల విధానం ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

24న డయల్ యువర్ తితిదే ఈఓ

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే నిర్వహించే డయల్ యువర్ ఈఓ కార్యక్రమం ఈనెల 24న(శనివారం) ఉదయం 9 నుంచి 10 గంటల వరకు స్థానిక అన్నమయ్య భవనంలో జరగనుంది. భక్తులు తమ సందేహాలు, సూచనలను తితిదే ఈఓ జె.శ్యామలరావుకు ఫోన్ ద్వారా తెలపొచ్చు. ఇందుకు భక్తులు ఫోన్ నం.0877- 2263261లో సంప్రదించాలని కోరారు.

పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా

పర్యాటకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్



కాళ్ల, న్యూస్‌టుడే: రానున్న ఐదేళ్లలో రాష్ట్రాన్ని పర్యాటక రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం కోపల్లె గ్రామంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి, పలు పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 268 సాధారణ, ఫైవ్ స్టార్, త్రీ స్టార్స్ హోటళ్లు ఉండగా.. సుమారు 11,700 గదులు అందుబాటులో ఉన్నాయి. రానున్న ఐదేళ్లలో వీటిని 50 వేలకు పెంచేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,842 హోం స్టే యూనిట్లు విజయవంతంగా నడుస్తుండగా.. తిరుపతిలోనే 561 హోం స్టేలు పని చేస్తున్నాయి. సెర్ప్, మెప్మా సభ్యుల భాగస్వామ్యంతో దిండి, అరకు ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి, వారికి శిక్షణ ఇస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు.

ఫీజుల బకాయిలు విడుదల చేయాలి: అపెక్మా

ఈనాడు, అమరావతి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో విడుదల చేయడంతో పాటు వచ్చే విద్యా సంవత్సరానికి కొత్త ఫీజులను నిర్ణయించాలని రాష్ట్ర ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ (అపెక్మా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి విద్యాసాగర్, మధుసూదనరావు, కోశాధికారి గ్రంధి సత్యనారాయణ కోరారు. ఫీజులను త్వరగా నిర్ణయించి, ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభించాలని పేర్కొన్నారు. "ప్రస్తుతం 2024-25 విద్యా సంవత్సరంతోపాటు 2023-24, అంతకుముందు సంవత్సరాలకు సంబంధించిన ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయి. 2023-24కు సంబంధించి మూడు వాయిదాలు, 2024-25లో ఇవ్వాల్సిన రెండు వాయిదాలు, గతంలో పెండింగ్‌లో పెట్టిన పీజీ కోర్సుల బకాయిలు ఉన్నాయి. ఫీజుల డబ్బులు రాకపోవడంతో అధ్యాపకులు, సిబ్బందికి జీతాలు ఇవ్వడం కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. 2025-26 సంవత్సరానికి కొత్త ఫీజులు నిర్ణయించాలి" అని కోరారు.

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్‌డీ పేరిట మోసాలు

ఏపీ యువకుడి అరెస్టు, రిమాండ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కార్యదర్శినని, ఓఎస్‌డీనంటూ ప్రజలను మోసం చేస్తున్న యువకుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో బుధవారం అరెస్టు చేసి, గురువారం హైదరాబాద్‌లో రిమాండ్‌కు తరలించారు. సైబర్ క్రైమ్ డీసీపీ ధార కవిత తెలిపిన ప్రకారం... ఏపీలోని శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేట, లక్ష్మీనగర్‌లో నివసించే మాజీ క్రికెటర్ బొడుమూరు నాగరాజు(32)... సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్‌డీ ఎట్ జీమెయిల్ డాట్ కామ్ పేరిట నకిలీ ఈ-మెయిల్ ఖాతా తెరిచాడు. తనకు తాను తెలంగాణ సీఎం వ్యక్తిగత కార్యదర్శినని, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్‌డీ) అని చెప్పుకొంటున్నాడు. అతడిపై తెలంగాణలో 13, ఆంధ్రప్రదేశ్‌లో 16 కేసులు ఉన్నాయి. నాంపల్లిలోని 12 ఏసీఎంఎం న్యాయస్థానంలో నాన్ బెయిలబుల్ వారెంట్ సైతం పెండింగ్‌లో ఉంది.

అతను ఏమేం చేశాడంటే...

బొడుమూరు నాగరాజు... ఆర్థిక సాయం కావాలంటూ ప్రముఖ పారిశ్రామికవేత్తలకు, కంపెనీలకు మెయిళ్లు, వాట్సప్ సందేశాలు పంపిస్తున్నాడు. అందులో భాగంగా బొల్లినేని ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎండీ శ్రీకృష్ణమోహన్ బొల్లినేనిని సంప్రదించాడు. ర్యాపిడో ఎండీ అరవింద్ సంకా, గుప్తా రియాలిటీ ఛైర్మన్ శ్రీనివాస్ గుప్తా వెర్రబొమ్మ, కంట్రీడిలైట్ ఎండీ చక్రధర్, నితిన్ కౌశల్‌లతోపాటు ఎంతో మందిని ఆర్థిక సహాయం కోరే ప్రయత్నం చేశాడు. అతని తీరుపై సైబర్ పోలీసులకు ఫిర్యాదులు అందాయి. కేసు నమోదు చేసిన హైదరాబాద్ సైబర్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఏపీలో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. కోర్టు ఆదేశాలతో గురువారం రిమాండ్‌కు తరలించారు.

వెబ్‌సైట్లో జేఈఈ అడ్వాన్స్‌డ్ రెస్పాన్స్ షీట్లు

26న ప్రాథమిక 'కీ' విడుదల

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సంబంధించి విద్యార్థుల రెస్పాన్స్ షీట్లను వెబ్‌సైట్లో ఉంచినట్లు ఐఐటీ కాన్పుర్ తెలిపింది. ఈ నెల 18న పరీక్ష నిర్వహించగా..అదేరోజు రాత్రి ప్రశ్నపత్రాలను వెబ్‌సైట్లో పెట్టిన సంగతి తెలిసిందే. మళ్లీ నాలుగు రోజుల తర్వాత విద్యార్థులు గుర్తించిన జవాబులతో కూడిన రెస్పాన్స్ షీట్లను వెబ్‌సైట్లో ఉంచారు. ఈ నెల 26న ఉదయం 10 గంటకు ప్రాథమిక 'కీ' విడుదల చేయనున్నారు. దానిపై అభ్యంతరాలను ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పంపవచ్చు.




చేయగల సత్తా ఉన్నప్పటికీ..

ఓటమే ఈ ప్రపంచంలో అత్యంత చెత్త ఫీలింగ్ అని చాలామంది భావిస్తుంటారు. కానీ వాస్తవానికి అది కాదు. గొప్ప పనులు చేయగల సత్తా ఉన్నప్పటికీ.. ఆ దిశగా అడుగులు వేయకుండా, రోజూ ఉదయం లేచినప్పటి నుంచీ ఫోన్‌లో అనవసరంగా స్క్రోల్ చేస్తూ సమయాన్ని వృథా చేయడమే అత్యంత చెత్త ఫీలింగ్. అది మీ ప్రతిభా సామర్థ్యాలను నిరుపయోగంగా మార్చేస్తుంది.

– రాజ్ శామని, రచయిత

శాస్త్రీయ విధానంలో పంటల సాగు ప్రణాళిక

- అంతర్జాతీయ పరిణామాలు, మార్కెట్ ఒడుదొడుకులను గమనించాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం
- వ్యవసాయ రంగ అంశాలపై సబ్‌కమిటీతో టెలికాన్ఫరెన్స్
- పొగాకు, కోకో, మామిడి రైతుల సమస్యలపై చర్చ



ఈనాడు, అమరావతి: పంటల సాగు ప్రణాళిక శాస్త్రీయ విధానంలో రూపొందించాలని.. దిగుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, మార్కెట్ ఒడుదొడుకులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆర్టీజీఎస్, వ్యవసాయశాఖ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేయాలో రైతులకు ముందే చెప్పడం వల్ల డిమాండ్, సరఫరా మధ్య సమతూకం ఉంటుందని వివరించారు. వ్యవసాయ రంగంలో రైతుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేసిన సబ్ కమిటీతో గురువారం ఆయన ఉండవల్లి నివాసం నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పొగాకు, కోకో, మామిడి, ధాన్యం రైతుల సమస్యలపై సమావేశంలో అధికారులతో చర్చించారు. మద్దతు ధర కంటే తగ్గితే వెంటనే రైతుల్ని ఆదుకోవాలని సూచించారు.

మధ్యాహ్న భోజనంలో మామిడిరసం.. తిరుమల భక్తులకూ

మామిడి గుజ్జుకు ఆర్డర్లు రాకపోవడంతో.. కంపెనీల వద్ద నిల్వలు పెరిగిపోయాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు మామిడి రసం అందించడంతోపాటు తిరుమలకు వచ్చే భక్తులకూ తితిదే ఆధ్వర్యంలో పంపిణీ చేసే అవకాశాలు పరిశీలించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ప్రాసెసింగ్ సంస్థలకు బ్యాంకు రుణాలు ఇప్పించేలా చూడాలని చెప్పారు. ప్యూర్ జ్యూస్‌లపై కేంద్రం 40% జీఎస్టీ విధించడంతో మామిడి కొనుగోలు మందగించిందని, జీఎస్టీ తగ్గించేలా కేంద్రాన్ని సంప్రదించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. మామిడి గుజ్జు తయారీ కంపెనీలు రైతుల నుంచి కొనుగోలు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు.

నల్లబర్లీ పొగాకు సాగుకు పంటవిరామం

రైతుల దగ్గర ఉన్న హెచ్‌డీ బర్లీ పొగాకు నిల్వలను యాప్ ద్వారా సేకరించాలని, ఆ మొత్తాన్ని కొనిపించాలని చంద్రబాబు నిర్దేశించారు. వైట్, హెచ్‌డీ బర్లీ పొగాకును కూడా మార్కెట్ పరిధిలోకి తీసుకురావాలని ఇప్పటికే కేంద్ర వాణిజ్యశాఖ మంత్రికి లేఖ రాసినట్టు వివరించారు. నల్ల బర్లీ పొగాకు సాగుకు వచ్చే ఏడాది పంట విరామం అమలుచేయాలని నిర్ణయించినట్లు వ్యవసాయ అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. పొగాకు బోర్డులో సెల్ ఏర్పాటు చేసి.. రోజువారీ కొనుగోలు వివరాలు తీసుకుంటున్నామని చెప్పారు.

టమాటాకు గిట్టుబాటు ధర దక్కాలి

టమాటా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేయించి, రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలని చంద్రబాబు చెప్పారు. రైతుల దగ్గర ఉన్న కోకో గింజలను కిలో రూ.500 తగ్గకుండా కొనేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

బియ్యం కార్డుల్లో మార్పుచేర్పులు నిరంతర ప్రక్రియ

- ఎప్పుడైనా దరఖాస్తు చేయొచ్చు.. గడువేమీ లేదు
- వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే నిత్యావసరాలు
- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



ఈనాడు, అమరావతి: కొత్తగా బియ్యం కార్డుల కోసం, అలాగే పాతవాటిలో మార్పుచేర్పుల కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని, అది నిరంతరం జరిగే కార్యక్రమమని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గురువారం నాటికి 5,48,176 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో మార్పుల కోసం 4,09,000 దరఖాస్తులు అందగా, కొత్త కార్డుల కోసం వచ్చినవి 60,000 అని వివరించారు. కొత్త దరఖాస్తులను 21 రోజుల్లో పరిశీలించి అర్హులైన వారికి జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులు ఇస్తామన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో బియ్యం కార్డుల సమాచారమంతా గ్రామ/వార్డు సచివాలయాలతో అనుసంధానించడంతో సమస్యలు ఎదురయ్యాయని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు. విజయవాడలో గురువారం ఆయన రేషన్ డీలర్ల సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం పౌర సరఫరాల శాఖ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి సౌరభ్ గౌర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరకులు ఇస్తాం. 15,00,050 మంది వృద్ధులు, దివ్యాంగులకు డీలర్ల ద్వారా ఇంటి వద్దే సరకులు అందించే ఏర్పాటు చేస్తున్నాం' అని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తుల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, తీసుకుంటున్న చర్యలను మనోహర్ వివరించారు.

★ వివాహమైన వారు బియ్యం కార్డులో పేరు చేర్చుకోవాలంటే వివాహ పత్రిక, ఫొటోలు, సర్టిఫికెట్లు అవసరం లేదు. వాటిని అడగొద్దని గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి స్పష్టం చేశాం.

★ వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా దరఖాస్తు చేసుకునే వీలు కల్పించాం.

★ వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, విదేశాల్లో ఉంటున్న వారు కార్డుల నుంచి తమ పేరు తొలగించుకునేందుకు అవకాశం ఇచ్చాం. కుటుంబంలో ఎవరైనా చనిపోయి ఉంటే వారి పేర్లను తొలగించవచ్చు.

★ హిజ్రాలకు బియ్యం కార్డులు ఇస్తాం. వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

★ కుటుంబ యజమాని పేరు మార్చుకోవచ్చు. కొన్ని కార్డుల్లో మగవారు ఆడవారిగా, ఆడవారు మగవారిగా పొరపాటున నమోదైంది. ఇంటి యజమాని పేర్లలోనూ తప్పులున్నాయి. గతంలో జేసీ స్థాయిలో మాత్రమే వాటిని మార్చే అవకాశం ఉండగా.. ఇప్పుడు తహసీల్దారు స్థాయిలోనే సవరించే అవకాశం కల్పించాం.

★ ఒంటరి మహిళల నుంచి కూడా బియ్యం కార్డులకు దరఖాస్తులు తీసుకోవాలి. తిరస్కరించకూడదు. రెండు మూడు రోజుల్లో వాటిని అప్‌లోడ్ చేసే ఆప్షన్ ఇస్తాం.

★ కుటుంబంలో ఒకరిని తొలగించి, మిగిలిన వారికి కార్డు ఇవ్వాలంటే ఒక సమస్య ఉంది. హౌస్ హోల్డ్ (కుటుంబ) సర్వే ఆధారంగా తీసుకున్న సమాచారం అంతా గ్రామ/వార్డు సచివాలయాల్లో ఉండటమే దీనికి ప్రధాన కారణం. దీనిపై సీఎంతో చర్చించి, వారంలో నిర్ణయం తీసుకుంటాం. సర్వర్ సమస్య 2 రోజుల్లో కొలిక్కి వస్తుంది.

ప్రతి రేషన్ దుకాణం వద్ద సీసీ కెమెరా

రేషన్ దుకాణాల్లో అయితే కోరిన సమయంలో రేషన్ తీసుకునే వెసులుబాటు ఉంటుంది. సాంకేతికత ఉపయోగించి పంపిణీ మరింత సులభతరం చేస్తాం. ప్రతి రేషన్ దుకాణం దగ్గర సీసీ కెమెరా ఏర్పాటు చేస్తాం.

పుంగనూరు నియోజకవర్గంలోని 6 మండలాలు అన్నమయ్య జిల్లా పరిధిలోకి!

ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ

ఈనాడు, అమరావతి: చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో ఉన్న 6 మండలాలను తమ పరిధిలోకి తీసుకురావాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం గురువారం ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసింది. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను అన్నమయ్య జిల్లా మదనపల్లె డివిజన్ పరిధిలోనికి తీసుకురావడంపై ప్రజలు అభ్యంతరాలు, సలహాలు 30 రోజుల్లోగా తెలియజేయాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

సెమీకండక్టర్ సాంకేతికతపై ఫాక్స్‌కాన్ సహకారం!

ఈ రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా తైవాన్‌లో పర్యటిస్తున్న రాష్ట్ర బృందం

ఈనాడు, అమరావతి: పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాల ఆధారంగా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు ఆకర్షించేందుకు సహకరించాలని ఫాక్స్‌కాన్ సంస్థ ప్రతినిధులను ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ కోరారు. ఆయన నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం తైవాన్‌లోని తైపీ నగరంలో పర్యటించింది. అక్కడి ఫాక్స్‌కాన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. దీర్ఘకాలిక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా సెమీకండక్టర్ల తయారీలో సాంకేతికత, నూతన ఆవిష్కరణలకు సంబంధించి సహకరించాలని ఆసంస్థను కోరినట్లు భాస్కర్ తెలిపారు. సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో ఉన్న విస్తృత అవకాశాలను వివరించామన్నారు.

హించు సైన్స్ పార్కు పరిశీలన: తైవాన్‌లోని హించు పార్కునూ అధికారుల బృందం సందర్శించింది. హించు సైన్స్ పార్క్‌తో సహకారానికి ఉన్న అవకాశాలపై అలైడ్ అసోసియేషన్ ఫర్ సైన్స్ పార్క్ ఇండస్ట్రీస్ (ఏఎస్‌ఐపీ) సెక్రటరీ జనరల్ వేన్ వాంగ్‌తో చర్చించింది. సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను భాస్కర్ వివరించారు. 'ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీకి ప్రపంచ గమ్యస్థానంగా ఎదగాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. దీనికి తైవాన్ సంస్థలు సహకరించాలి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది' అని పేర్కొన్నారు.



రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన పీతల సుజాత

మహిళలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్ పీతల సుజాత

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్ పీతల సుజాత అన్నారు. గుంటూరు మహిళా ప్రాంగణంలోని మహిళా సహకార ఆర్థిక సంస్థ కార్యాలయంలో గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో సుజాత మాట్లాడారు. మహిళల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని, నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి మహిళా సహకార ఆర్థిక సంస్థ ద్వారా ఆదరణ కల్పించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళా సహకార ఆర్థిక సంస్థ ఎండీ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఈడీ పద్మజ, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ రమణశ్రీ, ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 1న కానిస్టేబుల్ ఉద్యోగాలకు తుది రాత పరీక్ష

ఈనాడు, అమరావతి: కానిస్టేబుల్ ఉద్యోగాలకు జూన్ 1న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తుది రాత పరీక్ష నిర్వహించనున్నట్టు రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు ఛైర్మన్ రాజీవ్‌కుమార్ మీనా తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతిలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23 సాయంత్రం 5 గంటల నుంచి http://slprb.ap.gov.in నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

కుంకీ ఏనుగులను తీసుకురావడంలో సఫలీకృతులైన పవన్‌కు అభినందనలు: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అడవి ఏనుగుల నుంచి రైతుల్ని, పంటల్ని రక్షించడంలో సాయపడే కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకురావడంలో సఫలీకృతులయ్యారని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సీఎం చంద్రబాబు గురువారం అభినందనలు తెలిపారు. "శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల్ని ఆంధ్రప్రదేశ్‌కు పంపించేందుకు ఉదారంగా సహకరించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేలకు ప్రత్యేక ధన్యవాదాలు" అని ఎక్స్‌లో సీఎం పేర్కొన్నారు. తనకు అభినందనలు చెప్పిన సీఎంకు పవన్‌కల్యాణ్ ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

★ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల దాడులతో పంట నష్టపోతున్న రైతుల ఇక్కట్లు తొలగించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపించారని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ఏనుగుల విధ్వంసంతో నష్టపోతున్నామని పలమనేరు రైతులు 'యువగళం' పాదయాత్రలో తన దృష్టికి తెచ్చారని గుర్తు చేసుకున్నారు.


ఈనాడు

కాలం చెల్లిన భావజాలం

సోషలిస్టు సమాజ నిర్మాణానికి ప్రజాస్వామ్య పంథా పనికిరాదని, ప్రత్యక్ష సాయుధ పోరాటమే అందుకు శరణ్యమని భావించిన కొంతమంది ఆలోచనలే భారతావనిలో వామపక్ష తీవ్రవాదానికి ప్రాణంపోశాయి. దుర్భర పేదరికంతో పస్తులుంటున్న పల్లెలూ, ఆదివాసీ గూడేలూ... నిత్యం శ్రమదోపిడికి, సామాజిక పీడనకు బలవుతున్న సమూహాల్లోకి ప్రజావిప్లవ భావాలు చొచ్చుకెళ్లాయి. 1967 మేలో పశ్చిమ్ బెంగాల్‌లోని నక్సల్‌బరీ గ్రామంలో సన్నకారు రైతులు, భూమిలేని నిరుపేద కూలీలు, ఆదివాసులు కలిసి కర్రలూ విల్లంబులతో స్థానిక పెత్తందారులపై తిరగబడటంతో దేశంలో నక్సలైట్ ఉద్యమం ఆరంభమైంది. ఆ వసంతకాల మేఘగర్జన శ్రీకాకుళంలో మారుమోగి, ఆపై తెలంగాణలో మరింత గట్టిగా ప్రతిధ్వనించింది. పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ కలిసిపోయి సీపీఐ(మావోయిస్టు) పార్టీ అవతరించడం- ఇండియాకు అతిపెద్ద అంతర్గత ముప్పుగా పరిణమించింది. ఒకదశలో(2010లో) ఇరవై రాష్ట్రాల్లోని 223 జిల్లాల్లో హింసకు పాల్పడగలిగిన స్థాయికి మావోయిస్టులు విస్తరించారు. 'ప్రగతికోసం శాంతి, శాంతికోసం భద్రత' అన్న తలంపుతో కేంద్రం ఉక్కుపాదం మోపుతుండటంతో మావోయిస్టు అగ్రనేతలు కొన్నాళ్లుగా ఎన్‌కౌంటర్లలో హతమవుతున్నారు. తాజాగా ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మరణించారు. వరస ఎదురుదెబ్బల ధాటికి కకావికలమవుతూ అబూజ్‌మాడ్ అడవుల్లో అస్తిత్వ పోరాటం చేస్తున్న మావోయిస్టులు, తాము ఎంచుకున్న మార్గానికి కాలం చెల్లిందని అర్థం చేసుకోవాలి!

భూమికోసం, భుక్తికోసం అంటూ ఆయుధాలు పట్టుకున్న మావోయిస్టులు- తుపాకీతో రాజ్యాధికారాన్ని సాధించి తీరతామని లోగడ భీషణ ప్రతిజ్ఞలు చేశారు. వారి ఆయువుపట్టు మీదే కొట్టాలన్న భావనతో కేంద్రం పదహారేళ్ల కిందట దండకారణ్యంలో 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'ను ప్రారంభించినప్పుడు- పదివేల మందితో కూడిన కోబ్రా దళాలనే కాదు, పద్నాలుగు లక్షల భారత సైన్యాన్ని పంపినా ఎదిరించి నిలబడతామని సవాలు విసిరారు. ఎప్పుడో 1920-40 మధ్యనాటి చైనా సమాజంకోసం మావో సిద్ధంచేసిన విప్లవ వ్యూహాలకు నేటి భారతంలో ప్రాసంగికత లేదని వారు ఒప్పుకోవట్లేదు. గ్రామీణార్థిక వ్యవస్థ తీరుతెన్నులు సైతం వేగంగా మారిపోతున్న ప్రస్తుత తరుణంలో అడవుల్లో ఉండి సాధించగలిగేది ఏమీ ఉండదు. హింసతో సమాజాన్ని సంస్కరించలేమన్న సంగతిని అవగతం చేసుకుని మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టాలి. ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిర్వహించే ప్రజాఉద్యమాల ద్వారానే జనసామాన్యానికి నిజమైన మేలు జరుగుతుంది. ఆ మేరకు ప్రజాప్రయోజనాల పరిరక్షణకు పాటుపడాలనుకుంటే, మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి!

ప్రభుత్వ పాలనా వ్యవస్థలోని లోపాల నుంచే మావోయిస్టు ఉద్యమం పురుడుపోసుకుంది. అప్పటి ప్లానింగ్ కమిషన్ నియమించిన నిపుణుల సంఘమే ఈ వాస్తవాన్ని కరాఖండీగా చెప్పింది. ఆదాయాలు అడుగంటిపోయి ఆర్థిక అసమానతలు పెచ్చరిల్లుతున్న సమాజంలో ప్రజల్లో ఆవేదన, ఆక్రోశం పెల్లుబుకుతుంటాయి. దీనికితోడు సామాన్యుల కాళ్లకింది భూమిని లాక్కునే ధోరణులు సామాజిక అశాంతికి ఆజ్యంపోస్తాయి. 2008-09 నుంచి ఇంతవరకు దేశవ్యాప్తంగా 7.5లక్షల ఎకరాలకు పైగా అటవీ భూములను ఇతర అవసరాలకు మళ్లించారు. ఆ క్రమంలో ఆయా ప్రాంతాల్లోని ఆదివాసులెందరో నిర్వాసితులయ్యారు. విచ్చలవిడిగా గనుల తవ్వకాలు, సహజ వనరుల స్వాహాపర్వాలతో గిరిజన జీవితాలు ధ్వంసమవుతున్నాయి. ఈ కల్లోలాన్ని నివారిస్తేనే శాంతిభద్రతలు సాకారమవుతాయి. విప్లవోద్యమం ముందుకు తెచ్చిన ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు తీసుకునే చొరవే మావోయిస్టు సమస్యను పూర్తిగా నివారించగలదు!



స్వేచ్ఛ అంటే ఆత్మాభిమానంతో గౌరవంగా జీవించగలగడం. పరదా వెనకాల అనామకంగా ఉండిపోవడం ఇష్టం లేక నాకు నచ్చినట్లుగా నేను జీవించాను, అందుకు ఎలాంటి పశ్చాత్తాపమూ లేదు. నేనెప్పుడూ ఎవరికీ భయపడలేదు. ఆ క్రమంలో ఏవైనా పోగొట్టుకున్నానేమో కానీ ఓడిపోలేదు.

– మహారాణి గాయత్రీదేవి

సంకీర్తనా సేవ

భక్తి, జ్ఞాన, వైరాగ్య సాధనకు కలియుగంలో సంకీర్తన దగ్గర దారి అని పురాణ వచనం. 'కీర్తనం కీర్తి వర్ధనం' అంటుంది విష్ణు సహస్రనామం. నవవిధ భక్తి మార్గాలలో కీర్తనం ప్రధాన లక్షణంగా వచ్చిన సారస్వతం అన్నమాచార్యులది. భగవంతుడి తత్వాన్ని సులభంగా సామాన్య జనానికి అందించాలన్నది అన్నమయ్య ఉద్దేశం. పండిత పామరులెవర్నికైనా తన శృంగార, ఆధ్యాత్మిక, వైరాగ్య కీర్తనల ద్వారా భగవంతుణ్ని చేరుకునే దగ్గర దారిని చూపించాడు అన్నమయ్య.


బాల్యంలోనే తల్లిదండ్రులు, అన్నా వదినలు తనకు పొలం పనులు చెప్పి చికాకు పెడుతుంటే 'అయ్యో పోయె ప్రాయము కాలము' అని ఆ వేంకటేశ్వరుడికి మొరపెట్టుకున్నాడట అన్నమయ్య. తదనంతర కాలంలో శ్రీ వేంకటేశ్వరుడే చేకొని ఉన్న దైవమని, ఆయననే శరణు వేడుకుంటానని 'ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంత మాత్రమే నీవు' అన్న కీర్తనలో తెలియచెబుతాడు. కామ పురుషార్థానికి తన మనసు తరచు లోబడి పోతోందని, ఈ బంధాల నుంచి విముక్తిని ఇవ్వమని అన్నమయ్య వేడుకుంటాడు. 'ఛీ ఛీ ఓ బతుకా సిగ్గులేని బతుకా వాచవికి బతిమాలి వడబడ్డ బతుకా', 'ఎక్కడి మానుష జన్మం బెత్తిన ఫలమేమున్నది నిక్కమునే నమ్మితి' మొదలైన కీర్తనలలో ఇంద్రియాలకు లొంగిపోయి తరవాత పొందే పశ్చాత్తాపం కనబడుతుంది. 'ఇందిరాధిపుని సేవ ఏమరకుండుట కాక', 'విన్నపాలు వినవలె వింత వింతలు', 'బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే' మొదలైన అన్నమయ్య సంకీర్తనలు పరమ వేదాంత సారాలు. ఆడంబరానికి, ఆత్మవంచనకూ పరులను నమ్మకుండా శుద్ధమైన అంతరాత్మతో వేంకటనాథుణ్ని మొక్కమంటాడు. రాజాస్థానం తనకు తగదని తెలుసుకున్న అన్నమయ్య శేష జీవితాన్ని స్వామి సన్నిధిలో సంకీర్తనా దీక్షలో గడిపాడు. పుట్టడం, పోవడం సత్యాలు. వాటిమధ్య ఉన్న కాలమే ఓ నాటకం. ఎట్టఎదుట ఉన్న వేంకటేశ్వరుడే నిజమని చెబుతాడు. పరబ్రహ్మాన్ని చేరుకునేందుకు కుల వివక్ష వంటి అడ్డుగోడలను కూలగొట్టాలంటాడు. పురందరదాసు ఒకసారి తిరుమలకు వచ్చినప్పుడు అన్నమయ్యను ఉద్దేశించి 'మీ సంకీర్తనలు పరమ మంత్రాలు. వాటిని వింటే చాలు పాపాలు పటాపంచలవుతాయి. మీరు సాక్షాత్తు వేంకటపతి అవతారమే' అని కొనియాడాడట. సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ఖడ్గం నందకం అంశే అన్నమయ్య అని భక్తుల నమ్మిక.



అంతర్యామి

రోజుకొక కీర్తన జీవితమంతా గానం చేశాడు అన్నమయ్య. చక్రవర్తి అయినా నిరుపేద అయినా మనుషులందరూ ఒకటేనని సమానత్వాన్ని ప్రబోధించాడు. 'ఏమి కలదిందు ఎంతకాలంబైనా' అనే కీర్తనలో ఈ ప్రపంచంలో శాశ్వతమైంది ఏదీ లేదనే సత్యం తెలుసుకుంటేనే సంతోషంగా ఉండగలమని చెబుతాడు. తన పదకవితలలో తాత్విక సత్యాలను, సాంఘిక విమర్శలను గుదిగుచ్చిన రుషితుల్యుడు అన్నమయ్య. తన సంకీర్తనల ద్వారా పదాల అనంత రూపాలను ప్రదర్శించిన అద్వితీయ ప్రతిభాశాలి.

– గంటి ఉషాబాల



ట్రంప్ కాయిన్లు... లోగుట్టు ఏంటి?

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేయడానికి మూడు రోజుల ముందు డాలర్‌ట్రంప్ అనే పేరుతో మీమ్ కాయిన్‌ను ట్రంప్ ప్రవేశపెట్టారు. బిట్ కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీల మాదిరిగా మీమ్ కాయిన్లకు బలమైన ఆర్థిక పునాది ఉండదు- ఆన్‌లైన్ హంగూ ఆర్భాటం, స్పెక్యులేషన్ తప్ప. మొత్తం 100 కోట్ల మీమ్ కాయిన్లను జారీచేయగా, వాటిలో 80 కోట్ల కాయిన్లు ట్రంప్‌నకు చెందిన రెండు కంపెనీల చేతిలో ఉన్నాయి. సహజంగానే ట్రంప్ ఈ మీమ్ కాయిన్‌కు బాగా ప్రచారం చేసి దాని విలువ పెంచేశారు. మే 22న ట్రంప్ ఏర్పాటుచేసే విందులో పాల్గొనే మహద్భాగ్యం కోసమే 220 మంది బడా వ్యాపారులు మీమ్ కాయిన్స్‌ను కొన్నారు. వారిలో చాలామంది చైనా వంటి దేశాలకు చెందినవారే.

క్రిప్టోకాయిన్ గురించి అందరం విన్నాం. ఇప్పుడు మీమ్ కాయిన్ గురించి, అందునా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీమ్ కాయిన్ గురించి తెలుసుకోవాల్సి ఉంది. దాని గురించి ట్రంప్ తన ట్రూత్ సోషల్ ద్వారా ప్రచారం చేశారు. మరోవైపు ఆయన కుటుంబం పాకిస్థాన్‌తో క్రిప్టో లావాదేవీలు చేస్తుండటం గమనార్హం!

భారీ కుంభకోణం?

టిక్‌టాక్ ఈ-కామర్స్ కంపెనీలో పెట్టుబడి పెట్టిన ఓ చైనా కంపెనీ సైతం ట్రంప్ మీమ్ కాయిన్లను కొనుగోలు చేసింది. టిక్‌టాక్‌ను అమెరికాలో నిషేధించే విషయమై ట్రంప్ ఆలోచనచేస్తున్న సమయంలో ఈ కొనుగోలు జరగడం గమనించాలి. 0.18 డాలర్ల ఆరంభ ధరకు జారీ అయిన 'డాలర్ ట్రంప్' విలువ కొద్ది రోజుల్లోనే 75 డాలర్లకు పెరిగిపోయి, మే 17కల్లా 16 డాలర్లకు పడిపోయింది. ట్రంప్ తన మీమ్ కాయిన్ గురించి ప్రకటించడానికి రెండు నిమిషాల ముందు ఒక అజ్ఞాత వ్యాలెట్ 10 లక్షల డాలర్ల విలువైన కాయిన్స్‌ను కొని, రెండు రోజుల తరవాత 10.9 కోట్ల డాలర్లకు అమ్మేసింది. ట్రంప్ కంపెనీయే ఆ పని చేసిందన్న అనుమానం రేగుతోంది. ట్రంప్ విందులో పాల్గొనడానికని మీమ్ కాయిన్ కొన్నవారిలో దాదాపు సగం మంది తమకు విందులో సీట్లు నిర్ధారణ అయిన వెంటనే వాటిని అమ్మేసుకున్నారు లేదా వేరే వ్యాలెట్లకు బదిలీ చేశారు. ఈ వ్యవహారంలో మదుపరులకు 200 కోట్ల డాలర్ల నష్టం వాటిల్లిందని అంచనా.



దేశాధ్యక్ష పదవిలో ఉన్న వ్యక్తి తన పేరును మీమ్ కాయిన్ రూపంలో అమ్ముకుని సొమ్ముచేసుకోవడం వెనక పెద్ద అవినీతి కుంభకోణమే ఉందంటున్నారు. ఉదాహరణకు ట్రంప్ మీమ్ కాయిన్‌ను కొన్న ప్రముఖుల్లో ఒకరైన జస్టిన్ సన్- హాంకాంగ్‌కు చెందిన క్రిప్టో వ్యాపారి. క్రిప్టో మోసానికి పాల్పడ్డాడని 2023లో అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) ఆయనపై విచారణ చేపట్టింది. ట్రంప్ రెండోసారి దేశాధ్యక్షుడైన తరవాత అది నిలిచిపోయింది. ట్రంప్ కుమారులు ఎరిక్, డొనాల్డ్ జూనియర్, అల్లుడు జేరెడ్ కుష్నర్‌లు 2024లో ప్రారంభించిన క్రిప్టో కంపెనీ వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్‌లో జస్టిన్ సన్ పెట్టుబడి పెట్టారు. బహుశా క్రిప్టో వ్యాపారాన్ని అత్యంత లాభదాయకంగా మార్చే నిబంధనలు లేదా చట్టాన్ని ట్రంప్ సర్కారు తీసుకురానుందన్న అంచనాలు వినవస్తున్నాయి. దాన్నుంచి లబ్ధి పొందడానికి కాబోలు ఎరిక్, డొనాల్డ్ జూనియర్‌లు అమెరికన్ బిట్ కాయిన్ ఇన్‌కార్పొరేటెడ్ పేరుతో ఈ ఏడాది మార్చిలో కొత్త బిట్‌కాయిన్ మైనింగ్ కంపెనీని స్థాపించారు.

ట్రంప్ కుమారుల కంపెనీలు భారత్ పొరుగున గూడుపుఠాణి చేస్తున్నాయి. వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ అధికారులు ఏప్రిల్ 26న ఇస్లామాబాద్ వచ్చి పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్ (పీసీసీ)తో వ్యాపార ఒప్పందం కుదుర్చుకున్నారు. పాక్‌లో బ్లాక్‌చెయిన్ నవీకరణ, స్టేబుల్ కాయిన్ వంటి క్రిప్టో కార్యకలాపాలను విస్తరించడమే ఈ ఒప్పంద లక్ష్యం. ఇది పాకిస్థాన్ ప్రధాన సైన్యాధికారి జనరల్ అసిం మునీర్ సమక్షంలో జరగడం ఆశ్చర్యకరం. దీనికి నాలుగు రోజుల ముందు పహల్గాం ఉగ్రదాడి జరిగింది. అనంతరం ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సందర్భంలో, ఉభయులనూ సమాధానపరచి కాల్పుల విరమణకు ఒప్పించింది తానేనని ట్రంప్ ప్రచారం చేసుకున్నారు. మరోవైపు ఏప్రిల్ ఆరంభంలోనే బినాన్స్ క్రిప్టో ఎక్స్ఛేంజ్ వ్యవస్థాపకుడు చాంగ్ పెంగ్ ఝావో- పాక్ క్రిప్టో కౌన్సిల్‌కు ముఖ్య సలహాదారుగా బాధ్యతలు చేపట్టారు. చాంగ్ పెంగ్ అక్రమ ధన చలామణి నేరానికి అమెరికాలో జైలు శిక్షను ఎదుర్కొంటున్నారు. అలాంటి వ్యక్తి మార్గదర్శకత్వం వహిస్తున్న పాక్ క్రిప్టో కౌన్సిల్‌తో ట్రంప్ కుమారులు లావాదేవీలు జరపడం పలు సందేహాలకు తావిస్తోంది.

అప్రమత్తత అత్యవసరం

డొనాల్డ్ జూనియర్ మిత్రుడైన జెంట్రీ బీచ్ పాకిస్థాన్, బంగ్లాదేశ్, తుర్కియేలతో పెట్టుబడి, వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకోవడం మరొక కీలక పరిణామం. ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవిని చేపట్టిన కొద్దిరోజులకే జెంట్రీ పాకిస్థాన్ వచ్చారు. దక్షిణాసియా ప్రాంతంలో అమెరికా ప్రతినిధి పాకిస్థానేనని ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు ఊదరగొట్టారు. కరాచీ, ఇస్లామాబాద్‌లలో స్థిరాస్తి రంగంలో భారీ పెట్టుబడులు పెడతానన్నారు. సింధు పరీవాహక ప్రాంతంలో 50 లక్షల కోట్ల డాలర్ల విలువైన బంగారం నిక్షేపాలు ఉన్నట్లు వార్తలొచ్చాయి. వాటి వెలికితీతకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇంకా కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, రక్షణ రంగాలకు కీలకమైన అరుదైన లోహాలను తవ్వితీయడానికీ పాక్‌తో జెంట్రీ బీచ్ ఒప్పందం కుదుర్చుకున్నారు. పాక్‌తోపాటు బంగ్లాదేశ్, తుర్కియేలతో కూడా చమురు, ఖనిజ వనరుల రంగాల్లో ఒప్పందాలపై బీచ్ సంతకం చేశారు. ఏతావాతా భారత్ పట్ల శత్రు వైఖరి అవలంబిస్తున్న పాక్, బంగ్లా, తుర్కియేలతో అంటకాగుతూనే ఇండియాకు తాను ఆప్తమిత్రుడినని చాటుకోవడం ట్రంప్‌నకే చెల్లింది. ఈ పరిస్థితుల్లో భారత ప్రభుత్వం పటిష్ఠ ప్రతివ్యూహంతో ముందుకు సాగాలి.

– ప్రసాద్

శాన్వి గుండె దడదడా కొట్టుకుంటోంది. ఇంటర్వ్యూకి వెళ్లింది కానీ, భయంతో ఆమె మనసు మనసులో లేదు. ఏం అడుగుతారో? సమాధానాలు చెప్పగలనో లేదో? తడబడతానేమో... అని టెన్షన్ పడుతోంది. అక్కడ ఆమెతో పాటు మరో పది మంది ఉన్నారు. అందరి మొహాల్లోనూ ఒకలాంటి ఆందోళన. అంతలో మరో యువకుడు ఆ గదిలోకి ప్రవేశించాడు. నవ్వు ముఖంతో వస్తూనే అందరినీ నవ్వుతూ పలకరించాడు. అతడూ తమలాగే ఇంటర్వ్యూకి వచ్చినా ఇంత కూల్‌గా ఉన్నాడేంటీ అనుకుంది శాన్వి.

తన పక్కన ఉన్న అభ్యర్థులను చూస్తూ అతడు 'మీరు ఇంత సీరియస్‌గా ఉంటే ఇంటర్వ్యూ చేసేవాళ్లు భయపడతారేమో కొంపదీసి' అని నవ్వాడు. ఆ మాటలకు శాన్వితో సహా



నవ్వండి... నవ్వించండి!

అందరికీ నవ్వొచ్చింది. అలా ఒకరికొకరు అందరూ పరిచయాలు చేసుకోవడం, జోకులు వేసి నవ్వుకోవడంతో కాసేపట్లో అక్కడి వాతావరణం తేలికైంది. టెన్షన్ మాయమై అందరి ముఖాలూ తెరిపినపడ్డాయి. శాన్వికి పోయిన ధైర్యం తిరిగొచ్చింది. ఇంటర్వ్యూ చాలా బాగా చేసి బయటికి వస్తూ అనుకుంది శాన్వి... ఆ అబ్బాయి ఎవరో కానీ సమయానికి వచ్చి నవ్వించి తనకెంతో మేలు చేశాడని.

నవ్వు ఒక్క టెన్షన్‌కే కాదు, చాలావాటికి విరుగుడు. ఒత్తిడి తగ్గించి మనసును తేలికపరుస్తుంది. ఆరోగ్యానికి అది పరమౌషధం అని శాస్త్రవేత్తలు కూడా నిరూపించారు. అమెరికాకు చెందిన నార్మన్ కజిన్స్ తనకు వచ్చిన వెన్నెముక వ్యాధిని తానే కనిపెట్టిన లాఫ్ థెరపీతో నయం చేసుకున్నానన్నాడు. ఆ విషయాన్ని తన పుస్తకం 'అనాటమీ ఆఫ్ యాన్ ఇల్‌నెస్'లో రాశాడు. రోగాలను నయం చేయడమే కాదు, రోగనిరోధక శక్తినీ పెంచుతుందని తెలిసే ఊరూరా లాఫింగ్ క్లబ్బులు ఏర్పడ్డాయి. కానీ ఏం లాభం? వెళ్లిన వాళ్లు అక్కడేదో మొక్కుబడిగా నవ్వి రావడం తప్ప నిజంగా పకపకా నవ్వే సందర్భాలు ఉంటున్నాయా జీవితాల్లో?

ఉరుకులు పరుగులకు తోడు సమూహంలో ఒంటరి బతుకులు మనవి. స్మార్ట్ ఫోన్ స్క్రోలింగ్‌కే సమయం సరిపోదు ఇక సరదా సంభాషణలెక్కడ? సోషల్ మీడియాలో ఏ మీమో, జోకో కన్పిస్తే ఓ నవ్వు ఎమోజీ పెట్టడం తప్ప పెదాలతో నవ్వాలనీ నవ్వితే శబ్దం వస్తుందనీ గుర్తుందా అసలు. చిరునవ్వుతో మొదలెట్టి పడీ పడీ నవ్వే నవ్వు వరకూ ఎన్ని రకాల నవ్వులున్నాయో ఎంతమందికి తెలుసు?

ముక్కూమొహం తెలియని అపరిచితుల్ని చూసి బుజ్జిపాపాయి కూడా బోసినోరంతా తెరిచి నవ్వుతుందే... మరి అన్నీ తెలిసిన మనం రోజులో ఎంతమందిని నవ్వుతూ పలకరిస్తున్నాం?

జీవితంలో వృథాగా గడిచిన రోజంటూ ఏదైనా ఉందా అంటే- అది నవ్వకుండా గడిపిన రోజే అనేవారు చార్లీ చాప్లిన్. అందుకే జీవితాన్ని వృథా చేయవద్దు. నవ్వుతూ నవ్విస్తూ మన చుట్టూ ఉన్నవారిలో సానుకూల దృక్పథాన్ని పెంపొందిద్దాం. తద్వారా మనతోపాటు వారి ఆరోగ్యాన్నీ ఆయుష్షుని కూడా పెంచుదాం!

– ఉమారతన్ పాల్కే

పత్రికా స్వేచ్ఛకు విఘాతం

ప్రభుత్వ విధానాల్లోని లోటుపాట్లను ప్రజలకు తెలియజెప్పి వారిని చైతన్యవంతం చేసే పత్రికలపై చాలా చోట్ల ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 56శాతం ప్రజలకు నెలవులైన 42దేశాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. 2024తో పోలిస్తే ఈ ఏడాది 180 దేశాలకు సంబంధించిన పత్రికా స్వేచ్ఛ సూచీలో ఇండియా ఎనిమిది స్థానాలు మెరుగుపడింది. నార్వే, ఎస్తోనియా, నెదర్లాండ్స్, స్వీడన్ తొలి నాలుగు స్థానాల్లో నిలిచాయి. ఈ ఏడాది ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో పలు తూర్పు, దక్షిణాసియా దేశాల ర్యాంకులు...

దక్షిణ కొరియా	61
జపాన్	66
నేపాల్	90
మంగోలియా	102
మాల్దీవులు	104
శ్రీలంక	139
ఇండియా	151
భూటాన్	152
పాకిస్థాన్	158
చైనా	178



(ఆధారం: రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ నివేదిక)

ఐటీఐల పురోగతితో నైపుణ్యాభివృద్ధి

ఇండియాలో వృత్తి విద్య అంటే తొలుత పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లే గుర్తొస్తాయి. కాలక్రమంలో అవి తమ ప్రభను కోల్పోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా ఐటీఐ విద్యకు కొత్త జవం అందించేందుకు రూ.60 వేల కోట్లతో కేంద్రం ఇటీవల కొత్త పథకం ప్రారంభించింది.

వచ్చే నాలుగైదేళ్లలో ఉపాధి రంగ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వెయ్యి పారిశ్రామిక శిక్షణా సంస్థలను (ఐటీఐలను) సంస్కరించడానికి భారత ప్రభుత్వం సిద్ధమైంది. నైపుణ్య వృద్ధికి అయిదు ఉత్కృష్ట నైపుణ్య కేంద్రాలను స్థాపించాలని నిర్ణయించింది. అందుకోసం రూ.60వేల కోట్లు వెచ్చించనుంది. ఈ పెట్టుబడి మానవ వనరుల అభివృద్ధిలో గొప్ప సత్ఫలితాలు తెచ్చే అవకాశం ఉంది. కేంద్రం కొత్త పథకం ఐటీఐల ఆధునికీకరణకు తోడ్పడుతుంది. పాఠ్యాంశాలను, శిక్షణలో వాడే యంత్రాలను నవీకరించేందుకు అక్కరకొస్తుంది. పరిశ్రమలతో పొత్తును బలోపేతం చేస్తుంది. వృత్తి విద్యను పారిశ్రామిక అవసరాలతో అనుసంధానించడం ఇటు విద్యార్థులకు, అటు పారిశ్రామికవేత్తలకూ ఉపయుక్తమవుతుంది. భువనేశ్వర్, చెన్నై, హైదరాబాద్, కాన్పూర్, లూధియానాలలో అయిదు జాతీయ స్థాయి ఎక్సలెన్స్ కేంద్రాలు ఏర్పాటవుతాయి. అవి ఎలక్ట్రానిక్స్, హరిత ఇంధనం, ఆటోమోటివ్ తయారీ వంటి రంగాల్లో అధునాతన నైపుణ్యాలపై దృష్టి సారిస్తాయి. ఇవన్నీ భారతదేశ దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణమైన నిర్ణయాలే. ఈ పథకానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు సమకూరుస్తాయి. పరిశ్రమల నుంచీ సహకారం లభిస్తుంది. ముఖ్యంగా కేంద్రం వాటాలో సగం ఆసియా అభివృద్ధి బ్యాంకు, ప్రపంచ బ్యాంకుల నుంచి వస్తుంది. భారతదేశ నైపుణ్యాభివృద్ధి ప్రయత్నాల పట్ల ఆ సంస్థల విశ్వాసాన్ని ఇది తెలియజేస్తోంది.



శ్రామిక శక్తి సృష్టి

ఆర్థిక వ్యవస్థ గమనంలో ఒక కీలకమైన దశలో ఈ భారీ పెట్టుబడి వస్తోందని గుర్తించాలి. ఒకప్పుడు వేగవంతమైన ఆర్థిక పురోగమనానికి సాఫ్ట్‌వేర్, ఐటీ సేవల రంగం తప్ప వేరే మార్గమే లేదనే పరిస్థితి ఉండేది. ఇటీవలి కాలంలో ఆ రంగంలో కొంత అస్థిరత కనిపిస్తోంది. బడా టెక్ కంపెనీలు భారీగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. కొత్త నియామకాలు మందగించాయి. మరోవైపు ఏఐతో ఎన్నో ఉద్యోగాలు మాయమవుతాయనే భయం నానాటికి పెరుగుతోంది. టెక్ రంగంలో ఈ పరిణామాల నేపథ్యంలో వృత్తి శిక్షణ ఒక ముఖ్యమైన మార్గాంతరంగా ముందుకొస్తోంది. వెల్డింగ్, ప్రెసిషన్ మెషినరీ, ఎలక్ట్రిక్ వెహికల్ రిపేర్, సోలార్ ఇన్‌స్టాలేషన్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ వంటి రంగాల్లో వృత్తి శిక్షణకు, నిపుణులకు భారీ గిరాకీ ఉంది. బలమైన వృత్తి శిక్షణ వ్యవస్థలు సమతుల ఆర్థిక వృద్ధికి ఎంతో కీలకమని చాలా కాలంగా జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా తదితర దేశాలు నిరూపిస్తున్నాయి. భారతదేశ విద్యారంగం చరిత్రాత్మకంగా పారిశ్రామిక ప్రపంచానికి అవసరమయ్యే నైపుణ్యాల కన్నా పట్టాలకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. ఆ పట్టాలకు పరిశ్రమ అవసరాలకు మధ్య పొంతన లేక ఎంతో మంది ఉపాధి వేటలో వెనకబడుతున్నారు. కేంద్రం కొత్త పథకంతో ఐటీఐల దశ, దిశ మారే అవకాశం ఉంది. అయిదేళ్లలో 20 లక్షల మంది యువతకు శిక్షణ ఇవ్వడం, యాభై వేల మంది బోధకులను తయారు చేయడం కేంద్రం లక్ష్యాలు. అవి సాకారం అయితే, ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా పోటీపడగల అధునాతన శ్రామిక శక్తిని సృష్టించడం సాధ్యమవుతుంది.

మేలిమి నిర్ణయం

భారత జనాభాలో సుమారు 50శాతం ముప్పై ఏళ్ల లోపువారే. అభివృద్ధి చెందిన దేశాలెన్నింటిలోనో ప్రస్తుతం కార్మికుల కొరత వేధిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆధునిక ప్రమాణాలకు తగ్గట్టుగా ఐటీఐలలో శిక్షణ పొందిన భారతీయ యువత, దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కీలక నైపుణ్య అవసరాలను తీర్చగలుగుతుంది. ఇది పూర్తిస్థాయిలో సాకారం కావాలంటే ప్రజల ఆలోచనా ధోరణిలోనూ మార్పు రావాలి. చాలా కాలంగా ఐటీఐ చదువుల పట్ల సమాజంలో ఒక చిన్నచూపు నెలకొంది. ఇది సరి కాదు. ఉద్యోగం ఇవ్వలేని ఇంజినీరింగ్ పట్టాకన్నా, గౌరవమైన ఉపాధిని అందించగల వృత్తివిద్య మేలన్న అవగాహన సంఘంలో బలపడాలి. ఐటీఐల కోసం అరవై వేల కోట్ల రూపాయల పెట్టుబడి అంటే, భారతదేశ అభివృద్ధి ప్రాధాన్యతల పరంగా గొప్ప నిర్ణయమే. విశ్వవిద్యాలయ పాఠ్యాంశాల కంటే పరిశ్రమలు వేగంగా పరిణామం చెందుతున్న నేటి ప్రపంచంలో, అధునాతన వృత్తివిద్య ప్రపంచ విపణికి కావాల్సిన కార్మికులను అందిస్తుంది. ఈ సాహసోపేతమైన అడుగు... నైపుణ్యాలకు పెద్దపీట వేస్తూ భారతదేశ అభివృద్ధికి బాటలు పరుస్తుంది.



ప్రొఫెసర్ వి.శ్రీనివాస చక్రవర్తి

ఐఐటీ – మద్రాస్‌లో ఆచార్యులు


హాయ్! బుజ్జీ!!

ఏనుగు గర్వం!

ఒక చిట్టడవిలో ఏనుగు ఉండేది. అది అడవిలో ఉండే మిగతా అన్ని జంతువులతో దురుసుగా ప్రవర్తించేది. నడుచుకుంటూ వెళ్తూ దారిలో ఉన్న చెట్లను విరిచేసేది. బలంలో తనని మించిన జంతువు ఆ అడవిలో లేదని గొప్పలు చెప్పుకొనేది. ఆ ఏనుగు ఆగడాలను మిగతా జంతువులు తట్టుకోలేకపోయాయి. ఇలాగే కొనసాగితే.. భవిష్యత్తులో అడవికి చాలా ప్రమాదమని భయపడ్డాయి. అన్నీ కలిసి దానికి నచ్చజెప్పాలని చూశాయి. కానీ ఆ ఏనుగు అస్సలు వినలేదు. ఎప్పటిలాగే ప్రవర్తించసాగింది. దాంతో ఒకరోజు కుందేలు ఆ ఏనుగు దగ్గరికి వెళ్లి.. 'నువ్వు చాలా బలమైన దానివి కదా! అయితే నేను చూపించిన చెట్టుని నీ కాలితో విరిచి చూపించు.. అప్పుడు అందరి కంటే బలశాలివని నమ్ముతాను' అంది. 'మాటలొద్దు. ముందు నువ్వు చెట్టు చూపించు' అని గట్టిగా అరిచింది ఏనుగు. కుందేలు ఒక చిన్న చెట్టుని చూపించింది. దానికి ఏనుగు వెటకారంగా నవ్వి.. ఆ చెట్టుని కాలితో ఎడాపెడా తొక్కేసింది. అంతే.. చెట్టుకు ఉన్న ముళ్లన్నీ దాని కాలుకి గుచ్చుకున్నాయి. దాంతో ఏనుగు.. 'బాబోయ్.. నొప్పి!' అంటూ అరవడం మొదలుపెట్టింది. అది విని జంతువులన్నీ అక్కడికి చేరుకున్నాయి. ఎలుగుబంటిని పిలిచి.. పసరుమందుతో వైద్యం చేయించాయి. అది కాలిలో విరిగిన ముళ్లు తీసింది. దానికి కాస్త నొప్పి తగ్గాక.. 'ఇప్పుడైనా నీ బుద్ధి మార్చుకో! ఎంత చెప్పినా వినకుండా కనిపించిన ప్రతీచెట్టునీ విరగ్గొట్టాలని చూశావు. కానీ నీకు ఇప్పుడు ఆ చెట్టు పసరే అవసరం వచ్చింది. అందుకే దేన్నీ తక్కువ చేసి చూడొద్దు. ఏదీ కావాలని పాడు చేయొద్దు. వద్దు అనుకున్నవీ, నచ్చనివే.. కొన్నిసార్లు మనల్ని ఆపద నుంచి కాపాడతాయి' అని హితబోధ చేశాయి జంతువులు. 'నన్ను క్షమించండి మిత్రులారా! ఇప్పటి నుంచి పద్ధతిగా ఉంటాను' అంది ఏనుగు. దానిలో వచ్చిన మార్పునకు అడవిలోని జంతువులన్నీ సంతోషించాయి.



– నంద త్రినాథ రావు



బదిలీల్లో జేఎల్స్, ప్రిన్సిపాళ్ల పనితీరుకు పాయింట్లు

మే 22 నుంచి జూన్ 8 వరకు బదిలీలకు షెడ్యూల్ విడుదల

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ విద్యా మండలి పరిధిలోని బదిలీల్లో ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్లకు పనితీరు ఆధారిత పాయింట్లను నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల ఆధారంగా వీటిని ఇవ్వనున్నారు. 0నుంచి40శాతం ఫలితాలు వస్తే ఎలాంటి పాయింట్లు ఉండవు. 41 నుంచి 60 శాతానికి రెండు, 61-80 శాతానికి నాలుగు, 81నుంచి100 శాతానికి ఆరు పాయింట్లు చొప్పున ఇస్తారు. ప్రిన్సిపాళ్లకు జనరల్, వృత్తి విద్యా కోర్సులను కలిపి చూస్తారు. బోధనేతర సిబ్బంది, లెక్చరర్ల బదిలీలను వెబ్ కౌన్సెలింగ్ ద్వారా గురువారం నుంచి జూన్ 8లోపు పూర్తి చేస్తారు. మే 31 నాటికి ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన వారికి తప్పనిసరి బదిలీ ఉంటుంది. జూన్ 1 నుంచి మే 31 వరకు అకడమిక్ సంవత్సరంగా పరిగణిస్తారు. ఒక సంవత్సరంలో తొమ్మిది నెలల సర్వీసు పూర్తి చేసుకున్నా సంవత్సరంగానే లెక్కిస్తారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారు అభ్యర్థన బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2027 మే 31కి ముందు ఉద్యోగ విరమణ చేసే వారికి బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. హెచ్‌ఆర్‌ఏ 16 శాతంతో క్యాటగిరీ-ఏలో ఉన్నవారికి కేటగిరీ-బీ, సీ, డీ ప్రాంతాలకు మారేందుకు అనుమతిస్తారు. హెచ్‌ఆర్‌ఏ 12శాతంతో క్యాటగిరీ-బీలో ఉన్నవారు క్యాటగిరీ-ఏ, బీ, సీ, డీలకు వెళ్లొచ్చు. హెచ్‌ఆర్‌ఏ 10శాతంతో క్యాటగిరీ-సీలో ఉన్నవారు అన్ని క్యాటగిరీలకూ మారేందుకు అవకాశం ఉంటుంది. నోటిఫై చేసిన గిరిజన ప్రాంతాల్లో క్యాటగిరీ-డీలో పని చేస్తున్న వారు సైతం అన్ని క్యాటగిరీల్లోకి బదిలీ కోరుకోవచ్చు. క్యాటగిరీ-ఏకు రెండు, బీకి నాలుగు, సీకి ఆరు, డీకి ఎనిమిది పాయింట్లు చొప్పున ఏడాదికి ఇస్తారు. అన్ని కళాశాలల్లోనూ కనీస రెగ్యులర్ సిబ్బంది ఉండేలా పోస్టులను బ్లాక్ చేస్తారు.

కీర్తిచక్ర... రాంగోపాల్‌నాయుడు

రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కార ప్రదానం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నగిరిపెంటకు చెందిన మేజర్ మల్లా రాంగోపాల్‌నాయుడికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కీర్తిచక్ర పురస్కారాన్ని ప్రదానం చేశారు. దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గురువారం గ్యాలంట్రీ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఈ పురస్కారాన్ని అందించారు. 2023 అక్టోబరు 26న ఉగ్రవాదులు చొరబాటుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం వచ్చింది. జమ్మూలోని కుప్వారా జిల్లాలో తోటి సైనికులతో కలిసి రాంగోపాల్ సోదాలు ప్రారంభించారు. అక్కడ ఇళ్లలో నక్కిన ఐదుగురు ఉగ్రవాదుల్లో ముగ్గురిని పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో రాంగోపాల్ కాల్చి చంపారు. మరొక ఉగ్రవాది తప్పించుకున్నాడు. అతని కోసం వెతుకుతుండగా రాంగోపాల్ బృందంపై ఐదో ఉగ్రవాది గ్రెనేడ్ విసిరాడు. దాని నుంచి చాకచక్యంగా తప్పించుకుని అతడిని ముట్టుబెట్టి ఆపరేషన్ ముగించారు. రాంగోపాల్ చూపిన ధైర్యసాహసాలను పరిగణనలోని తీసుకుని... గతేడాది 'కీర్తిచక్ర' పురస్కారానికి ఎంపిక చేశారు.

రెండు రోజుల పోలీసు కస్టడీకి వంశీ

నకిలీ ఇళ్ల పట్టాల కేసులో న్యాయాధికారి ఆదేశాలు

హనుమాన్ జంక్షన్, నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నకిలీ ఇళ్ల పట్టాల కేసులో వైకాపా నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని రెండు రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు నిమిత్తం వంశీని ఏడు రోజులు కస్టడీకి ఇవ్వాలని హనుమాన్ జంక్షన్ పోలీసులు ఈ నెల 19న పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నూజివీడు సెకండ్ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈ నెల 20న వాదనలు వినిపించారు. తుది విచారణ అనంతరం వంశీని రెండు రోజులు కస్టడీకి ఇస్తూ.. న్యాయాధికారి శ్రావణి గురువారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్ర, శనివారాల్లో పోలీసులు ఆయన్ను విచారించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే విచారణ చేయాలని, ఆయన తరఫు న్యాయవాదిని అనుమతించాలని కస్టడీ ఉత్తర్వుల్లో న్యాయాధికారి సూచించారు. మరోవైపు ఇదే కేసులో ఈ నెల 16న వంశీకి రిమాండ్ విధించిన నేపథ్యంలో ఆయన తరఫున వేసిన బెయిల్ పిటిషన్‌పై గురువారం ఇదే కోర్టులో వాదనలు కొనసాగాయి. బెయిల్ ఇస్తే సాక్షులను, సాక్ష్యాలను ప్రభావితం చేస్తారని ఏపీపీ ప్రసన్న వాదనలు వినిపించగా. . ఆరోగ్య కారణాల రీత్యా బెయిల్ మంజూరు చేయాలని వంశీ తరఫు న్యాయవాది కోరారు. దీనిపై తీర్పును ఈ నెల 26కు వాయిదా వేశారు.

పోలీసు కస్టడీకి తురకా కిశోర్

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్, వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్‌ను రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి కోర్టు అనుమతిచ్చింది. ఈ మేరకు మాచర్ల అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ప్రశాంత్ ఉత్తర్వులిచ్చారు. 2009లో ప్రభుత్వం చల్లా శివకుమార్‌కు మాచర్లలో ఇంటి స్థలం మంజూరు చేసింది. దాని పక్కనే మరో స్థలాన్ని ఆయన కొనుగోలు చేసి, తన కుమార్తె నాగరాణి పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. అందులో ఆమె ఇల్లు నిర్మించగా, శివకుమార్ తన భార్యతో కలిసి అందులో నివాసం ఉంటున్నారు. ఆ ఇంటిపై కిశోర్ కన్నేసి, తన అనుచరులతో కలిసి బెదిరించి స్వాధీనం చేసుకున్నాడు. ఆ ఇంటిని కూలగొడుతున్న క్రమంలో అడ్డువచ్చిన శివకుమార్‌తోపాటు ఆయన భార్యపై హత్యాయత్నం చేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 12న పోలీసులు కేసు నమోదు చేశారు. కిశోర్, అతడి అనుచరులను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా. . రిమాండ్ విధించారు. ఈ కేసులో నిందితుడిని విచారించేందుకు అనుమతించాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. అందుకు 23, 24 తేదీల్లో అనుమతిస్తూ.. న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు.

సెలవుల్లో సరదాగా!

మార్కెట్ పాఠాలు!

ఫ్రెండ్స్.. రోజూ నాన్న, అమ్మ ఎవరో ఒకరు కూరగాయల మార్కెట్‌కి వెళ్లి వెజిటబుల్స్ తీసుకొస్తుంటారుగా.. సరదాగా మనం కూడా ఈసారి వెళదామా! ఎందుకంటే మార్కెట్‌లో మనం తెలుసుకోదగిన విషయాలు చాలానే ఉంటాయి మరి.



మార్కెట్‌లో రెండు రకాలవారు ఉంటారు.. అమ్మేవారు, కొనేవారు. వారు ఎలా బిహేవ్ చేస్తున్నారో చూడండి.

- ★ తాజా వస్తువులు కొనేందుకు అమ్మానాన్న ఏం చేస్తున్నారో అబ్జర్వ్ చేయండి.
- ★ ఒకటే వస్తువును కొందరు తక్కువ ధరకు, మరికొందరు ఎక్కువ ధరకు ఎందుకు అమ్ముతున్నారో ఆలోచించండి.
- ★ తెచ్చిన వెజిటబుల్స్ సేల్ కాకపోతే వాళ్లు ఏం చేస్తున్నారో, ఎలా ఫీల్ అవుతున్నారో గమనించండి.
- ★ కొందరు బేరం ఆడుతుంటారు. అది వారు ఎలా చేస్తున్నారో, అక్కడ ఎలాంటి మెజరింగ్‌లో వస్తువులు అమ్ముతున్నారో చూడండి.
- ★ వెళ్లి వచ్చాక మీరు తెలుసుకున్న విషయాలతోపాటు రకరకాలైన కాయగూరలు, అవి మనకు ఇచ్చే పోషకాల గురించి ఒక చోట రాయండి.

ఆ కూరగాయల పేర్లతో ఒక పాట కూడా కూర్చండి. సరేనా!

ఇంట్లోనే పిక్నిక్

మనం పిక్నిక్‌కి బయటకే వెళ్లాల్సిన పని లేదు తెలుసా! ఎంచక్కా ఇంట్లోనే ఒక 'హోమ్ పిక్నిక్' చేసుకోవచ్చు. దీనికోసం ఇంట్లో వాళ్లు, లేదా చుట్టుపక్కల ఫ్రెండ్స్.. ఎవరున్నా పర్లేదు. దుప్పట్లు, తలగడలు, బొమ్మ ఫుడ్, కొంచెం నిజమైన స్నాక్స్, నచ్చిన గేమ్స్ అన్నీ ఒక దగ్గర పెట్టుకోవాలి.



ఈ హోమ్ పిక్నిక్‌కి అన్నింటికంటే ఇంపార్టెంట్ ఏమిటో తెలుసా? ప్లేస్..! మనం ఎక్కడ ఇది చేస్తున్నాం అనే దాన్ని బట్టే సరదా అంతా. బెడ్‌రూమ్, పెరట్లో, హాల్‌లో ఒక మూల.. ఇలా ఎక్కడైనా దీన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ ఏరియాను చిన్నగా డెకరేట్ కూడా చేయొచ్చు! జంగిల్ సఫారీ, బీచ్. . ఇలా ఏదైనా థీమ్ పెట్టుకుని, ఆ బొమ్మలను అక్కడ ఉంచితే ఇంకా బాగుంటుంది. మరి మీరు ఎలా చేసుకోవాలి అనుకుంటున్నారో వెంటనే ఆలోచించండి!

భలే భలే పజిల్స్



మనలో కొందరికి పజిల్స్ సాల్వ్ చేయడమంటే చాలా నచ్చుతుంది. కానీ మరికొందరికి మాత్రం కొంతసేపటికి బోర్ కొట్టేస్తుంది. చేసిన పజిల్‌ను మళ్లీ చేయమంటే కూడా అంతగా ఇష్టపడం. కానీ ఫ్రెండ్స్.. పజిల్స్‌ను సాల్వ్ చేయడం వల్ల చాలా లాభాలున్నాయి తెలుసా!

★ ఏవైనా అనుకోని ప్రాబ్లమ్స్ ఎదురైనప్పుడు ఏం చేయాలో తెలియక బెంగపడుతూ ఉంటాం కదా.. అలా కాకుండా దీని వల్ల మన బ్రెయిన్ బాగా స్ట్రాంగ్ అయ్యి వాటిని ఎలా డీల్ చేయాలో తెలుస్తుందట. అన్ని విషయాలు బాగా గుర్తుంటాయట. చేతులకు, కళ్లకు మధ్య కోఆర్డినేషన్ పెరిగి, చాలా సెల్ఫ్‌కాన్ఫిడెన్స్ కూడా వస్తుందట. మరి మనకు ఎన్నో విధాలుగా మంచి చేసే ఈ పజిల్స్‌ను.. ఈ ఖాళీ సమయంలో బోలెడన్ని పూర్తిచేసి తెలివితేటలు పెంచేసుకుందాం, ఏం అంటారు!

వాట్ కలర్!

మనం అప్పుడప్పుడు పాత ఆటలు ఆడుతున్నాంగా, ఇవాళ అలాంటి గేమ్ ఒకటి ఆడేద్దాం. ఎలా అంటే..



- ❖ కొందరు పిల్లలు కలిసి ఆడాలి దీన్ని. దొంగగా ఉన్న ఒక్కరు తప్ప గ్రూప్‌లో అందరూ 'కలర్ కలర్ వాట్ కలర్' అంటారు.
- ❖ అప్పుడు మిగిలిన ఆ ఒక్కరు కలర్ ఈజ్.. అని ఏదైనా ఒక రంగు పేరు చెప్పాలి. అంటే రెడ్, బ్లూ, ఆరెంజ్.. ఇలా అన్నమాట.
- ❖ తను రంగు పేరు చెప్పగానే మిగతా అందరూ వెంటనే ఆ రంగు ఎక్కడ ఉంటే దాన్ని పట్టుకోవాలి. రంగు దొరికేలోపు దొంగకు దొరికిపోతే వారు ఔట్.

చుట్టుపక్కల ఈజీగా కనిపించని రంగులు చెబితే ఆట భలే సరదాగా ఉంటుంది. మరి ఇక మొదలు పెడదామా!

ఎన్ని వింతలో..

మనం సర్‌ప్రైజ్ ఫీల్ అవ్వాలంటే ఇంట్లోవాళ్లు చాక్లెటో, బొమ్మో ఇవ్వాల్సిన పనిలేదు తెలుసా? ఈ నేచర్ మనకి చాలా వింతలు ఇచ్చింది. వాటిని చూసి సర్‌ప్రైజ్ అవుదాం పదండి!

ఎప్పుడైనా మిణుగురు పురుగులను చూశారా? చీకట్లో అవి వెలుగుతున్నప్పుడు చూడటం ఎంత బాగుంటుందో!



..ఇంకా ఇలాంటి ప్రకృతి వింతలు ఎన్నున్నాయో.. కనిపెడుతూ, ఆడుకుంటూ ఈ హాలిడేస్‌ను సరదాగా గడిపేయండి!

- ఈ మొక్క మన వీధిలో, వెళ్లే దారిలో ఎక్కడపడితే అక్కడే ఉంటుంది. దాని ఆకుని వేలితో తాకగానే దానికుండే చిన్ని చిన్ని లీవ్స్ అన్నీ ముడుచుకుపోతాయి. కాసేపటికి గానీ విచ్చుకోవు, దాన్ని తాకి చూడండి.
- దారి పక్కన ఉండే పెద్దపెద్ద చెట్ల నుంచి పసుపు రంగు పూలు పడుతూ ఉంటాయి కదా! ఆ మొగ్గలను ఏరి గట్టిగా చేతికేసి కొట్టండి. భలే పేలి సౌండ్ చేస్తాయి!
- ఇంటి పక్కన ఉండే చిన్న చిన్న మొక్కలకు ఒకరకమైన కాయల్లాంటివి కాస్తాయి. వాటిని దువ్వెనలు అనుకుని ఆడుకోవచ్చు. అవి ఎక్కడున్నాయో వెతకండి.

వివేకా హత్య కేసు నిందితుడు.. దేవిరెడ్డి భూదందా

- వైఎస్సార్ కడప జిల్లాలో 30 ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జా
- 'నిరుపేదలం' అంటూ కుటుంబ సభ్యుల పేర్లతో వెబ్‌ల్యాండ్‌లోకి
- బినామీల పేరిట మరో 23.15 ఎకరాలు
- ఆక్రమణల విలువ రూ.10 కోట్ల పైనే
- చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి రెవెన్యూ శాఖ నివేదిక

ఈనాడు, కడప: వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడైన దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుటుంబం పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం దొండ్లవాగులో 30 ఎకరాల ప్రభుత్వ భూముల్ని కబ్జా చేసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో రెవెన్యూ యంత్రాంగాన్ని గుప్పిట పెట్టుకుని.. పేదల పేరుతో పట్టాలు తీసుకున్నట్లు చూపి వెబ్‌ల్యాండ్‌లోకి ఎక్కించుకున్నారు. ఎకరా రూ.20 లక్షల చొప్పున మొత్తం 30 ఎకరాల విలువ ప్రస్తుతం రూ.6 కోట్లు ఉంటుంది. ఇదే ప్రాంతంలో మరో 23.15 ఎకరాల భూమిని కూడా సబ్‌డివిజన్ చేసి బినామీ పేర్లతో వెబ్‌ల్యాండ్‌లోకి ఎక్కించారు. అది కూడా వీరికి సంబంధించిన వ్యక్తులదే అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంటే మొత్తం 53.15 ఎకరాల ప్రభుత్వ భూమి వారి చేతుల్లోకి వెళ్లిపోయింది. వాటి ప్రస్తుత విలువ రూ.10 కోట్ల పైమాటే. వాటిలో చీనీ తోటలు సాగు చేస్తున్నారు. ఇవన్నీ ఆక్రమణలే అని రెవెన్యూశాఖ తేల్చింది.



దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఆక్రమిత భూమిలో సాగుచేసిన చీనీ తోట

దొండ్లవాగులో దేవిరెడ్డి పరివారం..

మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు, ఎంపీ అవినాష్‌రెడ్డిలకు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి అత్యంత సన్నిహితుడు. వైకాపా పాలనలో ఆయన భారీగా సంపద కూడబెట్టారు. ఆయన కుమారుడు దేవిరెడ్డి చైతన్యరెడ్డి కడప నగరంలో ప్రైవేటు ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. దానికి ఈయనే ఎండీ. శివశంకర్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ప్రమీలమ్మ, తులసమ్మ, యశ్వంత్‌రెడ్డి, శ్రావణి పేర్లతో లింగాల మండలం దొండ్లవాగు రెవెన్యూ పరిధిలో ఐదెకరాల చొప్పున భూములున్నాయి. పేదల పేరుతో పట్టాలు తీసుకుని. . వీళ్ల పేరుతో వెబ్‌ల్యాండ్ చేయించుకున్నట్లు చెబుతున్నారు. సర్వే నంబరు 15, 150 పరిధిలోనివన్నీ ప్రభుత్వ భూములే అని రెవెన్యూ యంత్రాంగం చెబుతోంది. సబ్ డివిజన్ చేసినట్లు చూపి కుటుంబ సభ్యుల పేర్లతో మార్పించారని పేర్కొంటున్నారు.

ఎసైన్‌మెంట్ కమిటీ అనుమతి ఏదీ?

దేవిరెడ్డి కుటుంబం భూ ఆక్రమణపై అందిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా తహసీల్దారు వివరాలు తీసుకున్నారు. అందుబాటులో ఉన్న ఎసైన్‌మెంట్ కమిటీ, డీకే పట్టా రిజిస్టర్‌ను పరిశీలించారు. అయితే దేవిరెడ్డి కుటుంబ సభ్యుల పేర్లతో భూములు ఇచ్చినట్లు ఎక్కడా లేదు. డీకేటీ పట్టాలు కూడా ఇవ్వలేదు. అయినా వాటిని పట్టా చేసుకుని, అప్పటి తహసీల్దారు సహకారంతో వెబ్‌ల్యాండ్‌లోకి ఎక్కించారని గుర్తించారు. 2020 మే నెలలో ఆన్‌లైన్ చేసినట్లు రికార్డులు చూపిస్తున్నాయి. ఈ భూములతోపాటు చుట్టూ ఉన్న మరికొంత భూమినీ భారీగా ఆక్రమించి భవన నిర్మాణాలు కూడా చేపట్టారు. చీనీ తోటలు సాగు చేస్తున్నారు. వీటన్నింటిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు.

దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆక్రమణల చిట్టా

అక్రమ పట్టాదారు	బంధుత్వం	సర్వే నంబరు	విస్తీర్ణం (ఎకరాల్లో)
దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి	స్వీయ	150/6	5
దేవిరెడ్డి తులసమ్మ	భార్య	150/7	5
దేవిరెడ్డి యశ్వంత్‌రెడ్డి	కుమారుడు	15/6	5
దేవిరెడ్డి చైతన్యరెడ్డి	కుమారుడు	15/5	5
దేవిరెడ్డి ప్రమీలమ్మ	తల్లి	15/1(బి)	5
ఎస్.శ్రావణి	కోడలు	15/7	5

ఏడీసీఎల్‌కు రూ.75 కోట్లు కేటాయింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) వివిధ ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేందుకు 2025-26 బడ్జెట్ కేటాయింపుల నుంచి రూ.75 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సంస్థ ఎండీ తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.



మీరేంటో తెలిపేది మీ శక్తే!

మిమ్మల్ని నిర్వచించేది మీ వయసు కాదు. మీరేంటో మీ శక్తే తెలియజేస్తుంది. కొంతమంది వయసు పాతికేళ్లే అయినా.. ఎప్పుడూ డస్సిపోయి ఉంటారు. ఇంకొంతమంది 50 ఏళ్ల వయసు దాటినా నిరంతరం ఉత్సాహంగా ఉంటారు. శక్తి లేకపోతే జీవితం లేనట్టే! మీ శక్తిని పెంచుకోవడంపై దృష్టిపెట్టండి.

– శ్రద్ధే కటియార్, వైద్యుడు

కేంద్రానిది అమానవీయ విధానం: సీపీఎం

దిల్లీ: మావోయిస్టు అధిపతి నంబాల కేశవరావు సహా 27 మందిని ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండించింది. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకుందామని మావోయిస్టులు కేంద్రానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పెడచెవిన పెట్టి.. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రాణాలను బలిగొంటోందని ఆక్షేపించింది. ఈ మేరకు పార్టీ పొలిట్‌బ్యూరో గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఎన్‌కౌంటర్ మృతుల్లో ఐదుగురు తెలుగువారు

- 14 మంది మహిళలు..
- మొత్తం 27 మృతదేహాలు నారాయణపుర్‌కు తరలింపు
- మృతి చెందిన జవాన్ల సంఖ్య రెండుకి చేరిక

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపుర్ జిల్లా సరిహద్దు అబూజ్‌మడ్ అడవుల్లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ చీఫ్ నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజు సహా 27 మంది మావోయిస్టుల మృతదేహాలను గురువారం జిల్లా కేంద్రానికి తరలించారు. జోరున కురుస్తున్న వర్షం.. తీవ్ర ఇబ్బందుల నడుమ సైనిక హెలికాప్టర్లో జిల్లా కేంద్రానికి తీసుకువచ్చి.. పోస్టుమార్టం నిర్వహించారు. వారి గుర్తింపు పూర్తిచేశారు. మృతుల్లో కేశవరావు సహా ఐదుగురు తెలుగువారు కాగా.. మొత్తం మృతుల్లో 14 మంది మహిళలు ఉన్నారు. ఎదురుకాల్పుల ఘటనలో మృతి చెందిన జవాన్ల సంఖ్య రెండుకి చేరింది. జవాన్లు రమేశ్ హేమ్లా, కోట్లూరాం కొర్రంల పార్థివదేహాలకు ఆ రాష్ట్ర హోం మంత్రి విజయ శర్మ నివాళులర్పించారు. మావోయిస్టులతో జరుగుతున్న పోరాటంలో జవాన్ల తెగువ, ధైర్యం వెలకట్టలేనివన్నారు. ఎదురుకాల్పుల్లో ఏపీకి చెందిన నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్, సజ్జా నాగేశ్వరరావు ఎలియాస్ జంగు (రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడు), తెలంగాణకు చెందిన సంగీత, భూమిక, బూర రాకేశ్ ఎలియాస్ యుగేంద్ర ఎలియాస్ వివేక్ ఉన్నారు. నంబాల అంగరక్షకులైన రోషన్ ఎలియాస్ టిప్పు, రాజు ఓయం ఉన్నారు.

కడప మేయర్ సురేశ్‌బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ

మేయర్ పదవి నుంచి తొలగింపు జీఓను సస్పెండ్ చేసేందుకు నిరాకరణ

ఈనాడు, అమరావతి: కడప మేయర్ సురేశ్‌బాబుకు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను మేయర్ పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓను సస్పెండ్ చేసేందుకు న్యాయస్థానం నిరాకరించింది. సురేశ్‌బాబు వేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. ప్రధాన వ్యాజ్యంలో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ.. విచారణను వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ గురువారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన కారణంగా కడప మేయర్ పదవి నుంచి సురేశ్‌బాబును తొలగిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఈ నెల 14న జీఓ జారీ చేశారు. దాన్ని సవాలు చేస్తూ సురేశ్‌బాబు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. గురువారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపించారు. మేయర్ భార్య, ఆయన కుమారుడికి చెందిన వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి పనులు అప్పగించిన విషయం పిటిషనర్‌కు తెలియదని తెలిపారు. జీఓను సస్పెండ్ చేయాలని కోరారు.

ఇల్లు, కంపెనీ చిరునామాలు ఒక్కటే: ఎస్‌జీపీ

పురపాలక శాఖ తరఫున ఎస్‌జీపీ యతీంద్రదేవ్, కడప ఎమ్మెల్యే మాధవి తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావులు వాదనలు వినిపించారు. 'పిటిషనర్.. ఆయన కుటుంబ సభ్యులకు చెందిన వర్ధిని కంపెనీకి లబ్ధి చేకూర్చేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేశారు. పిటిషనర్‌కు తెలిసే ఆయన కుటుంబ సభ్యులకు కాంట్రాక్ట్ పనులు అప్పగించిన నేపథ్యంలో మేయర్ పదవికి ఆయన అర్హత కోల్పోతారు. మేయర్ సురేశ్‌బాబు ఇల్లు, వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ చిరునామాలు ఒక్కటే. ఆ కంపెనీకి పనులు అప్పగించిన విషయం తనకు తెలియదు అని చెప్పడం సరికాదు' అని కోర్టు దృష్టికి తెచ్చారు.

సాక్షులను పీఎస్ఆర్ ఎలా ప్రభావితం చేస్తారు?

వాదనలు వినిపించాలని ఏజీకి సూచించిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: సినీనటి కాదంబరీ జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుకు బెయిలు మంజూరు చేస్తే.. దర్యాప్తునకు ఏవిధంగా ఆటంకం కలిగిస్తారు, సాక్షులను ఏవిధంగా ప్రభావితం చేస్తారనే అంశాలపై వాదనలు వినిపించాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్‌కు హైకోర్టు సూచించింది. వాదనల ఆధారంగా బెయిలు మంజూరుపై నిర్ణయం తీసుకుంటామంది. విచారణను ఈ నెల 29కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.



విజయవాడ కోర్టుకు వస్తున్న పీఎస్ఆర్ ఆంజనేయులు

'గ్రూప్-1' కేసులో బెయిల్‌పై..

గ్రూప్-1 జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై విజయవాడ సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిలు కోసం పీఎస్ఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారించింది. పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశిస్తూ.. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

నిందితుల కస్టడీకి పోలీసుల పిటిషన్

గ్రూప్-1 అక్రమాల కేసులో నిందితులైన పీఎస్ఆర్, మధుసూదన్‌లను ఏడు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గురువారం రెండో ఏజేసీజే కోర్టులో పోలీసులు పిటిషన్ వేశారు. దీనిపై నిందితుల తరఫు న్యాయవాదులు కౌంటర్ దాఖలు కోసం విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. ఇదే కేసులో ఏ1.. పీఎస్ఆర్ రిమాండ్ గురువారంతో ముగియనుండడంతో ఆయనను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి వచ్చేనెల 5 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. అనంతరం పీఎస్ఆర్‌ను తిరిగి జైలుకు తరలించారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

హనుమజ్జయంతి సందర్భంగా విజయవాడలో గురువారం ద్విచక్ర వాహనాలతో పెద్దఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా స్వామి వారికి అభిషేకాలు, సుందరకాండ పారాయణం, లక్ష తమలపాకులతో అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైభవంగా సాగిన యాత్రలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఇరవై సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ భక్తులు పాల్గొన్నారు.

– ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, చిట్టినగర్, గాంధీనగర్



ర్యాలీలో భక్తులు



శోభాయాత్రలో మంత్రి సత్యకుమార్ యాదవ్, లంకా దినకర్ తదితరులు

మద్యం కేసులో నిందితుల కస్టడీ పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో అరెస్టై జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న సీఎంవో మాజీ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలంటూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 26కి వాయిదా వేసింది. ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డిని మరోసారి కస్టడీకి ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ కూడా అదే రోజుకు వాయిదాపడింది. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ, రాజ్ కెసిరెడ్డిలు విచారణకు సహకరించలేదని.. వారిని కస్టడీకి ఇవ్వాలని సిట్ తరఫు న్యాయవాదులు కోరారు. ఇదే కేసులో అరెస్టైన సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈ నెల 27వ తేదీకి, రాజ్ కెసిరెడ్డి, పైలా దిలీప్‌ల బెయిల్ పిటిషన్లపై విచారణను 26కు వాయిదా వేసింది.

అందానికే కాదు.. అమ్మతనానికీ కావాలి కసరత్తు



విజయవాడకు చెందిన ఓ యువతి ఆగస్టులో పెళ్లిచేసుకోబోతోంది. గతంలో పెళ్లైన తన స్నేహితురాళ్లలో ఎక్కువ మందికి పిల్లలు పుట్టకపోవడాన్ని ఆమె గమనించింది. కారణం పీసీవోఎస్ అని తెలుసుకుంది. భవిష్యత్తులో తనకూ పుట్టబోయే సంతానం విషయంలో ఇబ్బందులు రాకూడదని వైద్యుల్ని సంప్రదించింది. ఆయన బరువు తగ్గమని సూచించడంతో జిమ్‌లో చేరింది.

హైదరాబాద్‌కు చెందిన ఓ జంట వచ్చే సంవత్సరం పిల్లలు కనడానికి ప్రణాళిక వేసుకున్నారు. దానికి ఇప్పటి నుంచే బయటి ఆహారం మానేసి, జిమ్‌లో కసరత్తులు చేస్తున్నారు. పిల్లలు ఆరోగ్యంగా పుట్టడానికి అవకాశం ఉండడంతో ఈ కసరత్తులు చేస్తున్నామని చెబుతున్నారు.

మారుతున్న జీవనశైలి, కల్తీ ఆహారం, ఒత్తిళ్లు, వివిధ కారణాలతో యువతులు, మహిళలు పీసీవోఎస్, థైరాయిడ్, డయాబెటిక్, హెర్నియా వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. ఊబకాయం, సంతానలేమి సర్వసాధారణమయ్యాయి. పిల్లల కోసం అనేక జంటలు ఫెర్టిలిటీ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నాయి. ఇవన్నీ గమనిస్తున్న నవతరం యువతులు పెళ్లికి ముందే శరీర అధిక బరువు, ఇతర అనారోగ్య సమస్యలను అదుపులో ఉంచుకునేందుకు జిమ్‌లలో చేరి కసరత్తులు చేస్తున్నారు. ప్రస్తుతం ఏ జిమ్‌లో చూసినా ఇలా వచ్చిన వారు చాలామంది కనిపిస్తున్నారు. మరికొందరైతే పిల్లల్ని కనడానికి కొన్ని నెలల ముందు నుంచే కసరత్తులు చేస్తూ... ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటున్నారు. కొంతమంది ప్రత్యేక శిక్షకులనూ నియమించుకుంటున్నారు.

...అలా అయితే జుంబా చేద్దాం

జిమ్ చేయడం వల్ల ఎక్కువ మంది కండరాల నొప్పితో బాధపడుతుంటారు. మరికొందరు బరువులు ఎత్తలేరు. అయితే వారికి జుంబా డ్యాన్స్ సులువైన వ్యాయామం. ఎక్కువ మందితో కలిసి డ్యాన్స్ చేయడం వల్ల ఉత్సాహంగానూ ఉంటుంది. జుంబా నేర్చుకోవడానికి అధికంగా యువతులే వస్తున్నారు. జంక్‌ఫుడ్‌కు చెక్ పెట్టి ప్రత్యేక ఆహారాన్ని తీసుకోవడం వల్ల కూడా మంచి ప్రయోజనాలు కలుగుతున్నాయి.

శరీరాకృతి కోసం చెమటలు

ఆరోగ్యంతో పాటు పలువురు యువతులు అందంగా కనిపించడానికి జిమ్‌లను ఆశ్రయిస్తున్నారు. వీరిలో కొత్త జంటలు సైతం ఉంటున్నాయి. పెళ్లిలో వేసుకునే దుస్తులు అద్దినట్లు ఉండాలని పెళ్లికూతుళ్లు నుంచే కసరత్తులు చేస్తున్నారు. పెళ్లి నిశ్చయమైనప్పటి నుంచి జంటలుగా వచ్చి వ్యాయామ కేంద్రాల్లో చెమటలు చిందిస్తున్నారు. పెళ్లి ఫోటోల్లో అందంగా కనిపించాలని అంటున్నారు. జంటలుగా కలిసి వస్తున్నామని చెబుతున్నారు. అలాగే బరువు కూడా సులభంగా తగ్గుతున్నారు.

వ్యాయామంతో కలిగే ప్రయోజనాలు...

- ప్రస్తుతం 30 ఏళ్ల వరకు యువతులు పెళ్లిళ్లు చేసుకోవడంలేదు. వ్యాయామాలు చేస్తే వృద్ధాప్యం ఉండేవారికి పెద్ద వయసులోనూ గర్భం నిలబడే అవకాశం ఉంటుంది. కాన్పు సులభంగా అవుతుంది.
- వ్యాయామం చేసేవారికి పెడ కొవ్వుతో గుండె, అండాశయంపై పొరలు ఏర్పడవు.
- శరీరంలోని అవయవాల ఫంక్షనింగ్ బాగా ఉంటుంది. నెలసరి సమయానికి వస్తుంది.
- రోగనిరోధక శక్తి పెరుగుతుంది... పీసీవోఎస్ సమస్యల నుంచి తప్పించుకోవచ్చు.
- బరువు తగ్గడం వల్ల గర్భం దాల్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- బరువు తగ్గిన వారికి గర్భస్రావం అయ్యే అవకాశం తక్కువ.
- నెలలు నిండక ముందే పిల్లలు పుట్టే ప్రమాదమూ ఉండదు.
- పీసీవోఎస్, థైరాయిడ్ ఉన్నవారు బరువు తగ్గితే చికిత్స లేకుండా పిల్లలు పుట్టే అవకాశం ఎక్కువ.
- ఒకవేళ మందులు వాడాల్సి వచ్చినా.. మంచి ఫలితాలు తొందరగా వస్తాయి.
- పిల్లలు కనడానికి ముందు జంక్‌ఫుడ్ తగ్గించి, మంచి ఆహారం తీసుకోవడంతో పాటు వ్యాయామాలు చేయడం వల్ల ఆరోగ్యకరమైన పిల్లలు కలిగే అవకాశమూ ఉంది.

"జీవన విధానంలో వచ్చిన మార్పుల వల్ల యువతుల్లో హార్మోన్ల అసమతుల్యం అధికంగా కనిపిస్తోంది. దీంతో శరీరంలో మార్పులు వస్తున్నాయి. అండాశయం మందమై అండం విడుదల కష్టమవుతోంది. జెనెటిక్ కారణాలతో పిల్లలు పుట్టడంలేదు. వ్యాయామాలు చేయడంతో పాటు జంక్‌ఫుడ్, కొవ్వు పదార్థాలు తగ్గించాలి. కూరగాయలు, ఆకుకూరలు, నీటిని అధికంగా తీసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయడంతో హార్మోన్ల అసమతుల్యం తగ్గుతుంది. దీంతో పిల్లలు పుట్టే అవకాశం పెరుగుతుంది.

–డాక్టర్ కేశవచంద్ర, హెచ్‌వోడీ, గైనకాలజీ విభాగం, సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల, విజయవాడ

"ఎక్కువ మంది యువతులు, మహిళలు, థైరాయిడ్, పీసీవోఎస్, అధిక బరువు వల్ల పిల్లల లేమి, నడుం నొప్పులతో జిమ్‌కు వస్తున్నారు. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం వల్ల ఇవి అదుపులో ఉంటాయి. ఫిట్‌నెస్‌తో పాటు పెళ్లిలో అందంగా కనిపించడానికి, శరీరాకృతి కోసం వచ్చే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. జిమ్‌కు వచ్చే వారిలో 50 శాతానికి పైగా పీసీవోఎస్ సమస్యతోనే వస్తున్నారు.

– రాజు, సర్టిఫైడ్ ట్రైనర్, విజయవాడ

- ఈనాడు డిజిటల్, అమరావతి

వేల కోట్లు దోచేసి.. ఆధారాలు చెరిపేసి..

(మొదటి పేజీ తరువాయి)

తొలుత పెద్ద ఎత్తున డొల్ల కంపెనీలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా నిధుల మళ్లింపు, తప్పుడు ఇన్‌వాయిస్‌లు సృష్టించింది. వాటి ఆర్థిక లావాదేవీల ఆనవాళ్లు, ఆధారాలు లేవీ లేకుండా చేసేందుకు అంతర్గత సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ అయిన ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎస్ఏపీ వంటి వాటిని వ్యవస్థీకృతంగా మ్యానిపులేట్ చేశారు.

■ ఏపీఎస్‌బీసీఎల్‌కు ఆయా సంస్థలు సమర్పించిన ఇన్‌వాయిస్‌లు, ఫైనాన్షియల్ డేటా, ఆయా సంస్థల బ్యాక్ ఎండ్ సర్వర్లలోని సమాచారాన్ని క్రాస్ వెరిఫికేషన్ చేసి చూస్తే.. పెద్ద ఎత్తున లోపాలు బయటపడ్డాయి. ఏపీఎస్‌బీసీఎల్ అధికారుల సహకారం, ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎస్‌డబ్ల్యూఏఐ)లోని కొందరు ప్రతినిధులు, ఈ కుంభకోణంతో ప్రమేయమున్న మద్యం కంపెనీల మార్కెటింగ్ హెడ్‌ల సమన్వయంతో ఈ ఆధారాలను ధ్వంసం చేసే కుట్ర కొనసాగింది.

దర్యాప్తునకు తీవ్ర ఆటంకం కలిగేలా..

ఎంతటి క్లిష్టమైన నేరాన్నైనా ఛేదించడానికి డిజిటల్ ఆధారాలే ఇప్పుడు అత్యంత కీలకం. అందులోనూ ఆర్థిక కుంభకోణాల్ని వెలికితీయాలంటే అవి మరింత ముఖ్యం. వాటి రికవరీకి కూడా అవకాశం లేకుండా చేశారంటేనే ఈ ముఠా తమ నేరం ఉనికి బయటకు రాకుండా ఉండేందుకు ఎన్ని జాగ్రత్తలు తీసుకుందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఆధారాల ధ్వంసం వల్ల దర్యాప్తు ప్రక్రియకు తీవ్ర ఆటంకం కలిగింది. సిట్ వాటన్నింటినీ అధిగమించి ఈ మూలాల్ని వెలికితీయగలిగింది. ఈ ఆధారాల ధ్వంసం వెనక ఎవరున్నారనేది నిగ్గు తేల్చే పనిలో ఇప్పుడు ఆరా తీస్తోంది.

ఆర్థికసాయం కోరేందుకు... పెట్టుబడులు తెచ్చేందుకు..

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానించనున్నారు. దిల్లీ చేరుకున్న చంద్రబాబుకు తెదేపా ఎంపీలు స్వాగతం పలికారు.

నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం రేపు

భారత్ మండపంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో శనివారం జరిగే నీతి ఆయోగ్ పాలకమండలి 10వ సమావేశంలో చంద్రబాబు పాల్గొననున్నారు. ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమావేశం ఉంటుంది. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, అడ్మినిస్ట్రేటర్లు పాల్గొంటారు. మోదీ అధ్యక్షోపన్యాసం తర్వాత అన్ని రాష్ట్రాల సీఎంలకూ మాట్లాడే అవకాశం కల్పిస్తారు. వికసిత్ రాష్ట్రం, వికసిత్ భారత్-2047, పారిశ్రామిక ప్రోత్సాహకం, యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో తయారీ, సేవా రంగాలను ప్రోత్సహించేందుకు అవసరమైన వాతావరణాన్ని సృష్టించడం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈ రంగాన్ని ప్రోత్సహించడం, హరిత ఇంధనం, సర్క్యులర్ ఎకానమీలో కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవడం గురించి చర్చిస్తారు.

మద్యం కుంభకోణంలో.. మీ పాత్రపై విచారణ ఎందుకు కోరడం లేదు?

(మొదటి పేజీ తరువాయి)

షర్మిల వ్యాఖ్యానించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. 'ఇప్పటికైనా అసెంబ్లీకి వెళ్లి విచారణ కోరండి. తప్పు ఉంటే ఉరితీయండని చెప్పి మీ నిజాయతీని నిరూపించుకోండి?' అని జగన్‌కు హితవు పలికారు. 'మీ హయాంలో లిక్కర్ అమ్మకాల్లో డిజిటల్ చెల్లింపులు ఎందుకు లేవో సమాధానం చెప్పాలి? వచ్చిన ఆదాయం ఎక్కడికి పోయిందో వివరించాలి' అని డిమాండ్ చేశారు. 'లిక్కర్ మాఫియాపై మీడియాలో డైలీ థ్రిల్లర్ సిరీస్ రావడంతో వైకాపా నేతల్లో భయం పట్టుకుంది. వారిలో ఆ భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని నింపేందుకు పోలీసుల పట్ల జగన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. బట్టలూడదీస్తాం... తరిమి కొడతాం... ఎక్కడున్నా పట్టుకొస్తాం... విదేశాలకు వెళ్లినా వదిలిపెట్టం... అని అంటున్నారు. సీఎంగా ఉన్న రోజుల్లో మీరు పోలీసులను ఎలా వాడుకున్నారో జనం మరచిపోలేదు' అని షర్మిల ఎద్దేవా చేశారు.

ఆందోళన విరమించేది లేదు

'విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల కోసం దీక్షకు దిగితే ఎందుకు అడ్డుకుని అరెస్టు చేశారు? కార్మికుల పక్షాన పోరాడటం నేరమా? 2 వేల మందిని అన్యాయంగా తొలగించారు. మరో 3 వేల మందిని తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? మా దీక్ష భగ్నం చేసినా ఆందోళన విరమించేది లేదు' అని షర్మిల స్పష్టంచేశారు. 'కాంగ్రెస్ మహాసముద్రం. ఇందులో చెత్త కూడా ఉంటుంది. అది కిందనే ఉంటూ అప్పుడప్పుడూ పైకి తేలుతుంది. చాక్లెట్, బిస్కెట్ ఇవ్వలేదని అలిగే వాళ్లుంటారు. చేయగలిగేదేమీ లేదు' అని పార్టీలో తనకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రచారంపై షర్మిల వ్యాఖ్యానించారు.

మద్యం కుంభకోణం అరెస్టులతో జగన్‌కు వణుకు: మంత్రి సత్యకుమార్



ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో జరిగిన మద్యం కుంభకోణానికి సంబంధించిన అరెస్టులు చూసి, మాజీ సీఎం జగన్‌రెడ్డి వణికిపోతున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. మద్యం కుంభకోణంలో జగన్ సన్నిహితులు పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని.. దీంతో తన పరిస్థితి ఏంటోనన్న భయం జగన్‌ను పట్టుకుందన్నారు. జగన్ గురువారం విలేకర్ల సమావేశంలో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంత్రి ఓ ప్రకటన చేశారు. 'లిక్కర్ విక్రయాల్లో కొనుగోలుదారుల నుంచి డిజిటల్ పేమెంట్లను రద్దు చేసి, మాన్యువల్ చెల్లింపుల ద్వారా అమ్మకాలెందుకు చేశారన్న దానిపై జగన్ స్పందించలేదు. గత వైకాపా పాలనలో బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా ఉంటూ అడ్డగోలుగా వ్యవహరించిన వాసుదేవరెడ్డి, దీర్ఘకాలంపాటు జగన్‌కు సన్నిహితంగా మెలిగిన విజయసాయిరెడ్డి, మరో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డిల వాంగ్మూలాల విశ్వసనీయతను జగన్ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉంది. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలు సచ్ఛీలురని కితాబివ్వడం జగన్‌లో నెలకొన్న భయానికి నిదర్శనం. వైకాపా ప్రభుత్వ మద్యపాన విధానంతో ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచినట్లు జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉంది' అని మంత్రి మండిపడ్డారు.

కల్తీ మద్యంతో ప్రాణాలు తీసిన జగన్

తెదేపా ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, నక్కా ఆనంద్‌బాబుల ధ్వజం

ఈనాడు, అమరావతి: మద్యపాన నిషేధం అమలు చేస్తానని ప్రజల్ని నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్.. కల్తీ మద్యంతో వేలాది మంది ప్రాణాలు తీశారని తెదేపా ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నక్కా ఆనంద్‌బాబులు ధ్వజమెత్తారు. వైకాపా హయాంలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణంపై కూటమి ప్రభుత్వం నియమించిన సిట్ విచారణతో ఆయన వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. మద్యం ఆదాయాన్ని చూపించి.. అప్పులు చేసింది మీరు కాదా? అని జగన్‌ను ప్రశ్నించారు. ఆ రుణాలకు ఏటా రూ.40 వేల కోట్ల మేర కూటమి ప్రభుత్వం వడ్డీలు కట్టాల్సి వస్తోందని పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో వారిద్దరూ గురువారం విలేకరులతో మాట్లాడారు. అధికారం, ఆదాయం పోయాయనే ఆక్రోశాన్ని ప్రెస్‌మీట్‌లో జగన్ వెళ్లగక్కారని, ఆయన చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని మండిపడ్డారు. ఉర్సా కంపెనీకి ఎకరా 99 పైసల చొప్పున భూ కేటాయింపులు చేసినట్లు ఆరోపిస్తున్న జగన్.. దాన్ని నిరూపించలేకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమా? అని సోమిరెడ్డి సవాలు చేశారు.

మూడు కొత్త స్టార్ హోటళ్లకు ప్రభుత్వ రాయితీలు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం, తిరుపతిలో కొత్తగా ఏర్పాటయ్యే మూడు హోటళ్లకు రాష్ట్ర పర్యాటక విధానం-2024-29 కింద పలు రాయితీలు కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వరుణ్ హాస్పిటాలిటీ సంస్థ విశాఖలో తాజ్ హోటల్‌ని అభివృద్ధి చేసి ఫైవ్ స్టార్ డీలక్స్ హోటల్, దానికి అనుబంధంగా సర్వీస్ అపార్ట్‌మెంట్ నిర్మిస్తోంది. బెంగళూరుకు చెందిన ప్రవంతి హోటల్, రిసార్ట్స్ సంస్థ తిరుపతిలో త్రీ స్టార్ హోటల్, నోవోటెల్ ఫైవ్ స్టార్ హోటల్ నిర్మిస్తోంది. వీటికి పర్యాటక విధానంలో ప్రకటించిన రాయితీలు వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. తిరుపతిలోని ఎస్వీ పురంలోని వడమాలపేటలో ఫైవ్ స్టార్ రిసార్ట్ ఏర్పాటుకు 12.7 ఎకరాల భూమి.. బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్ సంస్థకు పర్యాటక విధానంలో ప్రభుత్వం కేటాయించింది. ఈ ప్రతిపాదనను ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ హోటళ్ల నిర్మాణానికి రూ.327 కోట్ల పెట్టుబడులు పెట్టడం ద్వారా ప్రత్యక్షంగా 570 మందికి ఉపాధి లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో వివరించింది.

అరెస్టు చేస్తారా.. నేనిక్కడే విజయవాడలోనే ఉన్నా

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో రెండేళ్లు మాత్రమే అదీ అనేకమంది ప్రభుత్వ సలహాదారుల్లో ఒకడిగా ఉన్నారు. ఆయనకు మద్యం అమ్మకాలతో ఏం సంబంధం? పైగా ఆయన ప్రస్తుత విజయవాడ ఎంపీ (తెదేపా)తో కలిసి వ్యాపారాలు చేస్తున్నారు. అతనైతే సులభంగా అబద్ధాలు చెప్పించవచ్చని తీసుకొచ్చారు. ఆయన చెప్పకపోయేసరికి నిందితుడిగా చేర్చారు. ఎంపీ మిథున్‌రెడ్డికి రాష్ట్రంలో మద్యం అమ్మకాలతో ఏం సంబంధం? మీరంతా సమావేశమయ్యారు, కమీషన్లు నిర్ణయించారంటూ ఆయన్ను పోలీసులు అడిగారు.. అలా కలిస్తే గూగుల్ టేకౌట్స్‌తో నిర్ధారణయ్యేది కదా? సీఎంఓలో ఉన్న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు మద్యంతో ఏం సంబంధం? వారిద్దరూ మచ్చలేని అధికారులు, వారినీ జైల్లో పెట్టారు. యూరప్‌లో టాప్-5 సిమెంట్స్‌లో ఒకటైన ఎంఎస్‌సీ గ్రూప్ కంపెనీల్లో హోల్‌టైం డైరెక్టరయిన బాలాజీ గోవిందప్పకు నా పనులు చక్కబెట్టేంత సమయం ఉంటుందా' అని జగన్ ప్రశ్నించారు. బాలాజీ అసలు ఏపీలోనే ఉండరన్నారు.

పెళ్లి హడావుడిలో ఉండగా అరెస్టు చేశారు!: 'ధనుంజయరెడ్డి తన కుమారుడికి, బాలాజీ గోవిందప్ప తన కుమార్తెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. కృష్ణమోహన్‌రెడ్డి కుమార్తెకు ఈ మధ్యనే పెళ్లి ఖాయమైంది. ఈ పరిస్థితుల్లో ఆ ముగ్గురినీ అరెస్టు చేశారు. డీజీపీ స్థాయి అధికారైన పీఎస్ఆర్ ఆంజనేయులు రెండో కుమారుడికీ పెళ్లి నిశ్చయమైంది. ఈ సమయంలో ఆంజనేయులును జైల్లో పెట్టారు' అని జగన్ పేర్కొన్నారు.

జూన్ 4న నిరసన: 'చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారు. ఆయనిచ్చిన హామీలేమయ్యాయంటూ జూన్ 4 (ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు)ను వెన్నుపోటు దినంగా నిర్వహించబోతున్నాం' అని జగన్ ప్రకటించారు. ఆ రోజున అన్నివర్గాల వారూ కలెక్టర్లకు డిమాండ్ పత్రాలను అందజేసే నిరసనలో పాల్గొనాలని ఆయన కోరారు.

బెంగళూరుకు జగన్: వైకాపా అధ్యక్షుడు జగన్ సోమవారం బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చారు. గురువారం సాయంత్రం తిరిగి బెంగళూరుకు వెళ్లిపోయారు.

వైకాపా పాపం.. బీమాకు రైతు దూరం

ప్రీమియం బకాయిలు చెల్లిస్తేనే రూ.2,559 కోట్ల పరిహారం

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ పాపాలు రైతులను ఇంకా వెంటాడుతున్నాయి. ఒకటీ రెండు కాదు.. ఏకంగా మూడు పంట కాలాలకు (ప్రధాన మంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా కలిపి) రూ.1,990 కోట్ల పంటల బీమా ప్రీమియం బకాయిలు ఇంకా రావాల్సి ఉంది. 2022-23 రబీ, 2023 ఖరీఫ్, 2023-24 రబీ పంట కాలాలకు సంబంధించి రైతులకు రావాల్సిన రూ.2,559 కోట్ల పంటల బీమా పరిహారం చెల్లింపులు నిలిచాయి. ఇప్పుడు ఆ మొత్తాన్ని కూటమి ప్రభుత్వం విడుదల చేస్తేనే రైతుల ఖాతాల్లో పరిహారం జమవుతుంది. 15.65 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది. వాస్తవానికి కేంద్రం అప్పుడే తమ వాటా నిధుల్ని బీమా సంస్థలకు విడుదల చేసింది. వైకాపా ప్రభుత్వం పైసా ఇవ్వకపోవడంతోనే ఈ సమస్యంతా వచ్చింది. కూటమి ప్రభుత్వం ఒకేసారి అంత మొత్తం చెల్లించలేని పరిస్థితి. దశల వారీగా చెల్లిస్తామన్నా కేంద్రం అంగీకరించడం లేదు. 2024 ఖరీఫ్, 2024-25 రబీ పంట కాలాలకు బీమా ప్రీమియంగా చెల్లించాల్సిన రూ.922 కోట్లు విడుదల చేయడానికే సతమతమవుతోంది.

నా రక్తనాళాల్లో ప్రవహించేది రుధిరం కాదు సిందూరం

(మొదటి పేజీ తరువాయి)



బీకానేర్–ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలును గురువారం జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

"ఆపరేషన్ సిందూర్ పట్ల దేశ ప్రజలంతా గర్వపడుతున్నారు. త్రివిధ దళాలు చక్రవ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. మన మహిళల సిందూరం చెరిపేసిన వాళ్లను మట్టిలో కలిపేశాం. పహల్గాం ఘటనకు జవాబుగా 22 నిమిషాల్లోనే ఉగ్రవాదులను మట్టుబెట్టాం. భారత్‌లో రక్తపుటేర్లు పారించినవాళ్లను ముక్కలు ముక్కలు చేశాం. ఉగ్రదాడికి భారత్ స్పందన ప్రతీకార క్రీడకాదు.. న్యాయానికి కొత్త రూపం. సమర్థ భారత రౌద్ర రూపం. ఉగ్రదాడి జరిగితే, మన సమాధానం ఇలాగే ఉంటుంది. ఉగ్రవాదులకు ఇకపై ఇలాంటి జవాబే దక్కుతుంది. పాక్‌తో వాణిజ్యంలేదు.. చర్చలు లేవు. ఒకవేళ చర్చలంటూ జరిగితే అది పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌పైనే. దయాది దేశపు అణుముప్పు బెదిరింపులకు దేశం జడుసుకునేది లేదు.. ఉగ్రదాడి జరిగితే కోలుకులేని విధంగా సమాధానం ఇస్తాం. ఎప్పుడు ఎలా దెబ్బకొట్టాలో సైన్యం చూసుకుంటుంది. ఉగ్రవాదులను, వారిని ప్రోత్సహించేవారిని ఒకటిగానే భావిస్తాం. మనదేశానికి చెందిన న్యాయబద్ధమైన నీటి వాటాలో ఒక చుక్క కూడా పాకిస్థాన్ పొందలేదు. ఉగ్రవాదులను ఎగుమతి చేస్తున్నంతకాలం మన పొరుగు దేశం ప్రతి పైసాను అడుక్కోవల్సిందే. సీమాంతర ఉగ్రవాదానికి దాయాది దేశం మద్దతు తెలిపినంత కాలం ఆ దేశంతో కుదుర్చుకున్న సింధూ జలాల ఒప్పందాన్ని మనం సుప్తచేతనావస్థలోనే ఉంచుతాం.

'మోదీ ఉన్నారనేది పాక్ మరిచిపోయింది'

పాక్ ఎప్పుడూ మనతో యుద్ధం చేయలేదు. చేస్తే ఓటమి పాలవుతామని ఆ దేశానికి తెలుసు. అందుకే ఉగ్రవాదాన్ని ఎంచుకుంది. ఇక్కడ మోదీ ఉన్నారనే సంగతి మరిచిపోయినట్టుంది. రాజస్థాన్‌లోని వైమానిక స్థావరాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నించింది. కానీ, రాజస్థాన్ ఎయిర్‌బేస్‌ను పాకిస్థాన్ క్షిపణులు తాకలేకపోయాయి. మన వాయుసేన పాక్‌లోని ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసింది'' అని మోదీ పేర్కొన్నారు.

'గతం కంటే ఆరు రెట్లు అధికంగా ఖర్చు చేస్తున్నాం'

"ఇక్కడికి కర్ణిమాత ఆశీస్సులు తీసుకుని వచ్చా. గత 12 ఏళ్లుగా దేశంలో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించే మహాయజ్ఞం జరుగుతోంది. గతంలో కంటే ఆరు రెట్లు అధికంగా మౌలిక సదుపాయాలపై ఖర్చు చేస్తున్నాం. గతంలో రైల్వేస్టేషన్లు ఎలా ఉండేవి, ఇప్పుడెలా ఉన్నాయో ఆలోచించండి. అమృత్ భారత్ స్టేషన్లను ఆయా ప్రాంతాల ప్రత్యేకతలతో నిర్మించాం. ఈ రైల్వే స్టేషన్లకు ప్రజలే యజమానులు. శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత కూడా ప్రజలదే'' అని మోదీ చెప్పారు.

ఐదేళ్లలో రాష్ట్రానికి రూ.50 వేల కోట్ల రైల్వే నిధులు

- కేంద్ర మంత్రి పెమ్మసాని
- ఆధునికీకరించిన సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ ప్రారంభం



సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే విజయశ్రీ, చెన్నై డివిజన్ రైల్వే డీఆర్ఎం బి.విశ్వనాథ్, కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: వచ్చే ఐదేళ్లలో రాష్ట్రానికి రూ.50 వేల కోట్ల రైల్వే నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించనుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా అభివృద్ధి చేసిన 103 రైల్వే స్టేషన్లను ప్రధాని మోదీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆధునికీకరించిన తిరుపతి జిల్లా సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. రూ.14.50 కోట్ల వ్యయంతో ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేశారన్నారు. ఈ పథకంతో 1300కు పైగా రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బస్సులపై ప్రణాళిక సిద్ధం చేయండి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఆర్టీసీలో డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులు తీసుకోడానికి సంబంధించి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని, అలాగే సీఎన్‌జీ బస్సులపై కూడా అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆయన గురువారం ఆర్టీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతమున్న డీజిల్ బస్సుల స్థానంలో మూడేళ్లలో విద్యుత్ బస్సులు తీసుకునేలా నివేదిక తయారు చేయాలని పేర్కొన్నారు. ఒకవేళ సీఎన్‌జీ బస్సులు తీసుకుంటే ఎంత తక్కువ వ్యయమవుతుందో కూడా పరిశీలించాలని తెలిపారు. విద్యుత్ బస్సులకు కేంద్ర సబ్సిడీ గురించి ఆరా తీశారు. ఆ బస్సుల కోసం డిపోల్లో కల్పించాల్సిన వసతులు తదితరాలపైనా ముఖ్యమంత్రి చర్చించారు.

మహాత్ముడి గురుతులు కాపాడుకుందాం!



పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం



ఆశ్రమంలోని అతిథి గృహం



మట్టితో కట్టిన అతిథి గృహం పైకప్పు

దక్షిణ భారతదేశంలోనే రెండో సబర్మతిగా పేరొందిన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం నిరాదరణకు గురవుతోంది. ఆశ్రమాన్ని ఉప్పు సత్యాగ్రహం సమయంలో మహాత్మా గాంధీ ప్రారంభించారు. నాటి నుంచి జిల్లాకే గర్వకారణంగా నిలుస్తోంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గతంలో ఆశ్రమాన్ని సందర్శించి, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఇక్కడి గ్రంథాలయం ఇప్పటికే మూసేశారు. గోశాల మూసివేసే దశకు చేరుకుంది. 2008లో అప్పటి కలెక్టర్ దాతల సాయంతో ఆశ్రమంలో ఓ అతిథి గృహాన్ని నిర్మించారు. పూర్తిగా మట్టితో కట్టిన ఆ నిర్మాణమూ ప్రస్తుతం వృథాగా మిగిలిపోయింది. ఇలాగే కొనసాగితే మహాత్ముడు ప్రారంభించిన భవనమూ మూలకు చేరొచ్చని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రెడ్‌క్రాస్ సంస్థ ఆశ్రమాన్ని నిర్వహిస్తోంది.

- ఈనాడు, నెల్లూరు

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శుక్రవారం మే 23, 2025

శ్రీరామదూతం.. శిరసానమామి!





చిట్టినగర్: రామభక్త హనుమాన్ కీ జై.. నినాదాలతో నగరం మార్మోగింది. హనుమజ్జయంతి పురస్కరించుకొని... భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పర్యవేక్షణలో గురువారం బీఆర్టీఎస్ రోడ్డు నుంచి చిట్టినగర్ వరకు హనుమాన్ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. పిల్లలు, యువత, మహిళలు పెద్దఎత్తున తరలిరాగా... మంత్రి సత్యకుమార్‌యాదవ్, శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మెట్రో హారం.. మేఘ విహారం


- ప్రతి రైలు రెండు బోగీలతో ప్రారంభం
- ప్రయాణికుల రద్దీ మేరకు ప్రణాళిక
- అన్ని అవసరాలకు కామన్ మొబిలిటీ కార్డులు
- నెలలో సలహా సంస్థ ఎంపిక, రుణంపై కొలిక్కి


ఈనాడు, అమరావతి

ప్రజారవాణా వ్యవస్థలో కీలకంగా భావిస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ప్రాథమిక ప్రణాళికలను సిద్ధం చేశారు. క్షేత్రంలో సర్వే అనంతరం మెట్రో రైలు కార్పొరేషన్ అధికారులు తుది రూపు తీసుకొచ్చారు. దీనిని ఆచరణలోకి తెచ్చేందుకు కార్పొరేషన్ అధికారులు రూ.205 కోట్లతో జనరల్ కన్సల్టెంట్ ఎంపిక కోసం టెండరు పిలిచారు. మరోవైపు విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు రుణం ఇచ్చేందుకు ఏఐఐబీ ఆసక్తి కనబరుస్తోంది. ఈ అంశంపై చర్చలు సాగుతున్నాయి. కేంద్రం నుంచి ఆమోదం లభించాక ఖరారయ్యే వీలుంది. నెల రోజుల్లో అన్ని అంశాలు కొలిక్కి వచ్చే వీలుంది.

ప్రయాణికుల సంఖ్య మేరకు.. ప్రతి రైలు రెండు బోగీలతో నడపనున్నారు. రెండు బోగీల్లో దాదాపు 500 మంది వరకు ప్రయాణించే అవకాశం ఉంది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నడవనున్నాయి. రద్దీ ఉంటే ఉదయం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు నడపనున్నారు. ఉదయం 9 నుంచి 11, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. సెలవు రోజులు, ఆదివారాలు డిమాండ్ తక్కువగా ఉంటే సర్వీసులను కుదించనున్నారు.

గంటకు ఒక్కో దిశలో ప్రయాణికుల రద్దీ అంచనా ఇదీ..





అన్ని వ్యవస్థల అనుసంధానం...

నగరంలో రానున్న మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశలో రెండు కారిడర్లను నిర్మించనున్నారు. 25.90 కి.మీ నిడివితో గన్నవరం విమానాశ్రయం నుంచి పీఎన్‌బీఎస్ వరకు ఒకటి, పెనమలూరు నుంచి పీఎన్‌బీఎస్ వరకు 12.50 కి.మీ పొడవుతో మరొకటి రానున్నాయి. ఈ రెండు మార్గాల్లో మొత్తం 33 స్టేషన్లు ప్రతిపాదించారు. మెట్రో స్టేషన్లను వీలైనంత మేర వివిధ రవాణా వ్యవస్థలైన ఆర్టీసీ, విమానాశ్రయం, రైల్వేతో అనుసంధానం చేయనున్నారు. ప్రతిపాదిత మెట్రో స్టేషన్ల వద్ద నగరంలో అన్ని ముఖ్య ప్రాంతాలకు వెళ్లేలా సిటీ బస్సు సర్వీసులను నడపనున్నారు. గన్నవరం విమానాశ్రయం, విజయవాడ రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్‌లతో అనుసంధానం ద్వారా ప్రయాణికులకు మేలు కలగనుంది.

గన్నవరం
పీఎన్‌బీఎస్
పెనమలూరు
రెండు మార్గాల్లో మొత్తం 33 స్టేషన్లు
25.90 కి.మీ
12.50 కి.మీ పొడవు
కృష్ణా నది




భద్రతా చర్యలకు ప్రాధాన్యం..

ప్రతి మెట్రో స్టేషన్ వద్ద భద్రతా చర్యల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. సీసీ కెమెరాలు, బ్యాగేజీ స్కానర్లు, మెటల్ డిటెక్టర్లు, పేలుడు పదార్థాల గుర్తింపు పరికరాలను అందుబాటులోకి తెస్తారు. రక్షణ చర్యల్లో భాగంగా జాగిలాల సేవలను కూడా తీసుకోనున్నారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్నంగా తనిఖీ చేశాకే అనుమతిస్తారు.

స్టేషన్ల వద్దే పార్కింగ్

ప్రతి మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేకంగా వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని కేటాయించనున్నారు. దీంతో ఎక్కువ మంది మెట్రోను వినియోగించుకునే వీలుందని భావిస్తున్నారు. పాదచారులు, సైకిల్‌పై వచ్చే వారి కోసం కూడా స్థలం లభ్యత మేరకు వేరుగా దారులను కేటాయించనున్నారు. టిక్కెట్ల జారీ కోసం ప్రత్యేక వ్యవస్థను తేనున్నారు. బహుళ ప్రయాణాల కోసం స్మార్ట్ కార్డులు, సింగిల్ జర్నీ కోసం క్యూఆర్‌తో కూడిన టిక్కెట్లను జారీ చేస్తారు. రూపే, ఈఎంవీ కార్డులతోపాటు ఎన్ఎఫ్‌సీ ఆధారంగా పనిచేసే మొబైల్ వ్యాలెట్ల ద్వారా కూడా ఇవ్వనున్నారు. మెట్రో రైళ్లతోపాటు సిటీ బస్సుల్లోనూ అక్కరకొచ్చేలా కామన్ మొబిలిటీ కార్డులనూ జారీ చేయనున్నారు. పార్కింగ్ రుసుము కూడా దీని ద్వారా చెల్లించే వెసులుబాటు తెచ్చేందుకు నిర్ణయించారు. కేసరపల్లి, పీఎన్‌బీఎస్, పెనమలూరులో మెట్రో రైలు కోసం ప్రత్యేకంగా విద్యుత్తు ఉపకేంద్రాలను నిర్మించనున్నారు.

1 నుంచి రేషన్ దుకాణాల వద్ద సరకుల పంపిణీ

దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వారికి ఇంటి వద్దే

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్టుడే: జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల వద్ద సరకులు పంపిణీ చేస్తారు. దివ్యాంగులు, 65 సంవత్సరాల వయసు పైబడిన వృద్ధులకు మాత్రం ఇంటి వద్దనే అందజేస్తారు. సరకుల పంపిణీ అత్యంత పారదర్శకంగా జరగాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులు, రేషన్ డీలర్లు, వారి అసోసియేషన్ ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఒకటి నుంచి సరకులు పంపిణీ చేయాల్సి ఉన్న క్రమంలో ఈ నెలాఖరులోగా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పంపిణీ చేసేలా చూడాలన్నారు. రేషను దుకాణాల వద్ద సరకుల పునఃపంపిణీ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారని, ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ధరలు, సరకుల నిల్వలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని, సరైన తూకంతో అందజేయడంతో పాటు, ఈ-పోస్ రసీదు ఇవ్వాలని సూచించారు. దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ. పక్కనే డీఎస్‌వో పాపారావు

ప్రజాభిప్రాయ సేకరణ.. విశ్లేషణ.. సాంకేతిక సహకారం అందించడానికి బృందాలు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. ఈ-పోస్, కాటాల మరమ్మతులకు సర్వీసు శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రజలకు సేవలు అందించే విషయంలో అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించి, ఎప్పటికప్పుడు విశ్లేషిస్తామన్నారు. డీఎస్‌వో ఎ.పాపారావు, ఏఎస్‌వోలు ఎన్.లక్ష్మణబాబు, లక్ష్మీనారాయణరెడ్డి, డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకట్రావు, జిల్లా సంఘం అధ్యక్షుడు యు.వెంకటేశ్వర రావు, జిల్లా కార్యదర్శి పి.శివప్రసాద్, కోశాధికారి ఎం.భూషణం తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలోకి 2,175 క్యూసెక్కులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్టుడే : అకాల వర్షాల నేపథ్యంలో కృష్ణా నదిలో స్థానిక వరద కొనసాగుతోంది. నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద గురువారం మధ్యాహ్నం వరకు 1,450 క్యూసెక్కుల మేర నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. క్రమేపీ వరద పెరిగింది. సాయంత్రం 6 గంటలకు మూడు గేట్లను అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 2,175 క్యూసెక్కులను విడుదల చేశారు.

ఆగమశాస్త్రానికి అనుగుణంగా దుర్గమ్మకు పూజలు

ఇంద్రకీలాద్రి, న్యూస్టుడే: ఆగమ శాస్త్రానికి అనుగుణంగా దుర్గమ్మకు పూజలు నిర్వహించాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ అర్చకులకు సూచించారు. ఇంద్రకీలాద్రిపై ఈవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన వైదిక కమిటీ, వేదపండితుల సమావేశంలో ఈవో మాట్లాడుతూ.. ప్రతి పౌర్ణమికి జగన్మాతకు స్వర్ణ కవచంతోపాటు, వజ్రకిరీట ధారణ చేయాలన్నారు. దుర్గమ్మ దర్శనం చేసుకున్న ప్రతి భక్తుడికి కుంకుమ ప్రసాదం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేవతామూర్తుల అలంకరణ, పూజలు వైభవంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానర్చకులు దుర్గాప్రసాద్, మల్లేశ్వర శాస్త్రి, సుందరంబాబు, ఉపప్రధానార్చకులు శంకరశాండిల్య, కోట రవికుమార్, ముఖ్యార్చకులు శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.




అందరి... సంకల్పమొక్కటే!

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. జీవ వైవిధ్యానికి కృషి చేసిన వివిధ రంగాల వారికి పురస్కారాలు.. వ్యాసరచన, క్విజ్ పోటీల్లో మేటిగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. - ఈనాడు, విజయవాడ

జిల్లాలో వర్షాల జోరు

విస్సన్నపేటలో 43.6 మి.మీ. నమోదు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్టుడే : జిల్లా అంతటా జోరు వానలు కురిశాయి. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు నమోదైన వివరాల ప్రకారం.. విస్సన్నపేట 43.6 మి.మీ., వత్సవాయి 38.4, విజయవాడ గ్రామీణ 36.8, నందిగామ 36.6, విజయవాడ ఉత్తరం 35.6, జగ్గయ్యపేట, విజయవాడ తూర్పు 35.4, విజయవాడ సెంట్రల్, పశ్చిమ 35.2, రెడ్డిగూడెం 28.4, ఇబ్రహీంపట్నం 26.6, ఎ.కొండూరు 24.4, వీరులపాడు 24.2, చందర్లపాడు 15.8, గంపలగూడెం 15.2, పెనుగంచిప్రోలు 14.6, జి.కొండూరు, కంచికచర్ల 12.8, మైలవరం 11, తిరువూరు 10.6 మి.మీ. మేర వర్షం పడింది. జిల్లా సగటు వర్షపాతం 26.43 మి.మీ.గా ఉంది.

తెలుగుదేశంతోనే అభివృద్ధి.. సంక్షేమం!

- ఐదేళ్ల విధ్వంస పాలనతో రాష్ట్రం తిరోగమనం
- చంద్రబాబు సారథ్యంలో ప్రగతి వైపు పయనం
- ఎన్టీఆర్ జిల్లా మినీమహానాడులో వక్తల ఉద్ఘాటన

ఈనాడు, అమరావతి - ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్టుడే

'తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ తెదేపా. ఎన్టీఆర్ పార్టీని స్థాపించి 43 ఏళ్లు గడిచాయి. ఎన్నో ఆటుపోట్లు వచ్చినా.. ఎదురొడ్డి నిలబడ్డాం. ఐదేళ్ల విధ్వంస పాలన నుంచి విముక్తి పొందిన రాష్ట్రాన్ని ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రగతి వైపు నడిపిస్తున్నారని' ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ పేర్కొన్నారు. మైలవరం పరిధిలోని గుంటుపల్లి సీఏ కన్వెన్షన్ హాల్‌లో ఎన్టీఆర్ జిల్లా మినీ మహానాడు నెట్టెం రఘురామ్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, తెదేపా నేతలు నాగుల్ మీరా, బుద్ధా వెంకన్న, అశోక్‌బాబు, గద్దె అనూరాధ, వర్ల రామయ్య తదితరులు మాట్లాడారు.



వేదికపై నెట్టెం రఘురామ్, ఎంపీ చిన్ని, పట్టాభిరామ్, వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య

తారకరాముడే స్ఫూర్తి... ఎన్టీఆర్ ధైర్యం, స్ఫూర్తితో... ఐదేళ్లపాటు వైకాపా దౌర్జన్యాలను ఎదురొడ్డి తెదేపా శ్రేణులు పోరాడాయని నెట్టెం రఘురామ్ పేర్కొన్నారు. 'ఎన్టీఆర్ సంక్షేమానికి బాటలు వేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు.. సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ బాటలు వేస్తున్నారు. కడపలో జరిగే రాష్ట్ర మహానాడుకు జిల్లా పార్టీ శ్రేణులు క్రమశిక్షణ బాధ్యతతో తరలివెళ్లాలి. మహానాడును విజయవంతంగా నిర్వహించి, పార్టీకి మరింత పటిష్ఠమైన పునాదులను వేయాలి. గత ఎన్నికల్లో ఎన్టీఆర్ జిల్లాలో తెదేపాకు తిరుగులేని విజయం అందించడంలో పార్టీ శ్రేణుల కృషి మరువలేనిది. ఇదే స్ఫూర్తి కొనసాగించాలని' నెట్టెం రఘురామ్ పిలుపునిచ్చారు.

జిల్లాలో తెదేపాకు తిరుగులేదు..



ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. తెదేపా స్థాపించినప్పటి నుంచి దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. 'దేశంలోనే తొలిసారి రెండు నదులను అనుసంధానం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుంది. దేశానికే మార్గదర్శకుడిగా నిలిచారు. ఎన్టీఆర్ జిల్లాతోపాటు రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి శ్రమిస్తున్న తీరు ఆదర్శం. తెలుగు తమ్ముళ్లపై వైకాపా గూండాల దౌర్జన్యాలు, దాడులు ఇప్పటికీ ఆగలేదు. తాజాగా తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల్లోనూ విజయవాడ నుంచి వైకాపా రౌడీమూకలు వచ్చి అలజడి సృష్టించాలని ప్రయత్నించాయి. వాళ్లను ఎ.కొండూరులోనే అడ్డుకుని పోలీసులకు అప్పగించాం. క్రమశిక్షణ కలిగిన తెదేపా కార్యకర్తలు ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తారు. అందుకే రౌడీమూకలను పోలీసులకు అప్పగించాం. జగన్, అతని వర్గం నేతలకు నాటకాలు ఆడటం బాగా అలవాటు. తిరువూరులో కౌన్సిలర్లను దాచి కొత్త నాటకానికి తెర తీసి.. మరోసారి అట్టర్‌ఫ్లాప్ అయ్యారని' కేశినేని శివనాథ్ ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో తెదేపాకు ఇక తిరుగులేదన్నారు.

జగన్‌ది... నా స్థాయి కాదు..

లిక్కర్ స్కామ్ ఎవరి హయాంలో జరిగిందో పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నించారు. 'నేను ఓ ఎంపీని. జగన్ ఓ ఎమ్మెల్యే. నా స్థాయి కాని వ్యక్తుల గురించి మాట్లాడటం నాకు ఇష్టం లేదు. జగన్ నా గురించి మాట్లాడుతుండడం వల్లే నేను మాట్లాడాల్సి వస్తోంది. నా గురించి తప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్‌కు సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదని' ఎంపీ శివనాథ్ పేర్కొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి..



మైలవరం శాసనసభ్యులు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికులన్నారు. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి, పేదల సంక్షేమం రెండూ సాధ్యమవుతాయని పేర్కొన్నారు. వైకాపా పాలనలో రాష్ట్రం పూర్తిగా అధోగతి పాలైందనీ, ప్రస్తుతం ముఖ్యమంత్రి పాలనా దక్షతతో గాడిన పెడుతున్నారని అన్నారు. వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రం ప్రగతిలో పరుగులు పెట్టనుందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో తెదేపాను మరింత పటిష్ఠపరిచేందుకు ప్రతి నాయకుడు కృషి చేయాలని సూచించారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు కొలువైన స్టాలిన్ కార్పొరేట్ భవనానికి వెళ్లే దారిలో వ్యర్థాలు

మరో.. 30 టన్నుల చెత్త పేరిగిపోయింది

ఆటోనగర్‌లో దారుణ పరిస్థితి

ఆటోనగర్‌లో పేరుకుపోయిన 500 టన్నుల చెత్తకు గురువారం కొత్తగా.. మరో 30 టన్నులు వచ్చి చేరింది. ఎన్ని రోజులు చెత్తను తరలించకుండా రహదారుల పక్కనే వదిలేస్తే.. అంత ఎక్కువ అయిపోతోంది. గత రెండు రోజులుగా పడిన వర్షాలకు ఈ చెత్తంతా కుళ్లిపోయి, రహదారుల మీదకు వచ్చేసి.. తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఏపీఐఐసీ, ఐలా అధికారులు ఇంకా చర్చలతోనే కాలయాపన చేస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కూడా అధికారులతో మాట్లాడి.. ముందు చెత్తను ఆటోనగర్ నుంచి తొలగించి, ఆ తర్వాత శాశ్వత పరిష్కారం కోసం ఏం చేయాలో ఆలోచిద్దామని చెప్పినా.. ఫలితం లేకపోయింది. నగరపాలక అధికారులతో మాట్లాడుతున్నాం... జిందాల్ కంపెనీతో చర్చలు జరుపుతున్నామని కాలయాపన చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన చెత్తను తరలించకపోతే.. వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. నగరపాలక కమిషనర్ స్పందించి, సిబ్బందిని పంపిస్తే.. ఒక్కపూటలో చెత్తను డంపింగ్ యార్డుకు తీసుకెళ్లవచ్చు. కమిషనర్‌కు.. ఎంపీ, ఎమ్మెల్యేలు చెబుతున్నా.. ఆయన స్పందించడం లేదు. దీంతో 80 వేల మంది కార్మికులు, వేల మంది ఉద్యోగులు చెత్తకుప్పల మధ్యలోనే పనిచేయాల్సి వస్తోంది.

- ఈనాడు, అమరావతి



చెత్తను లారీల్లో ఎక్కించి ఐలా కార్యాలయం ముందు నిలిపేశారిలా..

జనం బాధ మరిచి.. జగన్ బాటలో నడిచి!

- వేతనాలు, ప్రొటోకాల్ పేరిట సభ బహిష్కరణ
- ఆరంభంలోనే కలెక్టర్ల పోడియం వద్ద నిరసన
- జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం వాయిదా

ఈనాడు డిజిటల్ - మచిలీపట్నం: ఆరంభంలోనే జడ్పీ సర్వసభ్య సమావేశానికి ఆటంకం కలిగింది. జడ్పీ కన్వెన్షన్ హాల్లో గురువారం నిర్వహించిన సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.30 కోట్లు కేటాయిస్తున్నట్లు తీర్మానించామని ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక పేర్కొన్నారు. తర్వాత మైనింగ్ అధికారులు సమావేశానికి రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలకు జడ్పీటీసీలు, ఎంపీపీలను పిలవడంలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని తొలుతగా ప్రశ్నించారు. సభ్యులు ప్రజాసమస్యలకు ప్రాధాన్యం ఇవ్వకుండా... ప్రొటోకాల్ పాటించాలనీ.. గౌరవ వేతనాలు ఇవ్వాలని కలెక్టర్లు ఉన్న పోడియం వద్దకు దూసుకెళ్లి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని జడ్పీ ఇన్‌ఛార్జి సీఈవో ఆనంద్‌కుమార్ చెబుతున్నా వారు నినాదాలు చేస్తూ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రజాసమస్యలను గాలికొదిలేసి.. గత ప్రభుత్వం నుంచి అమలు కాని ప్రొటోకాల్, వేతనాల అంశాన్ని తెరపైకి తేవడంతో కావాలనే సభ్యులు సమావేశాన్ని నీరుగార్చారనే విమర్శలొచ్చాయి.



బయటకు వచ్చిన సభ్యులను సమావేశం కొనసాగించాలని కోరుతున్న ఆనందకుమార్

అధినేత మెప్పు కోసమేనా..?

సభ్యులు సమావేశం నుంచి బయటకు వచ్చి తమకు వేతనాలు ఇవ్వాలనీ.. ప్రొటోకాల్ పాటించాలని అప్పటి వరకు సమావేశాలకు రాబోమని ఆందోళనకు దిగారు. జడ్పీ సీఈవో వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా లోపలకు రాలేదు. ప్రొటోకాల్ విషయంపై ఉమ్మడి జిల్లా కలెక్టర్లు హామీ ఇస్తున్నారనీ, పాటించని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెబుతున్నా పట్టించుకోలేదు. రెండేళ్లుగా వేతనాలు రావట్లేదని ప్రభుత్వానికి ప్రతిపాదిస్తే తిరస్కరించారని.. మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించాలని ఛైర్మన్ కోరారు. గత ప్రభుత్వంలో వేతనాలు ఇవ్వలేదని ఎందుకు ప్రశ్నించలేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వేసవిలో పూర్తి చేయాల్సిన పనులు.. నిధుల మంజూరు.. బిల్లుల బకాయిలు.. ఎన్నో సమస్యలు ఉన్నా.. పనులు వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చను విస్మరించారు. కేవలం ఆ రెండు అంశాలనే ప్రస్తావిస్తూ.. అధికారులు బదులిచ్చే తావీయకుండా సభను బహిష్కరించారు. కూటమి సర్కారు సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తుండటంతో.. ఏదో ఒక వంకతో అధినేత మెప్పు పొందడానికే సమావేశం నుంచి వెళ్లిపోయారని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు.



పోడియం వద్దకు దూసుకెళ్లి.. వేతనాలు ఇవ్వాలని.. ప్రొటోకాల్ పాటించడం లేదని జడ్పీటీసీలు, ఎంపీపీల నిరసన

కలెక్టర్లు, అధికారుల పడిగాపులు...

జడ్పీ సమావేశానికి ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ, కృష్ణా ఇన్‌ఛార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణరాజు సహా దాదాపు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. సభ్యులు బయటకు వెళ్లిపోవడంతో... వీరు రెండు గంటలపాటు వేచి చూశారు. జడ్పీ సీఈవో సభ్యులను ఒప్పించి సమావేశాన్ని కొనసాగించాలని కోరగా.. 'మీ మర్యాద కాపాడుకోండ'ని ఆయనపై ఆగ్రహించారు. ప్రొటోకాల్ పాటించని అధికారుల వివరాలు, ఇతర సమస్యలను రాతపూర్వకంగా ఇస్తే ప్రభుత్వానికి పంపిస్తామన్నా వినలేదు. వ్యవస్థను రద్దు చేసుకోమని జడ్పీ కార్యాలయానికి వెళ్లిపోగా.. ఛైర్‌పర్సన్ హారిక సమావేశాన్ని వాయిదా వేశారు. తర్వాత జడ్పీ కార్యాలయంలో సభ్యులతో ఆమె సమావేశమై పలువురిని మెచ్చుకోవడం గమనార్హం. సమావేశాలకు అధ్యక్షత వహించే ఛైర్‌పర్సన్ ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాల్సింది పోయి.. గత సమావేశంలోనూ సమస్యలపై మాట్లాడకుండా సభ్యులను రెచ్చగొట్టారని విమర్శలు వచ్చాయి.

2028 నాటికి నేరుగా విదేశీ సర్వీసులు

ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌లో 12 డిజైన్ల మార్పునకు నిర్ణయం ★ విమానాశ్రయ అభివృద్ధిపై ఎంపీ బాలశౌరి సమాలోచనలు



సమావేశంలో ఎంపీలు బాలశౌరి, శివనాథ్, అధికారులు, కమిటీ సభ్యులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖుల తాకిడి పెరుగుతున్నందున మరో మూడు నెలల్లో నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనాన్ని పూర్తి చేయడంతో పాటు.. 2028 నాటికి విమానాశ్రయం నుంచి నేరుగా అమెరికాలోని న్యూయార్క్‌కు విమానం ఎగరడమే లక్ష్యంగా పెట్టుకున్నామని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. విమానాశ్రయం ఆవరణలో సలహా కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. వైస్ ఛైర్మన్ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఇన్‌ఛార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ, డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, జీఎం రామాచారి, ఎస్పీ గంగాధరరావు, అధికారులతో కలిసి ఛైర్మన్ బాలశౌరి మాట్లాడారు. ప్రతి రాష్ట్రానికి అనుసంధానం అయ్యేలా విమాన సర్వీసులు నడిపేందుకు వివిధ విమానయాన సంస్థలతో సంప్రదించినట్లు చెప్పారు. విజయవాడ నుంచి శ్రీలంక, సింగపూర్, థాయ్‌లాండ్, దుబాయ్‌లకు ఎమిరేట్స్ విమానాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామన్నారు. ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు 70 శాతం పూర్తయ్యాయని, ప్రతినెలా ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. తొలుత అభివృద్ధి, ప్రయాణికుల సమస్యలపై సమాలోచనలు చేశారు.

సంస్కృతి ఉట్టిపడేలా డిజైన్లు..: విమానాశ్రయంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడాలని సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి లోకేశ్‌ల ఆదేశాలతో 12 డిజైన్లు మార్పు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వైస్ ఛైర్మన్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. ప్రాచీన సంస్కృతి, కూచిపూడి భంగిమలు ఉట్టిపడేలా డిజైన్లు ఉంటాయన్నారు. వారణాసి, కొచ్చి, అహ్మదాబాద్‌లకు కొత్త సర్వీసులు నడిపేందుకు సమాలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక వేగవంతమయ్యాయని వెల్లడించారు.

భవానీద్వీపంలో.. ఇంటి దొంగలు

కూలీలను పెట్టి భారీగా చెట్ల నరికివేత ★ కొందరు అధికారుల సహకారంతోనే దందా?



భవానీద్వీపంలో నరికిన చెట్లు



ద్వీపంలోకి వచ్చిన ట్రాక్టర్లపై వేసి ఉన్న దుంగలు, పక్కన భిక్షాలు

ఈనాడు, అమరావతి - భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడ ప్రకాశం బ్యారేజీ సమీపంలోని కృష్ణానది మధ్యలో ఉన్న భవానీద్వీపంలో భారీగా చెట్లను నరికి తరలించుకుపోతున్నారు. పర్యాటక శాఖకు చెందిన కొందరు అధికారుల సహకారంతోనే ఈ దందా సాగుతున్నట్లు సమాచారం. అందుకే.. నరికేసిన చెట్ల దుంగలను దర్జాగా ట్రాక్టర్లలో వేసి మరీ తరలిస్తున్నారు. చెట్లను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో.. పర్యాటక శాఖ ఈడీ, అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి చూడగా ట్రాక్టర్లలో దుంగలను వేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్నారు. అధికారులను చూసి కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు పారిపోయారు. భిక్షాలు అనే దుండగుడు దొరికాడు. గుంటూరు జిల్లా వెంకటపాలెం నుంచి వచ్చినట్లు చెప్పాడు. చెట్లను ఎవరు కొట్టమన్నారని, ఎవరు తరలిస్తున్నారని అడగ్గా పర్యాటక శాఖలోని ఒక మేనేజర్ స్థాయి అధికారి పేరును చెప్పి.. ఆ తర్వాత మాట మార్చాడు. భిక్షాలును పర్యాటకశాఖ అధికారులు భవానీపురం పోలీసులకు అప్పగించారు. ట్రాక్టర్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

★ భవానీద్వీపం మేనేజర్ జె.రవీంద్రబాబుకు గురువారం ఉదయం వి.ప్రదీప్ కుమార్ అనే వ్యక్తి ఫోన్ చేసి చెట్లు నరికే విషయం చెప్పారు. దీంతో రవీంద్రబాబు అక్కడికి వెళ్లగా కొందరు ట్రాక్టర్లలో చెట్ల దుంగలను వేసి తీసుకెళ్తున్నారు. పోలీసులను చూసి వారందరూ పారిపోయారు. పర్యాటక శాఖ వారి అనుమతి లేకుండా అక్రమంగా చెట్లు నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటుపై ట్రాక్టర్లను తెచ్చి దుంగల తరలింపు..

భవానీద్వీపం చుట్టూ కృష్ణానది ఉండటంతో.. లోపలికి ఎవరు వెళ్లాలన్నా పడవలుండాల్సిందే. దీంతో పంటులను ఏర్పాటు చేసి మరీ.. ట్రాక్టర్లు, ఇతర వాహనాలను భవానీద్వీపంలోనికి తీసుకెళ్లి.. కొట్టేసిన చెట్లను వాటిలో వేసి తీసుకొస్తున్నారు. పర్యాటకశాఖ అధికారుల సహకారం లేకుండా ఈ దందా సాగించడం అసాధ్యం. ద్వీపంలో దశాబ్దాలుగా సుబాబుల్, పెద్ద చెట్లపై అక్రమార్కుల కన్ను పడింది. ట్రాక్టర్‌లు, కూలీలను తీసుకెళ్లి మరీ.. పెద్ద పెద్ద దుంగలను నదిని దాటించి తీసుకొస్తున్నారు.

ఓ అధికారి, గుత్తేదారుపై అనుమానం..

చెట్లను కొట్టి తీసుకెళ్తున్న దాని వెనుక పర్యాటక శాఖలోని అధికారి, మరో గుత్తేదారు పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే కూలీలు.. ఏమాత్రం భయం లేకుండా పంటుల్లో వెళ్లి మరీ చెట్లను నరికి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం పర్యాటక శాఖలోని అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టేసి.. ఎవరికి వాళ్లు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావును దీనిపై వివరణ కోరగా.. చెట్లను తరలిస్తున్న వ్యక్తిని పర్యాటకశాఖ అధికారులు తమకు అప్పగించారని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

సర్క్యులర్ ఎకానమీలో ఏపీని ప్రథమ స్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న అనంతరాము, వేదికపై శరవణన్, గౌతమ్‌మెహ్రా, పట్టాభిరామ్, కృష్ణయ్య తదితరులు

ఈనాడు డిజిటల్, అమరావతి : సర్క్యులర్ ఎకానమీ 2047 నాటికి 2 ట్రిలియన్లకు ఏపీ చేరుకోవాలని భావిస్తున్నాం. 2030 నాటికి రూ. వేల కోట్లకు పైగా ఆదాయం పొందేలా ప్రణాళికలు సిద్ధం చేసి ఇప్పటికే అమలుకు పెట్టామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జీరో వేస్ట్‌పై సర్క్యులర్ ఎకానమీ థీమ్‌తో విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో రెండు రోజుల కార్యశాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోనే సర్క్యులర్ ఎకానమీలో మన రాష్ట్రాన్ని మొదటిస్థానంలో నిలపడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ స్థానంలో ఏపీ స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానంలో దూసుకుపోతోందన్నారు. రీసైక్లింగ్ ఇండస్ట్రీస్ ఏర్పాటుతో యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే చెత్త నుంచి సంపద సృష్టిస్తున్నామని తెలిపారు. ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము మాట్లాడుతూ.. చెత్త రీసైక్లింగ్ ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఏపీపీసీబీ ఛైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ.. వ్యర్థాలను పునర్వినియోగంలోకి తీసుకొస్తే ఆర్థిక రంగాన్ని పరిపుష్టం చేయవచ్చునన్నారు. సర్క్యులర్ ఎకానమీ ద్వారా కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దోహదపడుతుందన్నారు. కార్యశాలలో దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, బ్యాంకర్లు హాజరవడం హర్షణీయమన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ శరవణన్, గౌతమ్ మెహ్రా (పరివర్తన సొల్యూషన్స్ డైరెక్టర్), బీఏఎస్ ప్రసాద్ (విశ్రాంత ఐఏఎస్ అధికారి), సంజయ్ మెహతా(ఎంఆర్ఏఐ అధ్యక్షుడు), ఏపీఈఎంసీ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి, మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, స్టాక్ హోల్డర్స్, పరిశోధన సంస్థల ప్రతినిధులు, ఏపీపీసీబీ ప్రధాన కార్యాలయ అధికారులు, జోనల్, రీజనల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని తీర్మానం

ఇబ్రహీంపట్నం గ్రామీణం: తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా మినీ మహానాడులో తీర్మానం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నందిగామలో వంద పడకల ఆసుపత్రి, మంచినీటి పైలెట్ ప్రాజెక్టు పనులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలపాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా పురోగతి కోసం చేపట్టాల్సిన అభివృద్ధి పనులే ప్రధానంగా తీర్మానాలు చేశారు. ★ బుడమేరు ఆధునికీకరణ చర్యలు చేపట్టాలి. ★ చింతలపూడి, ముక్త్యాల, వేదాద్రి ఎత్తిపోతలను త్వరగా పూర్తిచేయాలి. ★ జి.కొండూరు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చేయాలి. ★ ఎన్టీటీపీఎస్ కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి. ★ విజయవాడ నగరంలో నూతనంగా భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు. ★ జగ్గయ్యపేట పరిధిలో సాగర్ ప్రధాన కాలువకు గండ్లు పూడ్చడానికి నిధుల మంజూరు ★గుణదలలో నిలిచిపోయిన రెండు పైవంతెనలు, సింగ్‌నగర్ పాయకాపురం మధ్య మరో పైవంతెన నిర్మాణం చేయాలన్నారు.

★ శాశ్వత బుడమేరు ముంపు నివారణ చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానాలను ఆమోదించారు.

విశ్వగురువుగా భారత్ అవతరించాలి

యువతకు మంత్రి సత్యకుమార్ పిలుపు



ముగింపు సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్, శ్రీరామ్, శివస్వామి, నవీన్, శ్రీనివాస్ తదదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: ప్రపంచం ముందు భారత్‌ను విశ్వగురువుగా ఆవిష్కరించడానికి యువత సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం పాలఫ్యాక్టరీ సమీపంలో ఉన్న హనుమద్దీక్షాపీఠం వద్ద భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అధ్యక్షతన హనుమాన్ శోభాయాత్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశ సమైక్యతకు హిందూ బంధువులందరు ఒక తాటిపైకి రావాలన్నారు. హనుమాన్ శోభా యాత్రకు తరలి వచ్చిన హిందూ బంధువులతో హృదయం ఉప్పొంగిందన్నారు. ★ కొంతమంది పోలీసు అధికారులు పాత భావనతోనే పని చేస్తున్నారని, శోభాయాత్రను జరగకుండా చేయాలని చూశారన్నారు. భారత్ పాకిస్థాన్ యుద్ధ సమయంలో ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదుల్ని మట్టుబెట్టి విజయం సాధించిన నేపథ్యంలో సైన్యానికి, దేశానికి మద్దతుగా ర్యాలీలో టపాసులు కాలిస్తే కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసు అధికారుల తీరు తీవ్ర ఆక్షేపణీయంగా ఉందన్నారు. హిందూ వ్యతిరేక విధానాలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సేనా శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ విభాగ ప్రచారక్ నవీన్, శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, హనుమద్దీక్షాపీఠం పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామి, వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి దుర్గాప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి బ్యాంకు సహకారం



జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, పక్కన పట్టాభిరామ్, బ్యాంకు ఛైర్మన్ రాంబాబు తదితరులు

కానూరు, న్యూస్‌టుడే: కానూరులో ఏర్పాటు చేసిన కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు 34వ శాఖను ఎమ్మెల్యే బోడే ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌లు గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్య, ఉన్నత వర్గాల అభ్యున్నతికి బ్యాంకు సహకారం అందించాలన్నారు. కొమ్మారెడ్డి పట్టాభిరాం మాట్లాడుతూ అన్నిరంగాల ఖాతాదారులకు అనువైన సమయంలో సేవలు అందిస్తూ వారి మన్నలు పొంది బ్యాంకు అభివృద్ధి చెందాలన్నారు. బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ విశాఖపట్నం అక్కయ్యపాలెం ప్రధాన కార్యాలయంగా 1999లో ఏర్పాటైన ఈ బ్యాంకు లిమిటెడ్.. 9 జిల్లాల్లో విస్తరించిందని, ఇప్పుడు కానూరులో 34వ శాఖను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ పట్టణ సహకార బ్యాంకుల్లో ఒకటిగా ఉన్న తమ బ్యాంకు మల్టీ స్టేట్ హోదా సాధించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ప్రస్తుతం రూ.1020 కోట్ల డిపాజిట్లు, రూ.680 కోట్ల రుణాల మంజూరుతో రూ.1700 కోట్ల వ్యాపారం చేస్తున్నామన్నారు. బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, విజయవాడ రీజనల్ మేనేజర్ జాస్తి మురళీ, కానూరు మేనేజర్ నెహ్రూజీ, నాగార్జున ఆస్పత్రి ఛైర్మన్ కొడాలి జగన్మోహనరావు, మురళీమోహనరావు, డాక్టర్ వల్లభనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై విచారణ



గట్టు వద్ద రికార్డులు పరిశీలనలో అధికారులు

వత్సవాయి, న్యూస్‌టుడే: మండలంలోని భీమవరం సమీపంలో ఉన్న కొనగిరి మల్లికార్జునస్వామి గట్టులో జరిగిన అక్రమ గ్రావెల్ తవ్వకాలపై అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విచారణకు ఆదేశించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. గురువారం ఏఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ పి.బాబు, విజయవాడ రూరల్ తహసీల్దారు సుగుణ, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు గట్టులో జరిగిన గ్రావెల్ తవ్వకాలను పరిశీలించారు. ఎంత మేర తవ్వారో కొలతలు తీశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన గ్రావెల్ తవ్వకాల లీజు ఆర్డర్‌లో ఉన్న మేరకు తవ్వారా, అదనంగా తవ్వకాలు చేశారా..? అనే విషయాలపై అధికారులు తనిఖీలు చేసినట్లు సమాచారం. గత వైకాపా పాలనలో గట్టులో పెద్దఎత్తున అక్రమ తవ్వకాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లో దానిపై పలువురు ఫిర్యాదులు చేసినా బుట్టదాఖలయ్యాయి. కూటమి ప్రభుత్వంలో తవ్వకాలపై విచారణ చేపట్టడంతో గట్టులో జరిగిన అక్రమాలు బయటపడే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. తవ్వకాల పరిశీలనలో భీమవరం, చిల్లకల్లు వీఆర్వోలు జి.స్వామి, హుస్సేన్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -119 రిటైల్ ధర 141 చికెన్ విత్ స్కిన్ - 204, చికెన్ స్కిన్‌లెస్ - 233. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 127, 136, 147 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.87/-.

ఉపాధ్యాయ బదిలీల ఆన్‌లైన్ సేవలు ప్రారంభం



పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు, మనోహర్‌కుమార్ తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ బదిలీ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ గురువారం గవర్నర్‌పేటలోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ప్రారంభించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్.పి. మనోహర్‌కుమార్ తదితరులు ప్రారంభించారు. ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రచురణ కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య, సహాధ్యక్షుడు ఎం.కృష్ణయ్య, కోశాధికారి పి.నాగేశ్వరరావు, ఐక్య ఉపాధ్యాయ సంపాదక వర్గ సభ్యుడు జె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు

నందిగామ, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా నందిగామ పోలీసు స్టేషన్‌లో నమోదైన యువతిపై అత్యాచారం కేసులో నిందితుడు అమరేందర్‌రెడ్డిని పట్టుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల పోలీసులు గాలిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ పోలీసులు, డీసీపీ సహకారంతో ఏపీ పోలీసులకు నిందితుడు దొరక్కుండా తప్పించుకున్న విషయం తెలిసిందే. దీనిపై బుధవారం 'అత్యాచార నిందితుడికి ఎల్బీనగర్ పోలీసుల వత్తాసు' శీర్షికతో 'ఈనాడు' ప్రధాన సంచికలో వచ్చిన కథనంపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు స్పందించి సీరియస్‌గా తీసుకున్నారు. ఇరురాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు చర్చించి నిందితుడ్ని పట్టుకునేందుకు గురువారం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పరారైన నిందితుడు, కుటుంబ సభ్యుల సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. దీంతో సాంకేతిక పరిజ్ఞానంతో శోధించి నిందితుడు నాగర్‌కర్నూల్ ప్రాంతంలో ఉన్నట్లు తెలుసుకున్నారు. నిందితుడి స్వగ్రామం తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా చండూరు మండలం శిర్దేపల్లి గ్రామానికి పోలీసులు వెళ్లారు. దీంతోపాటు నందిగామ సీఐ వైవీఎల్ నాయుడు సైతం అక్కడే ఉండి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ఛాటింగ్‌లు, సందేశాల ఆధారంగా పోలీసుల విచారణ

గుంటూరులో సీఏ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాకల్టీగా ఉన్న కటికం అమరేందర్‌రెడ్డి ప్రేమ పేరుతో ఓ యువతి(సాఫ్ట్‌వేర్ ఇంజినీర్)కి దగ్గరయ్యాడు. వివాహం చేసుకుంటానని ఆమెను లోబర్చుకొని తర్వాత ముఖం చాటేశాడు. ఆమె వద్ద డబ్బులు కూడా కాజేశాడు. వారిద్దరి సెల్‌ఫోన్లలో ఛాటింగ్‌లు, సందేశాలు తదితర వివరాలు పోలీసులు సేకరించి విచారణ చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ని మోసం చేసిన నిందితుడు అనంతరం సీఏ చదువుతున్న తనకంటే 13 ఏళ్లు చిన్నదైన విద్యార్థినికి ప్రేమ పేరుతో దగ్గరై వివాహం చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అమెరికాలో ఉంటున్న బాధితురాలు మెయిల్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగామ పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేసి నిందితుడ్ని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా గొల్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రెండున్నర గంటల పాటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ రవీంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆశా ఆసుపత్రి రోడ్డు, మైలురాయి సెంటర్, ఆర్సీఎం చర్చి, హరిజనవాడ, కమ్యూనిటీ హాలు ప్రాంతం, టీటీడీసీ కార్యాలయం, పోసాని నరసింహారావుచౌదరి ఉన్నత పాఠశాల ప్రాంతం, బాలాజీ టవర్స్, మహాత్మాగాంధీ టోకు వ్యాపార కేంద్రం, మహేంద్రనగర్, టెలికంకాలనీ, వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 9:30 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్తు వినియోగదారులు గమనించాలని కోరారు.

గిరిపై మేఘం.. భువిపై అమోఘం



ఈ చిత్రం చూశారా కొండల మధ్యలో చల్లగా చిన్నగా జాలువారుతూ వెళ్తుంది మేఘం..ఎక్కడో ఆకాశాన ఉండే మేఘం జనావాసానికి దగ్గర్లోకి రావడంతో ప్రజలు కనుల విందుగా చూస్తున్నారు..ఇది ఎక్కడో అరకు లాంటి ప్రదేశం కాదండోయ్..గంపలగూడెం మండలం నారికింపాడు, ఎ.కొండూరు మండలం చీమలపాడు మధ్య ఉన్న కొండలే..గురువారం ఉదయం భూమికి చేరువుగా మేఘాలు చేరడంతో అటుగా ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే ప్రయాణికుల దగ్గరగా చూసి ఆనందించారు. **-న్యూస్‌టుడే, గంపలగూడెం, ఎ.కొండూరు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? కొత్తరెడ్డిగూడెం గ్రామం చివర కూనపరాజుపర్వ వెళ్లే రహదారి దగ్గర చెత్త, వ్యర్థాలు పడేస్తుండడంతో ఇబ్బందిగా ఉంది. **-స్థానికుడు, రాంబాబు** ✔ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **-ఎస్.రామారావు, పంచాయతీ కార్యదర్శి రెడ్డిగూడెం -న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

? కొండపల్లి ప్రధాన వీధి గుంతలమయమైంది. ప్రస్తుతం పడుతున్న వర్షాలకు ద్విచక్ర వాహనాలతో ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంది. **-రాజు, స్థానికుడు** ✔ రహదారి మరమ్మతులతో పాటు రహదారి విస్తరణ అంశం ప్రస్తుతం ఉన్నతాధికారుల వద్ద ఉంది. ఆర్అండ్‌బీ శాఖతో సమన్వయమై ఆ పనులు నిర్వహించాల్సి ఉంది. **-రమ్యకీర్తన, కమిషనర్**

స్పందనకు వందనం

కొండపల్లి ఖిల్లా రోడ్డు వద్ద డ్రెయిన్ దెబ్బతిందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు తెలిపిన సమస్యపై పురపాలిక సిబ్బంది స్పందించారు. ఆ డ్రెయిన్‌ను కొంత మేర వెడల్పు పనులు చేసి ఇరువైపులా చదును చేశారు. ❖ ఆదివారం కురిసిన వర్షానికి సంబంధించి ఇబ్రహీంపట్నం ఖాజీమాన్యం కాలువల వద్ద చెత్త నిలిచిందని స్థానికులు తెలిపిన సమస్యపై పారిశుద్ధ్య సిబ్బంది స్పందించారు. ఆ ప్రాంతంలోని అన్ని మురుగు కాలువల్లో ఉన్న చెత్తను గురువారం తొలగించారు. **-న్యూస్‌టుడే, కొండపల్లి**

❖ పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలో 18వ వార్డులో మురుగు నీరు ప్రవహించే కాల్వలో మట్టి పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ జి.లోవరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో కాల్వను శుభ్రం చేయించారు. ❖ పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలో 15వ వార్డులో మురుగు కాల్వలో పూడిక పేరుకుపోవడంతో అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో మురుగు కాల్వలో పూడిక తొలగింపజేశారు.



-న్యూస్‌టుడే, తిరువూరు

ప్రాణం తీసిన ఈత సరదా

కేతవల్లి, న్యూస్‌టుడే: మూసీ వాగులో ఈతకు వెళ్లి ఓ యువకుడు ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఘటన గురువారం నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపాడు పాత బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలోని కౌలూరుకి చెందిన గాలంకి నీరజ్(21), తన సోదరునితో కలిసి ద్విచక్రవాహనంపై శాలిగౌరారం మండలంలోని ఆకారం గ్రామం వెళ్లేందుకు బయలుదేరారు. ఉప్పలపాడు పాత బ్రిడ్జి వద్దకు చేరుకున్నాక.. అక్కడ ఇద్దరు కలిసి మూసీ వాగులో ఈత కొడుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ నీరజ్ మృతి చెందాడు. మృతుడి తల్లి రజని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్‌లు తెలిపారు.

వెలుగునిచ్చే భవిత కేంద్రాలు

విభిన్న ప్రతిభావంతులైన చిన్నారుల గుర్తింపునకు సర్వే

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

కన్న బిడ్డలపై తల్లిదండ్రులకు ఎన్నో ఆశలు..ఆకాంక్షలు ఉంటాయి.. కానీ అలాంటి బిడ్డల్లో ఏదైనా లోపం ఉందని తెలిస్తే కన్నవాళ్లు విలవిల్లాడిపోతారు. వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటారు. ప్రభుత్వం కూడా అలాంటి వారిపై ప్రత్యేక శ్రద్ధతో విద్యతో పాటు ఫిజియోథెరపీ అందించేందుకు కృషి చేస్తోంది. ఇందు కోసం సర్వే నిర్వహించి..గుర్తించి వారిని బడుల్లో..భవిత కేంద్రంలో చేర్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. జిల్లాలో 13వ తేదీ నుంచి ప్రారంభమైన సర్వే జూన్ 19 వరకు కొనసాగనుంది.



ఇబ్రహీంపట్నం ఫెర్రీ భవిత కేంద్రానికి చిన్నారులను తీసుకువస్తున్న తల్లిదండ్రులు (పాత చిత్రం)

నయం చేసేందుకు కృషి

విభిన్న ప్రతిభావంతుల్లో ఒక్కొక్కరిలో ఒక్కో సమస్య ఉంటుంది. కొందరిలో బహుముఖ లోపాలు ఉంటాయి. నడవలేకపోవడం, వినికిడి లోపం, మాట్లాడలేక పోవడం, దృష్టిలోపం వంటివి ఒక్కో స్థాయిలో ఉంటాయి. వీరందరికీ భవిత కేంద్రాలు వరంగా మారుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా సమస్యలను అధిగమించడానికి చిన్నారులకు ఫిజియోథెరపీ స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీతో పాటు బ్రెయిలీ లిపి సాధన చేయిస్తున్నారు. ఈ ఏడాది ఇబ్రహీంపట్నం మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించి దాతలు, సేవా సంస్థల ద్వారా భవిత కేంద్రాలలోని చిన్నారులకు ఉపకరణాలు ఉచితంగా అందించారు. మానసిక స్థితి బాగలేని చిన్నారులకు సైతం నయం అయ్యే విధంగా ప్రత్యేక నిపుణుల సాయంతో కృషి చేస్తున్నారు. వీరిని భవిత కేంద్రాలకు తీసుకెళ్లేందుకు కూడా ప్రభుత్వం రవాణా ఛార్జీలతో పాటు సహాయకులకు భత్యం కూడా మంజూరు చేస్తోంది.

జిల్లాలో ఇలా	
భవిత కేంద్రాలు	20
విభిన్న ప్రతిభావంతులు	55
సేవలందిస్తున్న ఐఈఆర్పీలు	40
ఐఈడీఎస్ఎస్‌లు	3
ఫిజియోథెరపిస్టులు	7

అవగాహన కల్పిస్తున్నాం

ఇప్పటివరకు బడుల్లో.. భవిత కేంద్రంలోనూ చేరకుండా ఇంటి పట్టునే ఉండిపోయిన విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారివారి తల్లిదండ్రులకు భవిత కేంద్రాలు ఇస్తున్న శిక్షణపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి బిడ్డకు మంచి భవితనిచ్చేందుకు ప్రభుత్వం శ్రమిస్తోంది. సర్వే ముగిసిన తరువాత వీరిని బడుల్లో... భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

- సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయురాలు చంద్రావతి

బాటసారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న నిర్వాహకులు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని వెల్వడం హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో గురువారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని బాటసారులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. రెండు నెలలుగా నిర్వహిస్తున్న చలివేంద్రంలో మజ్జిగ పంపిణీకి చాలా మంది సహకరిస్తున్నారని సంఘం నాయకుడు నాగిరెడ్డి తెలిపారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



బి.శ్రీనివాసరావు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బొజ్జగాని శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కంచికచర్ల డిప్యూటీ ఎంపీడీవోగా ఉన్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. కొత్తగా చేరిన ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది, గ్రామ సచివాలయాల ఉద్యోగులు స్వాగతించారు. ఇప్పటి వరకు విస్సన్నపేట ఎంపీడీవో చిన్నరాట్నాలు ఇన్‌ఛార్జిగా ఉన్నారు.

ఉత్సాహం.. విజ్ఞాన శిబిరం

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ఇచ్చారు. పుస్తక పఠనం, కథలు చెప్పడం, ఆటలు నిర్వహించినట్లు నిర్వాహకురాలు శ్రీలత తెలిపారు.

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గురువారం గ్రంథపాలకురాలు కె.పద్మావతి పర్యవేక్షణలో బాలబాలికలకు యోగాసనాల్లో శిక్షణ ఇచ్చారు. ధ్యానం, యోగ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. క్రాఫ్ట్స్ తదితర ఆటల పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని విశ్రాంత ఉపాధ్యాయుడు సురేష్ సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం గణితంలో కొలమానం అంశాలను సులభంగా అర్థమయ్యేలా అవగాహన కల్పించారు. గణితశాస్త్రంలో బిందువులు, రేఖలు, కోణాలు, మూలాలు, వాటి కొలతలు తదితర అంశాలను వివరించారు. అనంతరం జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెనుగొలను : కంప్యూటర్ శిక్షణలో విద్యార్థులు



తిరువూరు గ్రంథాలయంలో యోగాసనాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు సురేష్

రోడ్డు ప్రమాదం.. తల్లి, కుమారుడికి గాయాలు

భవానీపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు గాయపడిన ఘటన పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. భవానీపురం ఆకుల రాజేశ్వరరావు రోడ్డులో లక్ష్మీప్రసన్న, జనార్దన్ దంపతులు నివాసం ఉంటున్నారు. జనార్దన్ బీఎస్ఎన్ఎల్‌లో జవానుగా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. ఈనెల 19న కుమారుడు పణికుమార్‌తో కలిసి లక్ష్మీప్రసన్న ద్విచక్ర వాహనంపై బందరువైపు ఇంటికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా భవానీపురం స్వాతి సెంటర్ సమీపంలో వారు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు డ్రైవర్ ఢీకొట్టారు. దీంతో లక్ష్మీప్రసన్న, పణికుమార్‌లు గాయపడ్డారు. వారిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పన్నుల తగ్గింపుపై హర్షం



చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న డ్రైవర్లు

మైలవరం, న్యూస్‌టుడే: వాహనాలపై గ్రీన్ ట్యాక్స్ తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై గురువారం మైలవరం లారీ ఓనర్స్, వర్కర్స్ సంఘం కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఒడిదుడుకుల్లో ఉన్న రవాణా రంగానికి పన్నుల తగ్గింపు ఊరటనిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

వీరాంజనేయ వందనం



మైలవరం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు



మైలవరం కోదండ రామాలయంలో..



జి.కొండూరు: వెల్లటూరులో హనుమాన్‌చాలీసా పారాయణం



రెడ్డిగూడెంలో..




ఇబ్రహీంపట్నం గ్రామీణం: పూజాద్రవ్యాలతో భక్తులు



కొండపల్లిలో గ్రామోత్సవం

న్యూస్‌టుడే, బృందం: హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం ఆలయాలు భక్తులతో ఊరూరా కోలాహలంగా మారాయి. రామాలయాలు, ఆంజనేయస్వామి గుడుల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలు భక్తి శ్రద్ధలతో ఆచరించారు. హోమాలు నిర్వహించి, హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. భక్తులకు ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు చేశారు.



గంపలగూడెం: వినగడపలో..



మెట్టగుట్ట గుడిలో..



గంపలగూడెం భజన మందిరంలో ..



మేడూరు వీరాంజనేయస్వామి గుడికి శోభాయాత్ర



తిరువూరులో..

పవనసుతుడా.. ప్రసన్నాంజనేయ

తిరువూరు : మండలంలోని ముష్టికుంట్లలో హనుమజ్జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి అర్చకులు మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు, తమలపాకులతో అర్చనలు, సింధూరంతో పూజలు చేశారు. పలు రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్త బృందాలు పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం పఠించారు.



తిరువూరు: ముష్టికుంట్లలో భక్తుల పూజలు

పశువులను వదిలేస్తే చర్యలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: రహదారులపై ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను యజమానులు విచ్చలవిడిగా వదిలేయొద్దని ఎస్సై సీహెచ్. కృష్ణ సూచించారు. దీనిపై పశువుల పెంపకందారులకు అవగాహన కల్పించేందుకు గురువారం నుంచి గ్రామాల్లో మైక్ ప్రచారం కూడా చేస్తున్నామని తెలిపారు. ఇటీవల పలువురు వాహనదారులు ప్రమాదానికి గురవడానికి రహదారులపై వదిలేసిన ఆవులు, గేదెలు కారణమన్నారు. మేతకు వదిలేటప్పుడు కచ్చితంగా కాపలాదారు ఉండాలన్నారు. ఇకపై ఎక్కడైనా పశువుల కారణంగా ప్రమాదాలు జరిగితే అందుకు యజమానులను బాధ్యులుగా గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్రచార ఆటో వద్ద ఎస్సై కృష్ణ

ట్రాక్టర్ ట్రక్కు తగిలి ఒడిశా బాలుడి మృతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: ట్రాక్టర్ ట్రక్కు తగిలి ఏడేళ్ల బాలుడు మృతిచెందిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలోని వెల్లటూరులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన మంచుగౌడ కుటుంబం వెల్లటూరులోని ఓ ఇటుకల తయారీ బట్టీలో పనిచేస్తోంది. బట్టీలకు సమీపంలో గల మామిడి తోటలో చంద్రాలకు చెందిన ఓ రైతు కాయలను ట్రేల్లో ఎగుమతి చేసి ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నారు. ఈ క్రమంలో బట్టీల వద్ద కార్మికుల పిల్లలు కొందరు కాయలు అడగ్గా..ట్రాక్టర్ ట్రక్కులో ఉన్న వ్యక్తి కొన్ని కాయలను పిల్లలకు ఇచ్చాడు..ఆ సమయంలో మంచుగౌడ కుమారుడు దేబారాజు గౌడ(7) ట్రాక్టర్ ట్రక్కుకు తగిలి రహదారిపై పడిపోయాడు. రోడ్డుపై పడి ఉన్న బాలుడిని మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా..అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

వంతెన కల.. నెరవేరేదెలా..?

బ్రిడ్జిల నిర్మాణాలపై కూటమిపైనే రైతన్నల ఆశలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

వర్షాల ప్రారంభానికి ముందే ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని వాగులపై ఉన్న చప్టాల స్థానంలో కూటమి ప్రభుత్వం వంతెనలను నిర్మిస్తుందన్న ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. వర్షాకాలంలో వ్యవసాయ పనులకు కార్మికులు, ముంపునకు గురైన పైరును చూసుకునేందుకు రైతులు వాగులు దాటేందుకు అవస్థలు పడుతున్నారు. వానాకాలంలో ఇబ్రహీంపట్నం గ్రామీణ మూలపాడు, జూపూడి గ్రామాల వద్ద ఉబ్బడివాగు, చిలుకూరు గ్రామం వద్ద ఏనుగు గడ్డ వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తాయి. ఆయా గ్రామాలకు చెందిన పంట పొలాలకు వాగులను దాటి వెళ్లాల్సి రావడంతో ఒకరినొకరు పట్టుకుంటూ భయం భయంగా వాగులు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో వాగులపై వంతెనల నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. దీంతో కూటమి ప్రభుత్వంలోనైనా వంతెనల నిర్మాణ కల సాకారం అవుతుందని ఆయా గ్రామాల వారు ఆశతో ఉన్నారు.



జూపూడి సప్టాపై పొంగి పొర్లుతున్న వరద నీరు (పాత చిత్రం)



మూలపాడు వద్ద వాగు ఇలా (పాత చిత్రం)

నివేదికలు సిద్ధం చేసినా ➜ మూలపాడు శివారు ఉబ్బడివాగు వద్ద వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించి నివేదికలు సమర్పించినా ఆమోదం లభించలేదు. ఈ వాగు అవతల దాదాపు రెండు వందల ఎకరాలు ఉండగా సాగును చూసేందుకు వర్షాకాలంలో రైతులు, కూలీలు వాగు దాటాలంటే ఇబ్బందులు పడుతున్నారు. గత తెదేపా పాలనలో ఎన్టీటీపీఎస్ కాలుష్య ప్రభావితమైన జూపూడి ఉబ్బడి వాగుపై వంతెన నిర్మాణానికి ఎన్టీటీపీఎస్ సీఎస్ఆర్ నిధులను కేటాయించేందుకు ముందుకు వచ్చింది. అది కార్యరూపంలోకి వచ్చే ముందు ప్రభుత్వాలు మారడంతో అటకెక్కింది. ☛ చిలుకూరు వద్ద ఏనుగు గడ్డవాగుపై వంతెన నిర్మిస్తే వాగు పరివాహక పంట పొలాలకు ముంపు తప్పి నాలుగు గ్రామాలకు రహదారి ఏర్పడుతుందన్న గ్రామస్థుల ప్రతిపాదనలు నేటికి కార్యరూపంలోకి రాలేదు. వాగులపై వంతెలన నిర్మాణానికి నివేదికలు సిద్ధం చేసినట్లు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని పీఆర్, ర.భ శాఖలకు చెందిన ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ప్రతినిధులు చెబుతున్నారు.

ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాల్సిందే

విస్సన్నపేట: అన్నదాతలకు ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఏడీఏ శశికళ, ఏవో రాజ్యలక్ష్మి వ్యాపారులకు స్పష్టం చేశారు. విస్సన్నపేటలో వెంకటకృష్ణ విత్తనాల విక్రయ దుకాణంలో గురువారం వారిద్దరు తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, విత్తనాల నిల్వలు, దస్త్రాల నిర్వహణను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లులు కచ్చితంగా ఇవ్వాలని సూచించారు.



విత్తనాల దుకాణంలో దస్త్రాలు పరిశీలిస్తున్న ఏడీఏ శశికళ, ఏవో రాజ్యలక్ష్మి

హుండీలో కానుకల చోరీ



దొంగలు కానుకలు అపహరించిన హుండీ ఇదే

కోడూరు (ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కోడూరు కోదండ రామాలయంలో బుధవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. గుడిలో స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీని ధ్వంసం చేశారు. గత ఐదు నెలలుగా భక్తులు వేసిన కానుకలను అపహరించినట్లు గుడి కమిటీ అధ్యక్షుడు యరమల శివరామిరెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడాదికి ఒకసారి హుండీలో కానుకలు లెక్కిస్తారు. గత ఐదు నెలల కిందటే కానుకలను లెక్కించారు. గ్రామంలో గడ్డి వీరారెడ్డి పచారీ దుకాణంలో కూడా చోరీ జరిగింది. ఈ దొంగతనాలపై అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్సై సీహెచ్.కృష్ణ తెలిపారు.

బంగారు నగలు..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటుపల్లి ఖాజీపేటలోని ఓ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసుల సమాచారం మేరకు. .ఖాజీపేటలో నివసిస్తున్న బాణావతి విజయలక్ష్మి ఈ నెల 19 తేదీన కుటుంబసభ్యులతో కలిసి మహారాష్ట్ర వెళ్లారు. గమనించిన గుర్తు తెలియని దుండగులు బుధవారం రాత్రి ఆమె ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని రూ.1.40 లక్షల విలువైన బంగారు నగలు చోరీ చేశారు. గ్రామంలోనే నివాసముంటున్న ఆమె సోదరుడు శ్రీనివాసరావు జరిగిన విషయాన్ని ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. ఫోను ద్వారా బాధిత కుటుంబ సభ్యుల నుంచి సమాచారం సేకరించి చోరీకి గురైన బంగారు వస్తువుల వివరాలు తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దుర్మరణం

చింతలపాడు(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని చింతలపాడు సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరువూరులోని రాజుపేటకు చెందిన ఎం.శివరామకృష్ణ అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..గంపలగూడెం నుంచి తిరువూరు వైపు వస్తున్న ట్రాక్టరు వెనుక ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడికి తగలడంతో తలకు తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడి మృతదేహాన్ని తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

'సూపర్‌బగ్'కు విరుగుడు సూచించే కృత్రిమ మేధ సాధనం

• భారత్, ఫ్రాన్స్‌ల సంయుక్త ఆవిష్కరణ

దిల్లీ: యాంటీబయాటిక్‌లు ఎక్కువగా వాడటం వల్ల వ్యాధికారక బ్యాక్టీరియా ఔషధ ప్రభావానికి లొంగని "సూపర్‌బగ్"గా మారి రోగికి ప్రాణాంతకంగా పరిణమిస్తుంటుంది. ఈ ప్రమాదకర పరిస్థితికి పరిష్కారం చూపే కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. సూపర్‌బగ్ సోకిన రోగిలో వ్యాధి నిర్మూలనకు ఏ యాంటీబయాటిక్స్ మేళవించి ఇవ్వాలి, ఏయే మోతాదులో ఇవ్వాలి అని సూచించే కృత్రిమ మేధ ఆధారిత సాంకేతిక వ్యవస్థను దిల్లీకి చెందిన ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ), ఫ్రాన్స్‌కు చెందిన ఐరోపా సక్లే సంస్థలు అభివృద్ధి చేశాయి. ఈ ప్రాజెక్టుకు ప్రొఫెసర్ అంగ్షుల్ మజుందార్, ఫ్రాన్స్‌కు చెందిన డాక్టర్ ఎమిలీ షుఛాటినూ సారథ్యం వహిస్తున్నారు. ఈ పరిశోధన ద్వారా అందుబాటులో ఉన్న పరిజ్ఞానాన్ని సమర్థంగా ఉపయోగించుకొని ఔషధ నిరోధక శక్తి కలిగిన సూక్ష్మజీవుల్ని నిర్మూలించే అవకాశాలు విస్తృతమవుతాయని మజుందార్ అన్నారు. 'మనం తరచూ వైరల్ ఇన్‌ఫెక్షన్ చికిత్సల్లో కూడా యాంటీబయాటిక్స్ వాడుతుంటాం. వైరల్ ఇన్‌ఫెక్షన్లకు యాంటీ బయాటిక్స్ వాడాల్సిన అవసరం లేదు. ఈ తీరు ఇలాగే కొనసాగితే వ్యాధికారక బ్యాక్టీరియాపై యాంటీ బయాటిక్ ఔషధాలు ప్రభావం చూపని పరిస్థితి తలెత్తుతుంది. దీంతో మూత్రనాళ ఇన్‌ఫెక్షన్ వంటి సాధారణ రోగాలు, గాయాలు చికిత్సకు లొంగని పరిస్థితి తలెత్తుతుంది' అని మజుందార్ పేర్కొన్నారు. కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన కొత్త వ్యవస్థ ఇలాంటి స్థితిలో సరైన చికిత్సా మార్గాలను సూచిస్తుంది.

వేడి వాతావరణంలో శరీరాన్ని కుంచించుకుంటున్న చేపలు

జ్ఞాన నేత్రం

న్యూయార్క్: ధ్రువ ప్రాంతాల్లో వేడెక్కుతున్న సముద్ర వాతావరణ పరిస్థితుల్ని తట్టుకునేందుకు కొన్ని రకాల నారింజ చారల క్లౌన్ చేపలు తమ శరీర పరిమాణాన్ని తగ్గించుకుంటున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. మారుతున్న ప్రపంచ వాతావరణ పరిస్థితుల కారణంగా సముద్రగర్భంలో వేడి పెరుగుతోంది. "సీ అనిమోన్" అనే రంగు రంగుల వృక్ష జంతు సమ్మేళిత జీవుల మధ్య జీవిస్తుంటాయి. సముద్రగర్భంలో వేడి కారణంగా ఈ అనిమోన్‌లు తమ రంగులు కోల్పోతుంటాయి. ఈ పరిస్థితుల్లో క్లౌన్ చేపలు మారిన పరిస్థితికి తగ్గట్టుగా తమ శరీర పరిమాణంలో మార్పులు చేసుకుంటూ ఉంటాయి. అయితే ఈ చేపలు ఏ విధంగా తమ శరీర పరిమాణాన్ని తగ్గించుకుంటున్నాయనే విషయం అంతుపట్టడం లేదు. ఈ పరిమాణ కుదింపు వాటి శక్తిని ఆదా చేసే భాగంగా భావిస్తున్నారు. అయితే పరిస్థితులు మెరుగుపడినప్పుడు ఆ చేపలు తమ శరీర పూర్వ పరిమాణాన్ని తిరిగి పొందుతున్నాయని శాస్త్రవేత్తలు గమనించారు. మారుతున్న ప్రపంచ వాతావరణ పరిస్థితులు జీవజాతులను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. అయితే జీవులూ అందుకు తగ్గట్టుగానే పరిణామం చెందుతున్నాయనడానికి ఇదో ఉదాహరణ.

హార్వర్డ్ వర్సిటీకి మరో ఎదురుదెబ్బ

విదేశీ విద్యార్థుల ప్రవేశాలకు అనుమతి రద్దు

న్యూయార్క్: ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి నిధుల్లో కోత వేసిన ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో ప్రతికూల నిర్ణయం తీసుకుంది. వర్సిటీలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలు చేపట్టేందుకు ఉన్న అనుమతిని రద్దు చేసినట్లు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ఈ మేరకు గురువారం వర్సిటీకి అంతర్గత భద్రతా విభాగం లేఖ రాసినట్లు వెల్లడించింది. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని లేఖలో స్పష్టం చేసినట్లు పేర్కొంది.

దిగువ సభలో గట్టెక్కిన ట్రంప్ సర్కార్ కీలక బిల్లు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎజెండా అమలుకు వీలు కల్పించే కీలక బిల్లుకు అమెరికన్ కాంగ్రెస్ దిగువ సభ గురువారం ఆమోదం తెలిపింది. ట్రంప్ యంత్రాంగానికి, రిపబ్లికన్లకు ఇదొక ముఖ్య విజయం. బిల్లుకు సభ ఒక్క ఓటు అధిక్యతతో ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ఒకవైపు పన్నుల్లో రాయితీకి, మరోవైపు సంక్షేమ పథకాల్లో కోతకు వీలు కల్పిస్తోంది.

కాల్పుల్లో ఇద్దరు ఇజ్రాయెలీ దౌత్యవేత్తల మృతి

• వాషింగ్టన్‌లో దుశ్చర్య

వాషింగ్టన్: గాజాపై ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరమవుతున్న వేళ... అమెరికాలో దారుణం జరిగింది. ఇజ్రాయెల్ రాయబార కార్యాలయానికి చెందిన ఇద్దరు దౌత్యవేత్తలు హత్యకు గురయ్యారు. వాషింగ్టన్‌లోని యూదు మ్యూజియంలో బుధవారం జరిగిన యువ దౌత్యవేత్తల కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తున్న యారోన్ లిషిన్‌స్కీ, సారా మిల్‌గ్రిమ్‌పై చాలా దగ్గర నుంచి దుండగుడు కాల్పులు జరిపాడు. దీంతో వారు అక్కడే తుదిశ్వాస విడిచారు. అనంతరం దుండగుడు మ్యూజియంలోనికి వెళ్లగా అక్కడ భద్రతా అధికారులు అతడిని నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆ సమయంలో అతడు 'ఫ్రీ ఫ్రీ పాలస్తీనా' అంటూ నినాదాలు చేశాడని అధికారులు తెలిపారు. నిందితుడిని షికాగోకు చెందిన 30 ఏళ్ల ఎలియాస్ రోడ్రిగ్జ్‌గా గుర్తించారు. మృతుల కుటుంబాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. యూదులపై విద్వేషంతోనే ఈ హత్య జరిగిందని అన్నారు. ద్వేషానికి, అతివాదానికి అమెరికాలో స్థానం లేదని తెలిపారు. ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

త్వరలో నిశ్చితార్థం.. అంతలోనే



కాల్పుల్లో మృతి చెందిన యువ జంట యారోన్ లిషిన్‌స్కీ, సారా మిల్‌గ్రిమ్ త్వరలో నిశ్చితార్థం చేసుకోవాలని అనుకున్నారని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం తెలిపింది. లిషిన్‌స్కీ, తన స్నేహితురాలి కోసం ఉంగరం కూడా కొన్నారని. . నిశ్చితార్థం జెరూసలేంలో చేసుకోవాలని యువ జంట భావించిందని ఇజ్రాయెల్ రాయబారి యహీయల్ లైటర్ తెలిపారు. వారిది అందమైన జంట అని పేర్కొన్నారు. ఈ ఘటనను భారత విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్. జైశంకర్ తీవ్రంగా ఖండించారు. దోషులను న్యాయస్థానం ముందు నిలబెట్టాలని పేర్కొన్నారు.

వక్ఫ్ కేసులో మధ్యంతర ఉత్తర్వులపై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు

దిల్లీ: వక్ఫ్ సవరణ చట్టం-2025ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో వాదనలు ముగిశాయి. మూడు అంశాలపై మధ్యంతర ఉపశమన ఉత్తర్వులకు సంబంధించి తీర్పును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం గురువారం రిజర్వు చేసింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా; పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వి, రాజీవ్ ధవన్, హుజెఫా అహ్మదీ వాదనలు వినిపించారు. మూడు రోజుల విచారణ అనంతరం సీజేఐ జస్టిస్ గవాయ్ ధర్మాసనం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు వెల్లడించింది. చట్టం.. రాజ్యాంగబద్ధమైనదేనన్న సానుకూల భావనను కలిగి ఉంటుందని ఇది వరకే తాను తెలిపినట్లు ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ గుర్తు చేశారు.

ధర్మాసనం గుర్తించిన 3 అంశాలివే..

- న్యాయస్థానాలు వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించిన వాటిని డీనోటిఫై చేసే అధికారం.
- కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ మండళ్ల కూర్పు. వాటిలో ముస్లిమేతరులను సభ్యులుగా చేయడంపై అభ్యంతరం.
- ప్రభుత్వ భూమిని వక్ఫ్ ఆస్తిగా పేర్కొనడంపై వివాదం తలెత్తినప్పుడు కలెక్టర్ విచారణ జరిపితే దానిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించకపోవడం. ప్రభుత్వ భూమిగా భావించడం.

పూర్తి వివరాలు www.eenadu.net లో

బెయిల్ విచారణకు 27 వాయిదాలా!

• అలహాబాద్ హైకోర్టుపై సుప్రీం అసంతృప్తి

దిల్లీ: మోసం, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర అభియోగాలతో సీబీఐ నమోదుచేసిన కేసులో నిందితుడి బెయిలు దరఖాస్తుపై విచారణను అలహాబాద్ హైకోర్టు 27 సార్లు వాయిదా వేయడంపై సుప్రీంకోర్టు గురువారం అసంతృప్తి వ్యక్తం చేసింది. "వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన వ్యవహారంలో బెయిలుపై విచారణను హైకోర్టు 27 సార్లు ఎలా వాయిదా వేస్తుంది?" అంటూ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. నిందితుడు లక్ష్య తవార్‌కు బెయిలు మంజూరు చేస్తూ అలహాబాదు హైకోర్టు ముందున్న ఈ కేసును సుప్రీంకోర్టు ముగించింది. తవార్ దరఖాస్తుకు సంబంధించి.. హైకోర్టులో ఈ వ్యవహారం పదే పదే వాయిదాపడటంపై సీబీఐకి సర్వోన్నత న్యాయస్థానం నోటీసు కూడా జారీ చేసింది. సాధారణంగా ఒక కేసు విచారణలో వాయిదాలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు స్వీకరించదని ధర్మాసనం ఈ సందర్భంగా వెల్లడించింది. "వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయాన్ని హైకోర్టు ఇలా పెండింగులో పెట్టి 27 సార్లు వాయిదా వేయకూడదు" అని సీజేఐ వ్యాఖ్యానించారు.

అణుచర్చలు విఫలమైతే ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి?

దుబాయ్: వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య ఐదో రౌండ్ చర్చలు శుక్రవారం రోమ్‌లో ప్రారంభం కానున్న వేళ.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయనుందన్న వార్తలు కలకలం సృష్టిస్తున్నాయి. ఈ చర్చలు విఫలమైతే ఇరాన్‌లోని అణుస్థావరాలపై బాంబులు కురిపించడానికి టెల్‌అవీవ్ సిద్ధంగా ఉందన్న కథనాలు వెలువడుతున్నాయి. అమెరికా నిఘా వర్గాల నుంచి ఇదే సమాచారం అందుతోందని 'సీఎన్ఎన్' కూడా పేర్కొంది. చర్చలు దాదాపు విఫలమవుతాయని ఇజ్రాయెల్ అంచనా వేస్తోంది. ఈ దాడుల కథనాలపై ఇరాన్ గురువారం స్పందించింది. తమ అణుకేంద్రాలను రక్షించుకోవడానికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపింది. "ఇజ్రాయెల్ చేస్తున్న బెదిరింపులపై చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ సమాజానికి స్పష్టం చేశాం. ఒకవేళ వారు చర్యలు తీసుకోకపోతే, మా అణుకేంద్రాలను కాపాడుకోవడానికి ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటాం" అని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చి తెలిపారు.



మీరు ఎప్పటికీ ఇలాగే ఉండిపోనక్కర్లేదు!

లాంబోర్గిని ఒకప్పుడు ట్రాక్టర్ల కంపెనీ. శామ్‌సంగ్ గతంలో కిరాణా సామాన్లు విక్రయించేది. ఎల్‌జీ మొదట్లో ఫేషియల్ క్రీమ్ కంపెనీగా ఉండేది. వీటన్నింటి నుంచీ నేర్చుకోవాల్సిన పాఠం ఏంటో తెలుసా..? మీరు ప్రస్తుతం ఉన్న పరిస్థితి మీరు ఎప్పటికీ ఉండిపోయే స్థితి కానక్కర్లేదు.

– అనుభవ్ దుబె, మోటివేషనల్ స్పీకర్

భారత్‌కు యూఏఈ, జపాన్ బాసట

• ఆ దేశాల కీలక నేతలతో అఖిలపక్ష బృందాల భేటీ
• పహల్గాం దాడి, తదనంతర పరిస్థితులను వివరించిన ఎంపీలు



టోక్యోలో జపాన్ విదేశాంగ మంత్రి తకేషీతో సమావేశమైన భారత అఖిలపక్ష బృందం

అబుధాబి/టోక్యో: ఉగ్రవాదంపై భారత్ పోరాటానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), జపాన్ మద్దతు ప్రకటించాయి. పహల్గాం ఉగ్రదాడి, పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదంపై వివరించేందుకు జనతాదళ్ (యూ) ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలో జపాన్‌కు, శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే నాయకత్వంలో యూఏఈకి వెళ్లిన అఖిలపక్ష పార్లమెంటరీ బృందాలు ఆ దేశాల్లోని కీలక నేతలు, మేధావులు, వివిధ సంస్థల అధిపతులతో గురువారం సమావేశమయ్యాయి. జపాన్‌కు వెళ్లిన ఎంపీల బృందం.. ఆ దేశ మాజీ ప్రధాని, జపాన్-భారత్ అసోసియేషన్ ఛైర్మన్ యొషిదె సుగాను కలిసింది. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటానికి జపాన్ అండగా ఉంటుందని సుగా తెలిపారు. జపాన్ విదేశాంగమంత్రి తకేషి ఇవాయా సహా చాలా మంది నేతలను కలిసిన ఎంపీల బృందం. పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిస్థితులను వివరించింది. జపాన్ విదేశాంగ మంత్రి తకేషి ఇవాయా మాట్లాడుతూ.. ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడే వారిని శిక్షించాల్సిందేనన్నారు.

★ ఉగ్రవాదంతో ప్రపంచానికి ముప్పు అని యూఏఈ పేర్కొంది. శ్రీకాంత్ శిందే నేతృత్వంలోని అఖిలపక్ష బృందం.. యూఏఈ రక్షణ, అంతర్గత, విదేశీ వ్యవహారాల ఛైర్మన్ అలీ రషీద్ అల్ నుయామితో సమావేశమైంది. మానవత్వానికి ఉగ్రవాదం శత్రువు అని, ఈ విషయంలో తాము భారత్‌కు సహకరిస్తున్నామని నుయామి చెప్పారు.

మారిషస్‌కు చాగోస్ దీవులను అప్పగించిన బ్రిటన్

ఒప్పందాన్ని స్వాగతించిన భారత్

లండన్: హిందూ మహాసముద్రంలోని చాగోస్ దీవులపై బ్రిటన్ తన సార్వభౌమత్వాన్ని మారిషస్‌కు బదిలీ చేసే ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. ఈ మేరకు చారిత్రక ఒప్పందంపై తాను సంతకం చేసినట్లు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ గురువారం ప్రకటించారు. దీంతో సుమారు రెండు శతాబ్దాలుగా ఆ ద్వీపసమూహంపై తమ ఆధిపత్యాన్ని బ్రిటన్ వదులుకున్నట్లైంది. ఈ దీవుల్లో అతిపెద్దదైన డీగో గార్షియా.. నేవీ, బాంబర్ స్థావరాలతో వ్యూహాత్మక స్థానంలో ఉంది. తాజా ఒప్పందం ప్రకారం ఆ దీవి భద్రతకు బ్రిటన్ బాధ్యత వహించనుంది. దీంతోపాటు ఆ స్థావరాన్ని కనీసం 99 ఏళ్లకు లీజుకు తీసుకొని, మారిషస్‌కు ఏడాదికి 136 మిలియన్ డాలర్లు చెల్లించనుంది. అమెరికా దళాలు నిర్వహిస్తున్న ఈ రక్షణ స్థావరం భవిష్యత్తులో బ్రిటన్-అమెరికా భద్రత, నిఘా కార్యకలాపాల్లో కీలకం కానుందని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. చాగోస్ దీవులను బ్రిటన్ మారిషస్‌కు అప్పగించడాన్ని భారత్ స్వాగతించింది.



తేనీటి విందు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐరాస భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్

ఐరాసలో భారత్ తేనీటి విందు

ఐరాస: అంతర్జాతీయ తేనేటి దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ప్రపంచ దేశాలకు భారత్ తేనీటి విందు ఇచ్చింది. డార్జిలింగ్ టీ, మసాలా చాయ్, నీలగిరి, అస్సాం టీ లాంటి భారతీయ ప్రత్యేక టీ రకాలను ఆయా దేశాల ప్రతినిధులు రుచి చూశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైనా, శ్రీలంక, కెన్యా సహా తేయాకును పండించే ప్రధాన దేశాల ప్రతినిధులు, ఐరాస భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్, ఎఫ్ఏఓ యూఎన్ డైరెక్టర్ లిసాన్ పాల్గొన్నారు. "భారత్‌లో తేయాకు కేవలం రుచి, వాణిజ్యానికే పరిమితం కాలేదు. దేశ అభివృద్ధికి కారణమైంది. అస్సాం పొగమంచు కొండల నుంచి డార్జిలింగ్, నీలగిరి వరకు విస్తరించిన భారత తేయాకు పరిశ్రమ గ్రామీణ ఉపాధి, మహిళా సాధికారత, ఎగుమతి ఆధారిత అభివృద్ధికి మూలస్తంభంగా మారింది" అని పర్వతనేని హరీశ్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులు పంట ఉత్పత్తులపై ప్రభావం చూపుతున్నాయని, ఎగుమతి ఛార్జీలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మత గురువుల లైంగిక దాడులు... బాధితులకు పరిహారంగా 18 కోట్ల డాలర్లు

న్యూఆర్లీన్స్: కేథలిక్కు మతగురువుల చేతిలో లైంగిక దురాగతాలకు గురైన బాధితులకు దాదాపు 18 కోట్ల డాలర్లు పరిహారంగా చెల్లించేందుకు ఆర్చ్‌డయోసీస్ ఆఫ్ న్యూ ఆర్లీన్స్ అంగీకరించింది. కేథలిక్కు చర్చి వ్యవస్థ కుదుర్చుకున్న ఇలాంటి వరుస పరిహార చెల్లింపు ఒప్పందాల్లో ఇది తాజా పరిణామం. ఈ మొత్తాన్ని ఆర్చ్‌డయోసీస్‌తోపాటు, చర్చి సముదాయాలు తదితరులు సమకూరుస్తారని పరిహార చెల్లింపు ఒప్పందం కుదరడానికి కారణమైన ఒక కమిటీ తన ప్రకటనలో పేర్కొంది. అయితే లైంగిక దాడుల బాధితుల్లో అనేకులు ఈ పరిహారాన్ని అంగీకరించడం లేదని వారి న్యాయవాదులు చెబుతున్నారు. "బాధితుల్లో అత్యధికులు ఈ పరిహారాన్ని అంగీకరించబోరని తెలిసే ఈ ఒప్పందాన్ని రహస్యంగా కుదుర్చుకున్నారు" అని న్యాయవాదులు సోరెన్ గిస్లెసన్, జానీ డెనెనీలు ఒక వార్తా సంస్థకు తెలియజేశారు. ఈ పరిహార ఒప్పందం అవమానకరమని, ఇది బాధితుల మొహాలపై చాచి కొట్టినట్టుగా ఉందని ఆరోన్ హెబర్ట్ అన్నారు.

1960 దశకంలో 8వ తరగతి చదువుతున్న బాలునిగా ఒక మతగురువు చేతిలో లైంగిక అత్యాచారానికి గురయ్యానని హెబర్ట్ అంటున్నారు. బాధితులు పై కోర్టుకు వెళ్లకుండా నివారించేందుకే ఆర్చ్‌డయోసీస్ ఆఫ్ న్యూ ఆర్లీన్స్ ఆర్చిబిషప్ (గ్రెగరీ) ఏమండ్‌లు ఈ పరిహారం ఇవ్వజూపుతున్నారని ఆయన పేర్కొన్నారు. మత గురువుల చేతిలో లైంగిక దాడులకు గురయ్యామని ఆరోపిస్తూ 500 మందికి పైగా 2020లో కోర్టులో కేసు దాఖలు చేశారు. ఈ కేసు పరిష్కారంలో భాగంగా కుదిరిన పరిహార చెల్లింపు ఒప్పందం అమలు కావాలంటే బాధితుల అంగీకారం తప్పనిసరి.

'గోల్డెన్ డోమ్'లో చేరేందుకు చర్చిస్తున్నాం

• కెనడా ప్రధాని మార్క్ కార్నీ వెల్లడి

టొరంటో: అమెరికా నిర్మిస్తున్న 'గోల్డెన్ డోమ్' ప్రాజెక్టు నిర్మాణంలో భాగం అయ్యేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరుపుతున్నట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ వెల్లడించారు. భవిష్యత్తులో తమ గగనతలంలోకి ఏ క్షిపణీ ప్రవేశించకుండా, ఏ అణ్వాయుధమూ సమీపించకుండా 'గోల్డెన్ డోమ్' అనే అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థ నిర్మాణానికి అమెరికా శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. దీని నిర్మాణంలో భాగం కావడానికి కెనడా ఆసక్తి చూపుతోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే తెలిపారు. దీనిపై తాజాగా కెనడా ప్రధాని మార్క్ కార్నీ స్పందించారు. "అమెరికా రూపొందిస్తున్న గోల్డెన్ డోమ్‌లో భాగం అయ్యేందుకు చర్చలు జరుపుతున్నాం. భవిష్యత్తులో కెనడా లక్ష్యంగా అంతరిక్షం నుంచి వచ్చే క్షిపణుల ముప్పును ఇది సమర్థంగా ఎదుర్కొంటుంది. దీనిపై ట్రంప్‌తో ఉన్నతస్థాయిలో చర్చలు జరిపేందుకు చూస్తున్నాం. మేము స్వయంగా ఈ డోమ్‌ను నిర్మించుకోవాలా? లేక అమెరికాతో భాగం కావాలా అనే దానిపైనే ఆలోచన చేస్తున్నాం" అని కార్నీ తెలిపారు.

ఉపాధి కోల్పోయి 'పహల్గాం' ఉసూరు

• పర్యాటకులపై ఉగ్రదాడికి నెలరోజులు పూర్తి

పహల్గాం: దక్షిణ కశ్మీరులోని పహల్గాం పట్టణం ఏప్రిల్ 22న పర్యాటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి పర్యవసానాల నుంచి ఇంకా కోలుకోలేదు. 26 మంది అమాయకులను పొట్టనబెట్టుకొన్న నాటి మారణకాండ తర్వాత పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో పహల్గాంతోపాటు పరిసర గ్రామాల స్థానికులు జీవనోపాధిని కోల్పోయారు. ఈ నష్టాన్ని కొంత వరకు పూడ్చుకునేందుకు జులై 3 నుంచి మొదలుకానున్న అమరనాథ్ యాత్రపైనే ఇప్పుడు వీరి ఆశలన్నీ ఉన్నాయి. పటిష్ఠమైన భద్రత మధ్య కొనసాగే ఈ యాత్రకు భక్తులు తరలివస్తారనే వీరంతా విశ్వసిస్తున్నారు. పహల్గాంలోని బైసరన్ లోయలో సేదతీరుతున్న పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత ప్రభుత్వం చేపట్టిన ప్రతి చర్యల్లో పలువురు ఉగ్రవాదులు మరణించారు. అయితే, పర్యాటకులను ఊచకోత కోసిన ముష్కరులు మాత్రం ఇంకా భద్రతా దళాలను తప్పించుకునే తిరుగుతున్నారని అధికారులు గురువారం వెల్లడించారు. సుందరమైన



ఇక్కడి పచ్చికబయళ్లపై గుళ్లవర్షం కురిపించిన దుండగులు 25 మంది పర్యాటకులను, వారిని కాపాడేందుకు ప్రయత్నించిన ఓ పోనీవాలాను (గుర్రాల సహాయకుడు) కాల్చిచంపారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదుల సంఖ్య నాలుగు నుంచి ఆరు మధ్య ఉండవచ్చని తెలుస్తోంది. ఈ ఉగ్రవాదులను పట్టుకునేందుకు భద్రతా దళాలు అవిశ్రాంతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయని, వారిని త్వరలోనే పట్టుకుంటామని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. ఏప్రిల్ 22న జరిగిన దాడి తర్వాత కశ్మీర్ వ్యాప్తంగా వేలాదిమంది అనుమానితులను భద్రతా దళాలు ప్రశ్నించాయి. దాదాపు వందమందిపై ప్రజా భద్రతాచట్టం కింద కేసులు నమోదుచేసి వివిధ జైళ్లకు తరలించారు. గతంలో ఉగ్రవాదులతో సంబంధాలు కలిగి ఉన్న కొంతమంది యువత కూడా ఇందులో ఉన్నారు.

★ "నిత్యం వేలాది పర్యాటకులు వచ్చేవారు. దుకాణదారులు, రోడ్డు పక్కన ఉండే చిరు వ్యాపారులు, పోనీవాలాలు, క్యాబ్ డ్రైవర్లు, హోటల్ సిబ్బంది.. ఇలా పలువురికి ఉపాధి లభించేది. ఇపుడు మా ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. 1990ల ప్రారంభంలో తిరుగుబాటు ఉద్ధృతంగా ఉన్నపుడు కూడా పహల్గాం ఇలా లేదు. స్థానిక సందర్శకులూ రావడం లేదు" అని టూర్ ఆపరేటరు నాసిర్ అహ్మద్ తెలిపారు. గత నెల రోజులుగా పైసా సంపాదన లేదు, ప్రభుత్వమే ఏదో ఒకటి చేయాలని మొహమ్మద్ ఇర్షాద్ అనే దుకాణదారు ఆవేదన వ్యక్తం చేశారు. "జరిగింది చాలా దురదృష్టకరమైన సంఘటన. కానీ, కశ్మీర్ అంటే అది కాదు. మేము ఆతిథ్యం ఇచ్చేవాళ్లం, మా అతిథులంటే మాకు ఎంతో గౌరవం" అని పోనీవాలా సబ్జార్ అహ్మద్ అన్నారు.

వేసవి తాపంపై జాతీయ మార్గదర్శకాలు..

కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు

దిల్లీ: తీవ్ర వేసవి పరిస్థితులను తట్టుకోవడానికి అనుసరించాల్సిన జాతీయ మార్గదర్శకాలు, పాటించాల్సిన ముందస్తు జాగ్రత్తలు, తగు కార్యాచరణ అమలుకు సంబంధించి కేంద్రప్రభుత్వానికి గురువారం సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. గత ఏడాది వేసవి తాపం, వడగాలుల తీవ్రత వల్ల 700మందికి పైగా పౌరులు మరణించారని, దీనికి గాను సరైన చర్యలు సకాలంలో తీసుకొనేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం... కేంద్ర హోంశాఖ, పర్యావరణం, అడవుల మంత్రిత్వ శాఖకు, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థకు నోటీసు జారీ చేసింది. ఈ అంశంపై రెండు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

భారత దౌత్యాధికారిని బహిష్కరించిన పాక్

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని భారత హైకమిషన్‌లో పనిచేస్తున్న ఓ దౌత్యాధికారిని ఆ దేశం గురువారం బహిష్కరించింది. తన అధికారాలకు విరుద్ధమైన కార్యకలాపాలు చేస్తున్నారని ఆరోపిస్తూ ఈ చర్య తీసుకుంది. 24 గంటల్లోగా తమ దేశాన్ని వదిలి వెళ్లాలని ఆ అధికారికి ఆదేశాలు జారీ చేసింది. దిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పాక్ అధికారిని గూఢచర్యం అభియోగాలతో భారత్ బహిష్కరించిన మరుసటి రోజే పాక్ ఈ చర్యలు తీసుకోవడం గమనార్హం.

ఉత్తర కొరియా రెండో డిస్ట్రాయర్ నౌక జల ప్రవేశం విఫలం

అధికారులపై అధ్యక్షుడు కిమ్ ఆగ్రహం

సియోల్: ఉత్తరకొరియా రూపొందించిన 5 వేల టన్నుల సామర్థ్యమున్న డిస్ట్రాయర్ నౌక ప్రారంభోత్సవ సమయంలో దెబ్బతింది. బుధవారం ఆ నౌక జల ప్రవేశ కార్యక్రమానికి దేశాధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ చోంగ్జిన్ ఓడరేవుకు వెళ్లారు. యుద్ధ నౌకను ప్రారంభిస్తున్న సమయంలో వెనుక భాగంలోని రవాణా క్రాడిల్ జారిపోయి ఇరుక్కుపోవటంతో అడుగు భాగం కదలక నౌక దెబ్బతింది. దీంతో అధికారులు, శాస్త్రవేత్తలు, షిప్‌యార్డ్ నిర్వాహకులపై కిమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్లే ఈ వైఫల్యం చోటుచేసుకుందంటూ వారి పై విరుచుకుపడ్డారు. జూన్‌లో జరిగే పార్టీ కీలక సమావేశానికన్నా ముందే దీన్ని ఆధునీకీకరించాలని అధికారులను ఆదేశించారు. అణు సామర్థ్య, క్రూయిజ్ క్షిపణులతో సహా వివిధ ఆయుధ వ్యవస్థలను నిర్వహించడానికి దీన్ని రూపొందించారు.

కాలుష్య ఉద్గార నియంత్రణ లక్ష్యాల సాధన దిశగా భారత్

సీఈఈడబ్ల్యూ, ఏఈఈఈ విశ్లేషణలో వెల్లడి

దిల్లీ: కాలుష్య ఉద్గారాల తీవ్రతను 2005 నాటి స్థాయితో పోలిస్తే 2030 నాటికి 45 శాతం మేర తగ్గించాలన్న తన లక్ష్య సాధన దిశగానే భారత్ ముందుకు సాగుతోందని ఒక విశ్లేషణలో వెల్లడైంది. ప్రస్తుత ఒరవడి ఇలాగే కొనసాగితే విద్యుత్ రంగం వెలువరిస్తున్న ఉద్గారాలు 2030 నాటికి 48 శాతం నుంచి 57 శాతం మేరకు తగ్గే అవకాశం ఉందని కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ (సీఈఈడబ్ల్యూ), అలయెన్స్ ఫర్ యన్ ఎనర్జీ ఎఫిషియెంట్ ఎకానమీ(ఏఈఈఈ) సంస్థలు జరిపిన ఉద్గార విశ్లేషణల్లో తేలింది. అయితే 2070 నాటికి ఉద్గారాలను పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యాన్ని సాధించాలంటే విధానపరమైన చర్యలు అవసరమని ఈ సంస్థలు పేర్కొన్నాయి. కాలుష్య కారకులు మరింత ఎక్కువ మూల్యం చెల్లించాల్సి రావడం, విద్యుత్ ధరల్లో సంస్కరణలు, కాలుష్య రహిత సాంకేతిక పరిజ్ఞానానికి ఆర్థిక సాయం, విద్యుత్ సామర్థ్య పెంపుదల వంటి విధానపరమైన చర్యలు తీసుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుందని ఆ సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. అంతర్జాతీయ జర్నల్ "ఎనర్జీ అండ్ క్లైమేట్ ఛేంజ్" తాజా సంచిక ఈ విశ్లేషణల సారాంశాన్ని ఈ వారం ప్రచురించింది. తన కాలుష్య ఉద్గారాలను 2030 నాటికల్లా 45 శాతం మేర తగ్గిస్తానని భారత్ 2022 ఆగస్టులో యూఎన్ఎఫ్‌సీసీసీకి హామీ ఇచ్చింది. భారత్ ఈ లక్ష్యాన్ని సాధించే దిశగానే ముందుకు కదులుతోందని తాజా విశ్లేషణలు వెల్లడించాయి.

మాజీ గవర్నర్ సత్యపాల్‌పై సీబీఐ ఛార్జిషీట్



దిల్లీ: కీరూ జలవిద్యుత్ ప్రాజెక్టులో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. మాలిక్, అతని ఇద్దరు సహాయకులు వీరేందర్ రాణా, కన్వార్ సింగ్ రాణా సహా ఎనిమిది మందిని నిందితులుగా పేర్కొంటూ ప్రత్యేక కోర్టుకు సీబీఐ సాక్ష్యాలను సమర్పించింది. 2019లో జమ్మూకశ్మీర్‌లోని కీరూ జలవిద్యుత్ శక్తి (హెచ్ఈపీ) ప్రాజెక్టు సివిల్ పనుల కోసం రూ. 2,200 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ ప్రాజెక్టును ఓ ప్రైవేటు కంపెనీకి అప్పగించిన తీరులో అవకతవకలు జరిగాయని సీబీఐ ఆరోపిస్తోంది. ఈ అవినీతిలో అప్పటి జమ్మూకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కు సైతం భాగం ఉందని 2022లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పేర్కొంది. చీనాబ్ వ్యాలీ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సీవీపీపీపీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.ఎస్.బాబు, డైరెక్టర్ అరుణ్ కుమార్ మిశ్ర, ఎం.కె.మిత్తల్, పటేల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రూపెన్ పటేల్ సహా కన్వల్‌జీత్ సింగ్ అనే ప్రైవేటు వ్యక్తిపై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. మరోవైపు అనారోగ్యం కారణంగా మాలిక్ ఆసుపత్రిలో చేరారు.

రహదారులపై ఆక్రమణలను అడ్డుకోండి

• నిఘా బృందాలతో గస్తీ నిర్వహించండి
• ఎన్‌హెచ్ఏఐకి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: అనధికార ఆక్రమణల నుంచి రహదారులను పరిరక్షించడానికి గట్టి చర్యలు తీసుకోవాలని భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. పోలీస్ అధికారులతో కూడిన నిఘా బృందాలు తరచూ గస్తీ నిర్వహించేలా చూడాలంటూ జస్టిస్ అభయ్ ఎస్.ఓక్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం పలు మార్గదర్శకాలు జారీ చేసింది. జాతీయ రహదారులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచడంతో పాటు వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ఎన్‌హెచ్ఏఐ తీసుకొచ్చిన 'రాజ్‌మార్గ్‌యాత్ర' యాప్ గురించి పత్రికలు, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని తెలిపింది. రహదారుల ఆక్రమణలు, ఇతర సమస్యల గురించి రాజ్‌మార్గ్‌యాత్ర యాప్ ద్వారా వినియోగదారుల నుంచి ఇప్పటి వరకూ వచ్చిన ఫిర్యాదులు, వాటిలో ఎన్ని పరిష్కరించారో తెలుపుతూ మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని రహదారుల శాఖ సంయుక్త కార్యదర్శికి సూచించింది. జాతీయ రహదారుల తనిఖీకి ఏర్పాటు చేసే బృందాలకు సంబంధించి సమగ్ర ప్రామాణిక నిర్వహణ విధానాన్ని జారీ చేయాలని కూడా ఆదేశించింది.

మీకు తెలుసా?



అనసూయ సారాభాయి... ఓ ట్రేడ్ యూనియన్‌కి నాయకత్వం వహించిన మొదటి మహిళ. ఈవిడ అహ్మదాబాద్ టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్‌ని ప్రారంభించారు. వస్త్ర కార్మిక ఉద్యమంలో అనసూయ చేసిన కృషి.. ఆ తరవాత 'స్వయం ఉపాధి మహిళా సంఘం' ఏర్పాటుకు కారణమైంది.

వసుంధర

vasundhara@eenadu.in



నందిని

బంగారు నగలూ... బేసన్ లడ్డూ!

మిస్ వరల్డ్ పోటీలు కీలక దశకు చేరుకున్నాయి. అందరిలోనూ కిరీటాన్ని ఎవరు దక్కించుకుంటారన్న ఆసక్తే! తాజాగా నిర్వాహక సంస్థ నాలుగు ఖండాల నుంచి 24 మందిని టాలెంట్ ఛాలెంజ్ పోటీలకు ఎంపిక చేసింది. అందులో మనమ్మాయి నందినీ గుప్తా కూడా ఉన్నారు. 'వసుంధర' ఆమెను పలకరించగా... తన ఆసక్తులు, ఇష్టాయిష్టాల గురించి ఇలా సరదాగా ముచ్చటించారు. ఆ కబుర్లేంటో చదివేయండి.

● **మీ గురించి చెప్పమంటే...**

రైతు బిడ్డని. రాజస్థాన్‌లోని కోటా నుంచి.. అతిపెద్ద కలలను మోసుకుంటూ వచ్చిన అమ్మాయిగా నా గురించి చెప్పుకొంటా. కాస్త మొండి అమ్మాయిని కూడా. చేయాలనిపిస్తే కచ్చితంగా చేసి చూస్తా. చిన్నప్పుడు మోడలింగ్ చేయాలనుంది, అందాల కిరీటం దక్కించుకుంటా అని చెబితే నవ్వేవారు. 'కోటా అమ్మాయివి. ముంబయిలో ఎలా నెగ్గుకొస్తావ్' అనడిగేవారు. నేనవేమీ పట్టించుకోలేదు. అక్కడ నెగ్గాలంటే ఏం చేయాలనే ఆలోచించా. నిజం చెప్పొద్దూ... ఇంగ్లిష్‌లో కాస్త వెనకే. నేర్చుకోవడానికి కష్టపడ్డా. మాట్లాడాలంటే భయం. అప్పుడు నాకు నేను ఒకే మాట చెప్పుకొన్నా 'నువ్వు భయపడుతున్నావంటే అది నీకు మేలు చేసేదే' అని. పట్టుదలగా నేర్చుకున్నా. ఇదేకాదు, ఇతర భాషలపైనా దృష్టిపెట్టా.

● **మీ ఆత్మవిశ్వాసం వెనక...**

కచ్చితంగా కుటుంబమే. ముఖ్యంగా నాన్న.. .. తను ట్రాక్టర్ నడపడం నేనెప్పుడూ చూడలేదు. కానీ తన కూతుళ్లు నడపాలనుకున్నారు. ఎప్పుడూ 'అమ్మాయివైతేనేం నువ్వు నాకు పదిమంది అబ్బాయిలకు పెట్టు' అని చెప్పేవారు. అందుకే నేను తక్కువ అన్న భావన నాకెప్పుడూ కలగలేదు.

● **మిస్ ఇండియా అయ్యాక...**

ఈ కిరీటం దక్కించుకోవడం గర్వంగానే ఉన్నా... దాన్ని తలకెక్కించుకోలేదు. ఎప్పుడూ 'పక్కింటి అమ్మాయి'లా ఉండటానికే ఇష్టపడతా. మిస్ ఇండియా అయ్యాక మా బంధువులు, స్నేహితులు నాలో చాలా మార్పు వస్తుందనుకున్నారట. అందుకే మాట్లాడటానికీ సంశయించేవారట. తీరా మాట్లాడాక నేను గతంలోలాగే ఉండటం చూసి చాలా ఆనందించారు.

● **ఫ్యాషన్‌కి కేరాఫ్ కదా. మరి ఇంట్లో!**

షూట్‌లు, బయటికొచ్చినప్పుడే ఫ్యాషన్ గురించిన ఆలోచనలు. ఇంట్లో ఉంటే సాధారణ అమ్మాయినే. సల్వార్ కమీజ్, వదులుగా ఉండే దుస్తులు వేసుకోవడానికి ఇష్టపడతా. అమ్మానాన్నలతో కలిసి భోంచేస్తా. స్నేహితులతో కబుర్లు చెబుతా. బంధువులొస్తే వాళ్ల యోగక్షేమాలు కనుక్కుని వారితో ఆప్యాయంగా మాట్లాడతా.

● **మీ డైట్ రహస్యం?**

అన్నిసార్లూ డైట్ అంటూ కూర్చోను. కడుపు నిండా భోజనం చేయడానికే ఇష్టపడతా. మొన్న మాకోసం మామిడి పండ్లతో మిఠాయి చేస్తే ఆనందంగా తినేశా. కాకపోతే ఆహార వేళల్ని మాత్రం తప్పక పాటిస్తా. ఉదయం 8.30గం. అల్పాహారం, మధ్యాహ్నం 2లోపు లంచ్, రాత్రి 8.30 గం.లోపు భోజనం పూర్తిచేస్తా. ఇక్కడికొచ్చాక హైదరాబాద్ వంటకాలపై మనసు పారేసుకుంటున్నా. మా అమ్మ చేసే బేసన్ లడ్డూనీ ఇష్టంగా తింటా.

● **సినిమాలు చూస్తారా?**

రాజస్థాన్‌లో ఉన్నప్పుడు తక్కువే. ముంబయికి వెళ్లాక మాత్రం స్నేహితులతో కలిసి చూసేదాన్ని. వాటిలో తెలుగు సినిమాలూ ఉన్నాయి. అవి చూశాక తెలుగు చిత్రాలపై ఇష్టం పెరిగింది. ఇక్కడి హీరోల్లో మహేష్ బాబు నచ్చుతారు. అన్నట్టూ తెలుగు భాషనీ నేర్చుకుంటున్నా.


● **భవిష్యత్ ప్రణాళికలు...**

మిస్ ఇండియాగా గుర్తింపు పొందాక బాలీవుడ్ అవకాశాలు వస్తున్నాయి. పరిశీలిస్తున్నా, ఇంకా నిర్ణయం తీసుకోలేదు. బీబీఎం పూర్తి చేశా. అమ్మాయిని కదా! బంగారు, వజ్రాల నగలంటే ఇష్టం ఉండకుండా ఉంటుందా? పైగా నాకు వజ్రాల నగల డిజైనింగ్ అంటే ఇష్టం. భవిష్యత్తులో నగల దుకాణం ప్రారంభించాలన్న ఆలోచనా ఉంది. ఏక్తా ఫౌండేషన్ తోపాటు గ్రామీణ ప్రాంతాల్లో బాలికా విద్యను ప్రోత్సహించే సంస్థలకు అండగా ఉండాలనుకుంటున్నా.

● **మీరిచ్చే సలహా...**

అమ్మాయిలకు చదివే హక్కు ఇస్తే సరిపోదు. తనేదైనా చేయాలనుకుందా... చేయనివ్వండి. తన కలలను సాధించనివ్వండి. ఒకప్పుడు మా ప్రాంత అమ్మాయిలెవ్వరూ కిరీటం గురించి కలలు కనలేదు. నా అడుగు ఎంతో మందిలో మార్పు తెచ్చింది. ఈ రంగమనే కాదు... అమ్మాయి ఏ రంగంలో రాణించాలనుకున్నా ధైర్యంగా ముందడుగు వేయాలి. నేను కోరుకునే మార్పు అది.

– బొర్రెల్లి సునీల్ కుమార్, హైదరాబాద్



అగతే

రెక్కలు తొడుక్కున్న కలలతో... హాయిగా సాగిపోతోన్న ఆమె జీవితాన్ని క్యాన్సర్ శాసించాలనుకుంది. మనోనిబ్బరాన్ని కోల్పోతే అదే జరుగునేమో! కానీ, దానికి తను తలొగ్గలేదు. శారీరక బాధల్నీ, మానసిక ఉద్వేగాల్నీ పంటి బిగువునే భరిస్తూ దాన్ని జయించింది. తిరిగి జీవితంలో నిలదొక్కుకోవడమే కాదు... మోడలింగ్‌లోకీ అడుగుపెట్టింది. ఆమే ప్రపంచ సుందరి పోటీల్లో ఫ్రాన్స్‌కి ప్రాతినిధ్యం వహిస్తోన్న అగతే కౌట్. ఆ స్ఫూర్తి ప్రయాణాన్ని 'వసుంధర'తో పంచుకుందిలా...

ఆశావాదానికి చిరునామా... అగతే!

ప్రపంచ సుందరి పోటీలకు శారీరక సౌందర్యం మాత్రమే కొలమానం కాదు. శస్త్ర చికిత్సవల్ల నా శరీరంపై ఏర్పడిన 7 సెం.మీల మచ్చే అందుకు సాక్ష్యం. నేను క్యాన్సర్ సర్వైవర్‌ని. మార్చలేని గతం గురించి బాధపడటం నాకిష్టం ఉండదు. కేవలం నా చేతిలో ఉన్న భవిష్యత్తుకోసమే ఆలోచిస్తా... శ్రమిస్తా! అందులో భాగంగానే క్యాన్సర్ బాధిత చిన్నారుల సంక్షేమం కోసం పనిచేస్తున్నా.

అప్పటికి నాకు 17 ఏళ్లు.... అందరి అమ్మాయిల్లానే నేనూ అందంగా కనిపించాలని కోరుకునేదాన్ని. నాపై నేను ఎక్కువగా శ్రద్ధ చూపించేదాన్ని. అయితే, క్రమంగా పొట్ట పెరుగుతుండటం గమనించా. ఎక్కువగా తినడం వల్లే ఇలా అవుతుందనుకున్నా. అది కనిపించకుండా కోట్ ధరించడం, బెల్ట్‌ను టైట్‌గా పెట్టడం వంటివి చేశాను. అయినా ఎలాంటి మార్పూ కనిపించలేదు. దాంతో అమ్మానాన్నలకు విషయం చెప్పా. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. వైద్యులు కుడివైపు అండాశయంలో 9కిలోల క్యాన్సర్ కణతి ఉందని తేల్చారు. ఆ విషయం తెలిసిన క్షణం ప్రపంచమే తలకిందులైపోయినట్లు అనిపించింది. కళ్లు చీకట్లు కమ్మాయి.

అందుకు భయపడ్డా...

అందరిలా నేను కూడా మొదట క్యాన్సర్ వల్ల నా ప్రాణం పోతుందని భయపడ్డా. తర్వాత చికిత్స, కీమోథెరపీ గురించి ఆందోళన. ఇలా ఎన్ని రాత్రులు నిద్రలేకుండా ఏడ్చానో! మేజర్ సర్జరీతో ట్యూమర్‌ను తొలగించారు. కుడివైపు ఓవరీ తీసేశారు. కీమో థెరపీలూ సాగాయి. చివరికి ఆ ప్రదేశంలో ఏడు సెంటీమీటర్ల మచ్చ మాత్రం మిగిలింది. శారీరకంగా, మానసికంగా ఎంత నరక వేదన అనుభవించానో..! ఆ సమయంలో నా తల్లిదండ్రులు అండగా నిలిచారు. ఏ వ్యాధినైనా మనోధైర్యమే నయం చేస్తుందని నేనూ నెమ్మదిగా అర్థం చేసుకున్నా. పూర్తిగా కోలుకున్న తర్వాత తిరిగి జీవితాన్ని కొత్తగా ఆరంభించా. అలా 2021లో న్యూరాలజీ స్పెషలైజేషన్‌తో నర్స్ డిగ్రీ చేశాను. నాకు ఎంతో ఇష్టమైన నర్స్‌గా పని చేస్తూనే క్యాన్సర్‌పై అవగాహన కల్పించేదాన్ని.

కెరియర్‌లో నిలబడి..

జీవితంలో ఇంకా ఏదో సాధించాలనే తపన. నన్ను నేను నిరూపించుకోవాలనే బలమైన కోరిక అందాల పోటీల వైపు నడిపించాయి. ఆపై మోడలింగ్ రంగంలోకీ అడుగుపెట్టా. తక్కువ సమయంలోనే గుర్తింపు తెచ్చుకున్నా. మొదటిసారిగా ఫ్రాన్స్‌లో జరిగిన మిస్ అమోండినాయిస్ పోటీలో పాల్గొని విజేతగా నిలిచా. తర్వాత మరొకటి... ఇలా వరస విజయాలు... చివరకు 2023లో మిస్ వరల్డ్ ఫ్రాన్స్ కిరీటాన్ని దక్కించుకునేలా చేశాయి. 72వ ప్రపంచసుందరి పోటీల్లో మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీపడే శక్తిని ఇచ్చాయి. ఈ పోటీలకోసం ప్రత్యేకంగా పబ్లిక్ స్పీకింగ్, ఇంగ్లిష్‌లో నైపుణ్యం పెంచుకోవడంతోపాటు స్పోర్ట్స్‌కూ ప్రాధాన్యం ఇచ్చా. అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నవారి పరిస్థితి ఎలా ఉంటుందో నాకు బాగా తెలుసు... అందుకే, బాధిత చిన్నారులకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. యువ రోగుల్లో మానసిక స్థైర్యం నింపుతున్నా. ఆశావాదానికి గుర్తుగా నిలబడాలనుకుంటున్నా.

– బీఎన్ జ్యోతిప్రసాద్, హైదరాబాద్

పుస్తకం చూస్తే విరక్తి వస్తోంది!

ఒకప్పుడు నాకు చదువే లోకం. పుస్తకం అంటే ప్రాణం. తరగతి పాఠాలనూ చాలా ఇష్టంగా, ఆసక్తిగా చదువుకునేదాన్ని. అలాంటిది ఇప్పుడు చదువంటేనే అయిష్టత. ఎనిమిదో తరగతిలో అడుగు పెట్టినప్పట్నుంచీ పదో తరగతి వస్తోందంటూ భయపెట్టారు. వందలో ఒక్క మార్కు పోయినా కోప్పడటమే. ఇప్పుడు ఇంటర్‌కి వచ్చా. మెడిసిన్‌కి గంటలకొద్దీ చదవాలట. పుస్తకం వదలనీయట్లేదు. ఇప్పుడు వాటిని చూస్తేనే విరక్తి వస్తోంది.

– ఓ సోదరి

చదువు మీద ఆసక్తి ఉండటం అవసరమే. అయితే దాని పేరిట భయపెడితే ఆసక్తి ఎలా నశిస్తుందో చెప్పడానికి నువ్వే ఉదాహరణ. బాగా చదవాలి, ర్యాంకులు తెచ్చుకోవాలనే తపనతో తల్లిదండ్రులు, కొన్ని సందర్భాల్లో టీచర్లు పిల్లలపై ఎక్కువ ఒత్తిడి పెడుతుంటారు. అదేమో వారిపై ప్రతికూల ప్రభావం పడేలా చేస్తుంది. చదవాలనే తపన, ఆసక్తి పోయి... పుస్తకాలంటేనే విరక్తి కలుగుతుంది. నువ్వు పడుతున్న బాధ నాకు అర్థం అవుతోంది. ముందు మెడిసిన్ చదవాలన్న ఆలోచన నీదేనా లేదా తల్లిదండ్రుల కోరిక నెరవేర్చడానికి లక్ష్యంగా పెట్టుకున్నావా అన్నది విశ్లేషించుకో. ఒకవేళ నీ లక్ష్యమే అయితే ఎంత కష్టమైనా ఇష్టంగా సాధించడానికి ప్రయత్నిస్తావు. అలాకాకపోతే ప్రతిదీ ఆటంకంగానే అనిపిస్తుంది. కాబట్టి, ముందు ఆ స్పష్టత తెచ్చుకో. చదువంటే భయంతో కాకుండా పట్టుదల, ఇష్టంతో చదువు. ఎన్ని గంటలు చదువుతున్నావు అన్నది ముఖ్యం కాదు. ఎంతసేపు ఏకాగ్రతతో చదువుతున్నావన్నదే ముఖ్యం. అలాగే చదివే విధానం, మెమరీ టెక్నిక్‌లపైనా దృష్టి పెట్టు. క్లుప్తంగా నోట్స్ సిద్ధం చేసుకో. సొంత టైమ్ టేబుల్ తయారు చేసుకుని... దాన్ని అనుసరించు. మధ్యలో విరామాలు తీసుకుంటూ ఆ సమయంలో నచ్చినవి చెయ్యి. ఎక్కువ ఒత్తిడి అనిపిస్తే బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు ప్రయత్నించు. ఇవన్నీ నీ ఒత్తిడి తగ్గించి, విశ్రాంతి పొందేలా చేస్తాయి.

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

అసూయతో అలా చెబుతోందా?

డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్నా. సోషల్ మీడియాలో ఫ్రెండ్ రిక్వెస్ట్ వస్తే ఓకే చేశా. ప్రొఫైల్ చూసి అమ్మాయనుకున్నా. తీరా చూస్తే అబ్బాయి. సరదాగా మట్లాడా. కానీ అతడు ప్రేమిస్తున్నా అంటున్నాడు. ఏం చేయాలో తోచక ఫ్రెండ్‌కి చెబితే 'ఆన్‌లైన్‌లో ప్రేమలేంటి? ఎవరో నిన్ను ట్రాప్ చేశారు. ముందు అతణ్ని బ్లాక్ చెయ్' అంటోంది. తను అసూయతో అలా చెబుతోందా? నిజంగానే అనుమానించాలా?

– ఓ సోదరి

డిగ్రీ చదువుతున్న అమ్మాయివి. కొంతైనా లోకజ్ఞానం ఉండాలి కదా? తరగతి పుస్తకాలే కాదు ఇతర విషయాలనూ తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ముఖ్యంగా ఈ వయసులో చుట్టూ జరుగుతున్న విషయాలమీద అవగాహన ఏర్పరచుకోవడం ముఖ్యం. లేదంటే అమాయకంగా మోసపోయి సమస్యలు కొని తెచ్చుకునే ఆస్కారం ఉంది. తెలియక ఫ్రెండ్ రిక్వెస్టు ఓకే చేశావు. తెలిసిన తరవాత అది మోసమని గ్రహించి బ్లాక్ చేయాలి కదా? నిజాన్ని దాచి అమ్మాయిగా ప్రొఫైల్ పెట్టుకుని స్నేహం చేయాలనుకున్నాడంటేనే అవతలి వారి మనస్తత్వం అర్థమవుతోంది కదా? నీ స్నేహితురాలు చెప్పిన దానిలో అక్షరాలా నిజముంది. అందులో అసూయ పడటానికేం ఉంది? పైగా సరైన సలహా ఇచ్చింది. కాబట్టి, ఇప్పటికైనా ఆ వ్యక్తిని దూరంగా ఉంచు. మున్ముందూ ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండు.

బంగారం - వెండి



22న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	98,510	90,150	1,00,100
విజయవాడ	96,580	89,750	1,01,700
ప్రొద్దుటూరు	96,600	88,870	1,00,000
రాజమహేంద్రవరం	98,700	89,820	1.00,000
విశాఖపట్నం	97,550	89,750	1,02,000
తమిళనాడు	-----	89,750	1,12,000

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.

బిర్యానీ ఆకు టీ... లాభాలు మేటి!



వంటకాలలో రుచి, వాసనలకు మాత్రమే బిర్యానీ ఆకుని ఉపయోగిస్తామనుకుంటాం... అయితే ఆరోగ్య ప్రయోజనాలు పొందడానికీ వేర్వేరు రూపాల్లో ఈ ఆకుని తీసుకుంటారని మీకు తెలుసా? ఓసారి బిర్యానీ ఆకుతో టీని ప్రయత్నించి చూడండి...

● బిర్యానీ ఆకులో ఎ, సి, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, ఐరన్, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం లాంటి పోషకాలున్నాయి. అందువల్ల ఇది జీర్ణశక్తికి ఎంతో మేలు. బిర్యానీ ఆకు టీతో గుండె సమస్యలు తగ్గుతాయి. మధుమేహం నియంత్రణలో ఉంటుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ ఉన్న వాళ్లకూ ఈ టీ మేలు చేస్తుంది.

● క్రమం తప్పకుండా బిర్యానీ ఆకు టీని తీసుకుంటే క్యాన్సర్ కణాల పెరుగుదలను తగ్గిస్తుంది. ముఖ్యంగా నిద్రలేమి సమస్యకు ఉపశమనం ఇస్తుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గురక సమస్యలు పోతాయి. మహిళలకు నెలసరి నొప్పులు తగ్గుతాయి. జలుబు, దగ్గు ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి.

● జుట్టు రాలడం, చుండ్రు సమస్యలతో బాధపడుతుంటే... బిర్యానీ ఆకులను మరిగించి...ఆ గోరువెచ్చని నీటితో తలకు మర్దన చేయాలి. ఆపై షాంపూతో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే మాడు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ఇన్ఫెక్షన్లు దూరమై జుట్టు మృదువుగా, ఒత్తుగా పెరుగుతుంది.

● ఇన్ని ప్రయోజనాలున్న బిర్యానీ ఆకు టీ ఎలా చేయాలంటే... ఆకులను శుభ్రంగా కడిగి నీటిలో బాగా మరిగించి, వడగట్టి, కాస్త నిమ్మరసం, తేనె కలపాలి. అయితే ఇది తాగాక అరగంట వరకూ ఎలాంటి ఆహారం తీసుకోకపోవడం మేలు.

"

భారత్‌లో మహిళా ఆంత్రప్రెన్యూర్లు పెరగాలంటే...

1. మహిళలు ఇంటి పట్టునే ఉండాలి, కొన్ని అనుకూల వృత్తుల్లోనే ప్రవేశించాలనుకోవడం
2. అమ్మాయిలు కెరియర్‌లో రిస్కులు తీసుకోకూడదు, భద్రమైన వాతావరణంలో ఉండాలనుకోవడం
3. మహిళల పేర సంపద, ఆస్తి ఉన్నప్పటికీ వాటి బాధ్యతల్ని తండ్రి/భర్త/అన్న/కొడుకు చూసుకోవడం...



ఈ ఆలోచనల్లో మార్పు రావాలి.

– పద్మజ రూపారెల్, సహ-వ్యవస్థాపకురాలు, ఇండియన్ ఏంజెల్ నెట్‌వర్క్

ఒంటరితనమే మేలు... జెన్‌జీ అమ్మాయిలు!



ఒక వయసొచ్చాక తోడు అవసరం... అందుకే ఇప్పటికీ కష్టమనిపించినా నచ్చజెప్పి అయినా పిల్లల్ని ఓ ఇంటి వాళ్లని చేయాలి అనుకుంటారు పాతతరం. వయసు అయిపోతుందనో, ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడనో, పెళ్లి అనివార్యమనో పరిస్థితులకు తలొగ్గి పెళ్లిళ్లు చేసుకునేవారూ ఎక్కువే. కానీ జెన్‌జీలు వీటన్నింటికీ ససేమిరా అంటున్నారు. జీవితాంతం కలిసి నడిచే తోడూ ప్రేమా ఏదైనా ఒత్తిడితో రాకూడదని కరాఖండిగా చెబుతున్నారు. అలా వచ్చే ఏదీ శాశ్వతం కాదంటున్నారు. దీని బదులు ఒంటరిగా ఉండిపోవడమే మేలంటున్నారు.

మేము ట్రెండ్ ఫాలో అవ్వం. సెట్ చేస్తాం అంటూ ఇప్పటికే చాలా విషయాల్లో ముందున్నారు జెన్‌జీలు. ప్రతి విషయంలోనూ కూలంకషంగా ఆలోచిస్తూ, తమకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. వీళ్ల ఆలోచనలే బెస్ట్ అనేంతలా ఎదిగారు. ఇవన్నీ ఆచరణలోనూ పెట్టి చూపిస్తున్నారు. ప్రేమా పెళ్లీ విషయంలోనూ అదే ఫాలో అవుతున్నారు. వీళ్ల సోలో లైఫే సో బెటర్ అంటున్నట్లు ఇటీవల ఓ అధ్యయనమూ వెల్లడించింది. ఇందులో పాల్గొన్న వారిలో సగానికి పైగా అమ్మాయిల. వీళ్లంతా ఒత్తిడీ, బలవంతం, వయసు, పిల్లలు లాంటి సామాజిక కారణాలతో పెళ్లి చేసుకుని... జీవితాంతం బాధపడే బదులు, పెళ్లి చేసుకోకుండా ఉండటమే మేలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారట. మనసుకు నచ్చిన, తమకు సరిపోయే భాగస్వామి దొరికే వరకూ ఆలస్యమైనా వేచి చూస్తాం అంటున్నారట. పైగా, 'సిండ్రెల్లా రాకుమారుడి కోసం ఎదురు చూస్తూ కలలు కనడం పాత ట్రెండ్. మా కలల కోటను నిర్మించుకోవడానికి మాకు ఏ రాజూ అవసరం లేదు. మా స్వశక్తితో మేం నిర్మించుకోగలం' అంటూ సమాధానం చెబుతున్నారట.

పాత కానే కాదు... బెయిజ్!



నేటి ఫ్యాషన్

ఇదొక రంగా? బ్లీచింగ్‌కీ, డై చేయించడానికీ డబ్బుల్లేనివారు వేసుకుంటారు. 'పేదరికానికి గుర్తు' ఒకప్పుడు బెయిజ్ గురించి ఇలాగే మాట్లాడేవారట. మురికి వస్త్రం వర్ణాన్నే పోలి ఉంటుందీ రంగు. అందుకే వేసుకోవడానికీ ఇష్టపడేవారు కాదు. కానీ ఇప్పుడు... దీన్నే సంపదకీ, శ్రేయస్సుకీ ముఖ్యంగా స్టేటస్ సింబల్‌గా భావిస్తున్నారు. ఎంత తేడానో కదా! కాస్త గోధుమ రంగు... లేదు లేదూ ఇసుకను పోలి ఉంటుంది... అబ్బే బంగారు వర్ణంలా ఉంటుందండీ... ఒక్కొక్కరూ దీన్ని ఒక్కోలా వర్ణిస్తారు. నిజమే తెలుపు, పసుపు మధ్యలో చాలా షేడ్‌లలో ఉంటుందిది. అయితే స్వచ్ఛతకు గుర్తుగా మనసుకు ప్రశాంతతని ఇచ్చే రంగుగా తెలుపును చెబుతారు. కానీ... బెయిజ్ ఇచ్చే మెసేజ్ అంతకు మించి. అమ్మ ఒడి, ఆత్మీయుల ఆలింగనంలో ఉండే వెచ్చదనం దీని సొంతం అంటారు ఫ్యాషనిస్టులు. అందుకే దీనికి ఫ్యాషన్ ప్రపంచంలోనే కాదు, ఇంటీరియర్ రంగంలోనూ ఆదరణ ఎక్కువే. పైగా ఏ రంగులతోనైనా ఇట్టే మిళితమవుతుంది. ఏది వేసుకోవాలి, నాకు నప్పుతుందా అన్న ఒత్తిడి అస్సలే ఇవ్వదు. కోట్, షర్ట్, కుర్తీ, లెహెంగా, చీర... ఏ రూపంలో వేసుకున్నా ఇది ఇచ్చే వైబే వేరు. పైగా టైమ్‌లెస్ కలర్‌గా పేరు. అందుకే డిజైనర్లు ఎక్కువ ఎంచుకునేదీ బెయిజ్‌నే. గమనించారో లేదో ఈసారి నవ వధువుల దగ్గర్నుంచి హీరోయిన్ల వరకూ మనసు పారేసుకుంటున్నదీ ఈ రంగుపైనే. కాబట్టే, ఈ ఏడాది రంగు మోకా మూస్‌ను వెనక్కి నెట్టిమరీ బెయిజ్ ట్రెండ్ అవుతోంది. ముదురు రంగులేవైనా వచ్చి పోతుంటాయి. బెయిజ్ ఎప్పుడూ క్లాసిక్కే అన్న పొగడ్తలూ అందుకుంటోంది. మనసుకు విశ్రాంతి, సురక్షిత భావన కలిగించడం... పైగా ఎల్లప్పుడూ ఇచ్చే ట్రెండీ లుక్ దీని సొంతం. అందరూ మనసు పారేసుకుంటున్నదీ అందుకే. మరి మీ దగ్గరుందా బెయిజ్? ఏ డ్రెస్ రూపంలో?



డబ్బాకంటే... విందు మేలు!



శోధిత

చాలామంది పిల్లలు అన్నం తినడానికి మారాం చేస్తుంటారు. అందులోనూ తమకు నచ్చిందే తింటారు తప్ప, అన్ని రకాల ఆహార పదార్థాలు తినడానికి ఆసక్తి చూపించరు. దాంతో ఎక్కడ పోషకలేమి బారిన పడతారో అన్న ఆందోళన అమ్మల్లో మొదలవుతుంది. అయితే, దీనికి సంబంధించి యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్ ఓ అధ్యయనం చేసింది. పిల్లలకు లంచ్ బాక్స్‌లో ఆహారాన్ని సర్దిపంపడం కంటే స్కూల్ మీల్స్(పాఠశాల విందులు) ఏర్పాటు చేయడం మేలంటున్నారు శాస్త్రవేత్తలు. దీనికోసం వాళ్లు ప్రీ స్కూల్ పిల్లల ఆహార ఎంపికలను తెలిపే ప్రశ్నపత్రాల డేటాను పరిశీలించారు. పెరిగేకొద్దీ వాళ్ల ఆహారపు అలవాట్లు ఎలా మారుతున్నాయో తెలుసుకునేందుకు మళ్లీ వాళ్ల టీనేజ్ డేటాను సేకరించి, రెండింటినీ విశ్లేషించారు. ప్యాక్ చేసిన ఆహారాన్ని తినే పిల్లలకంటే, స్కూల్ మీల్స్ తినే అలవాటు ఉన్న పిల్లలు ఎక్కువ రకాల ఆహారాలు తీసుకుంటూ, ఆరోగ్యంగా ఉన్నారట. పండ్లు, కూరగాయ ముక్కలు, మాంసం, చేపలు వంటివి తినని పిల్లలు కూడా స్నేహితులతో కలిసి తినేటప్పుడు వాటిని ఇష్టంగా తింటున్నట్లు గమనించారట. కాబట్టి, ఒక్కరిగా లంచ్ బాక్స్ తినేకంటే ఇలా ఇతర పిల్లలతో కలిసి తినేలా ప్రోత్సహించాలంటున్నారు నిపుణులు. ఇదేకాదు, కుటుంబంతో కలిసి భోజనం చేయడం, వంటకాల తయారీలో భాగం చేయడం ద్వారా కూడా పిల్లల్లో మంచి ఆహారపు అలవాట్లు పెంపొందించొచ్చని చెబుతున్నారు పరిశోధకులు.

అటవీ భూములు ఆక్రమిస్తున్నారు..
కొత్త అడవులు సృష్టించాలి

- జిల్లాకో జీవవైవిధ్య పార్కు.. ప్రతి గ్రామంలో పల్లెవనం
- చెట్లు తొలగించడం కాదు.. నాటడం నేర్చుకోవాలి
- అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు డిజిటల్, అమరావతి: "రాష్ట్రంలో అటవీ భూములు ఆక్రమిస్తున్నారు. కొత్తగా అడవులు సృష్టించాలనే ఆలోచన ఉన్నవారు కరవయ్యారు. జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు మన ఇంటినుంచే మొదటి అడుగు వేయాలి. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రతి జిల్లాలో ఒక బయో డైవర్సిటీ పార్కు, ప్రతి గ్రామంలో ఒక పల్లెవనాన్ని ఏర్పాటు చేస్తాం" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. 'ఒక చెట్టు నరకాలనే ఆలోచన వస్తే ముందు పది చెట్లు నాటాలి. అప్పుడే జీవవైవిధ్యం దెబ్బతినకుండా ఉంటుంది. ప్రకృతి విధ్వంసాన్ని వీడకపోతే.. సమస్త మానవజాతి నష్టపోతుంది. జీవ వైవిధ్యాన్ని పెంచడం మనందరం బాధ్యతగా స్వీకరించాలి' అని సూచించారు.



'ఈటీవీ ఆంధ్రప్రదేశ్'లో అన్నదాత కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ జర్నలిజం, జీవ వైవిధ్యంలోని వివిధ సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి కృషిచేసిన రాచర్ల లక్ష్మీప్రసాద్‌కు బయోడైవర్సిటీ గ్రీన్ జర్నలిస్ట్ అవార్డును ప్రదానం చేస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ విజయ్‌కుమార్

అడవుల విధ్వంసంతో జీవ వైవిధ్యానికి దెబ్బ

'సీడ్ బాల్స్ తయారుచేసి విసిరితే వేలసంఖ్యలో మొక్కలు నాటే వీలు ఉంటుంది. తీరప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన మడ అడవులు సముద్రం దగ్గర ఉంటూ తుపానుల నుంచి మనల్ని రక్షిస్తాయి. ఇటీవల వాటినీ నాశనం చేసేస్తున్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో.. నాకున్న పొలంలోని ఎనిమిది ఎకరాల్లో సహజసిద్ధంగా మొక్కలు పెరిగేలా ఏర్పాటు చేశాను.

ప్రాణవాయువునిచ్చే చెట్లు పెంచాలి

ఒక్క పక్షి కూడా నివాసం ఉండని యూకలిప్టస్, కోనోకార్పస్ లాంటి మొక్కలు నాటుతున్నాం. అవి ప్రాణవాయువును అతి తక్కువ మోతాదులో అందిస్తాయి. రావిచెట్టు లాంటి ప్రాణవాయువునిచ్చే చెట్లను పెంచాలి. నర్సరీల యజమానులు కోనోకార్పస్ చెట్లను ఉంచాలని అడుగుతున్నారు. అది రాష్ట్రానికి తీవ్రనష్టం చేస్తుంది. కడియం నర్సరీలు కోనోకార్పస్ మొక్కల అమ్మకాలు నిలిపివేయడంపై ఆలోచించాలి' అని పవన్ కల్యాణ్ సూచించారు. కార్యక్రమంలో ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, బోర్డు కార్యదర్శి రామకృష్ణ, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము, ఏపీఎఫ్‌డీసీ ఎండీ ఆర్.పి.ఖజూరియా తదితరులు పాల్గొన్నారు.

ఎస్టేట్‌కు ఎలా వెళ్తారో చూస్తాం!

- సజ్జల కుటుంబ సభ్యుల బెదిరింపులు
- తాళం వేసుకుని రాకపోకలకు అంతరాయం


ఈనాడు, కడప: వైకాపా ప్రభుత్వంలో సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు బెదిరింపులకు దిగుతున్నారు. తమ ఎస్టేట్‌లోకి ఎలా అడుగు పెడతారో చూస్తామంటూ హెచ్చరికలు చేస్తున్నారు. సజ్జల ఎస్టేట్‌లో ఆక్రమిత భూముల వెంట రెవెన్యూ అధికారులు హద్దులు గుర్తించి జెండాలు నాటి తాజాగా హెచ్చరిక బోర్డులు పెట్టి వచ్చారు. అయితే అక్కడికి ఎవరినీ వెళ్లనీయకుండా బెదిరింపులకు పాల్పడుతుండటంతో ఇంతా చేసి ప్రయోజనమేమిటన్న ప్రశ్న వినిపిస్తోంది. వైఎస్సార్ జిల్లా సీకే దిన్నె మండలం సుగాలిబిడికి ప్రాంతంలో సజ్జల ఎస్టేట్ ఉంది. ఎస్టేట్‌కు ఉత్తరం, దక్షిణం అటవీ ప్రాంతం ఉండగా.. పడమర వైపున కొండలున్నాయి. ఈ మూడు వైపులకూ రాకపోకలకు దారి లేదు. తూర్పు దిక్కున భారీ కంచె నిర్మించి.. గేటును ఏర్పాటు చేసి తాళం వేశారు. ఆక్రమిత భూముల్ని స్వాధీనం చేసుకునే సమయంలోనూ బలవంతంగా తాళాలు తీయించి రెవెన్యూ అధికారులు లోపలికి ప్రవేశించారు. ఆ తర్వాత సజ్జల కుటుంబ సభ్యులు తాళాలు వేసి బెదిరింపులకు దిగారు. ఎస్టేట్‌లో పేదలకు ఇచ్చిన డీకేటీ భూములు ఉండగా వాటిని తమ భూముల్లో కలిపేసుకుని ఎవరినీ అక్కడికి వెళ్లనీయకుండా గేటుకు తాళాలేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న భూముల వద్దకు అవసరమైనప్పుడు పరిశీలనకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు రాగా శుక్రవారం ఎస్టేట్‌కు వెళ్లి గేటును తొలగించాలనే ప్రయత్నాల్లో రెవెన్యూశాఖ అధికారులున్నారు.



వైఎస్సార్ కడప జిల్లా సీకే దిన్నె మండలంలో సజ్జల ఎస్టేట్ ప్రాంతం (డ్రోన్ చిత్రం)



సజ్జల ఎస్టేట్ గేటుకు తాళం



మీపై మీ ప్రేమ.. ఉన్నత ప్రమాణాలు కోరుతుంది

మీపై మీకు ప్రేమ ఉండటం స్వార్థం కాదు. ఇతరుల కంటే ఉన్నత ప్రమాణాలను కలిగి ఉండాలని మీరు కోరుకోవడం స్వీయ ప్రేమే. ప్రస్తుతం మీరున్న స్థితి నుంచి మీరు కలలు కంటున్న వ్యక్తిగా ఎదగడానికి అది ఉత్ప్రేరకంలా పనిచేస్తుంది.

– అలెక్స్ హర్మోజీ, బిజినెస్ గ్రోత్ మెంటార్

బుగ్గమఠం భూములపై ట్రైబ్యునల్‌కు వెళ్లండి

- పెద్దిరెడ్డికి స్పష్టంచేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: బుగ్గమఠానికి చెందిన 3.88 ఎకరాల ఆక్రమిత భూమిని ఖాళీ చేయాలని, అందులో నిర్మాణాలను తొలగించాలంటూ మఠం ఈవో/అసిస్టెంట్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే ఎండోమెంట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హైకోర్టు స్పష్టం చేసింది. ఈవో జారీచేసిన ఉత్తర్వుల ఆధారంగా దేవాదాయశాఖ అధికారులు రెండు వారాలపాటు తొందరపాటు చర్యలేవీ తీసుకోబోరని అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పిన విషయాన్ని కోర్టు నమోదు చేసింది. న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

- తిరుపతి నగరంలోని ఎమ్మార్ పల్లి పరిధి సర్వే నంబరు 261/1లో 1.50 ఎకరాలు, 261/2లో 2.38 ఎకరాలు(మొత్తం 3.88) బుగ్గమఠానికి చెందిన భూములను వాటిని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, వాటిని పది రోజుల్లో ఖాళీ చేయాలని పేర్కొంటూ ఈనెల 16న మఠం ఈవో ఉత్తర్వులిచ్చారు. వీటిని సవాలు చేస్తూ పెద్దిరెడ్డి గురువారం హైకోర్టులో అత్యవసర వ్యాజ్యం వేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపించారు. ఆ భూములు 30 ఏళ్లుగా పిటిషనర్ స్వాధీనంలో ఉన్నాయన్నారు. ఆక్రమణకు పాల్పడలేదని తెలిపారు.
- దేవాదాయశాఖ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ 3.88 ఎకరాల టైటిల్ విషయంలో పెద్దిరెడ్డి వద్ద ఎలాంటి ఆధారాలూ లేవన్నారు. మఠం భూములను పిటిషనర్, ఆయన కుటుంబసభ్యులు ఆక్రమించినట్లు విచారణలో తేలిందని తెలిపారు. కేవలం 1.54 ఎకరాలకే పిటిషనర్‌కు యాజమాన్య హక్కులున్నాయన్నారు. ఈవో ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే ఎండోమెంట్ ట్రైబ్యునల్‌లో అప్పీల్ దాఖలు చేసుకోవాలి తప్ప నేరుగా హైకోర్టుకు రావడానికి వీల్లేదన్నారు.

విద్యుదాఘాతంతో 18 గేదెల మృతి

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం చింతకుంటలో గురువారం రాత్రి విద్యుదాఘాతంతో 18 గేదెలు మృతిచెందాయి. గ్రామంలోని ఐదుగురు రైతులకు చెందిన గేదెలు పొలాల్లో మేతకు వెళ్లాయి. అవి వెళ్లిన చోట అప్పటికే 11 కేవీ విద్యుత్తు తీగ తెగి పడి ఉండటంతో దాన్ని తాకి గేదెలు మృత్యువాత పడ్డాయి. వర్షాలు, ఈదురుగాలులకు తీగ తెగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

టిడ్కో లబ్ధిదారుల వడ్డీ చెల్లింపులకు రూ.102 కోట్లు

ఈనాడు, అమరావతి: టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల పేరు మీద గత ప్రభుత్వం రుణాన్ని తీసుకుని సకాలంలో గృహాలను పూర్తి చేసి ఇవ్వనందున అప్పుపై వడ్డీ భారం వారిపై పడకుండా ప్రభుత్వం భరించాలని నిర్ణయించింది. ఈ మేరకు వడ్డీ/ఈఎంఐల చెల్లింపునకు రూ.102 కోట్ల విడుదలకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి టిడ్కోకు రీయింబర్స్‌మెంట్ ప్రాతిపదికన అందించేందుకు సమ్మతి తెలిపింది. తిరిగి రూ.102 కోట్లను మూడు నెలల్లోపు ఆయా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

వైకాపా కార్యకర్తల వీరంగం

- దాచేపల్లిలో పోలీసు క్వార్టర్స్‌పై దాడి

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి పోలీసుస్టేషన్ ఆవరణలోని క్వార్టర్స్‌పై వైకాపా కార్యకర్తలు, నాయకులు గురువారం దాడి చేసి, కిటికీల అద్దాలు పగలగొట్టారు. తంగెడ గ్రామానికి చెందిన ఉప్పుతల హరికృష్ణను అక్రమంగా స్టేషన్‌కు తీసుకొచ్చారంటూ ఆందోళనకు దిగారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు తంగెడలో వైకాపా వారు పెట్రోలు బాంబులు వేసి, దుకాణాలకు నిప్పుపెట్టారు. ఆ ఘటనకు సంబంధించి వైకాపా కార్యకర్త హరికృష్ణపై తెదేపా వారు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తెదేపా నాయకులను హరికృష్ణ బెదిరిస్తూ... సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెడుతున్నారు. దీంతో పోలీసులు గురువారం తెల్లవారుజామున అతడిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి, ఆవరణలో నిరుపయోగంగా పోలీసు క్వార్టర్స్‌లో ఉంచారు. విషయం తెలుసుకున్న హరికృష్ణ బంధువులు, వైకాపా కార్యకర్తలు స్టేషన్ వద్దకు తరలివచ్చారు. హరికృష్ణను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని, విడిచిపెట్టకపోతే పురుగుమందు తాగుతామంటూ కొందరు డబ్బాలు చూపుతూ ఆందోళనకు దిగారు. తర్వాత క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లి, కిటికీల అద్దాలు పగులగొట్టారు. అడ్డొచ్చిన పోలీసులను నెట్టివేశారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. హరికృష్ణ భార్య మాట్లాడుతూ... పోలీసులు కొట్టడంతో తన భర్త కాలు విరిగిందని ఆరోపించారు. సాయంత్రం 4 గంటల సమయంలో నిందితుడిని గురజాల కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ వైకాపా కార్యకర్తను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు.



పోలీసు క్వార్టర్స్‌లోకి దూసుకెళ్తూ...

వేసవిలో విస్తారంగా వర్షాలు

- రాష్ట్రంలో 85 శాతం అధిక వర్షపాతం నమోదు
- అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్లే

ఈనాడు, విశాఖపట్నం: ఈ ఏడాది వేసవిలోనూ రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. వాతావరణ మార్పుల ప్రభావంతో 2024లో ప్రతి నెలలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 డిగ్రీలు ఎక్కువగానే నమోదయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ఉరుములతో కూడిన పిడుగులు పడి, వర్షపాతం ఎక్కువగా నమోదైంది. బంగాళాఖాతం, అరేబియా సముద్రం నుంచి వచ్చిన తేమకు ఇతర పరిస్థితులూ అనుకూలించాయి.

లోటు వర్షపాతం లేదు

- రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రెండు నెలలుగా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. మార్చి 1 నుంచి మే 21 వరకు సగటున 85% ఎక్కువ వర్షం కురిసింది. రాయలసీమలో 120%, కోస్తాంధ్రలో 66% ఎక్కువ వర్షపాతం నమోదైంది.



నీటితో కళకళలాడుతున్న అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలోని గొందిరెడ్డిపల్లి చెరువు

- రాష్ట్రంలోని 14 జిల్లాల్లో అత్యధిక (60% కంటే ఎక్కువ), 6 జిల్లాల్లో అధిక (20-59% ఎక్కువ), మరో 5 జిల్లాల్లో సాధారణ వర్షం కురిసింది. రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనూ గత మూడు నెలల్లో లోటు వర్షపాతం లేదు.
- బాపట్ల, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, గుంటూరు, కాకినాడ, కృష్ణా, పశ్చిమగోదావరి, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో వర్షాలు ఎక్కువగా కురిశాయి. జూన్‌లోనూ ఈ పరిస్థితులే ఉంటాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.
- అత్యధికంగా అనంతపురం జిల్లాలో 183.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం కంటే 230% ఎక్కువ. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, బాపట్ల, గుంటూరు, శ్రీసత్యసాయి జిల్లాల్లోనూ 150% కంటే ఎక్కువ వర్షం కురిసింది.
- మే నెలలో సాధారణ వర్షపాతం 56.8 మి.మీ.లు కాగా, 88.6 మి.మీ. వర్షం కురిసింది.
- రాయలసీమలోని నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,484 చెరువులున్నాయి. వాటిలో 49 చెరువులు పూర్తిగా నిండగా.. 96 చెరువుల్లో సగం కంటే ఎక్కువ నీరు చేరింది.

EENADU Vol: 51, Issue: 283 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

జ్యోతి మల్హోత్రా రిమాండ్ పొడిగింపు

• వెలుగులోకి సంచలన విషయాలు



హిసార్: పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులతో సంబంధాలున్నట్లు ఎన్ఐఏ విచారణలో అంగీకరించిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా(33)కు హిసార్ జిల్లా కోర్టు మరో నాలుగు రోజుల రిమాండ్ విధించింది. ఐదు రోజుల పాటు జ్యోతిని విచారించిన అధికారులు ఆమె నుంచి కీలక విషయాలు రాబట్టారు. కస్టడీ బుధవారం ముగియడంతో జ్యోతిని కోర్టులో హాజరుపరిచారు. ఆమెను మరికొన్ని రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు న్యాయస్థానాన్ని కోరారు. వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు మరో 4 రోజుల పాటు ఆమెకు రిమాండ్ విధించింది. ఆమె విదేశీ ప్రయాణాలకు డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో కొత్త విషయం బయటికొచ్చింది. జ్యోతికి స్పాన్సర్‌షిప్ చేసిన వాటిల్లో యూఏఈకి చెందిన ట్రావెల్ కంపెనీ 'వెగో' ఉన్నట్లు ఆంగ్ల మీడియా కథనం వెల్లడించింది. జ్యోతి మరో యూట్యూబర్ ప్రియాంకతో కలిసి ఒడిశాలోని పూరీ ఆలయంతో పాటు ప్రపంచ ప్రఖ్యాత కోణార్క్ ఆలయాన్ని కూడా సందర్శించినట్లు పూరీ క్రైమ్ బ్రాంచ్ ఐజీ సార్థక్ షడంగి తెలిపారు.

జ్యోతికి ఉగ్రవాదులతో సంబంధం లేదు: పోలీసులు

"ఉగ్ర మూకలతో గానీ, ఉగ్రవాదులతో గానీ జ్యోతి మల్హోత్రాకు సంబంధం ఉన్నట్లు, ఉగ్ర కార్యకలాపాల్లో పాలుపంచుకున్నట్లు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లేవు. పాక్ ఇంటెలిజెన్స్ అధికారిని పెళ్లి చేసుకోవాలనుకున్నట్లు, మతం మార్చుకోవాలనుకున్నట్లు ఆమె భావించినట్లు నిర్ధరించే పత్రాలేవీ మాకు దొరకలేదు. అయితే, ఆమె మాట్లాడుతున్న వారిలో పాక్ గూఢచర్య సంస్థకు చెందిన వారు ఉన్నారని తెలిసినప్పటికీ.. జ్యోతి వారితో సంప్రదింపులు కొనసాగించారు. మన సాయుధ దళాల ప్రణాళికల గురించి ఆమెకు అవగాహన ఉన్నట్లు అనిపించడం లేదు. భారత్‌లోని పాక్ హైకమిషన్‌లో పనిచేసే ఎహసాన్ ఉర్ రహీం అలియాస్ డానిష్‌తో సంబంధంలో ఉన్నారు. ఆమె డైరీలోని పేజీలంటూ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అలాంటివేవీ మేం స్వాధీనం చేసుకోలేదు. ఆమెకు చెందిన మూడు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ వస్తువులను మాత్రమే స్వాధీనం చేసుకున్నాం. వాటిని పరిశీలన కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించాం" అని హిసార్ ఎస్పీ వెల్లడించారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), మిలిటరీ ఇంటెలిజెన్స్ అధికారులు ఆమెను విచారించారు.

ఆపరేషన్ సిందూర్ ఆగలేదు

• ఉగ్రవాదులు పాక్‌లో ఎక్కడున్నా వేటాడుతాం: జైశంకర్



దిల్లీ: ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. పహల్గాం తరహాలో మరో ఉగ్రదాడి జరిగితే భారతదేశం తప్పకుండా స్పందిస్తుందని, ఉగ్రవాదులు పాకిస్థాన్‌లో ఎక్కడున్నా వేటాడి మరీ దెబ్బ తీస్తుందని తేల్చి చెప్పారు. నెదర్లాండ్స్, డెన్మార్క్, జర్మనీ దేశాల పర్యటనలో ఉన్న జైశంకర్.. డచ్ వార్తాసంస్థ ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. "ఆపరేషన్ సిందూర్‌ను భారత్ కొనసాగించడం వెనుక ఒక సందేశం ఉంది. ఉగ్రవాదంపై పోరాటంలో రాజీపడని భారతీయ తత్వానికి ఇది నిదర్శనం. ఆపరేషన్‌ను కొనసాగించడం అంటే ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకోవడం కాదు. ప్రస్తుతానికైతే భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది. సైనిక చర్యలు ఆగిపోయాయి" అని ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన జాబితాలో ప్రస్తావించిన ఉగ్రవాద స్థావరాలపైనే భారతదళాలు దాడి చేసిందన్నారు.

పాక్ దిగి రావడం వల్లే కాల్పుల విరమణ

పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ఇరు దేశాల మధ్య నేరుగా జరిగిన చర్చలతోనే కుదిరిందని జైశంకర్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందానికి కారణం తానేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఉన్నప్పుడు వివిధ దేశాలు ఇరువర్గాలతోనూ మాట్లాడటం సహజం. పరిస్థితిని చక్కదిద్దేందుకు అవి ప్రయత్నిస్తాయి. అమెరికాతోనే కాదు ఏ దేశాలతోనూ కాల్పుల విరమణ కావాలంటే పాకిస్థాన్ మాట్లాడమనండి అని స్పష్టం చేశాం. మే 10న ఆ దేశ జనరల్ మాతో చర్చలు జరిపి ఒప్పందం చేసుకున్నారు" అని వివరించారు. ఈ ప్రక్రియలో అమెరికా ఎక్కడ ఉందని ఇంటర్వ్యూలో ప్రశ్న ఎదురైంది. అమెరికా.. అమెరికాలోనే ఉందని మంత్రి సూటిగా బదులిచ్చారు.

నీరు, రక్తం కలిసి ప్రవహించలేవు


• సీమాంతర ఉగ్రవాదం ఆపితేనే సింధూ జలాలు

• పాక్‌కు స్పష్టం చేసిన భారత్

దిల్లీ: పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదానికి తుర్కియే అడ్డుకట్ట వేయాలని భారత్ పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు తుర్కియే అండగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాకిస్థాన్‌పై తుర్కియే ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. ఉగ్రవాదం విషయంలో ఇస్లామాబాద్ గట్టిగా వ్యవహరిస్తేనే భారత్‌తో సంబంధాలు మెరుగవుతాయని అన్నారు. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపేంతవరకు సింధూ జలాల ఒప్పందం నిలుపుదలలోనే ఉంటుందని జైస్వాల్ వెల్లడించారు. నీరు, రక్తం కలిసి ప్రవహించలేవని తెలిపారు. పాకిస్థాన్‌తో ఏ ద్వైపాక్షిక చర్చలైనా పాక్ ఆక్రమిత కశ్మీర్ తిరిగి అప్పగించిన తర్వాతే జరుగుతాయని పేర్కొన్నారు.

సల్మాన్‌ఖాన్ ఇంట్లోకి చొరబడిన వ్యక్తుల అరెస్ట్

ముంబయి: బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ నివాసంలోకి వేర్వేరు సమయాల్లో ఇద్దరు వ్యక్తులు చొరబడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జితేంద్ర కుమార్ సింగ్(23) అనే వ్యక్తితో పాటు ఈశా ఛాబ్రియా అనే మహిళ కూడా బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లోకి అక్రమంగా ప్రవేశించారని గురువారం పోలీసులు తెలిపారు. నిందితులు సల్మాన్ ఖాన్‌ను కలిసేందుకే ఇంట్లోకి చొరబడినట్లు విచారణలో వారు వెల్లడించారు.



పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో గురువారం రామ్మోహన్ మిషన్ పురస్కారం-2025ను అందుకున్న ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్. అంతరిక్ష విజ్ఞాన రంగంలో చేసిన కృషికిగాను ఆయనకు ఈ గౌరవం దక్కింది.

శరవేగంతో సాగుతున్న అంతరిక్ష కేంద్రం, గగన్‌యాన్ ప్రాజెక్టులు

• ఇస్రో ఛైర్మన్ నారాయణన్ వెల్లడి

కోల్‌కతా: మనదేశం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సొంత అంతరిక్ష కేంద్రం, గగన్‌యాన్ ప్రాజెక్టు పనులు శరవేగంతో ముందుకు సాగుతున్నాయని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ గురువారం వెల్లడించారు. ప్రతిపాదిత అంతరిక్ష కేంద్రం బరువు సుమారు 50 టన్నుల వరకూ ఉంటుందన్నారు. భారత అంతరిక్ష పరిశోధనలో గగన్‌యాన్ ఓ మైలురాయిగా మారనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చంద్రయాన్-4, చంద్రయాన్-5 ప్రాజెక్టులపై ఇస్రో కృషి చేస్తోందని తెలిపారు. జపాన్ భాగస్వామ్యంతో చేపడుతున్న చంద్రయాన్-5లో 6,400 కేజీల లాండర్, 350 కేజీల రోవర్ చంద్రుడిపైకి పంపనున్నామని వాటి జీవితకాలం 100 రోజులు ఉంటుందని వివరించారు.

నికర వలసలను సగానికి తగ్గించిన బ్రిటన్

• వెళ్లిపోయినవారిలో భారతీయులే అధికం


లండన్: వీసా, వలస విధానాలను కఠినతరం చేసిన బ్రిటన్ చర్యల ప్రభావం గురువారం విడుదల చేసిన ఆ దేశ తాజా వలస గణాంకాల్లో ప్రతిబింబించింది. గత ఏడాదికాలంగా బ్రిటన్ విడిచి వెళ్లిన విదేశీయుల్లో భారతీయ విద్యార్థులు, కార్మికులు అగ్రస్థానంలో ఉన్నారు. జాతీయ గణాంకాల కార్యాలయ (ఓఎన్ఎస్) వివరాల మేరకు.. 2024 డిసెంబరు నాటికి భారతీయులు దాదాపు 37,000 మంది విద్యార్థులు, ఉపాధి కోసం వచ్చిన 18,000 మంది, ఇతర కారణాలతో వచ్చిన 3,000 మంది బ్రిటన్ విడిచి వెళ్లారు. 45,000 మంది విద్యార్థులు, కార్మికులు తరలివెళ్లడంతో చైనా ద్వితీయస్థానంలో ఉంది. నైజీరియా (16,000), పాకిస్థాన్ (12,000), అమెరికా (8,000) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ క్రమంలో గత ఏడాది మొత్తం నికర వలసలు 4,31,000 మేర తగ్గాయి. బ్రిటన్‌లో చదువుకోడానికి, పనిచేయడానికి వచ్చేవారు తగ్గడంతో పాటు ముఖ్యంగా విద్యార్థులపై ఆధారపడి వచ్చేవారు ఆగిపోవడంతో తగ్గుదల ఎక్కువగా ఉన్నట్లు ఓఎన్ఎస్‌కు చెందిన జనాభా గణాంకాల డైరెక్టరు మేరీ గ్రెగరీ తెలిపారు. "టోరీల పాలనలో నికర వలసలు దాదాపు ఒక మిలియన్‌కు చేరుకున్నాయి. ఇది బర్మింగ్‌హామ్ జనాభాతో సమానం. మీకు కోపం తెప్పిస్తున్న ఈ పరిణామాన్ని నేను మారుస్తానని హామీ ఇచ్చా. తాజా గణాంకాలు చూస్తే గతేడాది నికర వలసలను దాదాపు సగానికి తగ్గించాం. నియంత్రణ మళ్లీ మన చేతుల్లోకి వస్తోంది" అని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తెలిపారు.

దక్షిణాఫ్రికా అధ్యక్షుడి సమక్షంలో

డొనాల్డ్ ట్రంప్ నాటకీయత

• తెల్లజాతీయులపై హింస పెరుగుతోందంటూ వీడియో ప్రదర్శన


వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దక్షిణాఫ్రికాలో తెల్లజాతీయులపై హింసాకాండ పెరిగిపోతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం తనను కలవడానికి వచ్చిన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా సమక్షంలో ఆయన ఈ విషయాన్ని నాటకీయ ధోరణిలో లేవనెత్తారు. అమెరికా అధ్యక్షుడి అధికార కార్యాలయం "ఓవల్ ఆఫీస్"లో రమఫోసాతో సమావేశమైన వెంటనే "లైట్లు ఆఫ్ చేయండి" అంటూ ట్రంప్ తన సిబ్బందిని ఆదేశించారు. ఏం జరుగుతోందా అని రమఫోసా గ్రహించే లోపలే ఒక టెలివిజన్ తెరపై వీడియో ప్రదర్శన మొదలైంది. దక్షిణాఫ్రికాలో తెల్లజాతీయులపై హత్యాకాండ, దురాగతాలు జరుగుతున్నాయనడం ఆ వీడియో సారాంశం. నాలుగు నిమిషాల ఆ వీడియోలో కొందరు నల్లజాతి రాజకీయ నాయకులు తెల్లజాతి దురహంకారానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం కనిపించింది. అయితే వీడియోలో నినాదాలు చేసిన వారిలో ఏ ఒక్కరూ రమఫోసాకు చెందిన ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌కు చెందినవారు కాదు. నిరాధార నిందారోపణలతో నిండిన ఆ వీడియోను అమెరికా అధ్యక్షుడు ప్రదర్శించడంపై దక్షిణాఫ్రికా అధినేత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వీడియో చివరలో కొన్ని క్రైస్తవ సమాధుల్లాంటి నిర్మాణాలు కనిపిస్తాయి. ఇవన్నీ ఊచకోతకు గురైన తెల్లజాతీయుల సమాధులని చెబుతూ వీడియో ముగుస్తుంది. అప్పుడు ట్రంప్ "దక్షిణాఫ్రికాలో ఎక్కడ చూసినా మరణం మరణం మరణం" అని ట్రంప్ తనదైన నాటకీయ ధోరణిలో అన్నారు. తన యంత్రాంగం దక్షిణాఫ్రికాకు చెందిన పలువురు శరణార్థులకు ఆశ్రయం కల్పించిందని ట్రంప్ ఈ సందర్భంగా రమఫోసాతో అన్నారు. ఈ దారుణాలు నిజంగా ఎక్కడ జరిగాయో తెలుసుకోవాలని ఉందని, ఎందుకంటే అవి తన దృష్టికి ఎప్పుడూ రాలేదని రమఫోసా బదులిచ్చారు. ఈ పరిణామం అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలన్న ఆశతో వచ్చిన దక్షిణాఫ్రికా అధ్యక్షుడికి నిరాశే మిగిల్చింది.



శ్వేతసౌధంలోని ఓవల్ కార్యాలయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా

పీజీ వైద్య కోర్సుల కౌన్సెలింగ్‌కు ముందే రుసుములు వెల్లడించాలి

• ప్రైవేటు, డీమ్డ్ వర్సిటీలకు సుప్రీంకోర్టు ఆదేశం



దిల్లీ: నీట్-పీజీ వైద్య కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించే కౌన్సెలింగ్‌కు ముందుగానే రుసుములను తప్పనిసరిగా వెల్లడించాలని ప్రైవేటు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. పీజీ వైద్య కోర్సుల సీట్లను బ్లాక్ చేసి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం ఈ ఉత్తర్వులిచ్చింది. సీట్లను బ్లాక్ చేయడం వల్ల వాస్తవంగా అందుబాటులో ఉండాల్సిన వాటి సంఖ్య తగ్గిపోయి ప్రతిభావంతులకు అన్యాయం జరుగుతోందని, అభ్యర్థుల మధ్య అసమానత్వానికి కారణమవుతోందని తెలిపింది. సీట్లను బ్లాక్ చేయడం వ్యవస్థ లోపాన్ని, విధాన నిర్ణయాల బలహీనతకు అద్దంపడుతుందని, పారదర్శకతను అడ్డుకుంటుందని ఏప్రిల్ 29న ఇచ్చిన తీర్పులో పేర్కొంది.

తీర్పుల అప్‌లోడ్‌లో జాప్యంపై సుప్రీం మండిపాటు

దిల్లీ: కోర్టు తీర్పులు సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కావడంలేదన్న ఫిర్యాదులపై సుప్రీంకోర్టు మండిపడింది. గడచిన ఏడాది కాలంలో తీర్పులు వెలువడిన తేదీలు, ఆ తీర్పులు ఆన్‌లైన్‌లో పెట్టిన తేదీల వివరాలు ఇవ్వాలని హైకోర్టులను ఆదేశించింది. జులై 21 లోగా వివరాలను సమర్పించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం పేర్కొంది. "2024 జనవరి 1 నుంచి ఈ ఏడాది మే 31 వరకూ తీర్పులు వెలువరించిన తేదీలు, ఆ తీర్పులు అప్‌లోడ్ చేసిన తేదీలు ఇవ్వండి" అని ధర్మాసనం ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు అనవసరంగా సెలవులు తీసుకుంటున్నారనీ, వారి పనితీరుపై సమీక్ష జరగాలని అత్యున్నత న్యాయస్థానం ఈ నెల 13న పేర్కొంది.

న్యాయ వ్యవస్థలో మహిళా ప్రాతినిధ్యం పెరగాలి

దిల్లీ: న్యాయ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం పెంచాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు గురువారం నొక్కిచెప్పింది. మహిళల భాగస్వామ్యం పెరిగితే కోర్టు నిర్ణయాల నాణ్యత మెరుగవుతుందని, మహిళలకు సంబంధించిన కేసులపై సానుకూల ప్రభావం పడుతుందని కోర్టు అభిప్రాయపడింది. న్యాయవ్యవస్థలో మహిళల భాగస్వామ్యం పెరిగితే న్యాయసిబ్బంది సమర్థత, నిబద్ధత బలోపేతమవుతాయని, వైవిధ్యం పెంపొందుతుందని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ధర్మాసనం పేర్కొంది. 2019లో రెండేళ్ల కాలానికిగాను ప్రొబేషన్‌పై నియమించిన ఒక మహిళా జుడీషియల్ అధికారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. ఈ కేసులో పిటిషన్‌దారు అయిన మహిళా అధికారికి ఎలాంటి పోస్టింగు ఆదేశాలు ఇవ్వకుండా రాజస్థాన్ జుడీషియల్ సర్వీసులో ఆమెకు కన్ఫర్మేషన్ ఇవ్వడానికి అవకాశంలేదని 2020 మేలో తేల్చి చెప్పారని ధర్మాసనం పేర్కొంది.

వాయుసేన అధికారిణి సర్వీస్‌ను ముగించొద్దు: సుప్రీంకోర్టు

దిల్లీ: బాలాకోట్ ఆపరేషన్‌లో, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న వాయుసేనకు చెందిన మహిళాధికారి సర్వీసును ముగించవద్దని, ఆమెను విధుల్లో కొనసాగనివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని గురువారం సుప్రీంకోర్టు ఆదేశించింది. వాయుసేనలో తనకు శాశ్వత కమిషన్ (పీసీ) నియామకం ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారంటూ వింగ్ కమాండర్ నికితా పాండే దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం ఈ ఉత్తర్వులిచ్చింది. భారతీయ వాయుసేనను ప్రతిభ ఆధారంగా పనిచేసే సంస్థగా పేర్కొంటూ సిబ్బంది ఉద్యోగ విషయాల్లో అనిశ్చితి సంస్థకు మంచిది కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. పిటిషన్‌దారు అయిన వింగ్ కమాండర్ నికితా పాండే పదమూడున్నరేళ్లకు పైగా సేవలందించారని, 2019లో ప్రవేశపెట్టిన ఒక విధానం కారణంగా ఆమె సేవలు మరో నెలలో ముగిసే పరిస్థితి తలెత్తిందని న్యాయవాది పేర్కొన్నారు. నికితా పాండేను తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకూ విధుల నుంచి తొలగించరాదని పేర్కొంటూ కోర్టు ఈ అంశంపై తదుపరి విచారణను ఆగస్టు 6 నాటికి వాయిదా వేసింది.

దిల్లీ వర్సిటీని సందర్శించిన రాహుల్

• ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులతో సంభాషణ

• విద్యా సంస్థ నిబంధనలు ఉల్లంఘించారంటూ అధికారుల అభ్యంతరం

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ గురువారం దిల్లీ విశ్వవిద్యాలయం (డీయూ)లోని నార్త్ క్యాంపస్‌ను సందర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. వర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో విద్యా విధానం, సమానత్వం, ప్రాతినిధ్యం అంశాలపై రాహుల్ ప్రసంగించారు. అధ్యాపక ఉద్యోగాలు, ఉన్నత పరిపాలన పదవుల్లో అట్టడుగు వర్గాలకు ప్రాతినిధ్యం లేకపోవడం, కుల ఆధారిత వివక్ష, అగ్రశ్రేణి బహుళజాతి సంస్థల్లో అవకాశాలు దక్కకపోవడంపై రాహుల్‌తో విద్యార్థులు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. "ఎడ్యుకేట్, ఎజిటేట్, అండ్ ఆర్గనైజ్" అన్న బి.ఆర్. అంబేడ్కర్ సందేశాన్ని పాటిస్తూ.. న్యాయమైన వ్యవస్థను సృష్టించడంలో చురుకైన పాత్రను పోషించాలని విద్యార్థులకు రాహుల్ పిలుపునిచ్చారు. విద్యార్థుల ప్రాతినిధ్యం తరగతి గదులకే పరిమితం కాకూడదని, అణచివేతకు గురైన వారికోసం నిలబడాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా రాహుల్ అనుమతి తీసుకోకుండా వర్సిటీని సందర్శించడంపై వర్సిటీ అధికారులు అభ్యంతరం తెలిపారు. వర్సిటీ నిబంధనలను ఆయన ఉల్లంఘించారని పేర్కొన్నారు. రాహుల్ ఇలాంటి చర్యకు పాల్పడటం ఇది రెండోసారి అని ఓ ప్రకటనలో తెలిపారు.

దేశ ప్రయోజనాలపై ఎందుకు రాజీపడ్డారు?

• ప్రధాని మోదీని ప్రశ్నించిన రాహుల్

పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్‌ను ఎందుకు నిలిపివేశారో చెప్పాలని ప్రధాని మోదీని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఎందుకు రాజీపడాల్సి వచ్చిందో వెల్లడించాలన్నారు. "మోదీజీ.. మీ డొల్ల ప్రసంగాలు ఆపండి. ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వబోమని పాక్ చేసిన ప్రకటనను మీరెలా విశ్వసించారు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందు మోకరిల్లి దేశ ప్రయోజనాల విషయంలో ఎందుకు రాజీపడ్డారు? కెమెరాల ముందు మాత్రమే మీ రక్తం ఎందుకు మరుగుతుంది?" అని రాహుల్ 'ఎక్స్'లో ప్రశ్నించారు.



దిల్లీ విశ్వవిద్యాలయం ఉత్తర క్యాంపస్‌లో రాహుల్‌గాంధీ

ఆరుగురికి కీర్తిచక్ర, 33 మందికి శౌర్యచక్ర అవార్డుల ప్రదానం

దిల్లీ: విధి నిర్వహణలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన ఆరుగురు సైనికులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం 'కీర్తిచక్ర' అవార్డులను అందజేశారు. ఇందులో నలుగురికి మరణానంతరం ఈ గౌరవం దక్కింది. 33 మంది శౌర్యచక్ర పురస్కారాలు అందుకోగా, వీరిలోనూ ఏడుగురు మరణానంతరం ఈ గౌరవం పొందారు. రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సాయుధ దళాల సుప్రీం కమాండర్ అయిన ముర్ము చేతుల మీదుగా ఆయా సైనికులు, వారి కుటుంబసభ్యులు ఈ పురస్కారాలను అందుకొన్నట్లు రక్షణ మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

ధులె అతిథిగృహంలో రూ.కోట్లు.. శాసనమండలి ఉద్యోగి సస్పెన్షన్

• అది లంచం సొమ్మే: విపక్షాలు

• విచారణకు సిట్ ఏర్పాటు: సీఎం

ముంబయి: మహారాష్ట్రలోని ధులె పట్టణ ప్రభుత్వ అతిథిగృహం నుంచి పెద్దమొత్తంలో నగదు స్వాధీనం చేసుకొన్న వ్యవహారంలో రాష్ట్ర శాసనమండలి ఛైర్‌పర్సన్ రామ్ శిందే ఓ ఉద్యోగిని గురువారం సస్పెండు చేశారు. అతిథిగృహంలో నగదు దొరికిన గదిని శాసన మండలి సెక్షన్ అధికారి కిశోర్ పాటిల్ పేరుతో బుక్ చేసి ఉన్నందున ఈ చర్య తీసుకున్నారు. ధులె జిల్లాలో పర్యటిస్తున్న శాసనసభ అంచనాల కమిటీ ఛైర్‌పర్సన్ అర్జున్ ఖోట్కర్‌కు పీఏ హోదాలో కిశోర్ పాటిల్ ఆయన వెంట ఉన్నారు. అర్జున్ ఖోట్కర్ శివసేన (ఏక్‌నాథ్ శిందే) ఎమ్మెల్యే. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ గురువారం ముంబయిలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి, సిట్ దర్యాప్తునకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. అతిథిగృహంలో దొరికిన సొమ్ము రూ.5.5 కోట్లు అని, అంచనాల కమిటీకి లంచం ఇచ్చేందుకే ఆ డబ్బును అక్కడికి చేర్చినట్లు శివసేన (యూబీటీ) రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ 'ఎక్స్' ద్వారా ఆరోపించారు. ఈ ప్రయత్నాన్ని తమ పార్టీ కార్యకర్తలు అడ్డుకొన్నట్లు తెలిపారు. దొంగలు ఆధారాలతో దొరికాక మళ్లీ విచారణ ఎందుకని, కస్టడీలోకి తీసుకోవాలని మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ హర్షవర్ధన్ సప్కాల్ డిమాండ్ చేశారు.

పాక్ గగనతలం కోసం ఇండిగో పైలట్ అభ్యర్థన

• తిరస్కరించిన లాహోర్ ఏటీసీ

• తప్పనిసరి పరిస్థితుల్లో కుదుపులతోనే ప్రయాణించిన విమానం

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ నుంచి బుధవారం శ్రీనగర్‌కు బయల్దేరిన ఇండిగో విమానం వడగండ్ల వాన కారణంగా తీవ్ర కుదుపులకు గురైనప్పుడు.. పాకిస్థాన్ గగనతలాన్ని పాక్షికంగా ఉపయోగించుకోవడానికి పైలట్ లాహోర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ)ను అభ్యర్థించారని, అయితే అతడికి తిరస్కారం ఎదురైందని సంబంధిత వర్గాలు తెలిపాయి. పంజాబ్‌లోని అమృత్‌సర్ మీదుగా వెళ్తున్న సమయంలో కుదుపులు మొదలవడంతో పైలట్ ముందు జాగ్రత్త చర్యగా మార్గాన్ని మళ్లించడానికి పక్కనే ఉన్న లాహోర్ ఏటీసీని అభ్యర్థించినట్లు పేర్కొన్నాయి. కానీ ఏటీసీ అధికారులు అంగీకరించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో విమానం తీవ్ర కుదుపుల మధ్యే ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణం సాగించి శ్రీనగర్‌లో దిగిన సంగతి తెలిసిందే.

మోదీ 3.0 వార్షికోత్సవానికి ఎన్డీయే సన్నాహాలు

దిల్లీ: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని పదవి చేపట్టి త్వరలో ఏడాది పూర్తవుతున్న సందర్భాన్ని ఘనంగా నిర్వహించడానికి అధికార ఎన్డీయే కూటమి సన్నాహాలు చేస్తోంది. భాజపా సీనియర్ నేతలు, కేంద్ర మంత్రుల నేతృత్వంలో పెద్ద ఎత్తున బహిరంగ సభలు, ర్యాలీలు చేపట్టడానికి సంసిద్ధమవుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంపై ఆపరేషన్ సిందూర్ చేపట్టిన నేపథ్యంలో ఈ వార్షికోత్సవాన్ని ఎన్డీయే ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నాయి. ఇందుకోసం ఈ నెల 25న భాజపాతో పాటు ఎన్డీయే కూటమి పాలిత రాష్ట్రాల సీఎంలతో మోదీ అధ్యక్షతన సమావేశం జరగనున్నట్లు తెలుస్తోంది. బిహార్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు సమాచారం.

అమెరికాలో కూలిన ప్రైవేటు విమానం

• పలువురి మృతి.. వాహనాలు దగ్ధం

శాన్ డియాగో: అమెరికాలోని శాన్ డియాగో సమీపంలో గురువారం ఓ ప్రైవేటు విమానం కూలిపోయింది. ఈ ఘటనలో పలువురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఆ విమానంలో 8 నుంచి 10 మంది ప్రయాణించేందుకు వీలవుతుందని, అయితే ప్రమాద సమయంలో అందులో ఎంత మంది ఉన్నది తెలియరాలేదన్నారు. ఇంధనం అయిపోవడం వల్లే విమానం కూలినట్లు వారు తెలిపారు. ఓ వీధిలో అది కూలిపోయిందని, ఈ ఘటనలో పలు వాహనాలు దగ్ధమయ్యాయని, అయితే ఎవరికీ గాయాలు కాలేదని తెలిపారు.

ఎంఎస్పీ కంటే దిగువలో ఆహారపంటల ధరలు: ఆర్బీఐ

ముంబయి: దేశంలో ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటల దిగుమతులు ఇబ్బడిముబ్బడిగా రావడంతో వ్యవసాయ మార్కెట్లలో వాటి సగటు ధరలు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కంటే తక్కువగా ఉన్నాయని భారత రిజర్వ్ బ్యాంకు తెలిపింది. ఒక్క గోధుమల ధరల పరిస్థితి దీనికి భిన్నంగా ఉందని తన తాజా పత్రంలో పేర్కొంది.

ఉక్రెయిన్‌తో తదుపరి శాంతి చర్చలెప్పుడో నిర్ణయం కాలేదు: రష్యా

మాస్కో: మూడేళ్లకు పైగా సాగుతున్న యుద్ధానికి చరమగీతం పాడేందుకు ఉక్రెయిన్, రష్యాల మధ్య తదుపరి శాంతి చర్చలు ఎప్పుడు నిర్వహించాలనేది నిర్ణయం కాలేదని గురువారం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. తదుపరి చర్చలపై ఓ అంగీకారం కుదరాల్సి ఉందన్నారు.

ఎవరెస్టు పర్వతారోహణలో

జినాన్ గ్యాస్ వాడకంపై నేపాల్‌లో వివాదం

కాఠ్‌మాండూ: నలుగురు బ్రిటిష్ పర్వతారోహకులు జినాన్ వాయువును పీల్చి తక్కువ సమయంలో ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించడం నేపాల్‌లో వివాదానికి దారితీసింది. అతితక్కువ ఆక్సిజన్ కలిగిన వాతావరణ పరిస్థితులకు త్వరగా అలవాటు పడేందుకు జినాన్ వాయువు ఉపకరిస్తుంది. ఈ వాయువును పీల్చిన బ్రిటిష్ పర్వతారోహకులు 8,848.86 మీటర్ల ఎత్తున్న ఎవరెస్టు పర్వతాన్ని ఐదు రోజుల్లోనే అధిరోహించారని ఆస్ట్రియాకు చెందిన సాహసయాత్రల సంస్థ ప్రతినిధి లుకాస్ ఫర్టెన్‌బాక్ తెలిపారు. అయితే ఎవరెస్టు పర్వతారోహణలో జినాన్ వినియోగానికి సాధారణంగా అనుమతినివ్వరు. ఈ విషయంపై దర్యాప్తు జరుపుతున్నామని నేపాల్ పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. పర్వతారోహకులు సాధారణంగా స్థానిక షెర్పాల సాయంతో పర్వత శిఖరానికి చేరుతుంటారు. వారు తమ శరీరాలు ప్రతికూల పర్వత వాతావరణ పరిస్థితులకు అలవాటు పడేందుకు కొన్ని వారాల పాటు ఎవరెస్టు ప్రాంతంలో గడుపుతుంటారు. జినాన్ వాయువు కారణంగా పర్యటన కాలం తగ్గిపోతే షెర్పాల బతుకుతెరువుపై, నేపాల్ ఆదాయంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అందుకే ఇక్కడ పర్వతారోహణలో జినాన్ వాడకాన్ని అనుమతించరు.

చిన్నారుల జనన ధ్రువీకరణ పత్రంలో తల్లిదండ్రులుగా ఇద్దరు తల్లుల పేర్లు

• స్వలింగ దంపతుల కేసులో ఇటలీ కోర్టు తీర్పు

రోమ్: స్వలింగ వివాహితులున్న కుటుంబాల్లో చిన్నారులపై తల్లిదండ్రుల హక్కుల్ని కన్నతల్లికి మాత్రమే పరిమితం చేయరాదని ఇటలీ సర్వోన్నత న్యాయస్థానం (కానిస్టిట్యూషనల్ కోర్టు) స్పష్టం చేసింది. పిల్లల జనన ధ్రువీకరణ పత్రంలో తల్లిదండ్రులుగా ఇద్దరు తల్లుల పేర్లూ చేర్చాలని గురువారం తీర్పు వెలువరించింది. కన్నతల్లితో పాటు ఆమె గర్భం దాల్చడానికి వైద్యపరంగా సహకరించిన, తల్లిదండ్రుల బాధ్యతల్లో భాగస్వామి అవుతున్న మహిళ హక్కును తిరస్కరించడం సరికాదని పేర్కొంది. ఈ తీర్పుపై ఎల్‌జీబీటీక్యూ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఇటలీ పౌర హక్కుల చరిత్రలో చిరస్మరణీయమైన రోజుగా నిలిచిపోతుందని పేర్కొన్నాయి.



దిల్లీలో భారీ ఈదురుగాలుల కారణంగా చెట్టు కూలడంతో దెబ్బతిన్న వాహనాలు

ఈనాడు సినిమా


రామ్ చరణ్

పల్లెటూరి సెట్‌లో పెద్ది యాక్షన్

'పెద్ది'గా ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు రామ్‌చరణ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభించుకున్నట్లు చిత్ర బృందం గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా సెట్లో చరణ్, బుచ్చిబాబు, దివ్యేందు కలిసి దిగిన ఫొటోను నెట్టింట పంచుకున్నారు. ఈ చిత్ర కథాంశానికి తగ్గట్లుగా ప్రొడక్షన్ డిజైనర్ అవినాశ్ కొల్ల ఈ సినిమా కోసం ఓ పెద్ద పల్లెటూరి సెట్‌ను సిద్ధం చేశారు. అందులోనే ఇప్పుడు చరణ్‌పై భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కీలక సన్నివేశాల్ని చిత్రీకరించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా 30శాతం చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. ఈ లాంగ్ షెడ్యూల్‌తో ఓ కీలక దశకు చేరుకోనుంది. ఇది వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి సంగీతం: ఏఆర్ రెహమాన్, కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: ఆర్.రత్నవేలు.

సూజిత్ సర్కార్ దర్శకత్వంలో రాజ్‌కుమార్?


రాజ్‌కుమార్

'భూల్ చుక్ మాఫ్'తో థియేటర్లలో సందడి చేస్తూనే.. మరోవైపు తన రాబోయే ప్రాజెక్టుల కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారు బాలీవుడ్ కథానాయకుడు రాజ్‌కుమార్ రావు. తాజాగా ఆయన 'మద్రాస్ కేఫ్', 'పీకు' లాంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు సూజిత్ సర్కార్‌తో ఓ సినిమా కోసం చేతులు కలిపినట్లు సమాచారం. "కొన్ని రోజులుగా సూజిత్, రాజ్ మధ్య ఓ ప్రాజెక్టు కోసం చర్చలు జరుగుతున్నాయి. కామెడీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో ఇద్దరు హీరోలు ప్రధాన పాత్ర పోషించనున్నారు. అందులో ఒకరే రాజ్. ప్రస్తుతం మరో కథానాయకుడిని వెతికే పనిలో ఉంది చిత్రబృందం. ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ ఏడాది ద్వితీయార్ధంలో చిత్రీకరణ ప్రారంభం కానుంద"ని రాజ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

జూన్ నుంచి ఉస్తాద్ బరిలోకి



పవన్ కల్యాణ్

కథానాయకుడు పవన్ కల్యాణ్ సినిమాల విషయంలో వేగం పెంచారు. చేతిలో ఉన్న చిత్రాల్ని పూర్తి చేయడమే లక్ష్యంగా చిత్రీకరణల్ని పరుగులు పెట్టిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే 'హరి హర వీరమల్లు'ను పూర్తి చేసి 'ఓజీ' కోసం రంగంలో దిగిన ఆయన.. ఇప్పుడు 'ఉస్తాద్ భగత్ సింగ్'ను పునఃప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు. ఇది జూన్ నుంచి కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకోనున్నట్లు చిత్ర బృందం హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం ప్రకటించింది. ఇది హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న సినిమా. అన్ని రకాల వాణిజ్య హంగులతో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబు కానుంది. ఇందులో శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా.. అశుతోష్ రాణా, నవాబ్ షా, అవినాశ్, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



సవాళ్లు ఎదురైనా.. నువ్వేంటో మర్చిపోకు!

సిరీస్: 'ఫర్గెట్ యు నాట్'
నటీనటులు: ఇంగ్-జువాన్, చిన్‌హాన్
విడుదల ఎప్పుడు: శుక్రవారం
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్



కథాంశం: వినోదాన్ని పంచే చిత్రాలు మాత్రమే కాదు.. జీవితానికి దగ్గరగా ఉంటూ బంధాల విలువల్ని తెలిపే సినిమాలు కూడా ఉంటాయి. ఇప్పుడీ నేపథ్యంలోనే రాబోతున్న సిరీస్ 'ఫర్గెట్ యు నాట్'. ఈ చైనీస్ డ్రామాకు రెనే లియు దర్శకత్వం వహించారు. ఇంగ్-జువాన్, చిన్‌హాన్, ట్రేసీ చౌ, ఎస్తేర్ లియు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులో హీస్‌హ.. చెంగ్ లె-లే అనే పాత్రలో కనిపించనుంది. స్టాండ్-అప్ కమెడియన్‌గా ఉంటూనే.. మరోవైపు పార్ట్‌టైమ్ ఉద్యోగం కూడా చేస్తుంటుంది చెంగ్. ఒక కమెడియన్‌గా అందరిని నవ్వించే ఆమె మాత్రం.. తన జీవితంలో ఎన్నో సమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఓవైపు అర్థం చేసుకోలేని భర్త.. మరోవైపు వృద్ధాప్య దశలో ఉన్న తన తండ్రి నుంచి చెంగ్‌కు చాలా ఎదురుదెబ్బలు తగులుతాయి. మరి ఇవన్నీ దాటుకొని ఆమె కొత్త జీవితం ఎలా ప్రారంభించింది? అసలు తన తండ్రితో ఉన్న సమస్య ఏంటి? అనే ఆసక్తికర ప్రశ్నల చుట్టూ ఈ సిరీస్ కథ తిరుగుతుంది. "ఎన్ని సవాళ్లు ఎదురైనా.. నిన్ను నువ్వు మర్చిపోకు" అంటూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ఈ సిరీస్‌పై మీరూ లుక్కేయ్యండి.


సుహాసిని, త్రిష, మణిరత్నం, కమల్‌హాసన్, శింబు

నేనెప్పుడూ నిత్య విద్యార్థినే : కమల్

"స్టార్‌గా నాకు పుట్టినిల్లు తెలుగు చిత్ర పరిశ్రమే. నాకు ఎన్నో మంచి సినిమాల్ని నిర్మించే శక్తినిచ్చింది ఇక్కడి ప్రేక్షకులే" అన్నారు కథానాయకుడు కమల్‌హాసన్. ఇప్పుడాయన నుంచి వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'థగ్ లైఫ్'. మణిరత్నం తెరకెక్కించిన ఈ సినిమాని రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. త్రిష కథానాయిక. శింబు, జోజు జార్జ్, నాజర్, తనికెళ్ల భరణి, అభిరామి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా శ్రేష్ఠ్ మూవీస్ సంస్థ ద్వారా జూన్ 5న తెలుగులోకి రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం రాత్రి హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో కమల్‌హాసన్ మాట్లాడుతూ.. "మణిరత్నం అప్పటికీ ఇప్పటికీ దర్శకుడిగా చాలా మారారు. ఆ మార్పు ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుంది. మా మధ్య నుంచి ఇన్నేళ్ల విరామం తర్వాత సినిమా రావడానికి కారణం నేనే. నన్ను అందరూ ద్రోణాచార్యుడు.. గురువు అంటున్నారు. దయచేసి నా నుంచి ఏ పాఠాలు ఆశించకండి. ఎందుకంటే సినిమాకి నేనెప్పుడూ నిత్య విద్యార్థినే. నేర్పడానికి సిద్ధంగా ఉండాలంటే ముందు నేనింకా నేర్చుకోవాలి. కెరీర్ ఆరంభం నుంచి నిత్యం నేనదే పని చేస్తున్నా. అందుకే నన్ను గురువు అనకండి. గుర్తుపెట్టుకోండి చాలు. నేను మంచి సినిమాలకు అభిమానిని. అలాంటి చిత్రాలు అందించేందుకు ఎంతైనా కష్టపడతా. నేను నా జీవితంలో ప్రతిదీ సినిమా ద్వారానే నేర్చుకున్నా. నటన ద్వారానే తమిళం, తెలుగు, మలయాళం.. ఇలా ప్రతి భాషా నేర్చుకున్నా. ఈ 'థగ్ లైఫ్' నాకెంతో ఇష్టమైన చిత్రం. మేమంతా ఎంతో ఇష్టపడి, కష్టపడి చేశాం. ఈ సినిమా నుంచి.. పాత్ర నుంచి బయటకు రావడానికి నాకు చాలా సమయమే పడుతుంది. నేనీ చిత్రం చూశా. తప్పకుండా ఇది 'నాయగన్' కంటే చాలా పెద్ద సినిమా అవుతుందని మాటిస్తున్నా. ప్రేక్షకుల స్పందన చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా" అన్నారు. "అందరిలాగే నేనూ కమల్ - మణిరత్నంల 'నాయగన్' చిత్రం చూస్తూ పెరిగాను. వాళ్లిద్దరూ కలిసి 37 ఏళ్ల తర్వాత ఇలా ఈ సినిమాతో రావడం.. నేనిందులో భాగమవ్వడం చాలా ఆనందంగా ఉంది. దీన్ని ప్రేక్షకులు ఎలా ఆస్వాదిస్తారోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అంది త్రిష.

దర్శకుడు మణిరత్నం మాట్లాడుతూ.. "నా 'మౌనరాగం' సినిమా విడుదలయ్యాక ఓసారి నిర్మాత ముక్తా శ్రీనివాసన్ ఓరోజు మా ఇంటికి వచ్చారు. తను నా చేతికి ఓ కవర్ ఇచ్చి.. 'కమల్ సర్ అందులో ఉన్న హిందీ సినిమాని మిమ్మల్ని చూడమని చెప్పార'న్నారు. నేను ఆ చిత్రం చూశాక దాన్ని రీమేక్ చేయలేనని చెప్పేశా. కానీ, ఆ నిర్మాత అదే మాట నేరుగా కమల్‌కి చెప్పమని కారులో ఏవీఎం స్టూడియోకి తీసుకెళ్లారు. అప్పుడదే మాట మళ్లీ ఆయనతో చెప్తే.. 'సరే నాతో చేయడానికి ఏ కథతే బాగుంటుందో చెప్పమ'ని అనడంతో ఆశ్చర్యపోయా. అప్పుడలా చర్చిస్తూ అనుకోకుండా 'నాయగన్' చిత్రం పురుడుపోసుకుంది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత 'థగ్ లైఫ్' విషయంలోనూ అదే జరిగింది. ఓరోజు కమల్ ఫోన్ చేసి కలిసి సినిమా చేద్దామన్నారు. అలా ఇన్నేళ్ల విరామం తర్వాత మా ఇద్దరి కలయికలో రెండో సినిమా సాకారమైంది" అన్నారు. నిర్మాత సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. "కమల్‌హాసన్ గత రెండు చిత్రాల్ని తెలుగులో నేనే విడుదల చేశా. అవి బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఈ చిత్ర ట్రైలర్, పాటలు చూశాక ఇది కమల్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలుస్తుందని నమ్మకం ఏర్పడింది" అన్నారు. ఈ కార్యక్రమంలో శింబు, సుహాసిని, అశోక్ సెల్వన్, అభిరామి, నాజర్, తనికెళ్ల భరణి తదితరులు పాల్గొన్నారు.


ఐశ్వర్య రాయ్


అదితీ రావ్ హైదరీ

తళుకుల అందం.... మెరిసే 'సిందూరం'

రంగు రంగుల దుస్తులు.. రెడ్‌కార్పెట్‌పై సినీతారల హొయలు.. అబ్బురపరిచే సినిమా ప్రదర్శనల మధ్య కేన్స్ చిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. మరో రెండు రోజుల్లో ముగియనున్న ఈ ఫెస్టివల్‌లో తాజాగా బాలీవుడ్ కథానాయిక ఐశ్వర్య రాయ్ రెడ్ కార్పెట్‌పై మరోసారి హొయలొలికించింది. కొన్నేళ్లుగా కేన్స్‌లో మెరుస్తున్న ఈ భామ ఈసారి భారతీయత ఉట్టిపడేలా.. చీరకట్టుతో నుదుటిన సిందూరం పెట్టుకొని సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. మరోవైపు అందాల తార అదితీ రావ్ హైదరీ కూడా నుదుటిన సిందూరంతో ఎరుపు రంగు చీరలో ఎర్రమందారంలా కేన్స్ చిత్రోత్సవాల్లో సందడి చేసింది. దీంతో వీరిద్దరూ ప్రత్యేకంగా నుదుటిన సిందూరం పెట్టుకొని కనిపించడంతో ఇటీవలే పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు కేన్స్ వేదికగా ఐశ్వర్య, అదితి మద్దతు తెలిపినట్లు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

సెంటిమెంటల్ వాల్యూ రికార్డు



ఇద్దరు సోదరీమణుల చుట్టూ తిరిగే కథనంతో రూపొందిన హాలీవుడ్ చిత్రం 'సెంటిమెంటల్ వాల్యూ'. జోచిమ్ ట్రియర్ దర్శకత్వం వహించారు. రెనేట్ రీన్స్వ్, స్టెల్లాన్, స్కార్స్‌గార్డ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తాజాగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న కేన్స్‌లో ప్రదర్శించిన ఈ చిత్రం 15 నిమిషాల పాటు స్టాండింగ్ ఒవేషన్‌ను అందుకుంది. కేన్స్‌లో ఈ ఏడాది అత్యధికంగా ప్రశంసలు అందుకున్న సినిమాగా రికార్డు సాధించినట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. తన తండ్రి కోసం తపన పడుతున్న ఇద్దరు అక్కాచెల్లెళ్ల నేపథ్యంలో తీర్చిదిద్దిన ఈ చిత్రం పామ్ డీ ఓర్‌కు నామినేట్ అయింది.

కేన్స్‌లో విశ్వంభర పుస్తకం

'విశ్వంభర' చిత్రంతో తెరపైకి రావడానికి సన్నద్ధమవుతున్నారు అగ్రకథానాయకుడు చిరంజీవి. ఈ సోషియో ఫాంటసీ చిత్రానికి వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. త్రిష కథానాయిక. ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పుస్తకాన్ని కేన్స్ చిత్రోత్సవాల్లో విడుదల చేశారు నిర్మాత విక్రమ్. త్వరలో ఈ బుక్‌లోని పూర్తి సమాచారాన్ని వెల్లడించనున్నట్లు తెలిపారు. యాక్షన్ అడ్వెంచర్ నేపథ్యంలో భారీ స్థాయిలో యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్ర విడుదల తేదీని మరికొన్ని రోజుల్లో ప్రకటించనున్నట్లు తెలిపాయి చిత్ర వర్గాలు.



'కింగ్' షూటింగ్ మొదలు!

సినీ ప్రియుల హృదయాలను దోచుకున్న బాలీవుడ్ కథానాయకుడు షారుక్ ఖాన్.. ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కింగ్'. యాక్షన్ కథా నేపథ్యంలో సిద్ధార్థ్ ఆనంద్ రూపొందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ ముంబయిలో ప్రారంభమైనట్లు సమాచారం. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత షారుక్ సెట్స్‌పైకి అడుగుపెట్టనున్నట్లు సమాచారం. ఇందులో అర్షద్ వార్సి, జాకీ ష్రాఫ్, అనీల్ కపూర్, అభిషేక్ బచ్చన్, జైదీప్ అహ్లావత్, దీపికా పదుకొణె, రాణీ ముఖర్జీ తదితరులు కీలక పాత్రలు పోషించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో సుహానాకు గురువుగా శక్తిమంతమైన పాత్రలో షారుక్ కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.


షారుక్ ఖాన్

విలువల వైభవం


ఇక్రా ఇద్రిసి, రుత్విక్

రుత్విక్ కథానాయకుడిగా... ఆయన తమ్ముడు సాత్విక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వైభవం'. తల్లి రమాదేవి నిర్మాత. ఇక్రా ఇద్రిసి కథానాయికగా నటించారు. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకి ముందస్తు వేడుకని నిర్వహించారు. "మానవతా విలువలు, సునిశిత హాస్యం మేళవింపుగా ఈ చిత్రాన్ని రూపొందించాం. సినిమా రంగంలో రాణించాలనే తపనతో కార్పొరేట్ ఉద్యోగాల్ని వదిలిపెట్టి ఈ సినిమా చేశాం. మా అభిరుచిని అర్థం చేసుకుని ప్రోత్సహించారు మా అమ్మ. మాపై అమ్మ పెట్టిన నమ్మకం వమ్ము కాదు. కుటుంబ విలువలకి పెద్దపీట వేస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రతి ఒక్కరినీ అలరిస్తుంది" అన్నారు సాత్విక్, రుత్విక్. నిర్మాత రమాదేవి మాట్లాడుతూ "నేనొక న్యాయవాదిని. చిన్నప్పట్నుంచీ మా పిల్లలు చదువుల్లో, ఆటపాటల్లో ముందుండేవారు. మంచి ఉద్యోగాలు సంపాదించారు. సినిమాపై తపనతో ఈ రంగంలోకి రావాలనే కోరికని బయటపెట్టినప్పుడు కాదనలేకపోయా. వాళ్లు ఈ రంగంలోనూ విజయం సాధిస్తారనే నమ్మకం ఉంది" అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందులో నటించిన కె.ఎల్.ఎన్, అనంత్, నవీందర్ తదితరులు పాల్గొన్నారు.

థ్రిల్‌ని పంచే 'నిశ్శబ్ద ప్రేమ'


శ్రీరామ్, ప్రియాంక తిమ్మేశ్

శ్రీరామ్, ప్రియాంక తిమ్మేశ్ జంటగా నటించిన చిత్రం 'నిశ్శబ్ద ప్రేమ'. రాజ్ దేవ్ దర్శకత్వం వహించారు. కార్తికేయన్.ఎస్ నిర్మాత. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకి ముందస్తు వేడుకని నిర్వహించారు. సినీ ప్రముఖులు టి.ప్రసన్నకుమార్, వీరశంకర్, చింతపల్లి రామారావు, రాజేశ్ పుత్ర, సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కథానాయకుడు మాట్లాడుతూ "ప్రేమకథకి థ్రిల్లింగ్ అంశాల్ని జోడించి తెరకెక్కించిన చిత్రమిది. తమిళంలో విడుదలై విజయవంతమైన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్నీ మెప్పిస్తుంది. మంచి సినిమాకి భాషాపరమైన హద్దులు లేవు. కథపై ఉన్న నమ్మకమే ఈ చిత్రాన్ని తెలుగులోకి తీసుకు రావడానికి కారణమైంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కొత్త రకమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. శ్రీరామ్ నటన ఆకట్టుకుంటుంది" అన్నారు. "అభిరుచి కలిగిన దర్శకనిర్మాతలు, ప్రతిభ కలిగిన నటీనటులు, సాంకేతిక నిపుణులు కలిసి చేసిన చిత్రమిది. తమిళం తరహాలోనే తెలుగులోనూ ఘన విజయాన్ని సొంతం చేసుకుంటుంది. ఈ సినిమాతో పరిటాల రాంబాబు పంపిణీదారుడిగా మారడం ఆనందంగా ఉంద"న్నారు అతిథులు. ఈ చిత్రానికి సంగీతం: జుబిన్, ఛాయాగ్రహణం: యువరాజ్.ఎం.

మరణ శిక్ష నేపథ్యంలో సన్నీ చిత్రం


సన్నీ దేవోల్

ప్రేక్షకులను అలరించడమే లక్ష్యంగా వైవిధ్యమైన కథలతో ఓటీటీ వేదికగా కూడా మెప్పిస్తున్నారు సినీతారలు. కొన్ని రోజులుగా బాలీవుడ్ సీనియర్ కథానాయకుడు సన్నీ దేవోల్ ఓటీటీలో అడుగుపెడుతున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ ప్రాజెక్టు గురించి మరో ఆసక్తికర విషయం బాలీవుడ్‌లో సందడి చేస్తోంది. ఈ చిత్రాన్ని హాలీవుడ్ థ్రిల్లర్ 'డెత్ సెంటెన్స్' సినిమా ఆధారంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. దీనికి సిద్ధార్థ్ పి. మల్హోత్రా దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. "సుపర్ణ్ వర్మ నిర్మిస్తున్న ఈ సినిమా సన్నీ కెరీర్‌లో మైలు రాయిగా నిలిచిపోతుంది. మరణ శిక్ష నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ యాక్షన్ చిత్రంతో బాలీవుడ్‌కి కొత్త కళ వస్తుంది. జులైలో దీన్ని పట్టాలెక్కించనున్నారు. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నార"ని సన్నీ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

పూరితో సినిమా కోసం ఎదురు చూస్తున్నా!


విజయ్ సేతుపతి

"ఒకేసారి కాకుండా రెండు రోజులపాటు కథ వినాలనుకున్నా. కానీ దర్శకుడు పూరి జగన్నాథ్ కథ చెబుతుంటే అలా మూడున్నర గంటలు వింటూనే ఉన్నా. ఆయన కథ చెప్పిన తీరు అంతగా నచ్చింది. ఆయనతో కలిసి చేయనున్న సినిమా కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నా" అన్నారు ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి. ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన 'ఏస్' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఆరుముగ కుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రమిది. రుక్మిణీ వసంత్ కథానాయిక. దివ్య పిళ్లై కీలక పాత్ర పోషించారు. బి.శివప్రసాద్ తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. విజయ్ సేతుపతి మాట్లాడుతూ 'యాక్షన్, హాస్యంతోపాటు రొమాంటిక్ అంశాల మేళవింపుతో కూడిన మంచి చిత్రమిది" అన్నారు. పూరితో కలిసి చేస్తున్న సినిమాపై అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ... "ఆ సినిమాకి ఇంకా పేరు ఖరారు చేయలేదు. పోస్టర్లు కూడా ఎవరో ఏఐ నుంచి తీసినవే వైరల్ అవుతున్నాయి. వచ్చే నెలలో ఆ సినిమా ప్రారంభం అవుతుంది. దర్శకుడు పూరి జగన్నాథ్ ఆ కథని తయారు చేసిన విధానం చాలా బాగుంది" అన్నారు.

దర్శకనిర్మాత మాట్లాడుతూ "విజయ్ సేతుపతి ఒక ఆల్‌రౌండర్. ఆయన సినిమా అంటే అన్ని రకాల వాణిజ్యాంశాలు ఉంటాయి. ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అన్నారు. తెలుగు ప్రేక్షకుల ముందుకు సినిమాని తీసుకొస్తున్న బి.శివప్రసాద్ మాట్లాడుతూ "ఈ సినిమా కథ, పాత్రలు అద్భుతంగా ఉండబోతున్నాయి. విజయ్ సేతుపతి మంచి వ్యక్తి. అన్నీ సెట్ అయితే ఆయనతో 'రొమాంటిక్ డాన్' అనే సినిమాని త్వరలోనే ప్రకటిస్తాం" అన్నారు.

ఈనాడు బిజినెస్

చమురు ధరలు చల్లబడతాయ్

జులైలోనూ ఉత్పత్తి పెంచేందుకు ఒపెక్+యోచన



కొవిడ్ సమయంలో తగ్గిన గిరాకీ వల్ల, ధరలు మరీ క్షీణించకుండా చూసేందుకు చమురు ఉత్పత్తిలో కోతను ప్రారంభించిన చమురు ఎగుమతి దేశాల సమాఖ్య (ఒపెక్) ఇప్పుడు ఉత్పత్తి పెంపుపై దృష్టి సారిస్తోంది. కొవిడ్ పరిణామాల తదుపరి కూడా ధరలు స్థిరంగా ఉండేందుకు, ఉత్పత్తిని ఐదేళ్ల వరకు పెద్దగా పెంచలేదు. అయితే ప్రపంచ చమురు విపణిలో తమ వాటా తగ్గుతుండటం, అమెరికా అధ్యక్షుడి ఒత్తిడి వల్ల చమురు ఉత్పత్తి పెంచేందుకు ఇటీవలే అంగీకరించాయి. ఈ ఏడాది మిగిలిన కాలంలో ఆర్థిక పరిస్థితుల వల్ల, చమురు గిరాకీలో వృద్ధి నెమ్మదించవచ్చని అంచనాలే ఉన్నా... ఒపెక్ దేశాలు చమురు ఉత్పత్తి పెంచుతున్నాయి.

మే, జూన్ తరహాలోనే

ఈ ఏడాది జులైలో చమురు ఉత్పత్తిని భారీగా పెంచడానికి ఒపెక్+ దేశాలు సన్నాహాలు చేస్తున్నాయి. రోజుకు అదనంగా 4,11,000 బ్యారెళ్ల చమురు ఉత్పత్తికి సిద్ధమవుతున్నాయి. ఇంతకు ముందు ప్రణాళిక లతో పోలిస్తే ఇది మూడు రెట్లు అధికం. ఇదే మొత్తంలో మే, జూన్ నెలల్లోనూ సరఫరాను ఒపెక్+ పెంచుతోంది. జులై నెలకు సంబంధించిన ప్రతిపాదనపై జూన్ 1న తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఒపెక్+ తాజా నిర్ణయంతో మార్కెట్లో గిరాకీ కంటే అధికంగా చమురు సరఫరా కానుంది. ఇప్పటికే అధిక సరఫరా కారణంగా చమురు ధర తగ్గి, బ్యారెల్ 60 డాలర్ల వద్ద ఉంది. కొన్నేళ్లుగా చమురు ధరకు మద్దతు ఇచ్చేందుకు, ఉత్పత్తి కోత పాటించిన ఒపెక్+, ఇప్పుడు వందా మార్చుకుంది. ఇప్పుడు ధరలు తగ్గినా కూడా సరఫరా పెంచడంపైనే దృష్టి పెట్టాలని భావిస్తోంది.

✦ 2025, 2026 సంవత్సరాల్లో చమురు ఉత్పత్తి ఎంత ఉండాలనే అంశంపై చర్చించడానికి ఈనెల 28న ఒపెక్‌లోని మొత్తం 28 సభ్యదేశాలు సమావేశం కానున్నాయి. గిరాకీని అందుకోవడానికి ఉత్పత్తి పెంచుతున్నట్లు ఒపెక్+ చెబుతోంది. అయితే తగ్గిన మార్కెట్ వాటాను తిరిగి పొందేందుకు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి వస్తున్న ఒత్తిడి కారణంగానే చమురు ఉత్పత్తి పెంచుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

✦ ఉత్పత్తి కోటాకు కట్టుబడి ఉండకపోతే తాము కూడా సరఫరా పెంచుతామని ఇరాక్, కజకిస్థాన్‌లను ఒపెక్+లో అత్యంత శక్తిమంత దేశమైన సౌదీ అరేబియా ఇటీవల హెచ్చరించింది. ఫలితంగా ఉత్పత్తిలో మార్పులు చేపడతామని కజకిస్థాన్ హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయలేదు. ఆ దేశంలో పనిచేస్తున్న అంతర్జాతీయ చమురు కంపెనీలు, కొన్ని రికార్డు స్థాయిల్లోనే ముడిచమురు ఎగుమతులు చేస్తున్నాయి.

నవంబరు కల్లా అదనంగా 22 లక్షల బ్యారెళ్లు

ఈ ఏడాది నవంబరు కల్లా ఒపెక్+ దేశాలు, రోజుకు అదనంగా 22 లక్షల బ్యారెళ్ల చమురు ఉత్పత్తి చేయొచ్చని వార్తా సంస్థ రాయిటర్స్ పేర్కొంది. జులై ఉత్పత్తి పెంపులో ఎక్కువ భాగం సౌదీ నుంచే ఉంటుందని వెల్లడించింది. జులైలో ఉత్పత్తి పెంపునకు ఒపెక్+ అంగీకరించొచ్చని, భవిష్యత్‌లో మరిన్ని పెంపులు ఉండకపోవచ్చని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేస్తోంది.

✦ అమెరికా నిల్వల గణాంకాల వల్ల చమురు ధరలు తాజాగా ఒత్తిడికి గురయ్యాయి. అమెరికా నిల్వలు 1.3 మి.బ్యారెళ్లు పెరిగి 443.2 మి.బ్యారెళ్లకు చేరాయి. అమెరికా చమురు దిగుమతులు 6 వారాల గరిష్ఠానికి చేరడం, గ్యాసోలిన్, డీజిల్‌కు గిరాకీ తగ్గడం వంటివి ప్రభావం చూపాయి.



భారత్‌లో శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్25 ఎడ్జ్ తయారీ

దిల్లీ: అత్యంత పలుచని స్మార్ట్‌ఫోన్ గెలాక్సీ ఎస్25 ఎడ్జ్ తయారీని భారత్‌లో ప్రారంభించినట్లు దక్షిణ కొరియా స్మార్ట్‌ఫోన్ దిగ్గజం శామ్‌సంగ్ గురువారం వెల్లడించింది. ఈ స్మార్ట్‌ఫోన్‌ను భారత్ సహా అంతర్జాతీయ మార్కెట్లలో ఈనెల 13న విపణిలోకి విడుదల చేసింది. 'పలుచగా ఉండటంతో పాటు తేలికపాటి ఫోన్లను కోరుకునే వారి కోసం గెలాక్సీ ఎస్25 ఎడ్జ్ తీసుకొచ్చాం. మల్టీమోడల్ ఏఐ సహా పలు కృత్రిమమేధ (ఏఐ) ఫీచర్లు ఇందులో ఉన్నాయి. విజన్, వాయిస్ ద్వారా ఈ ఫోన్‌తో వినియోగదారులు సంభాషించగలరు. దేశంలోని నోయిడా ప్లాంట్‌లో ఈ ఫోన్లను ఉత్పత్తి చేస్తున్నాం' అని శామ్‌సంగ్ అధికార ప్రతినిధి తెలిపారు. క్వాల్‌కామ్ ఏఐ చిప్‌సెట్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ మొబైల్ ప్లాట్‌ఫామ్‌పై రూపొందించిన ఈ ఫోన్ ధర రూ.1.09- 1.22 లక్షల మధ్య ఉంది.

రాణించిన మాస్‌చిప్ టెక్నాలజీస్

ఈనాడు, హైదరాబాద్: మార్చి త్రైమాసికానికి మాస్‌చిప్ టెక్నాలజీస్ రూ.134.71 కోట్ల ఆదాయం, రూ.8.69 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2023-24 ఇదే కాలంలో ఆదాయం రూ.75.42 కోట్లు, లాభం రూ.0.87 కోట్లతో పోల్చితే గణనీయంగా పెరిగాయి. 2024-25 పూర్తికాలానికి ఈ సంస్థ రూ.466.84 కోట్ల ఆదాయం, రూ.33.46 కోట్ల నికరలాభం ఆర్జించింది. సిబ్బంది సంఖ్య 18% పెరిగింది.


కోడి గుడ్డు

23న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్ల ధర రూపాయల్లో)

హైదరాబాద్	500
వరంగల్	502
విజయవాడ	530
గోదావరి	517
విశాఖపట్నం	545
చిత్తూరు	613

టాటా మోటార్స్ సరికొత్త అల్ట్రోజ్

ధర రూ.6.89- 11.29 లక్షలు



ముంబయి: టాటా మోటార్స్ తన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ మోడల్ అల్ట్రోజ్‌లో కొత్త వెర్షన్‌ను విపణిలోకి విడుదల చేసింది. ఈ మోడల్ పరిచయ ధరలు రూ.6.89 - 11.29 లక్షల శ్రేణిలో ఉన్నాయి. పెట్రోల్, సీఎన్‌జీ, డీజిల్ వేరియంట్లలో ఈ కారు లభించనుంది. హ్యాచ్‌బ్యాక్ విభాగంలో ఎక్కువ మోడళ్లు ఉన్నందున, ప్రస్తుతానికి అల్ట్రోజ్ విద్యుత్ వెర్షన్‌ను తీసుకొచ్చే ప్రణాళికలను నిలిపివేసినట్లు కంపెనీ తెలిపింది. రూ.8-15 లక్షల విభాగంలో ఇప్పటికే టియాగో, పంచ్, నెక్సాన్ విద్యుత్ కార్లను సంస్థ విక్రయిస్తోంది. డ్యూన్ గ్లో, ఎంబర్ గ్లో, ప్యూర్ గ్రే, రాయల్ బ్లూ, ప్రిస్టీన్ వైట్ రంగుల్లో కొత్త అల్ట్రోజ్ లభించనుంది. 5-స్టార్ జీఎన్‌క్యాప్ రేటింగ్‌తో ఈ కారు వస్తోంది. ఇది హోల్డ్ అసిస్టెంట్, ఎయిర్‌బ్యాగ్స్, ఫాగ్ ల్యాంప్స్, హిల్ హోల్డ్ అసిస్టెంట్, సన్‌రూఫ్, వైర్‌లెస్ ఛార్జర్, 360 డిగ్రీల కెమెరా, ఎస్ఓఎస్ కాల్ ఫంక్షన్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయని కంపెనీ ఎండీ శైలేశ్ చంద్ర పేర్కొన్నారు.

పీవీ విక్రయాల వృద్ధి 5% లోపే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రయాణికుల వాహనాల (పీవీ) విక్రయాల వృద్ధి ఒక అంకె (1-5%)గా ఉండొచ్చని టాటా మోటార్స్ అంచనా వేసింది. పరిశ్రమ సంఘం సియామ్ వృద్ధి అంచనా (1-4%) కు అనుగుణంగానే ఇవి ఉన్నాయి.

ఐటీసీ లాభం రూ.6,417 కోట్లు

దిల్లీ: వినియోగదారు ఉత్పత్తుల దిగ్గజ సంస్థ ఐటీసీ, మార్చి త్రైమాసిక లాభం 2% పెరిగింది. గ్రామీణ గిరాకీ రాణించడం, సిగరెట్ల వ్యాపారంలో స్థిర వృద్ధి ఇందుకు దోహదం చేశాయి. కంపెనీ స్టాండలోన్ నికర లాభం (వన్నులు, అసాధారణ అంశాలకు ముందు) జనవరి-మార్చిలో రూ.6,416.85 కోట్లుగా నమోదైంది. 2023-24 ఇదే కాల లాభం రూ.6,287.57 కోట్లుగా ఉంది. ఈ ఏడాది జనవరిలో జరిగిన హోటల్ వ్యాపార విభజనను పరిగణనలోకి తీసుకున్నాకే, తాజా ఫలితాలను ప్రకటించారు. ఐటీసీ హోటల్స్ విభజన వల్ల రూ.15,179 కోట్ల మేర ఏకమొత్తం ప్రయోజనాలు కలిగాయి.

✦ సిగరెట్ల వ్యాపార ఆదాయాలు 4% పెరిగి రూ.5,118 కోట్లకు చేరాయి. ఆశీర్వాద్, సన్‌ఫీస్ట్, బింగో వంటి బ్రాండ్లు ఉన్న వినియోగదారు వస్తువుల విభాగ ఆదాయం 3.7% మేర రాణించి రూ.5,495 కోట్లకు చేరింది. దీంతో స్థూల ఆదాయం 9.2% వృద్ధితో రూ.18,266 కోట్లకు చేరుకుంది. ఎబిటా 2.5% పెరిగి రూ.5,986 కోట్లుగా నమోదైంది.

✦ 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.73,465 కోట్ల ఆదాయంపై రూ.20,092 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఆదాయం రూ.66,657 కోట్లు, రూ.19,910 కోట్ల లాభం నమోదయ్యాయి. స్థూల ఆదాయం 10.2%, ఎబిటా 2.3% రాణించాయి.

✦ ఒక్కో షేరుకు తుది డివిడెండుగా రూ.7.85ను ప్రకటించారు.

కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌పై ఎన్‌హెచ్ఏఐ నిషేధం

దిల్లీ: కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌పై ఎన్‌హెచ్ఏఐ (జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ) కఠిన చర్య తీసుకుంది. ప్రస్తుత రోడ్డు ప్రాజెక్టులతో పాటు భవిష్యత్తులో ప్రకటించే రోడ్డు ప్రాజెక్టుల బిడ్డింగ్‌లో పాల్గొనకుండా ఈ కంపెనీని నిషేధించింది. కేరళ రాష్ట్రంలోని ఎన్‌హెచ్-66 లో రామనట్టుకర- వలాంచెరి సెక్షన్‌లో రీ-ఇన్‌ఫోర్స్‌డ్ ఎర్త్ వాల్ నిర్మాణంలో కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ విఫలమైనందునే ఈ చర్య తీసుకుంది. ఆ కాంట్రాక్టును కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ నిర్వహిస్తోంది. నేల స్థితిగతులను సరిగా అధ్యయనం చేయకుండా, గట్టి పునాదులు నిర్మించకుండా పనులు చేపట్టడం వల్లే ఈ పరిస్థితి ఎదురైనట్లు ఎన్‌హెచ్ఏఐ అభిప్రాయపడింది. ఈ ప్రాజెక్టు కన్సల్టెంట్ అయిన హైవే ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌పైనా ఇదే చర్య తీసుకుంది.

అస్త్ర మైక్రోవేవ్ మెరుగైన ఫలితాలు

ఈనాడు, హైదరాబాద్: అస్త్ర మైక్రోవేవ్ ప్రోడక్ట్స్ ఏకీకృత ఖాతాల ప్రకారం మార్చి త్రైమాసికానికి రూ.408 కోట్ల ఆదాయంపై, రూ.73 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదేకాలంలో ఆదాయం రూ.354 కోట్లు, నికరలాభం రూ.54 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే నికరలాభం 35% పెరిగింది. 2024-25 పూర్తి కాలానికి ఈ సంస్థ రూ.1051 కోట్ల ఆదాయం, రూ.154 కోట్ల నికరలాభం నమోదు చేసింది. ప్రస్తుతం కంపెనీ చేతిలో రూ.2,304 కోట్ల ఆర్డర్లు ఉన్నాయి. ఇందులో రూ.150 కోట్ల సర్వీస్ అర్డర్లు కలిసే ఉన్నాయి.

ఇంద్రజాల్ నుంచి సరికొత్త రక్షణ కవచం

ఈనాడు, హైదరాబాద్: రక్షణ డ్రోన్ల కంపెనీ అయిన ఇంద్రజాల్ కొత్తగా 'ఇంద్రజాల్ ఇన్‌ఫ్రా' అనే వినూత్న రక్షణ కవచాన్ని ఆవిష్కరించింది అణు విద్యుత్తు కేంద్రాలు, విమానాశ్రయాలు, ఆయిల్ రిఫైనరీలు, నౌకాశ్రయాలు, విద్యుత్తు గ్రిడ్ వంటి కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను డ్రోన్ దాడుల నుంచి రక్షించడానికి దీన్ని వినియోగిస్తారు. ఇంద్రజాల్‌కు చెందిన అత్యంత ఆధునాతన 'స్కైఓఎస్' ప్లాట్‌ఫామ్ ఆధారంగా దీన్ని రూపొందించారు. దాదాపు 4,000 చదరపు కిలోమీటర్ల పరిధిలో రక్షణ కవచాన్ని ఇంద్రజాల్ రూపొందించగలుగుతుంది. ఏఐ ఆధారిత ముప్పును పసిగట్టే సాంకేతిక పరిజ్ఞానం, సెన్సర్లు, స్మార్ట్ జామర్లు, కమాండ్ ఇంటెలిజెన్స్ ఇందులో ఉంటాయి. ఇప్పటికే ఈ వ్యవస్థను గుజరాత్‌లోని ఒక పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టు వద్ద అమలు చేశారు. కర్ణాటకలోని మరొక నౌకాశ్రయంలో కూడా దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు బాగా పెరిగిన నేపథ్యంలో ఇటువంటి రక్షణ వ్యవస్థలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని ఇంద్రజాల్ సీఈఓ కిరణ్ రాజు పేర్కొన్నారు.

26 నుంచి బ్లూ వాటర్ లాజిస్టిక్స్ ఐపీఓ

రూ.40.50 కోట్ల సమీకరణకు సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సేవల సంస్థ, బ్లూ వాటర్ లాజిస్టిక్స్, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కి రానుంది. ఫ్రైట్ ఫార్వర్డింగ్, కస్టమ్ క్లియరెన్స్, ట్రాన్స్‌పోర్టేషన్ హ్యాండ్లింగ్ సర్వీసులను ఈ సంస్థ అందిస్తోంది. ఐపీఓ ద్వారా రూ.40.50 కోట్లు సమీకరించనుంది. రూ.132- 135 ధరల శ్రేణిని నిర్ణయించారు. 30 లక్షల షేర్లను కొత్తగా జారీ చేయనున్నారు, యాంకర్ ఇన్వెస్టర్ల విభాగంలో 8.35 లక్షల షేర్లను రిజర్వు చేశారు. సమీకరించే నిధుల్లో 20 కొత్త వాహనాల కోసం రూ.10.51 కోట్లు, నిర్వహణ అవసరాలకు రూ.20 కోట్లు ఖర్చు చేస్తారు. మిగిలిన సొమ్మును కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తారు. 2010లో ప్రారంభమైన ఈ కంపెనీకి 5 నగరాల్లో శాఖలుండగా, 25 సొంత వాహనాలున్నాయి. 2024-25లో రూ.196.18 కోట్ల ఆదాయంపై రూ.10.67 కోట్ల నికరలాభాన్ని ఈ కంపెనీ ఆర్జించింది.

రిలయన్స్ డిఫెన్స్, రైన్‌మెటల్ వ్యూహాత్మక భాగస్వామ్యం

దిల్లీ: ఆయుధ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని జర్మనీ సంస్థ రైన్‌మెటల్, అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ డిఫెన్స్ కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంపై రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాయోజిత రిలయన్స్ డిఫెన్స్, రైన్‌మెటల్ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా మధ్య నుంచి భారీ స్థాయి ఆయుధాల కోసం పేలుడు పదార్థాలు, ప్రొపెల్లంట్స్‌ను రైన్‌మెటల్‌కు రిలయన్స్ సరఫరా చేస్తుంది. భవిష్యత్తు అవకాశాల ఆధారంగా సహకారాన్ని పొడిగించుకుంటామని ఇరు కంపెనీలు తెలిపాయి. ఈ భాగస్వామానికి అవసరమైన ఉత్పత్తి కోసం మహారాష్ట్ర రత్నగిరిలోని వటాడ్ ఇండస్ట్రియల్ ఏరియాలో కొత్త తయారీ కేంద్రాన్ని రిలయన్స్ డిఫెన్స్ ఏర్పాటు చేయనుంది. ఆసియాలోనే పెద్ద తయారీ కేంద్రాల్లో ఇది ఒకటని, ఏడాదికి 2,00,000 వరకు ఆర్టిలరీ షెల్స్, 10,000 టన్నుల పేలుడు పదార్థాలు, 2,000 టన్నుల ప్రొపెల్లంట్స్‌ను ఇక్కడ ఉత్పత్తి చేస్తామని రిలయన్స్ గ్రూప్ ప్రకటించింది.

చిన్న నగరాలకు రాపిడో సేవలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని మరో 11 నగరాలకు తమ సేవలు విస్తరించినట్లు రాపిడో తెలిపింది. సిద్దిపేట, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, రామగుండం, నిజామాబాద్, నల్గొండ, భువనగిరి, కొత్తగూడెం, సూర్యాపేట, ఆదిలాబాద్, కామారెడ్డి ఇందులో ఉన్నాయి. దేశంలోని 500 నగరాల్లో సేవలు అందించాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఈ విస్తరణ ఉందని, వందల మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి తెలిపారు.

బజాజ్ ఆటో చేతికి కేటీఎం!

దిల్లీ: ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆస్ట్రియా బైక్ తయారీ సంస్థ కేటీఎంలో మెజార్టీ వాటాను తన అనుబంధ సంస్థ బజాజ్ ఆటో ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ బీవీ ద్వారా కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు బజాజ్ ఆటో వెల్లడించింది. ఇందుకోసం 800 మిలియన్ యూరోల (సుమారు రూ.7,765 కోట్ల) డెట్ ఫండింగ్ ప్యాకేజీని సమకూరుస్తోంది. ఇప్పటికే 200 మిలియన్ యూరోలు ఇచ్చేసింది కూడా. మొత్తం నిధులు ఇవ్వగానే గ్లోబల్ కేటీఎం కంపెనీలో బజాజ్ ఆటో, మైనార్టీ పెట్టుబడిదారు స్థాయి నుంచి మెజార్టీ వాటా కలిగిన యజమానిగా మారబోతోంది.

సూచీల షేర్లలో మార్పులు

ముంబయి: సెన్సెక్స్-30 సూచీలోకి ట్రెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు చేరనున్నట్లు బీఎస్ఈ అనుబంధ సంస్థ ఆసియా ఇండెక్స్ తెలిపింది. నెస్లే ఇండియా, ఇండస్ఇండ్ బ్యాంక్‌లను ఇవి భర్తీ చేయనున్నాయి. ఈ మార్పులు జూన్ 23 నుంచి అమల్లోకి రానున్నాయి. బీఎస్ఈ-100 సూచీలో డిక్సన్, కోఫోర్జ్, ఇండస్ టవర్స్ చేరనుండగా, భారత్ ఫోర్జ్, డాబర్ ఇండియా, సీమెన్స్ వైదొలగనున్నాయి. బీఎస్ఈ 50 సూచీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్ చేరుతుంటే, బ్రిటానియా, హీరో మోటో కార్ప్ తప్పుకుంటున్నాయి.

అభ్యాసం, కెరీర్ వృద్ధికి యువత ప్రాధాన్యం

- ఉద్యోగ నిర్ణయాల్లో ఇవే కీలకాంశాలు
- 2025 డెలాయిట్ గ్లోబల్ జెన్‌జెడ్ అండ్ మిలీనియల్ సర్వే



ముంబయి: ఆటోమేషన్, జెన్ ఏఐ (కృత్రిమమేధ), మారుతున్న అంచనాలతో పని ప్రదేశాలు అభివృద్ధి చెందుతున్నాయని '2025 డెలాయిట్ గ్లోబల్ జెన్ జెడ్ అండ్ మిలీనియల్' సర్వే గురువారం వెల్లడించింది. దేశంలోని యువ శ్రామిక శక్తి (30 ఏళ్లలోపు -జెన్ జెడ్, 45 ఏళ్లలోపు-మిలీనియల్స్) ఉద్యోగ నిర్ణయాల్లో కెరీర్ పురోగతి, అభ్యాస అవకాశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపింది. ఈ సర్వే ప్రకారం..

❒ దేశంలోని యువత భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మారడమే కాకుండా, నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకుంటున్నారు. 85 శాతం మంది వారం వారీగా తమ నైపుణ్యాలను పెంచుకోవడంపై దృష్టి సారిస్తున్నారు.

❒ మేనేజర్ల నుంచి చురుకైన మెంటార్‌షిప్ కోరుకునే వారిలో సగం మందే దాన్ని పొందుతున్నారు.

❒ వేగంగా మారుతున్న ఉద్యోగ విపణికి సంప్రదాయ విద్యా వ్యవస్థ, డిగ్రీలు సరిపోతాయా అనే అనుమానాలు వీరి నుంచి వ్యక్తమయ్యాయి. 94 శాతానికి పైగా జెన్ జెడ్‌లు, 97% మంది మిలీనియల్స్ థియరీ కంటే అనుభవానికే (ప్రాక్టికాలిటీ) విలువ ఇస్తున్నట్లు తెలిపారు.

❒ 52% మంది జెన్‌జెడ్‌లు, 45% మంది మిలీనియల్స్ ఉన్నత విద్య నాణ్యతపై అసంతృప్తిగా ఉన్నారు. 33% జెన్ జెడ్‌లు, 29% మిలీనియల్స్ తాము అన్ని సమయాల్లో లేదా ఎక్కువ సమయం ఒత్తిడి/ఆందోళనకి గురవుతున్నామని చెప్పారు. తమ ఉద్యోగ బాధ్యతలే ఈ ఒత్తిడికి కారణమవుతున్నాయని 36 శాతానికి పైగా జెన్ జెడ్‌లు, 39% మంది మిలీనియల్స్ వెల్లడించారు.

సంస్థలూ పని సంస్కృతి నిర్మించుకోవాలి: ఉద్యోగంలో నేర్చుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు జెన్ ఏఐ వంటి సాంకేతికతలతో అనుసంధానించిన కెరీర్‌లను యువత నిర్మించుకుంటోందని డెలాయిట్ ఇండియా చీఫ్ హ్యాపినెస్ ఆఫీసర్ సరస్వతి కస్తూరిరంగన్ వెల్లడించారు. ఉద్యోగ సంస్థలు కూడా వృద్ధి, ఆవిష్కరణలు, నిరంతర అభ్యాసం వంటి పని సంస్కృతిని నిర్మించుకోవాలని సూచించారు. ఉద్యోగుల ఆనందం, శ్రేయస్సుకు సంస్థలు ఎలా ప్రాధాన్యం ఇస్తున్నాయో ఒకసారి పునరాలోచించుకోవాలని సరస్వతి సూచించారు. శారీరక, మానసిక, ఆర్థిక శ్రేయస్సు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయని, నాయకత్వంలోని అత్యున్నత స్థాయిల్లో దీన్ని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.

❒ 809 మంది భారతీయ వృత్తి నిపుణులు, 505 మంది జెన్ జెడ్‌లు, 304 మంది మిలీనియల్స్ నుంచి స్పందనలు స్వీకరించి ఈ సర్వే నివేదికను రూపొందించారు.

ఇండస్‌ఇండ్ బ్యాంక్‌కు మరింత మూలధనం

- అవసరమైతే ఇస్తాం
- ప్రమోటరు గ్రూప్ ఐఐహెచ్ఎల్ ఛైర్మన్ హిందుజా

ముంబయి: ఇండస్‌ఇండ్ బ్యాంక్ తాత్కాలిక యాజమాన్యం చేపట్టే చర్యలు.. ఆ బ్యాంక్‌పై విశ్వాసాన్ని తిరిగి తీసుకురావడానికి సహాయం చేస్తాయని ప్రమోటరు గ్రూప్ ఐఐహెచ్ఎల్ ఛైర్మన్ అశోక్ హిందుజా పేర్కొన్నారు. బ్యాంకుకు అవసరమైతే మరింత మూలధన సహాయం చేయడానికి ఐఐహెచ్ఎల్ కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. 'బ్యాంకు ఛైర్మన్, బోర్డు డైరెక్టర్లపై మాకు అచంచల విశ్వాసం ఉంది. లోటుపాట్లు సరిచేసే దిశగా వారు తీసుకునే సరైన, వేగవంత చర్యలతో పారదర్శకత, పాలన, నేతృత్వం అంశాల్లో అత్యున్నత ప్రమాణాలను ఏర్పాటు చేస్తారు. దీంతో బ్యాంకుపై నమ్మకం తిరిగి వస్తుంద'ని హిందుజా అన్నారు.

సెబీ దృష్టి: ఇండస్‌ఇండ్ బ్యాంక్ సీనియర్ మేనేజ్‌మెంట్ ఏవైనా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడిందా అన్న కోణంలో సెబీ దృష్టి సారించింది. ఆ బ్యాంకు అకౌంటింగ్ మోసం విషయం ఆర్‌బీఐ చూసుకుంటుందని, అయితే వారి వల్ల సెక్యూరిటీస్ మార్కెట్‌లో ఉల్లంఘనలేమైనా జరిగాయేమోనన్న అంశాన్ని సెబీ పరిశీలిస్తుందని ఛైర్మన్ తుహిన్ కాంత పాండే పేర్కొన్నారు. బ్యాంకులో జరిగిన మోసంలో కొంత మంది ఉద్యోగుల పాత్ర ఉందని అనుమానిస్తున్నట్లు, ఈ అంశాన్ని బ్యాంకు సంబంధిత దర్యాప్తు ఏజెన్సీలు, నియంత్రణాధికార సంస్థలకు చెప్పాలని బుధ బ్యాంకు బోర్డు ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే.

గుజరాత్ ప్లాంటులో అదనంగా 6.5 లక్షల వాహనాల తయారీ

రూ.920 కోట్లతో విస్తరణ: హెచ్ఎంఎస్ఐ

ముంబయి: గుజరాత్‌లోని విఠల్‌పూర్ వద్ద ఉన్న తన ప్లాంటులో నాలుగో ఉత్పత్తి విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తెలిపింది. ఇందుకోసం రూ.920 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. నూతన విభాగంలో వాహనాల తయారీ 2027లో ప్రారంభం అవుతుంది. దీనికి ఏటా 6.5 లక్షల వాహనాలను తయారు చేసే సామర్థ్యం ఉంది. తద్వారా ఈ ప్లాంటు మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 26.10 లక్షలకు చేరుతుంది. ప్రపంచంలో హోండా మోటార్‌సైకిల్‌కు అతిపెద్ద అసెంబ్లింగ్ ప్లాంటుగా ఇది నిలవనుంది. ప్రస్తుతం మనదేశంలో హెచ్ఎంఎస్ఐకు 4 ప్లాంట్లు ఉన్నాయి. ఈ ప్లాంట్ల మొత్తం వార్షిక తయారీ సామర్థ్యం 61.40 లక్షల వాహనాలు.

ఈ ఏడాదిలోనే రిలయన్స్ సౌర మాడ్యూల్ పరిశ్రమ

దిల్లీ: సౌర ఫొటో ఓల్టాయిక్ (పీవీ) మాడ్యూల్ తయారీ పరిశ్రమను ఈ ఏడాదిలోనే రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రారంభించనుంది. భారత్ స్వచ్ఛ ఇంధన లక్ష్యాన్ని సాధించడంలో తన వంతు సహకారం అందించేందుకు దీనిని ఏర్పాటు చేయనుంది. తన వార్షిక సామర్థ్యాన్ని దశలవారీగా పెంచుకుంటూ 20 గిగావాట్లకు చేర్చాలని కూడా కంపెనీ ప్రణాళికగా పెట్టుకుంది. తద్వారా సౌర పీవీ మాడ్యూళ్ల తయారీలో ప్రపంచంలోనే దిగ్గజ సంస్థగా అవతరించాలన్నది రిలయన్స్ లక్ష్యమని ఆ సంస్థ ప్రెసిడెంట్ (వ్యూహాలు, ఇనీషియేటివ్స్) పార్థా పి మైత్ర తెలిపారు..

1,11,000 డాలర్లకు బిట్‌కాయిన్



న్యూయార్క్: క్రిప్టో కరెన్సీలలో పేరొందిన బిట్‌కాయిన్ జోరు కొనసాగుతోంది. తొలిసారి దీని విలువ 1,11,000 డాలర్లను తాకింది. బిట్‌కాయిన్ దూకుడుకు సంస్థాగత మదుపర్ల నుంచి గిరాకీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధాన నిర్ణయాలు కారణమని చెబుతున్నారు. క్రిప్టో కరెన్సీని భారత్ వంటి దేశాలు గుర్తించడం లేదు. అయితే ట్రంప్ మాత్రం వీటికి మద్దతు ఇచ్చేలా వ్యవహరిస్తున్నారు. ఫలితంగానే గురువారం బిట్‌కాయిన్ విలువ 3.3% దూసుకెళ్లి 1,11,878 డాలర్ల వద్ద రికార్డు గరిష్ఠాన్ని చేరింది. రెండో అతి పెద్ద క్రిప్టో అయిన ఈథర్ విలువ కూడా 7.3% పెరిగింది.

మార్కెట్లు మళ్లీ కుదేలు

- అంతర్జాతీయ ప్రతికూల సంకేతాల ప్రభావం
- ఎఫ్ఎమ్‌సీజీ, ఐటీ షేర్లలో అమ్మకాలు

ఎఫ్ఐఐల విక్రయాలు- రూ.5,045.36 కోట్లు
డీఐఐల కొనుగోళ్లు- రూ.3,715 కోట్లు

సెన్సెక్స్ ▼645 80952 | నిఫ్టీ ▼204 24610

సమీక్ష



ఒక రోజు విరామంతోనే మార్కెట్లు మళ్లీ నష్టపోయాయి. అమెరికా బాండ్లపై ప్రతిఫలాలు పెరగడం, ఆ దేశ అప్పు భారం అధికమవ్వడంపై ఆందోళనలతో ప్రపంచ మార్కెట్లు డీలాపడటం ఇందుకు నేపథ్యం. ఐటీ, చమురు, ఎఫ్ఎమ్‌సీజీ రంగ షేర్లలో అమ్మకాలు.. మన సూచీల నష్టాలకు కారణమయ్యాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 36 పైసలు తగ్గి రూ.85.95 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1.42% నష్టపోయి 63.99 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

ప్రతికూల ధోరణిలో ప్రారంభం: సెన్సెక్స్ క్రితం ముగింపు (81,596.63)తో పోలిస్తే 274 పాయింట్ల నష్టంతో 81,323.05 వద్ద ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ 80,489.92 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని చేరింది. చివరకు 644.64 పాయింట్లు నష్టపోయి 80,951.99 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 203.75 పాయింట్లు కోల్పోయి 24,609.70 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,462.40 వద్ద కనిష్ఠాన్ని; 24,737.50 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది.

3 మినహా నష్టాల్లోనే..: సెన్సెక్స్ 30 షేర్లలో మూడు కంపెనీలు- ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్ మినహా మిగతా కంపెనీల షేర్లన్నీ నష్టాలను చవిచూశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా 2.59%, టెక్ మహీంద్రా 1.96%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.8%, పవర్‌గ్రిడ్ 1.74%, ఐటీసీ 1.58% డీలాపడ్డాయి.

✦ జనవరి- మార్చి త్రైమాసికానికి రూ.2,329 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించడంతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు గురువారం ట్రేడింగ్ ఆరంభం అయ్యాక బీఎస్ఈలో 6% వరకు నష్టపోయాయి. అవసరమైతే మరింత మూలధనం సమకూరుస్తామన్న ప్రమోటర్ల ప్రకటనతో, షేరు పుంజుకుని 1.82% లాభంతో రూ.785.10 వద్ద ముగిసింది.

✦ రోజ్ వ్యాలీ గ్రూపునకు చెందిన 30 స్థిరాస్తులను రూ.400 కోట్ల రిజర్వ్ ధర వద్ద జూన్ 27న వేలం వేయనున్నట్లు సెబీ తెలిపింది. మోసపూరిత పథకాల ద్వారా ఆ గ్రూప్ ప్రజల నుంచి సమీకరించిన నిధులను, తిరిగి వసూలు చేసే నిమిత్తం ఈ వేలాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొంది.

✦ బొరానా వేవ్స్ తొలి పబ్లిక్ ఆఫర్ ముగింపు రోజు నాటికి 148.77 రెట్ల స్పందన లభించింది.

✦ బెంగళూరులో 15,000 సీటింగ్ సామర్థ్యంతో కొత్త సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించేందుకు జర్మనీ ఐటీ సంస్థ ఎస్ఏపీ సిద్ధం అవుతోంది. ఈ ఏడాది ఆగస్టులో దీనిని ప్రారంభించనుంది.

✦ భారత వృద్ధిరేటు 2028 వరకు సగటున 6.4 శాతంగా ఉంటుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. 2023 నవంబరులో అంచనా వేసిన 6.2 శాతంతో పోలిస్తే పెంచింది.

నేటి బోర్డు సమావేశాలు

ఆజాద్ ఇంజినీరింగ్, స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ, రామ్‌కో ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అశోక్ లేలాండ్, గ్లెన్‌మార్క్ ఫార్మా, నారాయణ హృదయాలయ, బీఈఎంఎల్, ఫినోలెక్స్ ఇండస్ట్రీస్, ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్, రిలయన్స్ ఇన్‌ఫ్రా

జనవరి- మార్చి త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2024-25	నికర లాభం/(నష్టం) 2023-24	మొత్తం ఆదాయం 2024-25	మొత్తం ఆదాయం 2023-24
స్ట్రైడ్స్ ఫార్మా1	85.61	10.44	1,202.37	1,029.95
ఎంక్యూర్ ఫార్మా	197	121	2,116	1,771
దీపక్ ఫెర్టిలైజర్స్	277.66	229.96	2,716.99	2,158.56
గోకల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్	53	44	1,035	818
ఆల్‌ప్లెక్స్ సోలార్	35.31	6.28	327.38	120.62
ఇంటర్‌ఆర్క్ బిల్డింగ్2	38.68	29.69	470.58	390.23
లింకన్ ఫార్మా	11.62	18.8	161.30	149.51
టీబీఓ టెక్	59	45	446	369
హెచ్ఎఫ్‌సీఎల్	(83)	109	800.72	1,326

1) డివిడెండ్ రూ.4 2) డివిడెండ్ రూ.12.5



నడి వయసులో ధీమా

నలభై ఏళ్ల వయసు.. జీవితంలో ఇదొక కీలక దశ. చాలామంది ఈ వయసులో ఆర్థిక స్థిరత్వం సాధించి ఉంటారు. మరికొందరు ఇప్పుడిప్పుడే తమ భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకుంటారు.. ఎప్పుడో సంపాదన ప్రారంభమైనప్పుడు అంటే ఉద్యోగంలో చేరిన కొత్తలో చేసిన బీమా పాలసీలు.. ఇప్పటికీ కొనసాగించే వారూ ఉంటారు. పెరుగుతున్న బాధ్యతలకు అనుగుణంగా పాలసీల విలువను పెంచుకోకుంటే.. ముున్ముందు ఇబ్బందులు తప్పకపోవచ్చు.

బీమా పాలసీలు తీసుకున్నాం అంటే.. తీసుకున్నాం అన్నట్లు ఉంటే నడవని రోజులివి. ఏ పాలసీ తీసుకున్నాం.. దాని వల్ల మనకు ఎంత వరకూ ప్రయోజనం ఉంటుంది అనేది కచ్చితంగా లెక్కలు వేసుకోవాలి. ముఖ్యంగా 40 ఏళ్ల నడి వయసులోకి ప్రవేశించినప్పుడు.. ధీమాగా ఉండేలా బీమా పాలసీలను ఎలా ఎంచుకోవాలో చూద్దాం.

లెక్క వేసుకోండి..

ఉద్యోగంలో చేరినప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా ఉంటుంది. 21-22 ఏళ్ల వయసులో ఉద్యోగంలో చేరినప్పుడు బాధ్యతల బరువు ఉండదు. 40 ఏళ్ల వయసుకు చేరుకున్నాక ఎన్నో రకాల బాధ్యతలు నెత్తిమీదకు వస్తాయి. కాబట్టి, వాటికి తగ్గట్టుగా బీమా ఉందా లేదా అనే విషయంలో స్పష్టత ఉండాలి. మీపై ఆధారపడిన వారు ఎందరు? అప్పులేమున్నాయి? వార్షికాదాయం? భవిష్యత్తులో ఉన్న ఖర్చులు.. ఇలా అనేక రకాల లెక్కలు బీమా ఎంత కావలి అనేది విశ్లేషించేందుకు తోడ్పడతాయి.

రక్షణకే ప్రాధాన్యం

ఉద్యోగంలో చేరిన రోజుకూ.. ఇప్పటికీ ఆదాయంలో ఎంతో వృద్ధి కనిపిస్తుంది. అప్పటి లెక్కల ప్రకారం తీసుకున్న బీమా పాలసీకి ఇప్పటి అవసరాలకూ ఎంతో వ్యత్యాసం ఉంటుంది. చదువుకునే పిల్లలు.. పెద్దవారైన తల్లిదండ్రులు ఇలాంటివన్నీ చూసుకోవాలి. ఇలా పెరిగిన బాధ్యతలకు అనుగుణంగా బీమా పాలసీ విలువ కూడా అధికమవ్వాలి. తక్కువ ప్రీమియంతో ఎక్కువ రక్షణ కల్పించే టర్మ్ పాలసీని తీసుకోవడం ఇప్పుడు ఎంతో అవసరం. ఇంతకుముందే తీసుకుంటే దాని విలువ ప్రస్తుత మీ అవసరాలకు తగ్గట్టుగా ఉందా లేదా తనిఖీ చేసుకోండి. బీమా పాలసీల ఎంపికలో పెట్టుబడికి ప్రాధాన్యం ఉన్నవి కాకుండా పూర్తి రక్షణకే ప్రాధాన్యం ఇవ్వడం అవసరం.

ఆరోగ్యంగా..

వయసు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్య సమస్యలు రావడం సహజం. నలభైలోకి వచ్చేసరికి కొందరికి మధుమేహం, రక్తపోటులాంటి జీవన శైలి వ్యాధులు పెరుగుతుండటం గమనిస్తూనే ఉన్నాం. ఆరోగ్యంగా ఉన్నంత కాలం ఏ ఇబ్బందీ ఉండదు. ఒక్కసారి ఈ వ్యాధుల బారిన పడ్డామా.. ఇక ఆదాయంలో కొంత భాగం వీటికి ఖర్చు చేయక తప్పదు. ప్రస్తుతం వైద్య ద్రవ్యోల్బణం ఎప్పటికప్పుడు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో అనారోగ్యం వచ్చినప్పుడు మన దగ్గరున్న పొదుపు మొత్తం హరించుకుపోకుండా చూసుకోవాలి. దీనికి ఉత్తమ మార్గం.. ఆరోగ్య బీమా పాలసీని ఎంచుకోవడం. మీతోపాటు మీ కుటుంబంలోని అందరికీ ఆరోగ్య బీమా పాలసీ ఉండేలా చూసుకోండి. జీవిత బీమా తర్వాత రెండో స్థానం దీనికే ఇవ్వాలి. యాజమాన్యాలు అందించే బృంద ఆరోగ్య బీమా పాలసీ ఉన్నప్పటికీ.. సొంతంగా ఈ బీమా పాలసీ ఉండటం అవసరం.

తీవ్ర వ్యాధులకూ..

ప్రాణాంతక వ్యాధులైన క్యాన్సర్, గుండెపోటు, పక్షవాతంలాంటివీ ఇప్పుడు ఎంతోమందిని బాధిస్తున్నాయి. 30 ఏళ్లు దాటినప్పటి నుంచే ఏ వ్యాధి వస్తుందో అనే భయం వెన్నాడుతోంది. నడి వయసులో ఉన్నవారు వీటి విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. దురదృష్టవశాత్తూ ఇలాంటి వ్యాధుల బారినపడ్డా ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. ఇందుకోసం క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలను ఎంచుకోవడం మర్చిపోవద్దు. దీనిని ప్రత్యేకంగా తీసుకోవచ్చు. లేదా ప్రస్తుతం ఉన్న ఆరోగ్య బీమా పాలసీతో కలిపి తీసుకున్నా ఇబ్బందేమీ లేదు.

ప్రమాదంలో..

నిత్యం ఎన్నో ప్రమాద వార్తలు వింటుంటాం. ఇలా ప్రమాదం బారినపడ్డవారు శారీరకంగా వైకల్యంతో బాధపడే అవకాశాలున్నాయి. కొన్నిసార్లు మరణం సంభవించవచ్చు. ఇలాంటి అనుకోని సంఘటనలు కుటుంబాన్ని ఆర్థికంగా కుంగదీస్తాయి. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలను తీసుకోవడం ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎంతో అవసరం.

విలువ పెరగాలి..

ఇప్పటికే బీమా పాలసీలు తీసుకున్నాం.. ఇంకా అవసరమా? అనుకోకండి. ఒకసారి మీ అవసరాలను పూర్తిగా లెక్కలేసుకోండి. ప్రస్తుతం ఉన్న బీమా మొత్తంతోనే సరిపోతుందా? ఏమైనా పెంచుకోవాల్సిన అవసరం ఉందా? చూసుకోండి. మీ ఆదాయం పెరిగినప్పుడు మీ జీవిత బీమా విలువా దానితో సమానంగా ఉండాలి. ఒకసారి ఎంత మొత్తం కావాలో తెలుసుకున్నాక.. ఇప్పటికే ఉన్న పాలసీకి తోడుగా ఎంత అదనంగా తీసుకోవాలో స్పష్టత వస్తుంది. మంచి బీమా కంపెనీని ఎంచుకొని, ఆ మేరకు పాలసీ తీసుకోండి.

ఆలస్యం చేయొద్దు..

వయసు మీద పడుతున్న కొద్దీ జీవిత, ఆరోగ్య బీమా పాలసీలకు చెల్లించాల్సిన ప్రీమియం పెరుగుతుంది. నడివయసులోనే ఈ పాలసీల అవసరం ఎక్కువగా ఉంటుందన్నదీ విస్మరించొద్దు. బీమా కంపెనీలు 40 ఏళ్లు దాటిన వారికి పాలసీ ఇవ్వాలంటే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అడుగుతాయి. బీమా తీసుకోకుండా ఉండటం మంచిది కాదు. కాస్త అధిక ప్రీమియం ఉన్నా సరే.. వీలైనంత తొందరగా పాలసీలు తీసుకోవాలి.

కొన్ని లక్ష్యాలను సాధించటానికీ.. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకూ కొన్నిసార్లు అప్పు చేయడం సహజం. ఇల్లు, కారులాంటి వాటి కొనుగోలుకు రుణం తీసుకోవడం తప్పదు. మీరు ఎంచుకున్న రుణదాత మీ దరఖాస్తును తొందరగా ఆమోదించాలంటే ఏం చేయాలి? రుణం తీసుకునేందుకు మిమ్మల్ని మీరు ఎలా సిద్ధం చేసుకోవాలి? తెలుసుకుందాం.

అప్పు చేస్తున్నారా?

సిరి

siri@eenadu.net



రుణం తీసుకోవాలని అనుకున్నప్పుడు తిరిగి చెల్లించే సామర్థ్యం గురించి పూర్తిగా అవగాహన వేసుకోవాలి. మీ ప్రస్తుత ఆదాయం, స్థిరంగా ఉండే ఖర్చులు, బాధ్యతల ఆధారంగా రుణ వాయిదాల్ని చెల్లించే శక్తిని అంచనా వేయొచ్చు. సాధారణంగా నికర ఆదాయంలో ఖర్చులు దాదాపు 40-50 శాతం వరకూ ఉంటాయి. ఇలా ఉన్నప్పుడు రుణదాతలు మీ దరఖాస్తును వేగంగా ఆమోదించే అవకాశాలున్నాయి. కాబట్టి, రుణం తీసుకునే ముందు మీ ఖర్చులు 40 శాతానికి మించకుండా ఉండేలా చూసుకోవాలి.

క్రెడిట్ స్కోరును చూడండి..

బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణ దరఖాస్తును పరిశీలించేటప్పుడు రుణగ్రహీత క్రెడిట్ స్కోరు, నివేదికను పరిగణనలోకి తీసుకుంటాయి. మీ క్రెడిట్ రిపోర్టులో క్రెడిట్ స్కోరు, రుణం తిరిగి చెల్లింపు చరిత్ర, ఇప్పటికే కొనసాగుతున్న రుణ ఖాతాలు, పొదుపు ఖాతాల గురించి సమాచారం ఉంటుంది. రుణం తీసుకోబోయే ముందు సొంతంగానే క్రెడిట్ స్కోరును చూసుకోవాలి. ఇప్పుడు చాలా సంస్థలు నెలవారీ క్రెడిట్ రిపోర్టును ఉచితంగానే అందిస్తున్నాయి. ఎలాంటి క్రెడిట్ చరిత్ర లేనివారు.. ఫిక్స్‌డ్ డిపాజిట్ ఆధారిత క్రెడిట్ కార్డును తీసుకోవడం ద్వారా స్కోరును నిర్మించుకోవచ్చు. రెండుమూడేళ్లపాటు బిల్లుల చెల్లింపులు సరిగ్గా చేస్తే మంచి స్కోరును సాధించవచ్చు.

ఇవి పరిశీలించండి..

ఏ అవసరం కోసం రుణం తీసుకుంటున్నారు అనేది ముఖ్యం. ఇల్లు కొనుగోలు, వాహనం, వ్యక్తిగత రుణం ఇందులో ఏది తీసుకుంటున్నారు, దానికి ఏ బ్యాంకు లేదా ఆర్థిక సంస్థను సంప్రదించడం మంచిది అనే విషయంలో కొంత అవగాహన ఉండాలి. అప్పుడే సరైన చోట నుంచి రుణం తీసుకునేందుకు వీలవుతుంది. చాలామంది గృహరుణం తీసుకునేటప్పుడు బ్యాంకులను మాత్రమే పరిశీలిస్తుంటారు. గృహరుణ సంస్థలూ, బ్యాంకింగేతర రుణ సంస్థలూ ఇప్పుడు రుణాలను అందించేందుకు పోటీ పడుతున్నాయి. కాబట్టి, ఒకసారి అన్ని అవకాశాలనూ పరిశీలించి, తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.

చాలామంది రుణగ్రహీతలు తమకు అవసరమైన దానికంటే ఎక్కువ రుణం తీసుకునేందుకు ప్రయత్నిస్తారు. ఇది సరైన పద్ధతి కాదు. అవసరం మేరకే రుణాన్ని తీసుకోవడం మంచిది. రుణం తీసుకునేటప్పుడు వడ్డీ భారం ఉంటుంది. ఏ లక్ష్యం లేకుండా అప్పు తీసుకుంటే వడ్డీ చెల్లించేందుకు కష్టపడాలి తప్ప, మరో ప్రయోజనం ఉండదు.

అర్హత ఎంత మేరకు..

బ్యాంకు లేదా ఆర్థిక సంస్థ తమ విచక్షణ మేరకు ఒక వ్యక్తికి ఎంత రుణం ఇవ్వాలనేది నిర్ణయిస్తాయి. వారికి సొంత ప్రమాణాలు ఉంటాయి. అర్హత షరతుల్లో సాధారణంగా వయసు, నెలకు నికర ఆదాయం, ప్రస్తుతం ఉంటున్న నివాసం వివరాలు ఉంటాయి.

మీరు సంప్రదించే బ్యాంకు ఎలాంటి షరతులతో రుణం ఇస్తుందనేది ముందు తెలుసుకోవాలి. లేకపోతే దరఖాస్తు చేసిన తర్వాత అర్హత సరిపోలేదని దరఖాస్తును తిరస్కరించే అవకాశం ఉంది. ఇప్పుడు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఆన్‌లైన్‌లోనే రుణ ప్రక్రియను పూర్తి చేస్తున్నాయి. మీ బ్యాంకు నుంచి ఇలాంటి సౌకర్యం ఉందా అనేది తెలుసుకోండి.

మా అమ్మానాన్నలకు ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవాలని అనుకుంటున్నాం. ఇద్దరికీ 60 ఏళ్లపైనే ఉంటాయి. ప్రస్తుతానికి వారిద్దరికీ ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేవు. వారికి ఇప్పుడు పాలసీలు తీసుకోవచ్చా? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? - కృష్ణారావు

కుటుంబంలో అందరికీ ఆరోగ్య బీమా పాలసీ కచ్చితంగా ఉండాలి. మీ అమ్మానాన్నల కోసం పాలసీ తీసుకోవాలన్న ఆలోచన మంచిదే. ఎవరైనా అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి, సొంతంగా బిల్లు కట్టాల్సి వస్తే.. ఆర్థికంగా కనీసం 3-5 ఏళ్లపాటు వెనక్కి వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం దేశంలో వైద్య ద్రవ్యోల్బణం 10-12 శాతం వరకూ ఉంది. ఆరోగ్యపరంగా ఇబ్బందులు వచ్చినప్పుడు ఆర్థికంగా కష్టం రాకుండా ఉండాలంటే తగినంత ఆరోగ్య బీమా అవసరం. మీ అమ్మానాన్నలకు ఆరోగ్య సమస్యలేమీ లేవు అంటున్నారు కాబట్టి, పాలసీ తీసుకోవడం సులభమే. బీమా సంస్థ ముందుగా ఆరోగ్య పరీక్షలు చేయించాల్సిందిగా కోరవచ్చు. వచ్చిన ఫలితాలను బట్టి పాలసీపై నిర్ణయం తీసుకుంటుంది. కొన్నిసార్లు ప్రీమియం లోడింగ్ విధించే అవకాశం ఉంది. కొన్ని సంస్థలు ముందస్తు వ్యాధులకూ రక్షణ కల్పిస్తూ పాలసీలను ఇస్తున్నాయి. ఇందులో సహ-చెల్లింపు ఉండే అవకాశం ఉంటుంది.

సిప్.. పీపీఎఫ్.. ఏది మేలు?

మార్గదర్శి

క్రమానుగత పెట్టుబడి విధానం(సిప్)లో నెలకు రూ.10వేల వరకూ మదుపు చేయాలన్నది ఆలోచన. దీనికి బదులు పీపీఎఫ్ మంచిదని చెబుతున్నారు. నిజమేనా? దేన్ని ఎంచుకోవాలి? - ప్రవీణ్

ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్) కేంద్ర ప్రభుత్వ హామీతో ఉన్న పథకం. ఇందులో ప్రస్తుతం 7.2 శాతం వడ్డీ లభిస్తోంది. 15 ఏళ్ల లాకిన్ వ్యవధి ఉంటుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో సిప్ చేయడం వల్ల దీర్ఘకాలంలో మంచి రాబడి ఆర్జించే అవకాశం ఉంటుంది. మ్యూచువల్ ఫండ్లలో నష్టభయం ఉంటుంది. కాబట్టి, పీపీఎఫ్‌నూ, ఫండ్లనూ పోల్చడం సరికాదు. పెట్టుబడులు ఎప్పుడూ వైవిధ్యంగా ఉండాలి. కాబట్టి, మీరు మదుపు చేయాలనుకుంటున్న మొత్తంలో రూ.3,000 పీపీఎఫ్‌లో జమ చేయండి. మిగతా రూ.7,000 ఈక్విటీ ఫండ్లలో పెట్టుబడి పెట్టండి. ఇలా చేయడం వల్ల 15 ఏళ్ల తర్వాత సగటున 12 శాతం వార్షిక రాబడి అంచనాతో రూ.44,73,565 అయ్యే అవకాశం ఉంది. వీలైనప్పుడల్లా పెట్టుబడి మొత్తాన్ని పెంచుకునేందుకు ప్రయత్నించండి.

నా వయసు 50. పదవీ విరమణను దృష్టిలో పెట్టుకొని వీలున్నప్పుడల్లా కొంత మొత్తాన్ని పెట్టుబడి పెట్టాలని అనుకుంటున్నాను. దీనికోసం ఎలాంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. బీమా పాలసీలు తీసుకోవచ్చా? - చంద్ర

పదవీ విరమణ ప్రణాళికలను వీలైనంత తొందరగా ప్రారంభించాలి. అప్పుడే మంచి నిధి సమకూరుతుంది. సంప్రదాయ బీమా పాలసీలు సగటున 3-5 శాతం వరకూ రాబడినిస్తాయి. ఈక్విటీ ఆధారిత యులిప్‌లు 8-10 శాతం వరకూ నికర ప్రతిఫలాన్నిస్తాయి. మీ పెట్టుబడి ద్రవ్యోల్బణానికి మించి 4-5 శాతం వరకూ రాబడినివ్వాలి. కాబట్టి, మంచి పనితీరుగల ఈక్విటీ ఫండ్లను ఎంచుకొని, సిప్ చేయండి. మీరు సంపాదించిన మొత్తంలో కనీసం 15 శాతం వరకూ పదవీ విరమణ పెట్టుబడి కోసం కేటాయించండి.

నేను వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకోవాలని అనుకుంటున్నాను. మార్కెటింగ్ ఉద్యోగంలో ఉన్నాను. క్రెడిట్ కార్డు తీసుకున్నా ఈ బీమా ఇస్తారని విన్నాను. దీన్ని తీసుకోవచ్చా? - సురేంద్ర

క్రెడిట్ కార్డులు ఇచ్చే పాలసీలపై ఎప్పుడూ పూర్తిగా ఆధారపడకూడదు. దీనికి ఎన్నో నిబంధనలు ఉంటాయి. ఒకవేళ మీరు కార్డు బిల్లు కట్టడం ఆపేసినా, కార్డు రద్దు చేసుకున్నా ఈ పాలసీ దూరమవుతుంది. సొంతంగా పాలసీ తీసుకోవడమే మంచిది. కనీసం రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకూ పాలసీ ఉండేలా చూసుకోవాలి. శాశ్వత, పాక్షిక వైకల్యం సందర్భంలోనూ పరిహారం ఇచ్చేలా పాలసీని ఎంచుకోవాలి.

కొత్తగా ఉద్యోగంలో చేరాను. ఉద్యోగ భవిష్య నిధికి రూ.4,000 వరకూ వెళ్తున్నాయి. దీంతోపాటు నేను వీపీఎఫ్ కింద మరో రూ.3,000 జమ చేద్దాం అనుకుంటున్నాను. మంచి ఆలోచనేనా? వేరే పెట్టుబడులు ఎంచుకోవాలా? - శ్రీకాంత్

పెట్టుబడులు ఎప్పుడూ వైవిధ్యంగా ఉండేలా చూసుకోవాలి. ఉద్యోగ భవిష్య నిధి, వీపీఎఫ్ రెండూ ఎంతో సురక్షితమైన పథకాలే. దీనిపై ప్రస్తుతం 8.25 శాతం వడ్డీ అందుతోంది. మన పెట్టుబడిపై 10-12 శాతం రాబడి వచ్చేలా చూసుకోవాలి. అప్పుడే మన సంపద పెరుగుతుంది. మీరు మదుపు చేయాలని అనుకుంటున్న రూ.3వేలను డైవర్సిఫైడ్ ఈక్విటీ పథకాలకు కేటాయించండి. మీ ఆదాయం పెరిగినప్పుడు మీ పెట్టుబడులూ పెంచుకోవాలి. మంచి మొత్తంలో నిధి జమ అవుతుంది.

- తుమ్మ బాల్‌రాజ్,
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

(ఆర్థిక విషయాల్లో మీకున్న సందేహాలను siri@eenadu.net కు పంపండి)



మలి జీవితం ఆనందంగా

పదవీ విరమణ.. ఎన్నో ఏళ్ల ఉద్యోగ జీవితం తర్వాత విశ్రాంతంగా ఉండే సమయం. ఈ కాలంలో ఆర్థిక పరమైన ఒత్తిడి లేకుండా ఉన్నప్పుడే ప్రశాంతంగా ఉండగలం. దీనికోసం ఆర్జిస్తున్న సమయంలోనే కచ్చితమైన ప్రణాళికలు వేసుకోవాలి. అవేమిటో తెలుసుకుందాం.

ప్రణాళికతో...

ప్రయాణం మొదలు పెట్టేముందు ఒక ప్రణాళిక ఉంటుంది. ఆర్థిక విషయాల్లోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. మనం వేసుకున్న ప్రణాళిక కాలానుగుణంగా వాస్తవ పరిస్థితుల్లో సవరించుకునేలా ఉండాలి. ఆలోచన ఉండగానే సరిపోదు. దాన్ని ఆచరణలో పెట్టినప్పుడే విలువ. ఇప్పుడున్న ప్రణాళికలు 10-15 ఏళ్ల తర్వాత పూర్తిగా భిన్నంగా ఉండొచ్చు. ఖర్చులు పెరగడం, మారుతున్న అవసరాలు, ద్రవ్యోల్బణం, అనారోగ్యం, జీవన శైలిలో మార్పులు ఇలా ఎన్నో దీనికి కారణం అవుతాయి. కాబట్టి, ముందుగా మీరు ఇప్పుడున్న వాస్తవ పరిస్థితులు, భవిష్యత్తులో ఎలా ఉండొచ్చు.. అనే అంశాన్ని ఆలోచించండి. అందుకు అనుగుణంగా పొదుపు మొత్తాలను కేటాయించండి. పదవీ విరమణ ప్రణాళిక నిరంతరం సాగే ప్రక్రియ. మధ్యలో ఆపేస్తే.. విశ్రాంత జీవితంలో ప్రశాంతత కొరవడుతుంది.

జీవన శైలికి తగ్గట్టుగా..

రిటైరయ్యాక మీ జీవితం ఎలా ఉండాలని కోరుకుంటున్నారు? ఎక్కడ స్థిర నివాసం ఉంటారు? సొంతిల్లా? అద్దె ఇల్లా? ఇలా ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలి. కొన్నిసార్లు ఈ సందేహాలు వాస్తవ దూరం అనిపించవచ్చు. వీటికి కచ్చితమైన సమాధానాలూ అవసరం లేదు. కానీ, అంచనాలైనా ఉండాల్సిందే. ఇవీ అత్యుత్తమంగా ఉండేలా చూసుకోవాలి. మీరు పదవీ విరమణ దగ్గరకు వచ్చే సరికి ఈ అంచనాలు వాస్తవ రూపంలోకి మారేందుకు ఏం చేయాలన్నది చూసుకోండి. వసతి, ఆహారం, సాధారణ ఔషధాల ఖర్చు, ఇతర జీవన శైలి వ్యయాలు.. ఎంత మేరకు అవుతాయనే లెక్కలు వేసుకోవాలి. మీరు భవిష్యత్తును ఇప్పటి నుంచే ఊహిస్తే.. దానికి అనుగుణంగా మీ పెట్టుబడులూ కొనసాగించాలి. అంచనాలను వేసుకునేటప్పుడు ద్రవ్యోల్బణాన్ని మర్చిపోకూడదు. మీ పదవీ విరమణ దగ్గరకు వస్తే.. ఇప్పుడు నెలవారీ ఖర్చు ఎంతుంది? వచ్చే 5, 10, 15 ఏళ్లకు ఎలా ఉండొచ్చు అనేది లెక్కలు వేసుకోవాలి. అందుకు అనుగుణంగా ఆదాయం వచ్చేలా ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి.

సురక్షితంగా ఉంటూనే...

పదవీ విరమణ తర్వాత వచ్చిన ప్రయోజనాలను చాలామంది స్థిరాదాయం అందించే పథకాల్లో జమ చేయాలని అనుకుంటారు. దీనివల్ల పెట్టుబడికి నష్టం ఉండదు. కానీ, పెరుగుతున్న ఖర్చులను తట్టుకునేందుకు ఇది సరిపోకపోవచ్చు. 60-80 శాతం రాబడి ఇచ్చే హామీ పథకాల్లో జమ చేయాలి. మిగతా 40-20 శాతం మొత్తాన్ని బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లవంటి వాటిలో పెట్టుబడి పెట్టాలి. రెండు నుంచి మూడేళ్ల తర్వాత ఇందులో నుంచి ఏటా 6-7 శాతం వరకూ సిస్టమేటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) ద్వారా వెనక్కి తీసుకోవచ్చు.

లోటును భర్తీ చేసేలా..

పదవీ విరమణ చేశాక ఎంత మొత్తం అవసరం అనే అవగాహన ఉండాలి. మీ ప్రస్తుత పెట్టుబడులు మీ ఖర్చులను తట్టుకునేందుకు ఎంత మేరకు సాయపడతాయనేది చూసుకోవాలి. ఉదాహరణకు మీ పదవీ విరమణ తర్వాత నెలకు రూ.40వేలు అవసరం. కానీ, మీకు రూ.30వేల వరకే వస్తున్నాయి అనుకోండి. మిగతా రూ.10వేలను ఎలా ఆర్జించాలన్నది ఇప్పుడే ఆలోచించాలి. ఆరోగ్యాన్ని కాపాడుకోవడమూ ఎంతో అవసరం. అప్పుడే మీ పెట్టుబడులు సురక్షితంగా ఉంటాయి.

నాణ్యమైన 30 కంపెనీల్లో

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ ఒక కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. **ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్** అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ వచ్చే నెల 4 వరకూ అందుబాటులో ఉంటుంది. ఎన్ఎఫ్ఓలో కనీస పెట్టుబడి రూ.1,000. దాదాపు నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ మాదిరిగానే ఈ పథకం ఉంటుంది. అధిక ఆర్ఓఈ (రిటర్న్ ఆన్ ఈక్విటీ), స్థిరమైన ఆదాయాలు ఆర్జించే కంపెనీలను ఎంచుకొని పోర్ట్‌ఫోలియో తయారు చేస్తారు. ఈ ప్రమాణాల ప్రకారం 30 కంపెనీలను ఎంచుకుంటారు. దీర్ఘకాలంలో లాభాలు ఆర్జించేందుకు ఈ పథకం అనువైనది. నాణ్యమైన కంపెనీలు కాబట్టి, పోర్ట్‌ఫోలియో విలువలో హెచ్చుతగ్గులు పరిమితంగా ఉంటాయి. నష్టభయమూ కాస్త తక్కువే. మార్కెట్ దిద్దుబాటు సమయంలో విలువ తగ్గినప్పటికీ తిరిగి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. ఇండెక్స్ పథకం కాబట్టి, ఫండ్ వ్యయాలూ తక్కువగానే ఉంటాయి. **ఫండ్ మేనేజర్లు నిషిత్ పటేల్, అశ్విని షిండే.**

సేవల రంగంలో

కొత్త పథకం

సేవల రంగంలో వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకొని అధిక లాభాలు ఆర్జించే లక్ష్యంతో ఒక వినూత్నమైన పథకాన్ని మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ ఆవిష్కరించింది. దీని పేరు **మోతీలాల్ ఓస్వాల్ సర్వీసెస్ ఫండ్.** దీని ఎన్ఎఫ్ఓ చివరి తేదీ వచ్చే నెల 3. ఎన్ఎఫ్ఓలో కనీస పెట్టుబడి రూ.500. సేవల రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీలను ఈ పథకం ఎంచుకుంటుంది. నిఫ్టీ సర్వీసెస్ సెక్టార్ టీఆర్ఐ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది. దేశంలో సేవల రంగం గత రెండేళ్ల కాలంలో 8.3 శాతం వృద్ధి సాధించింది. జీడీపీలో సేవల రంగం వాటా 55 శాతం ఉండటం గమనార్హం. అందువల్ల ఇది కొత్తదనంగల మ్యూచువల్ ఫండ్ పథకంగా కనిపిస్తోంది. **ఫండ్ మేనేజర్లు బాలచంద్ర షిండే, అజయ్ ఖండేల్వాల్, అతుల్ మెహ్రా.**

అన్ని విభాగాల షేర్లలో

యూనిఫై మ్యూచువల్ ఫండ్ **యూనిఫై ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌**ను రూపొందించింది. ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 30 వరకూ కొనసాగుతుంది. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలి. యూనిఫై మ్యూచువల్ ఫండ్ సొంతంగా ఆవిష్కరించిన గ్రోత్ ఎట్ ఏ రీజనబుల్ ప్రైస్ (సీఏఆర్పీ) అనే పెట్టుబడి విధానాన్ని ఈ పథకం అనుసరిస్తుంది. ఫ్లెక్సీ క్యాప్ పథకం కాబట్టి, లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ తరగతికి చెందిన షేర్లలో పెట్టుబడి పెడుతుంది. దీని కోసం నిఫ్టీ 500 సూచీ నుంచి 50- 70 షేర్లను ఎంచుకుంటుంది. 3-5 ఏళ్లపాటు పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్న మదుపరులకు ఈ పథకం అనువుగా ఉంటుంది. **ఫండ్ మేనేజర్లు వీఎన్ శరవణన్, ఏజాస్ లఖాని, కార్తీక్ శ్రీనివాస్, అమన్ రెడ్డి.**

ఆ పత్రాలూ చూడండి

ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేసే సమయం ఆసన్నమైంది. ఇ-ఫైలింగ్ పోర్టల్‌లో ఆదాయం, టీడీఎస్, వడ్డీ వంటి వివరాలు ఐటీఆర్ ఫారంలో ముందుగానే నింపి ఉంటాయి. అయినప్పటికీ ఫారం 26ఏఎస్, వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)లాంటివి కీలకం. ఎందుకో తెలుసుకుందాం.

ఫారం 26 ఏఎస్: మీ పాన్ కార్డు ఆధారంగా ఆర్థిక సంవత్సరంలో ఎంత పన్ను చెల్లించారో తెలిపేదే ఫారం 26ఏఎస్. దీన్ని ట్యాక్స్ క్రెడిట్ స్టేట్‌మెంట్ అనీ చెప్పొచ్చు. మీ యాజమాన్యం, బ్యాంకులు, ఇతర సంస్థలు మీ నుంచి మూలం వద్ద వసూలు (టీడీఎస్) చేసిన మొత్తాన్ని ఆదాయపు పన్ను విభాగానికి జమ చేసిన వివరాలు ఇందులో ఉంటాయి. ఒకవేళ మీరు అదనంగా పన్ను చెల్లిస్తే, ఐటీఆర్ దాఖలు చేసి, రిఫండ్ క్లెయిం చేసుకోవచ్చు.

ఏఐఎస్: ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన లావాదేవీల పూర్తి వివరాలను వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్) అందిస్తుంది. ఇందులో జీతం, వడ్డీ, మూలధన లాభాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్ల నుంచి వచ్చిన డివిడెండ్లు, ఆస్తుల క్రయవిక్రయాలు ఇలా అన్ని ఆదాయ వనరులూ ఉంటాయి. ఒకవేళ ఏఐఎస్‌లో ఏదైనా తప్పు ఉంటే, ఫీడ్ బ్యాక్ సమర్పించి సరిచేసుకోవచ్చు.

యాక్సిస్ బ్యాంకు కొత్త క్రెడిట్ కార్డు

ప్రైవేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్ కొత్త క్రెడిట్ కార్డును విడుదల చేసింది. రూపే నెట్‌వర్క్‌పై ఫ్లిప్‌కార్ట్ గ్రూపు ఆధ్వర్యంలోని సూపర్.మనీతో కలిసి కో-బ్రాండెడ్ కార్డును తీసుకొచ్చింది. 'యాక్సిస్ బ్యాంక్ సూపర్.మనీ రూపే' పేరుతో వచ్చిన ఈ కార్డును యూపీఐ, కార్డు పీఓఎస్ టెర్మినల్స్, ఆన్‌లైన్ చెల్లింపులకూ వినియోగించుకోవచ్చు. స్కాన్ అండ్ పే లావాదేవీలపై 3 శాతం, ఇతర ఖర్చులకు 1 శాతం నగదు వెనక్కి ఇస్తుంది. వినియోగదారులకు ఎలాంటి రుసుములూ ఉండవని యాక్సిస్ బ్యాంక్ వెల్లడించింది. రూ.400-రూ.4,000 మధ్య ఇంధన లావాదేవీలకు 1 శాతం సర్‌ఛార్జీ (బిల్లింగ్ సైకిల్‌లో గరిష్ఠంగా రూ.400 వరకూ)మినహాయింపు లభిస్తుంది. ఆర్థిక నిర్వహణను ఈ కార్డు సులభతరం చేస్తుందని సూపర్.మనీ వ్యవస్థాపకుడు, సీఈఓ ప్రకాశ్ సికారియా అన్నారు.

444 రోజులకు...

ఆర్‌బీఐ రెపో రేట్లు తగ్గిస్తుండటంతో ఆ ప్రభావం ఫిక్స్‌డ్ డిపాజిట్లపైనా పడుతోంది. పలు బ్యాంకులు ఇప్పటికే వడ్డీ రేట్లను సవరించాయి. ఈ నేపథ్యంలో కొన్ని బ్యాంకులు ప్రత్యేకంగా 444 రోజుల వ్యవధితో ప్రత్యేక ఎఫ్‌డీలను అందుబాటులోకి తెచ్చాయి. ఇందులో కొన్నింటిని చూస్తే..

- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అమృత్ వృష్టి పేరుతో అందిస్తున్న పథకంలో సాధారణ ప్రజలకు 6.85 శాతం వడ్డీని ఇస్తోంది. సీనియర్ సిటిజెన్లకు 7.35శాతం, 80 ఏళ్ల పైన ఉన్న వారికి (సూపర్ సీనియర్ సిటిజెన్) 7.45 శాతం వడ్డీని ఇస్తోంది.
- కెనరా బ్యాంకు 60 ఏళ్ల లోపు వారికి 7.25 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.75 శాతం, సూపర్ సీనియర్ సిటిజెన్లకు 7.85 శాతం వడ్డీని ఇస్తోంది.
- బ్యాంక్ ఆఫ్ బరోడా అందిస్తున్న స్క్వేర్ డ్రైవ్ డిపాజిట్ పథకంలో సాధారణ వ్యక్తులకు 7.10 శాతం వడ్డీని ఇస్తోంది. సీనియర్ సిటిజెన్లకు 7.60 శాతం, సూపర్ సీనియర్లకు 7.70 శాతం వడ్డీ అందిస్తోంది.
- ఇండ్ సెక్యూర్ పేరుతో ఇండియన్ బ్యాంక్ ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని అందిస్తోంది. ఇందులో సాధారణ వ్యక్తులకు 7.15 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.65 శాతం, సూపర్ సీనియర్లకు 7.90 శాతం వరకూ వడ్డీని అందిస్తోంది. ఈ పథకం సెప్టెంబరు 30 వరకూ అందుబాటులో ఉంటుంది.



✿ నేను డీఎస్సీ ఎస్జీటీకి సిద్ధమవుతున్నాను. నాకు తొమ్మిదో తరగతి చరిత్ర; తొమ్మిది, పది తరగతుల భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించి ఏయే అంశాలను చదవాలో తెలియజేయండి. -పెద్దద యశోద

జ: ఎనిమిదో తరగతి వరకు చరిత్ర పాఠ్యపుస్తకాలు చదివితే సరిపోతుంది. తొమ్మిదో తరగతి రసాయన శాస్త్రం మొత్తం

వాటిని వదిలేసి చదువుకోవచ్చు!

అంశాలను చదవాలి. భౌతికశాస్త్రంలో మాత్రం న్యూటన్ గమన నియమాలు, గురుత్వాకర్షణ, పని-శక్తి మినహాయించి మిగిలిన అంశాలన్నింటినీ అధ్యయనం చేయాలి. పదోతరగతి భౌతిక శాస్త్రం మొత్తం అంశాలను చదవాలి. రసాయన శాస్త్రంలో మూలకాల వర్గీకరణ, కర్బన సమ్మేళనాలు, లోహ సంగ్రహణ శాస్త్రం, రసాయన బంధం వదిలేసి మిగిలిన పాఠాలను చదవాలి.

✿ డీఎస్సీ ఎస్జీటీ విద్యార్థులు విభాగానికి సంబంధించి ఏ పుస్తకాలు చదవాలి? ఉద్యోగ సాధనకు ఏవైనా సూచనలు ఇవ్వండి. - టి. గిరీష్

జ: ప్రభుత్వం ప్రచురించిన తెలుగు అకాడమీ పుస్తకాన్ని చదవాలి. మీరు వ్యక్తిగతంగా తగిన అధ్యయన ప్రణాళికను సిద్ధం చేసుకోండి. దాని ప్రకారం ప్రిపరేషన్ సాగించండి. గత ప్రశ్నపత్రాలను పరిశీలించి ఏయే పాఠాలు లేదా అంశాల నుంచి ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారో గమనించి వాటిపై ఎక్కువ దృష్టి పెట్టండి. బాగా ప్రాక్టీస్ చేయండి.

మెగా డీఎస్సీ 2025

మీ సందేహాలను మాకు పంపండి!

help@eenadupratibha.net

పదాల స్వరూప స్వభావాల వివరణ

వ్యాకరణ బోధన

వ్యాకృతిని వివరించేది వ్యాకరణం. 'వ్యాక్రియంతే శబ్దాః అనేన ఇతి వ్యాకరణం' అంటే శబ్దాలను ప్రకృతి, ప్రత్యయం అనే రెండు విధాలుగా విభజించేది వ్యాకరణం. సాధు, అసాధు రూపాలను తెలియజేసేది వ్యాకరణమే. ✪ విద్యార్థుల్లో తార్కిక శక్తిని పెంపొందించేది వ్యాకరణం. ✪ శాస్త్రీయ దృక్పథాన్ని అలవరిచేది- వ్యాకరణం. ✪ పదాల స్వరూప స్వభావాలను తెలియజేసేది - వ్యాకరణం. ✪ ప్రయోగ శరణం వ్యాకరణం అంటే కవుల ప్రయోగాలే వ్యాకరణ నిర్మితికి ఆధారం. ✪ వ్యాకర్తల పట్ల గౌరవాభిమానాలు పెంపొందించేది - వ్యాకరణం. ✪ మాండలిక భాషల మధ్య, సోదర భాషల మధ్య సామ్యభేదాలను గ్రహింపజేసేది - వ్యాకరణం. ✪ ప్రాచీన, ఆధునిక భాషా రూపాలను గ్రహించేది - వ్యాకరణం.

భాషా ఆధార పత్రం:

3, 4, 5 తరగతుల విద్యార్థులు సాధించాల్సిన భాష గురించి తెలిపే పదజాలంపై అవగాహన: 1) నామవాచక, క్రియా విశేషణాలను గుర్తించి, ఉపయోగించడం. 2) భాషా భాగాలను అర్థం చేసుకుని వాక్యంలో గుర్తించడం. 3) ఏకవచన, బహువచన రూపాలను అర్థం చేసుకోవడం. 4) వాక్యంలో పదాల మధ్య సంబంధాన్ని గుర్తించడం. 5) వాక్య నిర్మాణ క్రమాన్ని అర్థం చేసుకోవడం. 6) భూత, భవిష్యత్ క్రియా రూపాలను గుర్తించడం.



మెథడాలజీ తెలుగు

6, 7 తరగతుల విద్యార్థులు సాధించాల్సిన భాషను గురించి తెలియజేయడం: 1) వాక్యం రకాలు, భేదాలను గుర్తించడం. 2) వాక్యాల్లో విభక్తులు, ఔప విభక్తులను గుర్తించడం. 3) బహువచన రూపాలు ఏర్పడే విధానాలను గుర్తించి సూత్రీకరించడం. 4) పదాలను కలపడం, పదాలు కలిసే సందర్భంలో జరిగే మార్పులను సూత్రీకరించడం. 5) పదాలను విడదీసినప్పుడు కలిగే మార్పులను గుర్తించి సూత్రీకరించడం. 6) వ్యతిరేకార్థక పదాలు ఏర్పడే విధానాలను సందర్భోచితంగా గుర్తించడం.

8, 9, 10 తరగతుల విద్యార్థులు సాధించాల్సిన భాషాపదజాలంపై అవగాహన: 1) అలంకారాలను గుర్తించడం. 2) వివిధ రచనల శైలీ భేదాలను గుర్తించడం. 3) పద్య, గేయ, వచన నియమాలను గుర్తించడం. 4) ప్రథమ, మధ్యమ, ఉత్తమ పురుషలను గుర్తించడం. 5) ప్రత్యక్ష, పరోక్ష వాక్య రూపాలను గుర్తించడం. 6) కర్తరీ, కర్మణీ రూపాలు గ్రహించి, మరో రూపంలోకి మార్చడం.

అధ్యయన విధానాన్ని బట్టి వ్యాకరణం రకాలు:

1)వర్ణనాత్మక వ్యాకరణం: ✪ నిర్దిష్ట కాలానికి చెందిన భాష స్వరూప స్వభావాలను వివరించే వ్యాకరణం. ✪ వ్యాకర్త తన కాలంనాటి వరకు ఉపయోగిస్తున్న ప్రయోగాల ఆధారంగా రూపొందే వ్యాకరణం.

2) చారిత్రక వ్యాకరణం: ✪ ఒక భాష భిన్న కాలాల్లో ఎలాంటి మార్పులకు లోనైందో తెలిపే వ్యాకరణం.

3) తులనాత్మక వ్యాకరణం: ✪ భాషల మధ్య జన్య, జనక సంబంధాలను తెలియజేసే వ్యాకరణం.

మరిన్ని వివరాలు

ఆకాశంలో ఆధునిక యుద్ధతంత్రం!

భారత్ ఇటీవల పాకిస్థాన్‌పై 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించి తన గగనతల రక్షణ వ్యవస్థల సత్తాను ప్రపంచానికి చాటింది. ఒక వైపు లక్షిత దాడులు చేస్తూనే మరోవైపు శత్రు దేశం ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులు, యుద్ధవిమానాలను సమర్థంగా అడ్డుకుని కూల్చివేసింది. ఆకాశం నుంచి దూసుకొచ్చిన దాయాది ఆయుధాలన్నింటినీ నిర్వీర్యం చేసింది. చైనా, పాకిస్థాన్‌ల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో మనదేశం అనేక రకాల, బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థలను మోహరించి వినియోగిస్తోంది. వీటిలో కొన్ని దేశంలో తయారుచేశారు. మరికొన్నింటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు. దేశ గగన రక్షణ వ్యవస్థల ప్రత్యేకతలు, వాటి పరిధి, సామర్థ్యాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఆధునిక యుద్ధతంత్రం తీరును, రక్షణ రంగంలో సాంకేతికత ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవాలి. ఈ విషయంలో భారత్ శక్తి యుక్తులు, ప్రస్తుతం అమలు చేస్తున్న ప్రాజెక్టులు, వాటి లక్ష్యాలనూ తెలుసుకోవాలి.



బరాక్-8 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్



2025 మెగా డీఎస్సీ సైన్స్ అండ్ టెక్నాలజీ



ఎస్-400 మిస్సైల్ డిఫెన్స్ సిస్టం



గగనతల రక్షణ వ్యవస్థ

(ఎయిర్ డిఫెన్స్ సిస్టం)

యుద్ధరంగంలో శత్రువుల ఆయుధాలను నిర్వీర్యం చేయడం, తిరిగి దాడి చేయడం లాంటివి విజయం సాధించడానికి అత్యంత అవసరం. ఇటీవల వేగంగా మారుతున్న యుద్ధతంత్రంలో ఆకాశం నుంచి వచ్చి దాడి చేసే క్షిపణులు, డ్రోన్‌లు, యుద్ధవిమానాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. వీటితో సుదూరం నుంచే శత్రు దేశాల లక్ష్యాలను దెబ్బతీయవచ్చు. వీటిని గుర్తించి ఎదుర్కోవడానికి అభివృద్ధి చేసిన సాంకేతికతనే 'గగనతల రక్షణ వ్యవస్థ' అంటారు. దాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు.

1) లక్ష్యాలను గుర్తించడం 2) ట్రాకింగ్
3) అడ్డగించడం లేదా కూల్చివేయడం.

ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ: ఈ వ్యవస్థను దేశం 'సుదర్శన చక్రం'గా అభివర్ణిస్తుంది. పాకిస్థాన్‌పై ఇటీవల స్పష్టమైన ఆధిక్యం సాధించడంలో ఇది ప్రధాన పాత్ర పోషించింది. దీన్ని రష్యా తయారు చేసింది. ఆ దేశంతోపాటు భారత్, చైనా, తుర్కియే, అల్జీరియా, బెలారస్ వినియోగిస్తున్నాయి. అయితే దీనిలో భాగమైన క్షిపణులను పలు దేశాలు, అనేక రకాలుగా ఉపయోగిస్తున్నాయి.

భారతదేశం వినియోగిస్తున్న ఎస్-400 వ్యవస్థలో ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణులుంటాయి. వీటికోసం 2018-19లో రష్యాతో 5.43 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. దీనిలో భాగంగా ఐదు స్క్వాడ్రన్ల ఎస్-400 వ్యవస్థలు సమకూరతాయి. 2021లో మూడు స్క్వాడ్రన్లు అందాయి. మొదటగా పంజాబ్ ప్రాంతంలో మోహరించారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ప్రభావంతో మిగతా రెండు వ్యవస్థల సరఫరా ఆలస్యమైంది. వీటిని 2026 లోగా సమకూర్చుకోవాలని భారత్ భావిస్తోంది. ఎస్-400 వ్యవస్థను ఆధునిక సుదూరశ్రేణి భూతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థగా పేర్కొనవచ్చు. ఇది శత్రుదేశాల యుద్ధవిమానాలు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్‌లు లాంటి వాటిని సుదూరం నుంచే గుర్తించి కూల్చేస్తుంది. ఈ వ్యవస్థలోని రాడార్లు 600 కి.మీ.ల దూరం నుంచి వచ్చే లక్ష్యాలను గుర్తిస్తాయి. వాటిని 400 కి.మీ. దూరంలోనే కూల్చేస్తుంది. ఒకేసారి 100 లక్ష్యాలను గుర్తించి, వీటిలో 36 లక్ష్యాలను 30 కి.మీ. ఎత్తులో కూల్చేస్తుంది. ప్రస్తుతం అమెరికా వినియోగిస్తున్న థాడ్ (టెర్మినల్ హైఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్) వ్యవస్థ కంటే ఇది మెరుగైందిగా భావిస్తున్నారు.

✤ ఎస్-400 వ్యవస్థను మొబైల్ లాంచర్ అంటే ఒక వాహనంపై నుంచి నియంత్రించవచ్చు. దీనివల్ల ఈ వ్యవస్థను సరిహద్దుల సమీపానికి లేదా ఏ ప్రాంతానికైనా రవాణా చేయొచ్చు. ఈ వ్యవస్థలో నాలుగు గొట్టాల్లో క్షిపణులుంటాయి. ఇవి మూడు రకాలు.. 1) 40 N6 - పరిధి 400 కి.మీ.
2) 48 N6 - పరిధి 250 కి.మీ.
3) 9m 96E- పరిధి 40-120 కి.మీ. 9m96 E లో తిరిగి 9m 96 E1- 40 కి.మీ., 9m 96E2 - 120 కి.మీ. అనే రకాలు ఉంటాయి. మూడు రకాల క్షిపణులు (మొత్తం నాలుగు) ఉంటాయి. ప్రస్తుతం ఎస్-400 వ్యవస్థను ఆధునీకరించి రష్యా ఎస్- 500 అనే గగనతల రక్షణ వ్యవస్థను తయారు చేసింది. దీని పరిధి, సాంకేతికత ఎస్- 400 కంటే మెరుగ్గా ఉంటుంది.

మరిన్ని వివరాలు

ఆకాష్‌తీర్ వ్యవస్థ: ఇది భారతదేశం దేశీయంగా అభివృద్ధి చేసిన గగనతల రక్షణ వ్యవస్థకు సంబంధించిన సాంకేతికత. దీన్ని డీఆర్‌డీఓ, ఇస్రో, బీఈఎల్ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్) కలిసి రూపొందించాయి. దీన్ని స్వయంచోదిత, కృత్రిమమేధ ఆధారంగా పనిచేసే రక్షణ వ్యవస్థగా పేర్కొనవచ్చు. ఈ వ్యవస్థ అనేక మార్గాల ద్వారా శత్రుదేశాల యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్‌లకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తుంది. ఇందుకోసం ఇస్రో రక్షణ ఉపగ్రహాలను, 'నావిక్', జీపీఎస్ నావిగేషన్ వ్యవస్థలను ఉపయోగించుకుంటుంది. రాడార్‌ల ద్వారా సేకరించిన సమాచారాన్ని మానవ ప్రమేయం లేకుండానే విశ్లేషిస్తుంది. అందుకే దీన్ని ఆధునిక ADCRS- (Air Defence Control and Reporting System) వ్యవస్థగా పేర్కొనవచ్చు. దీన్ని వాహనంపై అమర్చి, దేశ సరిహద్దు ప్రాంతాలకు తీసుకెళ్లవచ్చు. దీన్ని మొదట సైనిక రక్షణ వ్యవస్థగా రూపొందించారు, వాయుసేన, నావికాదళాలు కూడా ఉపయోగించుకుంటాయి. ఈ వ్యవస్థ ద్వారా సేకరించిన సమాచారం ఆకాష్ లాంటి క్షిపణి వ్యవస్థలకు చేరవేసి గగనతలం నుంచి వచ్చే ప్రమాదాలను అరికడుతుంది.



ఆకాష్‌తీర్

భారతదేశ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలో దశలు: గగనతల దాడుల నుంచి రక్షించుకోవడానికి భారతదేశం ఐదు-అంచెల గగనతల రక్షణ వ్యవస్థ (ఎయిర్ డిఫెన్స్ సిస్టం) ను వినియోగించుకుంటుంది. అవి:

1) మొదటి దశ: దీనిలో రెండు అంచెల్లో ఖండాంతర (బాలిస్టిక్) క్షిపణి రక్షణ వ్యవస్థ ఉంటుంది. ఇది శత్రు దేశాలు ప్రయోగించిన ఖండాంతర క్షిపణులను అడ్డుకుంటుంది. ఇలాంటి వ్యవస్థ ప్రస్తుతం దిల్లీ నగరాన్ని క్షిపణి దాడుల నుంచి రక్షిస్తోంది.

2) రెండో దశ: రష్యా నుంచి దిగుమతి చేసుకున్న ఎస్-400 వ్యవస్థను దీనికి ఉదాహరణగా చెప్పొచ్చు. దీన్నే ఇటీవల పాకిస్థాన్‌పై జరిపిన 'ఆపరేషన్ సిందూర్'లో వినియోగించారు. 400 కి.మీ. దూరంలో ఉన్న లక్ష్యాలను కూల్చేస్తుంది.

3) మూడో దశ: ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే మధ్యశ్రేణి క్షిపణులు, బారాక్-8 క్షిపణి వ్యవస్థలు దీనికి ఉదాహరణ.

4) నాలుగో దశ: ఆకాష్ క్షిపణి రక్షణ వ్యవస్థ దీనికి ఉదాహరణ.

5) అయిదో దశ: స్వల్ప శ్రేణి భూమిపై నుంచి గాలిలోకి ప్రయోగించే క్షిపణులు. యుద్ధ విమానాలను కూల్చే భారీ మిషన్‌గన్‌లు లాంటివి ఉదాహరణ.



రచయిత: డాక్టర్ బి.నరేష్

వన్యప్రాణుల వ్యాపార నియంత్రణకు 'ట్రాఫిక్'!

పర్యావరణ మార్పులు - ప్రపంచ దేశాల చర్యలు

ప్రపంచ దేశాలన్నీ ప్రస్తుతం పర్యావరణ మార్పుల రూపంలో పెను విపత్తును ఎదుర్కొంటున్నాయి. పారిశ్రామికీకరణ, శిలాజ ఇంధనాల వినియోగం, పట్టణీకరణ, అడవుల నిర్మూలన లాంటివన్నీ కలిసి పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని ప్రమాదంలోకి నెట్టాయి. భూతాపం పెరిగిపోయి అనూహ్య వాతావరణ పరిస్థితులు నెలకుని ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. మానవాళికి సవాలుగా మారిన ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రపంచ దేశాలన్నీ ఏకమవుతున్నాయి. ప్రకృతి పరిరక్షణకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తున్నాయి. ఈ దిశగా జరిగిన అంతర్జాతీయ సదస్సులు, కుదిరిన ఒప్పందాలు, వాటి లక్ష్యాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. జీవవైవిధ్యం, ప్రకృతి పరిరక్షణ కోసం కృషిచేస్తున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, వాటి కార్యాలయాలున్న ప్రాంతాలు, పర్యావరణ సంబంధిత దినోత్సవాలు, దేశంలో చేసిన చట్టాలు, అందులోని ప్రధానాంశాలు, ఇందుకోసం ఏర్పాటైన వివిధ కమిటీలు మొదలైన వివరాలను తెలుసుకోవాలి.

1. 'అందరికీ బాధ్యత కానీ, భిన్నమైన బాధ్యత' అనే సంబంధిత సామర్థ్యాల సూత్రం తరచూ మీడియాలో కనిపిస్తుంది. ఇది దేన్ని సూచిస్తుంది?
   1) డబ్ల్యూహెచ్ఓ కొవిడ్-19 గ్లోబల్ వ్యాక్సినేషన్ డ్రైవ్
   2) అంతర్జాతీయ ద్రవ్యనిధికి విరాళాలు
   3) గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల తగ్గింపు
   4) ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక కార్యకలాపాలకు సహకారం
2. వన్యప్రాణుల రక్షణ చట్టం, 1972లోని షెడ్యూల్ VI కింద నిర్దిష్ట వృక్షజాతుల్ని చేరిస్తే, దాని అంతరార్థం ఏమిటి?
   1) ఆ మొక్కను పెంచడానికి లైసెన్స్ అవసరం.
   2) అలాంటి మొక్కను ఎట్టి పరిస్థితుల్లోనూ సాగు చేయలేం.
   3) ఇది జన్యుపరంగా మార్పు చెందిన పంట మొక్క.
   4) ఇలాంటి మొక్క పర్యావరణ వ్యవస్థకు హానికరం.
3. కింది అంతర్జాతీయ అంశాల్లో సరైన వాటిని ఎంపిక చేయండి.
   ఎ) అల్మా-అటా డిక్లరేషన్: ప్రజల ఆరోగ్య సంరక్షణ
   బి) హేగ్ కన్వెన్షన్: జీవ, రసాయన ఆయుధాలు
   సి) తలనోవా డైలాగ్: ప్రపంచ వాతావరణ మార్పు
   డి) అండర్-2 కూటమి: బాలల హక్కులు
   1) ఎ, బి 2) డి
   3) ఎ, సి 4) బి, సి, డి
4. కింది అంశాలను వాటి ప్రారంభానికి సంబంధించి కాలక్రమానుసారంగా అమర్చండి.
   ఎ) ప్రాజెక్ట్ టైగర్ బి) ప్రాజెక్ట్ ఎలిఫెంట్
   సి) వన్యప్రాణుల రక్షణ చట్టం డి) జీవవైవిధ్య చట్టం
   1) ఎ, బి, సి, డి 2) బి, ఎ, డి, సి
   3) సి, ఎ, బి, డి 4) సి, డి, ఎ, బి
5. కింది అంశాలను కాలక్రమానుసారంగా అమర్చండి.
   ఎ) రియో ఎర్త్ సమ్మిట్
   బి) బ్రంట్ ల్యాండ్ కమిషన్ నివేదిక
   సి) మాంట్రియల్ ప్రోటోకాల్ అమలు
   డి) లిమిట్ టు గ్రోత్ నివేదిక ప్రచురణ
   1) ఎ, డి, సి, బి 2) డి, బి, సి, ఎ
   3) డి, సి, బి, ఎ 4) డి, ఎ, సి, బి
6. కింది వాటిలో వియన్నా కన్వెన్షన్, మాంట్రియల్ ప్రోటోకాల్‌ల ప్రధాన లక్ష్యం?
   1) ఎడారీకరణ పోరాటం
   2) సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన
   3) ఓజోన్ పొర రక్షణ
   4) వాతావరణ మార్పుల కోసం పోరాడటం
7. ఇచ్చిన వాటిలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గురించి ఏది సరికాదు?



   1) ఇది 2010 లో ఏర్పాటైంది.
   2) పర్యావరణ, అడవుల పరిరక్షణకు సంబంధించిన కేసులను సమర్థవంతంగా, త్వరితగతిన పరిష్కరిస్తుంది.
   3) వ్యక్తులు, ఆస్తికి జరిగిన నష్టాలకు పరిహారాలను ఏర్పాటు చేస్తుంది.
   4) సివిల్ ప్రొసీజర్ కోడ్, 1908 కింద నిర్దేశించిన విధానాలకు కట్టుబడి ఉంటుంది.
8. గ్లోబల్ 500 రోల్ ఆఫ్ హానర్ అవార్డును కింది ఏ రంగంలో అరుదైన ఘనత సాధించినందుకు ఇస్తారు?
   1) జన్యు సంరక్షణ 2) పర్యావరణ పరిరక్షణ
   3) జనాభా నియంత్రణ 4) కాలుష్య నియంత్రణ
9. కింది వాటిలో సరికాని జతను గుర్తించండి.
   1) కార్టేజినా ప్రోటోకాల్: జీవభద్రత
   2) స్టాక్‌హోమ్ కన్వెన్షన్: శాశ్వత సేంద్రియ కాలుష్యకాలు
   3) మాంట్రియల్ ప్రోటోకాల్: ఓజోన్ పొర
   4) క్యోటో ప్రోటోకాల్: నీటిని ఆదా చేయడం
10. కింది వాటిలో గ్లోబల్ అలయన్స్ ఫర్ క్లైమేట్ - స్మార్ట్ అగ్రికల్చర్‌కు సంబంధించి ఏది సరైంది?
   ఎ) GACSA అనేది 2015 లో ప్యారిస్‌లో జరిగిన క్లైమేట్ సమ్మిట్ ఫలితం.
   బి) GACSA సభ్యత్వం ఎలాంటి కట్టుబాటు బాధ్యతలను సృష్టించదు.
   సి) GACSA ఏర్పాటులో భారతదేశం కీలకపాత్ర పోషించింది.
   1) ఎ, సి 2) బి
   3) బి, సి 4) ఎ, బి, సి

పర్యావరణ అంశాలు

11. కింది ప్రకటనలను పరిగణించి సరైన వాటిని గుర్తించండి.
   ఎ) క్రిటికల్ వైల్డ్ లైఫ్ హాబిటాట్ అనే నిర్వచనాన్ని అటవీ హక్కుల చట్టం, 2006 లో వివరించారు.
   బి) భారతదేశంలో మొదటిసారిగా బైగాస్ నివాస హక్కులు లభించాయి.
   సి) కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ భారతదేశంలోని ఏ ప్రాంతంలోనైనా ఆదిమ, గిరిజన సమూహాలకు నివాస హక్కులను అధికారికంగా నిర్ణయించి ప్రకటించింది.
   1) ఎ, బి 2) బి, సి
   3) సి 4) ఎ, బి, సి
12. దేశాలు హరిత, సమ్మిళిత ఆర్థిక వ్యవస్థల వైపు పరివర్తనకు సహాయపడే ఐక్యరాజ్యసమితి యంత్రాంగమైన 'పార్టనర్‌షిప్ ఫర్ యాక్షన్ ఆన్ గ్రీన్ ఎకానమీ' ఎక్కడ పుట్టింది?
   1) ది ఎర్త్ సమ్మిట్ ఆన్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ 2002, జోహన్నెస్‌బర్గ్
   2) యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ 2012, రియోడిజనీరో
   3) వాతావరణ మార్పుపై ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ 2015, ప్యారిస్
   4) ది వరల్డ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సమ్మిట్ 2016, న్యూదిల్లీ
13. భారతదేశపు మొదటి జాతీయ సముద్ర జీవవైవిధ్య కేంద్రం ఏ నగరంలో ఉంది?
   1) భావ్‌నగర్ 2) జామ్‌నగర్
   3) ముంబయి 4) పుదుచ్చేరి
14. గ్రీన్‌పీస్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
   1) ఆమ్‌స్టర్ డ్యామ్ 2) కాన్‌బెర్రా
   3) ఒట్టావా 4) నాగసాకి
15. గ్లోబల్ క్లైమేట్ ఛేంజ్ అలయన్స్‌కు సంబంధించి కింది ప్రకటనల్లో సరైంది?
   ఎ) ఇది యూరోపియన్ యూనియన్ చొరవ.
   బి) అభివృద్ధి విధానాలు, బడ్జెట్లలో వాతావరణ మార్పులను ఏకీకృతం చేయడానికి సిద్ధంగా ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది.
   సి) దీన్ని వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్, వరల్డ్ బిజినెస్ కౌన్సిల్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్‌లతో సమన్వయం చేశారు.
   1) ఎ, బి 2) సి
   3) బి, సి 4) ఎ, బి, సి
16. జంతుజాలం, వృక్షజాలాల విశ్లేషణకు సంబంధించి కింది ప్రకటనలను పరిగణించి, సరైన సమాధానాన్ని గుర్తించండి.
   ఎ) TRAFFIC అనేది 'యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్' ఆధ్వర్యంలోని ఒక బ్యూరో.
   బి) వన్యప్రాణులు, వన్యమొక్కల వ్యాపార నియంత్రణ, ప్రకృతి పరిరక్షణకు ముప్పు కలిగించకుండా చూడటమే TRAFFIC సంస్థ లక్ష్యం.
   1) ఎ 2) బి
   3) ఎ, బి 4) ఏదీకాదు
17. కింది వాటిలో సరికాని జత?
   1) ప్రపంచ పర్యావరణ దినోత్సవం - జూన్ 5
   2) ధరిత్రీ దినోత్సవం - ఏప్రిల్ 22
   3) పొగాకు వ్యతిరేక దినం - మే 5
   4) ఓజోన్ దినోత్సవం - సెప్టెంబరు 16
18. భారత ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టాన్ని ఏ సంవత్సరంలో అమలు చేసింది?
   1) 1976 2) 1980 3) 1983 4) 1988
19. కింది వాటిని జతపరచండి.

సంస్థ	ప్రాంతం
1) అటవీ పరిశోధనా సంస్థ	ఎ) జోధ్‌పుర్
2) భారతీయ గడ్డి భూములు, మేత పరిశోధనా సంస్థ	బి) న్యూదిల్లీ
3) సెంట్రల్ ఎరిడ్ జోన్ పరిశోధనా సంస్థ	సి) డెహ్రాడూన్
4) భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ	డి) ఝాన్సీ

   1) 1-బి, 2-డి, 3-ఎ, 4-సి
   2) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
   3) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి
   4) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ
20. గాడ్గిల్ కమిటీ నివేదిక-7, కస్తూరి రంగన్ కమిటీ నివేదికలు దేనికి సంబంధించినవి?
   1) రాజ్యాంగ సంస్కరణలు
   2) గంగా యాక్షన్ ప్లాన్
   3) నదుల అనుసంధానం
   4) పశ్చిమ కనుమల రక్షణ
21. 2015లో ప్యారిస్‌లో జరిగిన యూఎన్ఎఫ్‌సీసీసీ సమావేశంలో కుదిరిన ఒప్పందానికి సంబంధించి సరైన వాటిని గుర్తించండి.
   ఎ) ఈ ఒప్పందంపై యూఎన్ సభ్యదేశాలన్నీ సంతకం చేయడంతో 2017 నుంచి అమలులోకి వచ్చింది.
   బి) గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను పరిమితం చేయాలని ఒప్పందం లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా ఈ శతాబ్దం చివరి నాటికి సగటు ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదల పారిశ్రామిక పూర్వ స్థాయి కంటే 2°C లేదా 1.5°C కంటే ఎక్కువగా ఉండకూడదు.
   సి) అభివృద్ధి చెందిన దేశాలు గ్లోబల్ వార్మింగ్‌లో తమ చారిత్రక బాధ్యతను గుర్తించాయి. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు సహాయం చేయడానికి 2020 నుంచి ఏడాదికి వెయ్యి బిలియన్ డాలర్ల విరాళం ఇచ్చేందుకు సమ్మతించాయి.



   1) ఎ, సి 2) బి
   3) బి, సి 4) ఎ, బి, సి
22. గ్రీన్‌హౌస్ గ్యాస్ ప్రోటోకాల్ అంటే ఏమిటి?
   1) గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను అర్థం చేసుకోవడానికి, లెక్కించడానికి, నిర్వహించడానికి అంతర్జాతీయ అకౌంటింగ్ సాధనం.
   2) పర్యావరణ అనుకూల సాంకేతికతల్ని అవలంబించేందుకు, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి... అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం కోసం ఐక్యరాజ్య సమితి తీసుకున్న చొరవ.
   3) ఇది ఐక్యరాజ్య సమితిలోని అన్ని సభ్యదేశాలు ఆమోదించిన అంతర ప్రభుత్వ ఒప్పందం; 2022 నాటికి నిర్దేశిత స్థాయులకు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించాలి.
   4) ఇది ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలో రూపొందించిన బహుళపాక్షిక REDD+ కార్యక్రమాల్లో ఒకటి.

సమాధానాలు

1-3, 2-1, 3-3, 4-3, 5-2, 6-3, 7-4, 8-2, 9-4, 10-2, 11-1, 12-2, 13-2, 14-1, 15-1, 16-2, 17-3, 18-2, 19-2, 20-4, 21-2, 22-1.

మానవ శరీరంలో పిండం ఏర్పాటు, అభివృద్ధి, పెరుగుదలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని మానవ పిండోత్పత్తిశాస్త్రం (Human Embryology) అంటారు. ఇది గర్భధారణ ప్రారంభం నుంచి శిశు జననం వరకు పిండం వివిధ దశలను విశ్లేషిస్తుంది. ఈ శాస్త్రం వైద్యరంగంలో ముఖ్యంగా పుట్టుకతో వచ్చే వైకల్యాలు, గర్భధారణ సమస్యలు, పునరుత్పత్తి సాంకేతికతల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుంది.



పోటీ పరీక్షల ప్రత్యేకం
బయాలజీ

గర్భధారణతో మొదలై.. జననం వరకు సాగే అధ్యయనం!

మానవ పిండోత్పత్తిశాస్త్రం

పిండాభివృద్ధి - ట్రైమెస్టర్

మానవ పిండాభివృద్ధి మూడు ట్రైమెస్టర్‌లలో జరుగుతుంది. అవి:

1. మొదటి ట్రైమెస్టర్: 0 - 12 వారాల సమయంలో జరిగే ముఖ్య సంఘటనల కాలం.

- బీజ సంయోగం, విభజన, ఇంప్లాంటేషన్ లాంటి ప్రక్రియలు జరుగుతాయి.
- మూడు జనన స్థరాలు ఏర్పడతాయి.
- గుండె, మెదడు, కాలేయం, ఇతర ప్రధాన అవయవాలు ఏర్పడతాయి.
- జరాయువు (ప్లాసెంటా) ఏర్పడుతుంది. అది పోషకాలు, ఆక్సిజన్‌ను సరఫరా చేస్తుంది.
- అమ్నియోటిక్ శాక్ ఏర్పడి, పిండాన్ని రక్షిస్తుంది.
- 8వ వారం నాటికి పిండం అన్ని ప్రధాన అవయవాలను కలిగి ఉంటుంది. దీన్ని ఫీటస్ అని అంటారు.
- పరిమాణం రీత్యా 12వ వారం నాటికి ఫీటస్ సుమారు 6-7 సెం.మీ. పొడవు ఉంటుంది.

2. రెండో ట్రైమెస్టర్: 13 - 24 వారాల్లో జరిగే ముఖ్య సంఘటనల కాలం.

- ఈ సమయంలో అవయవాలు పరిపక్వం చెందుతాయి.
- ఫీటస్ కదలికలు తల్లికి స్పష్టంగా తెలుస్తాయి.
- చర్మాన్ని లానుగో (మెత్తని వెంట్రుకలు), వెర్నిక్స్ కేసియోసా (పొర) కప్పి ఉంచుతాయి. లానుగో అనేది రక్షణ, వెచ్చదనం కోసం గర్భాశయంలోని పిండంపై ఏర్పడే మృదువైన జుట్టు. వెర్నిక్స్ కేసియోసా అనేది పిండం చర్మాన్ని అమ్నియోటిక్ ద్రవం నుంచి రక్షించే జిడ్డు పొర.
- ఊపిరితిత్తులు అభివృద్ధి చెందుతాయి, కానీ పూర్తిగా పనిచేయవు.
- లింగ నిర్ధారణ చాలావరకు సాధ్యమవుతుంది.
- పరిమాణం రీత్యా 24వ వారం నాటికి ఫీటస్ సుమారు 30 సెం.మీ. పొడవు, 600-700 గ్రాముల బరువు ఉంటుంది.

ప్లాసెంటా, అమ్నియోటిక్ శాక్ పాత్ర

ప్లాసెంటా: ప్లాసెంటా అనేది ట్రోఫోబ్లాస్ట్, గర్భాశయ కణజాలం నుంచి ఏర్పడే అవయవం.

విధులు: పోషకాలు, ఆక్సిజన్‌ను తల్లి రక్తం నుంచి ఫీటస్‌కు సరఫరా చేస్తుంది.

- ఫీటస్ నుంచి కార్బన్ డైఆక్సైడ్, వ్యర్థ పదార్థాలను తొలగిస్తుంది.
- హార్మోన్లను (HCG, ప్రొజెస్టిరాన్, ఈస్ట్రోజెన్) ఉత్పత్తి చేస్తుంది. ఇవి గర్భాన్ని నిర్వహించడానికి సహాయపడతాయి.
- రోగనిరోధక రక్షణను అందిస్తుంది.

అమ్నియోటిక్ శాక్: అమ్నియోటిక్ శాక్ అనేది అమ్నియన్ పొర నుంచి ఏర్పడుతుంది. ఇది అమ్నియోటిక్ ద్రవంతో నిండి ఉంటుంది.

విధులు: ఫీటస్‌ను బాహ్య ఒత్తిడి, గాయాల నుంచి రక్షిస్తుంది.

- స్థిరమైన ఉష్ణోగ్రతను నిర్వహిస్తుంది.
- ఫీటస్ కదలికలకు అనుమతిస్తుంది.
- అమ్నియోటిక్ ద్రవం ఫీటస్‌లో ఊపిరితిత్తులు, జీర్ణ వ్యవస్థ అభివృద్ధికి సహాయపడుతుంది.

3. మూడవ ట్రైమెస్టర్: 25 - 40 వారాల్లో జరిగే ముఖ్య సంఘటనల కాలం.

- ఫీటస్ వేగంగా అభివృద్ధి చెందుతూ పెరుగుతుంది.
- ఊపిరితిత్తులు పూర్తిగా అభివృద్ధి చెందుతాయి. సర్ఫాక్టెంట్ (Surfactant) ఉత్పత్తి అవుతుంది.
- మెదడు అభివృద్ధి వేగవంతమవుతుంది.
- శరీరంలో కొవ్వు పేరుకుంటుంది. ఇది శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి సహాయపడుతుంది.
- ఫీటస్ జననానికి సిద్ధమవుతుంది. సాధారణంగా తల కింది వైపునకు తిరిగి ఉంటుంది.
- జనన సమయంలో ఫీటస్ సుమారు 50 సెం.మీ. పొడవు, 2.5 - 3.5 కిలోల బరువు ఉంటుంది.

మాదిరి ప్రశ్నలు

1. మానవుల్లో బీజ సంయోగం ఎక్కడ జరుగుతుంది?
   1) గర్భాశయం 2) ఫెలోపియన్ ట్యూబ్
   3) అండం 4) అండాశయం
2. బీజ సంయోగంలో అక్రోసోమ్ రియాక్షన్ పాత్ర ఏమిటి?
   1) స్పెర్మ్ కదలికను పెంచడం 2) ఓవం పొరను చీల్చడం
   3) జైగోట్ ఏర్పడటం 4) ప్లాసెంటా ఏర్పడటం
3. మానవ బ్లాస్టోసిస్ట్‌లో ఏ భాగం ప్లాసెంటా ఏర్పడటానికి సహాయపడుతుంది?
   1) ఇన్నర్ సెల్‌మాస్ 2) ట్రోఫోబ్లాస్ట్
   3) బ్లాస్టోసీల్ 4) నోటోకార్డ్
4. మానవ పిండాభివృద్ధిలో గుండె ఏ వారంలో పనిచేయడం ప్రారంభిస్తుంది?
   1) 3వ వారం 2) 5వ వారం
   3) 8వ వారం 4) 12వ వారం

సమాధానాలు

1-2 2-2 3-2 4-1

జనన లోపాలు

జనన సమయంలో ఉండే శారీరక లేదా నిర్మాణాత్మక అసాధారణ స్థితులను జనన లోపాలు అంటారు. ఇవి టెరాటోజెన్‌లు, జన్యు లోపాలు లేదా పర్యావరణ కారకాల వల్ల సంభవించవచ్చు.

టెరాటోజెన్‌లు: ఇవి పిండం అభివృద్ధిని ప్రభావితం చేసే రసాయనాలు, ఔషధాలు లేదా ఇన్ఫెక్షన్లు. మొదటి ట్రైమెస్టర్‌లో టెరాటోజెన్‌లకు గురికావడం అత్యంత ప్రమాదకరం.

ఉదాహరణలు:

థాలిడోమైడ్: 1950లలో గర్భిణులకు ఇచ్చిన ఔషధం. ఇది ఫోకోమెలియాకి (అవయవాలు సరిగా ఏర్పడకపోవడం) కారణమైంది.

ఆల్కహాల్: ఫీటల్ ఆల్కహాల్ సిండ్రోమ్ (FAS)కు కారణమవుతుంది. ఇది మానసిక వైకల్యం, ముఖ వైకల్యాలకు దారితీస్తుంది.

రుబెల్లా వైరస్: గుండె లోపాలు, చెవుడు, అంధత్వం లాంటి సమస్యలను కలిగిస్తుంది.

సాధారణ జనన లోపాలు:

నాడీ నాళం లోపాలు: స్పైనా బిఫిడా, అనెన్‌సెఫాలీ.

గుండె లోపాలు: టెట్రాలజీ ఆఫ్ ఫాలోట్, సెప్టల్ డిఫెక్ట్స్.

అవయవ లోపాలు: క్లెఫ్ట్ లిప్, ప్యాలెట్.



రచయిత
కొర్లాం సాయివెంకటేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్

658 Word of the Day

Poignant

Telugu meaning: పదునైన, చొచ్చుకుపోయే

English meaning: The word poignant (పోయ్‌నెంట్) is an adjective that describes something that evokes a strong sense of sadness or deep emotion.

Synonyms: Heartbreaking, Emotional

Antonyms: Detached, Unmoving

Usage: **1.** The movie ended with a poignant scene that brought tears to the audience.

2. Her speech was so poignant that everyone in the hall remained silent for a moment.

నోటిఫికేషన్స్

ప్రాజెక్ట్ ఇంజినీర్ పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్), బెంగళూరు తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రాజెక్ట్ ఇంజినీర్-1 పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 28. దరఖాస్తు ఫీజు రూ.472. అర్హులైన అభ్యర్థులు 2025 జూన్ 4 లోగా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అప్రెంటిస్ పోస్టులు

నాసిక్‌లోని డీఆర్‌డీవో - అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ఎనర్జిటిక్ మెటీరియల్స్ (ఏసీఈఎం) 2025-26 సంవత్సరానికి ఏడాది గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌షిప్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 41. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 15 జూన్ 2025.

డిప్లొమా ప్రోగ్రామ్

పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోని డా.వై.ఎస్.ఆర్. హార్టికల్చరల్ యూనివర్సిటీ 2025-26 విద్యా సంవత్సరానికి డా.వైఎస్‌ఆర్‌హెచ్‌యూతో పాటు అనుబంధ ఉద్యాన కళాశాలల్లో డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తు రుసుము రూ.1000. ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 19 జూన్ 2025.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (మే 23) చివరి తేదీ

- బ్యాంక్ ఆఫ్ బరోడాలో 500 ఉద్యోగాలు. పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు స్థానిక భాష చదవడం, రాయడం వచ్చినవారు అర్హులు.
- బీఐఎస్‌లో 20 సైంటిస్ట్-బి ఉద్యోగాలు. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- పీజీఐఎంఈఆర్, చండీగఢ్‌లో ప్రాజెక్ట్ రిసెర్చ్ పోస్టులు. డిప్లొమా, డిగ్రీ, ఎంబీబీఎస్, బీవీఎస్సీ/ బీడీఎస్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ తాబేళ్ల దినోత్సవం



మే 23
చరిత్రలో ఈనాడు

తాబేళ్ల ప్రాముఖ్యతలను ప్రపంచానికి తెలియజేసే లక్ష్యంతో ఏటా మే 23న ప్రపంచ తాబేళ్ల దినోత్సవాన్ని (World Turtle Day) నిర్వహిస్తారు. ఇవి సముద్ర పర్యావరణానికి చాలా ముఖ్యమైనవి. జెల్లీ ఫిష్‌లు, స్పాంజ్‌ల జనాభాను నియంత్రిస్తాయి. ఇవి భూమి, జలావరణంలో నివసిస్తాయి. తాబేళ్ల గురించి ప్రజలకు తెలియజేయడంతోపాటు, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

- తాబేళ్లు పురాతన సరీసృపాల సమూహాల్లో ఒకటి. పాములు, మొసళ్ల కంటే ఇవి చాలా పురాతనమైనవి. సుమారు 200 మిలియన్ సంవత్సరాల క్రితం.. డైనోసార్ల కాలం నుంచే ఇవి మనుగడలో ఉన్నట్లు శాస్త్రవేత్తల అభిప్రాయం. ప్రపంచవ్యాప్తంగా 300 తాబేళ్ల జాతులు ఉన్నాయి. వాటిలో 129 రకాలు అంతరించే స్థితిలో ఉన్నట్లు ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) పేర్కొంది. తాబేళ్ల ఆవాస నష్టం, మితిమీరిన వేట, అక్రమ రవాణా, వాతావరణ మార్పులు లాంటివి తాబేళ్ల జనాభాను గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి.
- వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 ద్వారా మన దేశంలో తాబేళ్లకు రక్షణ కల్పించారు. అయినప్పటికీ వాటి అక్రమ రవాణాలో మన దేశం ముందంజలో ఉంది. ఐయూసీఎన్ ప్రకారం, 2009 నుంచి ఏటా 11,000 కంటే ఎక్కువ తాబేళ్లతో అక్రమ వ్యాపారం చేస్తున్నారు.

భారతదేశంలో ముఖ్యమైన తాబేళ్ల సంరక్షణ కేంద్రాలు:


- గహిర్మాతా మెరైన్ శాంక్చుయరీ, ఒడిశా
- టర్టిల్ వైల్డ్‌లైఫ్ శాంక్చుయరీ, ఉత్తర్ ప్రదేశ్
- రుషికుల్య బీచ్, ఒడిశా
- వెలాస్ బీచ్, మహారాష్ట్ర

చారిత్రక నేపథ్యం:

తాబేళ్లను, వాటి జాతిని పరిరక్షించే ఉద్దేశంతో 1990లో అమెరికన్ టార్టాయిస్ రెస్క్యూ (ఏటీఆర్) ఏర్పడింది. తాబేళ్ల రక్షణ, పునరావాసం లాంటి చర్యలు ఇది నిర్వహిస్తుంది. వాటి ఆవాసాలను రక్షించి, మనుగడ - వృద్ధికి సాయపడేలా మానవ చర్యలను ప్రోత్సహించే లక్ష్యంతో ఏటీఆర్ సంస్థ ఏటా మే 23న 'ప్రపంచ తాబేళ్ల దినోత్సవం'గా జరుపుకోవాలని 2000లో తీర్మానించింది.

2025 నినాదం: Dancing Turtles Rock!

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ



అంతర్భూభాగ జలాశయాలను సరస్సులు అంటారు. సరస్సుల గురించి చేసే అధ్యయనాన్ని లిమ్నాలజీ అంటారు. భూఉపరితలంపై 1.8% సరస్సులు ఉంటే, వీటిలో 55% మంచినీటి సరస్సులు, 45% ఉప్పునీటి సరస్సులు. ఇవి ఏర్పడే విధానం, దానికి కారణమయ్యే నదులు, ఏ రాష్ట్రాల్లో ఏయే సరస్సులు ఉన్నాయో పోటీపరీక్షార్థులు తెలుసుకుని ఉండాలి.

సరస్సులు

సరస్సులు – రకాలు

- విరూపక సరస్సులు
- హిమనీనద సరస్సులు
- జ్వాలాబిల సరస్సులు
- ఒయాసిస్
- ప్లయాలు
- ఆక్స్ బౌ సరస్సు
- మానవ నిర్మిత సరస్సులు

టిటికాకా సరస్సు

- ఇది మంచినీటి సరస్సు.
- ఈ సరస్సు దక్షిణ అమెరికాలో పెరూ, బొలీవియా దేశాల సరిహద్దులో ఉంది.

బైకాల్ సరస్సు:

- ఇది మంచినీటి సరస్సు. రష్యా ఉత్తర భాగాన సైబీరియా ప్రాంతంలో ఉంది.
- ఈ సరస్సు ప్రపంచంలో అత్యంత లోతైన సరస్సు.

సరస్సులుగా పిలిచే సముద్రాలు

- కాస్పియన్ సరస్సు
- మృత సముద్రం
- అరల్ సముద్రం

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన సరస్సులు, తెలంగాణ - సరస్సులు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs

1. Who is the first Buddhist to serve as Chief Justice of India and has delivered around 300 significant verdicts, including rulings against "bulldozer justice"?
A) Justice D.Y. Chandrachud
B) Justice Bhushan Ramkrishna Gavai
C) Justice K.G. Balakrishnan D) Justice Ranjan Gogoi

2. Who was awarded the ICC Men's Player of the Month for April 2025?
A) Blessing Muzarabani B) Ben Sears
C) Mehidy Hasan Miraz D) Shakib Al Hasan

3. Who was appointed as the new Chairman of the Union Public Service Commission (UPSC) in May 2025?
A) Rajiv Gauba B) Ajay Kumar
C) Sanjay Mitra D) Preeti Sudan

4. Who was appointed as Canada's Minister of Foreign Affairs in May 2025, becoming the first Hindu woman to hold this position?
A) Kamal Khera B) Sneha Mishra
C) Anita Anand D) Keerthana Joly

5. Which date has the Government of India designated for the annual celebration of Ayurveda Day, replacing the previous observance on Dhanteras?
A) October 23 B) November 2
C) September 23 D) October 29

6. Who was appointed as the Chairman of the BRICS Chamber of Commerce and Industry in May 2025?
A) R.K. Vishnoi B) Harvansh Chawla
C) Shubham Chaudhary D) Pinarayi Vijayan

Key: 1-B 2-C 3-B 4-C 5-C 6-B.

మెగా డీఎస్సీ 2025 ప్రత్యేకం

ఫిజికల్ సైన్సెస్

పరమాణువులు - అణువులు

1. పరమాణువులు అనే పదాన్ని ప్రతిపాదించింది ఎవరు?
1) మహర్షి కాత్యాయన 2) డెమోక్రటిస్
3) మహర్షి కణాదుడు 4) జాన్ డాల్టన్

2. డాల్టన్ తెలిపిన వివరాల ప్రకారం పదార్థంలోని సూక్ష్మమైన కణాన్ని ఏమంటారు?
1) పరమాణువులు 2) అణుసమూహం
3) సంయోగ పదార్థం 4) అయాన్

3. ద్రవ్య నిత్యత్వ నియమం ప్రకారం కింది వాటిలో సరైంది?
1) ద్రవ్యరాశిని నాశనం చేయవచ్చు
2) ద్రవ్యరాశిని సృష్టించవచ్చు
3) ద్రవ్యరాశిని మార్చలేం
4) ద్రవ్యరాశిని మార్చవచ్చు

4. కిందివాటిలో ద్విపరమాణుక అణువు ఏది?
1) నీరు 2) కార్బన్ డైఆక్సైడ్
3) అమ్మోనియా 4) ఆక్సిజన్

5. నీటిలో హైడ్రోజన్, ఆక్సిజన్ ద్రవ్యరాశుల నిష్పత్తి ఎంత?
1) 2 : 1 2) 8 : 1
3) 1 : 8 4) 1 : 2

6. ధనావేశం కలిగిన అయాన్‌ను ఏమంటారు?
1) కాటయాన్ 2) అణువు
3) ఆనయాన్ 4) అణుసమూహం

7. నీటి (H_2O) అణు ద్రవ్యరాశి ఎంత?
1) 22u 2) 18u
3) 20u 4) 16u

8. బహుళ పరమాణుక అయాన్ ఏది?
1) అమ్మోనియం 2) సోడియం
3) హైడ్రోజన్ 4) క్లోరైడ్

9. పరమాణు ద్రవ్యరాశి ప్రమాణం (amu)ను ప్రస్తుతం ఏమని పిలుస్తున్నారు?
1) సాపేక్ష భారం
2) అణుసమూహ భారం
3) ప్రామాణిక ద్రవ్యరాశి
4) ఏకీకృత ద్రవ్యరాశి

10. రసాయనశాస్త్రానికి పునాదులు వేసిన శాస్త్రవేత్త?
1) రూథర్‌ఫర్డ్ 2) ఆంటోనీ లెవోయిజర్
3) జాన్ డాల్టన్ 4) డెమోక్రటిస్

11. సోడియం క్లోరైడ్ సంకేతం ఏమిటి?
1) $NaCl_2$ 2) Na_2Cl
3) $NaCl$ 4) Na_3Cl

12. Fe సంకేతంగా ఉన్న మూలకం?
1) జింక్ 2) ఐరన్
3) కాపర్ 4) సీసం

13. ఆక్సిజన్ పరమాణుకత ఎంత?
1) ద్వి 2) బహుళ 3) ఏక 4) త్రి

14. మెగ్నీషియం క్లోరైడ్ సంకేతం ఏమిటి?
1) $MgCl_2$ 2) $MgCl$
3) Mg_3Cl_2 4) Mg_2Cl

15. మూలకాలు కచ్చితమైన నిష్పత్తిలో కలుస్తాయని ఏ నియమం తెలుపుతుంది?
1) స్థిరానుపాత నియమం
2) రసాయన క్రియల నియమం
3) బహుళ నిష్పత్తుల నియమం
4) ద్రవ్యనిత్యత్వ నియమం

16. సల్ఫేట్ అయాన్ ఆవేశం ఎంత?
1) +1 2) −2 3) −1 4) +2

17. కాల్షియం కార్బొనేట్ సంకేతం ఏమిటి?
1) CaC_2O_4 2) $CaCO_3$
3) $CaCO_4$ 4) Ca_2CO_3

18. పరమాణువుల లక్షణం ఏమిటి?
1) పరమాణువులు నశిస్తాయి
2) పరమాణువులు కనిపిస్తాయి
3) పరమాణువులు అవిభాజ్యాలు
4) పరమాణువులను సృష్టించవచ్చు

19. కార్బన్ డైఆక్సైడ్ అణు ద్రవ్యరాశి ఎంత?
1) 44u 2) 28u
3) 32u 4) 40u

20. ఒక మూలకం సంయోజకతను ఏమంటారు?
1) వేలన్సీ 2) పరమాణు సంఖ్య
3) పరమాణుకత 4) భారం

21. అమ్మోనియం సల్ఫేట్ సంకేతం?
1) NH_4SO_3 2) $NH_4(SO_4)_2$
3) NH_4SO_4 4) $(NH_4)_2SO_4$

22. హైడ్రోజన్ అణు ద్రవ్యరాశి ఎంత?
1) 16u 2) 12u 3) 2u 4) 1u

23. కిందివాటిలో అణువుల లక్షణం?
1) స్వతంత్రంగా ఉండవు
2) స్వతంత్రంగా ఉంటాయి
3) ఎల్లప్పుడూ ఆవేశాన్ని కలిగి ఉంటాయి
4) ఎల్లప్పుడూ కంటికి కనిపించేంత పెద్దవిగా ఉంటాయి

24. సోడియం సల్ఫేట్ సంకేతం ఎంత?
1) $NaSO_3$ 2) Na_2S
3) $NaSO_4$ 4) Na_2SO_4

25. క్లోరైడ్ అయాన్ ఆవేశం ఎంత?
1) −1 2) −2 3) +1 4) +2

26. పొటాషియం నైట్రేట్ సంకేతం ఏమిటి?
1) K_2NO_3 2) KNO_3
3) KNO_2 4) K_2NO_2

సమాధానాలు

1-2	6-1	11-3	16-2	21-4	26-2
2-1	7-2	12-2	17-2	22-3	
3-3	8-1	13-1	18-3	23-2	
4-4	9-4	14-1	19-1	24-4	
5-3	10-2	15-1	20-1	25-1	

రచయిత: వట్టిపల్లి కృష్ణ కిశోర్

సబ్జెక్టులవారీ ప్రాక్టీస్ టెస్టుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

భక్తి, నమ్మకానికి ప్రతిరూపం ఆంజనేయుడు: ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: భక్తి, బల సంపన్నత, నమ్మకానికి ప్రతిరూపమైన ఆంజనేయుడి అండగా నిలిచి.. మనం చేపట్టే పనుల్లో విజయాల్ని చేకూర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. 'ఎక్స్' వేదికగా ఆయన ప్రజలకు హనుమ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

భయాన్ని దరిచేరనివ్వని ధీశక్తి హనుమ సొంతం: మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: భయం, నిరాశ, నిస్పృహలను దరి చేరనివ్వని ధీశక్తి ఆంజనేయస్వామి సొంతమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. 'అనన్యమైన ఆలోచనా విధానం, అసాధ్యాన్ని సుసాధ్యం చేసే తెగువ, అసాధారణ కార్యదక్షతకు ఆంజనేయస్వామి ప్రతీక. ఆ రామభక్తుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నాను' అని మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా రాష్ట్ర ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

కష్టాలను ఎదుర్కోవడంలో హనుమాన్ చరితం స్ఫూర్తి: మాజీ సీఎం జగన్

'శక్తిమంతుడు, సమర్థుడైన కార్యసాధకుడు ఆంజనేయుడు. విఘ్నాలను ఎదుర్కొని, కష్టాల్లో ధైర్యంగా నిలబడి విజయవంతంగా ఎలా అధిగమించాలో తెలిపేందుకు 'హనుమాన్ చరిత్ర' ఓ ఉదాహరణ. రాష్ట్ర ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు' అని మాజీ సీఎం జగన్ గురువారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

టైలర్ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్‌గా ఆకాశపు స్వామి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర టైలర్ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్‌గా ఆకాశపు స్వామిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఆరు నెలలపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

ఏవియేషన్ కార్పొరేషన్‌కు రూ.19 కోట్లు

ఈనాడు, అమరావతి: ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.19.12 కోట్లను గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా మంజూరు చేసింది. రాష్ట్రంలో వీవీఐపీల ప్రయాణానికి గాను హెలికాప్టర్, విమానాల అద్దె, ఇతర ఖర్చుల నిమిత్తం ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి గాను ఈ మొత్తాన్ని విడుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

సెలబ్రిటీల పాన్‌మసాలా ప్రకటనలు సరికాదు: సీపీఐ

ఈనాడు, అమరావతి: పాన్ మసాలా వినియోగాన్ని ప్రోత్సహించేలా సెలబ్రిటీలు చేస్తున్న ప్రకటనలను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఖండించారు. హానికరమైన పాన్‌మసాలా, పొగాకు గుట్కా ప్యాకెట్లను ప్రచారం చేస్తున్నా వీడియోను విడుదల చేశారు. ఇవి యువతను దుష్ప్రభావం చూపుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బు సంపాదన కోసం ఇలాంటి ప్రకటనలు చేయడం సరికాదన్నారు. పాన్‌మసాలా రూ.10కి కొనుగోలు చేస్తే ఉచితంగా పొగాకు గల గుట్కాను ఇస్తున్నారని, వీటి వినియోగంతో క్యాన్సర్ బారిన పడతారని వెల్లడించారు.

హత్యను ప్రమాదంగా చిత్రీకరించిన వైకాపా నాయకులు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: నంద్యాల జిల్లా నందికొట్కూరులో తన తండ్రిని వైకాపా నేతలు హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించారని పగిడ్యాలకు చెందిన ఎ.శివప్రసాద్ వాపోయారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం వినతి పత్రం సమర్పించారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, గుంటూరు జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధుడైన తన తండ్రికి కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైందని ఏలూరు జిల్లా భీమడోలు మండలం సూరప్పగూడేనికి చెందిన రామకోటేశ్వరరాజు వాపోయారు.

చట్టప్రకారం చర్యలు తీసుకోండి

- వై.వి.సుబ్బారెడ్డి భార్య పిటిషన్‌పై హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు వ్యక్తులు తమ భూమిలో జోక్యం చేసుకుంటున్నారంటూ వైసీపీ నేత వై.వి.సుబ్బారెడ్డి సతీమణి వై.స్వర్ణలతారెడ్డి ఇచ్చిన వినతి పత్రాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడంపై వివరణ ఇవ్వాలంటూ పోలీసులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను జూన్ 23కు వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లో సర్వే నం.87/2లోని 6.23 ఎకరాల్లో తనకు చెందిన 2.08 ఎకరాలను ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని స్వర్ణలతారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వేసవి సెలవుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. పిటిషనర్ ఇచ్చిన వినతి పత్రాలపై ఇరుపక్షాల వాదనకు అవకాశం ఇచ్చి చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని న్యాయమూర్తి పోలీసులను ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని పిటిషనర్‌కు రెండు వారాల్లో తెలియజేయాలని స్పష్టం చేశారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

- క్రిమినల్ కేసుపై స్టే ఇచ్చేందుకు నిరాకరణ
- అటవీ భూముల ఆక్రమణలపై అనుబంధ పిటిషన్ కొట్టివేత

ఈనాడు, అమరావతి: అటవీ భూములు ఆక్రమణ వ్యవహారంలో మాజీ మంత్రి, పుంగనూరు వైకాపా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు హైకోర్టులో చుక్కెదురైంది. ఆక్రమణల విషయంలో పెద్దిరెడ్డి, ఆయన తనయుడు రాజంపేట వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, సోదరుడు, తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, మరో సోదరుడు భాస్కర్‌రెడ్డి భార్య ఇందిరమ్మలపై అటవీ శాఖ అధికారులు నమోదు చేసిన క్రిమినల్ కేసు/ప్రొసీడింగ్స్‌ను నిలుపుదల చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. క్రిమినల్ కేసుపై స్టే విధించాలంటూ వారు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. యాజమాన్య హక్కులున్న భూముల విషయంలో పిటిషనర్లకు హైకోర్టు గతంలో రక్షణ కల్పించిందని గుర్తుచేశారు. పెద్దిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు చిత్తూరు జిల్లా పులిచర్ల మండలం మంగళంపేట రెవెన్యూ గ్రామ పరిధిలో 27.98 ఎకరాల అటవీ భూములను కబ్జా చేసి, జీవవైవిధ్యానికి నష్టం కలిగించారని విచారణ బృందం నిర్ధారించింది. దీంతో పెద్దిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై అటవీ శాఖ అధికారులు ఈ నెల 6న క్రిమినల్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెద్దిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు హైకోర్టులో పిటిషన్ వేశారు. తమ ఆధీనంలోని భూముల విషయంలో జోక్యం చేసుకోకుండా నిలువరించాలని, తమపై నమోదు చేసిన క్రిమినల్ కేసును కొట్టేయాలని అభ్యర్థించారు. గురువారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. అధికారుల వ్యవహారం పెండింగ్‌లో ఉండగా, అటవీశాఖ అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేయడం చెల్లదని తెలిపారు.

విచారణార్హత లేదు: ఏజీ

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ వాదిస్తూ 'పిటిషన్‌కు విచారణ అర్హత లేదు. భూముల విషయంలో జోక్యం చేసుకోవద్దని, క్రిమినల్ కేసును కొట్టేయాలని వేర్వేరు అభ్యర్థనలతో ఒకే వ్యాజ్యం దాఖలు చేయడానికి వీల్లేదు. అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసి, దర్యాప్తునకు సహకరించాలని కోరుతూ నోటీసు ఇచ్చారు. దానికి సహకరించకుండా స్టే కోరడం సరి కాదు. పిటిషనర్లకు యాజమాన్య హక్కులున్న భూముల విషయంలో హైకోర్టు ఇప్పటికే రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులిచ్చింది. వారిని ఆ భూముల నుంచి ఖాళీ చేయిస్తున్నారనేందుకు పిటిషనర్లు ఎలాంటి ఆధారాలూ కోర్టు ముందు ఉంచలేదు. అందువల్ల అనుబంధ పిటిషన్‌ను కొట్టేయండి' అని కోరారు. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. అనుబంధ పిటిషన్‌ను కొట్టేస్తూ ఉత్తర్వులిచ్చారు.

'ఇరవై సూత్రాల' పేరు మార్చాలి

లంకా దినకర్ ప్రతిపాదన



ఈనాడు, అమరావతి: ప్రస్తుత విధానాలకు అనుగుణంగా ఇరవై సూత్రాల కార్యక్రమాల పేరును మార్చాలని వాటి అమలు చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 'స్వర్ణాంధ్ర సాధన సూత్రాలు'గా, దేశంలో 'పీఎం వికసిత్ భారత్ సాధన సూత్రాలు' లేదా 'పీఎం వికసిత్ భారత్ కార్యక్రమాలు'గా మార్చాలని ప్రతిపాదించారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'పేరు మార్పునకు సంబంధించిన సమాచారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబుకు పంపించాం. వికసిత్ భారత్-స్వర్ణాంధ్ర లక్ష్యాలతో పని చేసేందుకు ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలులో సంస్కరణలు తీసుకురావాలి. 11 జిల్లాల అధికారులతో పథకాలు, ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహించిన అనంతరం సంస్కరణలు అవసరమని గుర్తించాం. పేరు మార్పుపై ఫిబ్రవరి 3న ప్రధానికి లేఖ రాశాం. దానిపై స్పందించిన ప్రధాని కార్యాలయం.. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కేంద్ర గణాంక, ప్రభుత్వ కార్యక్రమాల అమలు, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ శాఖకు ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలో పేరు మార్పుపై సీఎం చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 24 జిల్లాల్లో పథకాలు, ప్రాజెక్టుల అమలు తీరుపై సమీక్షలు పూర్తిచేశాం. మిగతా రెండు జిల్లాలు ఈ నెలాఖరుకు పూర్తిచేస్తాం' అని వెల్లడించారు.

జీఎంఆర్‌తో అనుబంధ ఒప్పందం

ఈనాడు-అమరావతి: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్న జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీవీఐఏఎల్)తో అనుబంధ రాయితీ ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ఏపీఏడీసీఎల్ ఎండీకి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వార్షిక భూమి లీజు, పెరుగుతున్న సబ్ లైసెన్స్ రుసుముల నిష్పత్తి ఆధారంగా అదనపు ఆదాయాన్ని ఇచ్చేందుకు జీవీఐఏఎల్ ప్రతిపాదించింది. దీనిపై మంత్రుల బృందం చేసిన సిఫార్సుల మేరకు ఏవియేషన్ హబ్ అభివృద్ధి కోసం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధి సంస్థకు 500 ఎకరాలు తిరిగి ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 2,703.32 ఎకరాల్లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని రైట్స్ సంస్థ మాస్టర్‌ప్లాన్ రూపొందించింది. ఇందులోని 793.96 ఎకరాలు వాణిజ్య అవసరాలకు వినియోగించే భూముల్లో 500 ఎకరాలను 2022 సెప్టెంబరు 16న అప్పటి ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.

రూ.2,065 కోట్లతో పారిశ్రామిక నోడ్‌ల అభివృద్ధి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక నోడ్‌లను రూ.2,065 కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (నిక్‌డిట్) ఆమోదించింది. ఓర్వకల్లు నోడ్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.1,120.81 కోట్లు, కొప్పర్తిలో రూ.944.30 కోట్లను ఖర్చు చేయనుంది. ప్రాజెక్టు మొదటి దశలో సర్వే, డిజైన్లు, నిర్మాణం, టెస్టింగ్, రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, వంతెనలు, పార్కులోని పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరా పనులు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, విద్యుత్ సరఫరా పనులకు ఈ మొత్తాన్ని ఖర్చుచేయనుంది. మల్టీ ప్రొడక్ట్ ఇండస్ట్రియల్ క్లస్టర్లుగా నోడ్‌ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదించింది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు వాక్ టు వర్క్ విధానానికి ప్రాధాన్యం కల్పించేలా నోడ్‌ల అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనుల నిర్వహణకు గుత్తేదారుల ఎంపిక కోసం ఏపీఐఐసీ ఈపీసీ విధానంలో టెండర్లు పిలిచింది. బిడ్‌ల దాఖలుకు జూన్ 12 తుది గడువుగా నిర్దేశించింది. అదేరోజు సాంకేతిక బిడ్‌ల పరిశీలన పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. పనులు దక్కించుకున్న గుత్తేదారుకు 30 రోజుల్లో లెటర్ ఆఫ్ అవార్డు (ఎల్‌వోఏ) అందిస్తామని పేర్కొన్నారు. రెండు నోడ్‌లు అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు, ఎగుమతులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం పేర్కొంది.

- **ఓర్వకల్లు నోడ్:** హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌బీఐసీ)లో భాగంగా కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు దగ్గర సుమారు 9,305 ఎకరాల్లో అభివృద్ధి చేసేలా ప్రతిపాదించారు. మొత్తంగా 8 ప్రాంతాల్లో నోడ్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రవాణా సదుపాయాలు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో ప్లగ్ అండ్ ప్లే విధానంలో మౌలిక సదుపాయాలను కల్పించనుంది.
- **కొప్పర్తి నోడ్:** విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ (వీసీఐసీ)లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక నోడ్‌ను 2,595.74 ఎకరాల్లో అభివృద్ధి చేయనుంది. మొదటి దశలో డిజైన్లు, కన్‌స్ట్రక్షన్, టెస్టింగ్, కమిషనింగ్ పనులను నిర్వహించనుంది. విశాఖపట్నం, చెన్నై మధ్యలో పారిశ్రామిక నోడ్ ఉండటం కలిసొస్తుంది.

పర్యవేక్షణకు ప్రత్యేక ఎస్పీవీలు

ఈ పనుల పర్యవేక్షణ కోసం ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐసీడీసీ) పేరిట ప్రత్యేక ప్రణాళిక నౌక (ఎస్పీవీ)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేంద్రం తరపున నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ), రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏపీఐఐసీ ఎస్పీవీలో ఉంటాయి. రెండు సంస్థలకు ఏపీఐసీడీసీలో సమాన వాటా ఉంటుంది. ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్‌ల పాలన, ప్రాజెక్టు అమలు పనులను ఎస్పీవీ పర్యవేక్షిస్తుంది. ప్రాజెక్టు అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్రసంస్థ నిక్‌డిట్ భరిస్తుంది. రాష్ట్రప్రభుత్వ వాటా కింద నోడ్‌ల అభివృద్ధికి భూములను అందిస్తుంది.

ఇప్పట్లో చీఫ్‌ను ఎన్నుకునే అవకాశాలు మృగ్యమే

- మావోయిస్టు పొలిట్ బ్యూరోలో మిగిలింది నలుగురే

ఈనాడు, హైదరాబాద్: అసలే వయోభారం.. ఆపై అనారోగ్యం.. అన్నింటికీ మించి నలువైపుల నుంచి తరుముకొస్తున్న భద్రతా బలగాలు.. అబూజ్‌మడ్ అడవుల్లో తలదాచుకున్న మావోయిస్టు అగ్రనేతలు ఒక రకంగా అష్టదిగ్బంధంలో చిక్కుకుపోయారని పోలీసులు అంచనా వేస్తున్నారు. బస్తర్‌లో బలగాల నిర్బంధం ఉద్ధృతమవుతున్న పరిస్థితుల్లో అక్కడే ఉండలేక.. బయటికి వెళ్లే మార్గం దొరక్క కకావికలమవుతున్నట్లు భావిస్తున్నారు. లొంగిపోవడం.. లేదంటే ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోవడం అన్న రీతిలో దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని వివరిస్తున్నారు. బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌లో పార్టీ చీఫ్ నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్ హతం కావడంతో అక్కడికి సమీపంలోనే పార్టీ పొలిట్ బ్యూరో అగ్రనేతలు తలదాచుకొని ఉంటారనే అంచనాతో భద్రత బలగాలు కూంబింగ్‌ను ముమ్మరం చేయడం ప్రజాసంఘాలను కలవరపెడుతోంది. ఏ క్షణాన ఎలాంటి సమాచారం వినాల్సి వస్తుందోననే ఆందోళన తీవ్రమవుతోంది. శాంతి చర్చల డిమాండ్‌ను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం.. బస్తర్‌లో కూంబింగ్‌ను తీవ్రం చేయడంతో మావోయిస్టు పార్టీ ప్రస్థానం చరమాంకంలో పడిందనే భావన పోలీసు వర్గాల్లో నెలకొంది.

కేంద్ర కమిటీలో ప్రస్తుతం ఉన్నది 16 మందే

2004లో మావోయిస్టు పార్టీ అవతరించినప్పుడు కేంద్ర కమిటీలో 34 మంది నేతలుండేవారు. వారి నుంచి పొలిట్‌బ్యూరోలో 16 మంది ఉన్నారు. మావోయిస్టు పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక కమిటీ పొలిట్‌బ్యూరోతోపాటు కేంద్ర కమిటీలో ప్రస్తుతం 16 మంది అగ్ర నేతలున్నారు. పొలిట్‌బ్యూరోలో కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. పార్టీ మాజీ చీఫ్ ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మిసిర్‌బెస్రా మాత్రమే ఉన్నారు. మొదటి ముగ్గురు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందినవారు.. మిసిర్‌బెస్రా మాత్రం ఝార్ఖండ్ గిరిధ్ ప్రాంతానికి చెందిన నేత. వీరు కాకుండా కేంద్ర కమిటీలో తెలంగాణకు చెందిన మల్లా రాజిరెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డి, గాజర్ల రవి, మోడెం బాలకృష్ణ, పుల్లూరి ప్రసాదరావు, పాక హన్మంతు, కట్టా రాంచంద్రారెడ్డి, పోతుల కల్పన.. ఆంధ్రప్రదేశ్ నుంచి తెంటు లక్ష్మీనర్సింహాచలంతోపాటు ఝార్ఖండ్ నుంచి వివేక్‌చంద్రి యాదవ్, పతిరాం మాంజీ.. పశ్చిమ్‌బెంగాల్ నుంచి సబ్యసాచి గోస్వామి ఉన్నారు. అరెస్టులు, ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్ల కారణంగా మావోయిస్టు పార్టీ అవతరించిన నాటి సంఖ్యతో పోల్చితే కేంద్ర కమిటీలో సభ్యుల సంఖ్య దాదాపు సగానికి పడిపోయింది. ఒకవేళ కూంబింగ్ ఉద్ధృతి తగ్గి పరిస్థితులు అనుకూలిస్తే పొలిట్ బ్యూరోలోని నలుగురిలో ఒకరు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి అయ్యే అవకాశముంది. ప్రస్తుతం మావోయిస్టు కేంద్ర కమిటీలో ఉన్న నేతలంతా 1980 దశకంలో ఉద్యమ బాట పట్టినవారే.

డీటీహెచ్ సేవలపై వినోద, సేవా పన్నులు విధించొచ్చు

- సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు

దిల్లీ: వినియోగదార్లకు అందించే డీటీహెచ్ సేవలపై రాష్ట్ర శాసనసభలు, పార్లమెంటు వినోద పన్ను, సేవా పన్ను విధించొచ్చని సుప్రీంకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ప్రసారం అనేది ఒక సేవ అని, రాజ్యాంగంలోని ఎంట్రీ 62 లిస్ట్-2 కింద వినోద కార్యకలాపాలపై పార్లమెంటు విధించిన సేవా పన్ను అమలవుతుందని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ ఎంట్రీ 62 లిస్ట్-2 వినోదం, బెట్టింగ్, జూదం వంటి విలాసాలపై పన్నులను వివరిస్తుంది. ఏదైనా ప్రదర్శన, సినిమా లేదా కార్యక్రమాన్ని తక్షణమే తమ టీవీలో ప్రసారం చేయడానికి బ్రాడ్‌కాస్టర్ సంకేతాలను ఇవ్వకపోతే ప్రేక్షకులకు ఎలాంటి వినోదం అందదని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రసారం ద్వారా అందించే టెలివిజన్ వినోదం, ఎంట్రీ 62 జాబితా-2లో విలాసవంతమైనదని ధర్మాసనం తెలిపింది. వినోదాన్ని అందించే కార్యకలాపాల్లో నిమగ్నమైన డీటీహెచ్ ఆపరేటర్లు ఆర్థిక చట్టం 1994లోని నిబంధనల ప్రకారం ప్రసార కార్యకలాపాలపై సేవా పన్నుతోపాటు వినోద పన్ను చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. వినోద పన్ను విధించడం రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన కొన్ని అప్పీళ్లపై తాజా తీర్పు వెలువడింది.

అచ్యుతాపురం కాల్ సెంటర్ల కేసులో 33 మంది అరెస్టు

అనకాపల్లి పట్టణం, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో నకిలీ కాల్ సెంటర్లు నిర్వహిస్తూ అమెరికన్ పౌరుల నుంచి నెలకు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు దోచుకుంటున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ముఠాలో కీలకమైన మహారాష్ట్రకు చెందిన పునీత్ గోస్వామి, రాజస్థాన్‌కు చెందిన అవిహాంత్‌దాగా సహా 33 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో ముగ్గురు మహిళలూ ఉన్నారు. దీనికి సంబంధించి ఎస్పీ తుహిన్‌సిన్హా అనకాపల్లి జిల్లా కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. "ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే యువతకు అమెరికన్లతో ఇంగ్లిష్‌లో ఎలా మాట్లాడాలో శిక్షణ ఇచ్చి ఫోన్‌లు చేయిస్తారు. వీరు అక్కడి వారిని మీరు ఆర్డర్ పెట్టారు.. అది చేరిందా అని అడుగుతారు. మేము ఎలాంటి ఆర్డర్ పెట్టలేదని అవతలి వారు అన్నాక మీ బ్యాంకు ఎకౌంట్ నుంచి నగదు డ్రా అయిందని, వేరే వారు ఎవరైనా ఎకౌంట్‌ను వాడుతున్నారేమో పరిశీలించవచ్చా అని ప్రశ్నిస్తారు. దీనికి వారు సరే అంటే రెండో దశలో బ్యాంకర్ పేరుతో మాట్లాడి వివరాలన్నీ తీసుకుంటారు. అనంతరం క్లోజర్‌తో మాట్లాడమని లైన్ కలుపుతారు. మీ బ్యాంకు ఎకౌంట్‌ను వేరే వారు వాడుతున్నారని, నగదు జాగ్రత్తగా ఉంచుకోండంటూ హెచ్చరిస్తారు. అనంతరం నగదుకు సెక్యూరిటీ పేరుతో కూపన్లు ఇస్తామని చెప్పి వారిని నమ్మించి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ఇలా రోజుకు 100 నుంచి 200 మందితో మాట్లాడతారు' అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మరింత లోతుగా దర్యాప్తు చేయడానికి కేంద్ర ప్రభుత్వ నిఘా విభాగం, సీఐడీ, సైబర్ నిపుణుల సహకారం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు, హార్డ్‌డిస్క్‌లు పరిశీలిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

పంచాయతీరాజ్ శాఖలో బదిలీలకు మార్గదర్శకాలు

ఈనాడు-అమరావతి: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఇంజినీరింగ్ విభాగాల్లో ఉద్యోగుల బదిలీల కోసం గురువారం మార్గదర్శకాలు వెలువడ్డాయి. ఒకేచోట ఐదేళ్లకు పైగా పని చేస్తున్న ఉద్యోగులను విధిగా బదిలీ చేయనున్నారు. పనితీరు ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించాలి. ఏసీబీ కేసుల్లో ఉన్న వారికి కీలక హోదాల్లో నియమించరాదు.

- ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలను సొంత డివిజన్లలో నియమించకూడదు.
- డివిజనల్ పంచాయతీ అధికారులు, పరిపాలన అధికారులు, మినిస్టీరియల్ సిబ్బందిని కూడా సొంత డివిజన్లలో నియమించరాదు.
- జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయాల్లోని మినిస్టీరియల్ సిబ్బంది బదిలీలకు సంబంధించి కలెక్టర్లకే పూర్తి అధికారం.
- పంచాయతీ కార్యదర్శులకు వారి సొంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వకూడదు.
- పనితీరు ఆశాజనకంగా లేని కార్యదర్శులను అప్రాధాన్య పంచాయతీలకు బదిలీ చేయాలి.
- డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను సొంత రెవెన్యూ డివిజన్ల పరిధిలో నియమించవద్దు.
- అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్లను సొంత సబ్ డివిజన్ పరిధిలో నియమించకూడదు.
- క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో పని చేస్తున్న ఇంజినీర్లను విధిగా డివిజన్, సబ్ డివిజన్, మండలాలకు బదిలీ చేయాలి.
- డిప్యుటేషన్‌పై పని చేసే కాలాన్ని కూడా మాతృ సంస్థలోనే పని చేస్తున్నట్లుగా గుర్తించి బదిలీ చేయాలి.

దేశవ్యాప్తంగా 50 కొత్త విమానాశ్రయాలు నిర్మిస్తాం

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం: ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 50 కొత్త విమానాశ్రయాలు నిర్మిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళంలో గురువారం జరిగిన పార్లమెంట్ స్థాయి మినీ మహానాడు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'అత్యంత చిన్న వయసులో కేంద్ర మంత్రిగా నాకు అవకాశం ఇచ్చారు. నేను ఎలా పని చేస్తున్నానని ప్రధాని మోదీ తూకం వేస్తుంటే.. రాష్ట్రానికి ఎన్ని నిధులు తీసుకొస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తూకం వేస్తున్నారు. అందుకే ఐదేళ్లలో 50 విమానాశ్రయాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే కొన్ని ప్రారంభం కాగా, మరికొన్నింటికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రాష్ట్రంలో శ్రీకాకుళం, నెల్లూరు, కుప్పం, అమరావతిల్లో విమానాశ్రయాలను త్వరలో ప్రారంభిస్తాం. వీటితోపాటు మరో మూడు చోట్ల ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నాం. అమరావతికి రూ.48 వేల కోట్లు, పోలవరానికి రూ.12 వేల కోట్లు, విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.10,500 కోట్లు తెచ్చుకోగలిగాం. రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. ఓర్వకల్లు, కొప్పర్తిల్లో 5 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయబోతున్నాం. రాష్ట్రంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. వాటిని నాయకులే అనుభవించాలి తప్ప ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలని సీఎం చంద్రబాబు పని చేస్తున్నారు. సంక్షేమం- అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నారు' అని రామ్మోహన్ నాయుడు అన్నారు.

శ్రీవారి శీఘ్ర దర్శనానికి ఏఐ సాంకేతికత

- ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు పిలిచిన తితిదే

ఈనాడు, తిరుపతి–న్యూస్‌టుడే, తిరుమల: తిరుమలలో భక్తులకు శ్రీవారి దర్శనాన్ని వేగంగా కల్పించేందుకు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత వినియోగించుకోవాలని తితిదే నిర్ణయించింది. ఛైర్మన్ బీఆర్ నాయుడి ఆధ్వర్యంలోని బోర్డు తీర్మానం మేరకు తితిదే ఈవో జె.శ్యామలరావు కార్యాచరణను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా కంపార్ట్‌మెంట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల మధ్య ఏఐ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. క్యూలైన్‌లోకి వస్తున్న సర్వదర్శనం, స్లాటెడ్, ప్రత్యేక ప్రవేశదర్శనం భక్తులు, క్యూలైన్‌లోకి అదనంగా వచ్చి కలుస్తున్న వారు, దర్శనం చేసుకుంటున్న భక్తుల వివరాలను బేరీజు వేస్తారు. తద్వారా భక్తులకు దర్శన సమయం కచ్చితంగా తెలుస్తుంది. ప్రస్తుతం గంటకు ఎంతమంది శ్రీవారిని దర్శించుకుంటున్నారనే శాస్త్రీయమైన సమాచారం తితిదే వద్ద లేదు. ఈ వివరాలు అందుబాటులోకి వస్తే దళారులు, కొందరు ఉద్యోగుల సహకారంతో ఇష్టారాజ్యంగా క్యూ లైన్లలోకి వచ్చే సంస్కృతికి అడ్డుకట్ట పడుతుంది. జియో సంస్థ ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఏఐ ఫేషియల్ రికగ్నిషన్‌ను వినియోగించి భక్తుల ముఖచిత్రాలను నమోదు చేస్తోంది. పూర్తి స్థాయిలో ఏఐ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు పిలిచారు. మూడు నాలుగు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని ఈవో శ్యామలరావు వెల్లడించారు.

సిక్కిం ప్రాజెక్టుల నుంచి 49 మెగావాట్ల విద్యుత్

- ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్న ఏపీఈఆర్సీ

ఈనాడు, అమరావతి: నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ), భాగస్వామ్య సంస్థల నుంచి 49 మెగావాట్ల జల విద్యుత్ తీసుకునేలా దీర్ఘకాలిక కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ) కుదుర్చుకోవాలన్న డిస్కంల ప్రతిపాదనలపై వ్యక్తులు/భాగస్వామ్య పక్షాలు ఈ నెల 31లోగా సూచనలు/అభ్యంతరాలు పంపాలని ఏపీఈఆర్సీ పేర్కొంది. వాటికి జూన్ 5లోగా సమాధానాలు పంపాలని సీపీడీసీఎల్‌ను ఆదేశించింది. తూర్పు సిక్కింలోని తీస్తా-4 ప్రాజెక్టు నుంచి 36 మె.వా.(యూనిట్ రూ.4.07), రంగీత్-4 నుంచి 13 మె.వా. (యూనిట్ రూ.4.37) విద్యుత్ తీసుకునేందుకు సీపీడీసీఎల్ కమిషన్ అనుమతి కోరింది. 2023 నవంబరు 24న రాష్ట్ర డిస్కంలు రాసిన లేఖ ఆధారంగా ఆ విద్యుత్‌ను కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ రాష్ట్రానికి కేటాయించింది. 2025 జూన్ లోగా పీపీఏలు కుదుర్చుకున్నట్లయితే అంతర్ రాష్ట్ర విద్యుత్ సరఫరా ఛార్జీ (ఐఎస్‌టీఎస్)లను కేంద్రం మినహాయించింది. తీస్తా ప్రాజెక్టు నుంచి 2027 డిసెంబరు, రంగీత్ ప్రాజెక్టు నుంచి 2025 డిసెంబరు నుంచి విద్యుత్ అందే అవకాశం ఉంటుంది.

పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల బదిలీకి అనుమతి

ఈనాడు, అమరావతి: ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన 300.30 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌కు బదలాయించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీసత్యసాయి జిల్లా ఆర్.అనంతపురం, కంబదూరు, శెట్టూరు మండలాల్లో ప్రాజెక్టుల ఏర్పాటుకు గతంలో ప్రభుత్వం ఎకోరెన్ లిమిటెడ్‌కు అనుమతి ఇచ్చింది.

- ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు వైఎస్సార్ కడప జిల్లా గంగదేవిపల్లి, నల్లబల్లె దగ్గర కేటాయించిన 260 మెగావాట్ల పవన, సౌర హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టులను యాంప్లస్ ఎవరెస్ట్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్, యాంప్లస్ ఐఐఎఫ్ఏ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బదిలీ చేసేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.
- బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్‌కు శ్రీసత్యసాయి జిల్లా రొద్దం, గుత్తి, పెదవడుగూరు, విడపనకల్, పెదపప్పూరు, నార్పల మండలాల్లో 2 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఇకపై నెలలో రెండు సార్లు భేటీ

- నిధుల అవకతవకలు, పాలనాపరమైన లోపాలనూ పరిశీలిస్తాం
- అసెంబ్లీ ప్రజాపద్దుల కమిటీ నిర్ణయం

ఈనాడు, అమరావతి: నిధుల అవకతవకలపైనే కాకుండా, పాలనాపరమైన లోపాలనూ ఇకపై పూర్తిస్థాయిలో సమీక్షించాలని అసెంబ్లీ ప్రజాపద్దుల కమిటీ(పీఏసీ) నిర్ణయించింది. ఇటీవలే ఏర్పాటైన ఈ కమిటీ గురువారం తొలిసారి భేటీ అయింది. కమిటీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు అధ్యక్షతన అసెంబ్లీలోని కమిటీ హాలులో జరిగిన సమావేశంలో శాఖల వారీగా పెండింగులో ఉన్న ఆడిట్ పేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇకపై నెలలో 2 సార్లు సమావేశం నిర్వహిస్తామని రామాంజనేయులు వెల్లడించారు. కాగ్ తాజా నివేదికను తొలుత సమీక్షించాలని, తర్వాతే పాత నివేదికల పేరాలు సమీక్షించాలని నిర్ణయించారు. గతంలో పీఏసీ చేసిన సిఫారసులపై ఎలాంటి చర్యలు(ఏటీఆర్) తీసుకున్నారని శాఖల వారీగా కమిటీ చర్చించింది. ఇకపై ఏటీఆర్‌లను ఎప్పటికప్పుడు సమర్పించాలని ఛైర్మన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కమిటీ సభ్యులు విష్ణుకుమార్ రాజు, ఎం.అశోక్‌రెడ్డి, ఆరిమిల్లి రాధాకృష్ణ, నక్కా ఆనందబాబు, లలితకుమారి, శ్రీరామ్ రాజగోపాల్, మొండితోక అరుణ్‌కుమార్‌లతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చర్యలపై ఆర్టీసీ కీలక ఆదేశాలు

ఈనాడు–అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులపై క్రమశిక్షణ ఉల్లంఘనల విషయంలో తీసుకునే చర్యలన్నీ 1/2019 సర్క్యులర్‌ను అనుసరించే ఉండాలని ఆర్టీసీ యాజమాన్యం ఆదేశించింది. ఉద్యోగుల తప్పులు, ఉల్లంఘనలకు.. వేటికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో పేర్కొంటూ 2019 జనవరి 1న యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసింది. కానీ ప్రస్తుతం డిపో మేనేజర్లు, రీజినల్ మేనేజర్లు ఎవరికి నచ్చినట్లు వాళ్లు చిన్న తప్పులకు సైతం కఠిన చర్యలు తీసుకుంటున్నారని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని పట్టుబడుతున్నాయి. మూడు రోజుల కిందట ఎన్ఎంయూఏ నేతలతో.. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో 1/2019 సర్క్యులర్ అమలుకు కిందిస్థాయి అధికారులను ఆదేశించాలని పట్టుబట్టారు. ఇది జరిగిన రెండు రోజులకే యాజమాన్యం తాజా ఆదేశాలు జారీచేసింది. ఆర్టీసీ ఉద్యోగులంతా ప్రభుత్వంలో ప్రజా రవాణాశాఖ ఉద్యోగులు కావడంతో.. వారిపై జీవో 70, 71 ప్రకారం అభియోగాలు నమోదు చేస్తారు. చర్యలు మాత్రం 1/2019 సర్క్యులర్‌ను అనుసరించి తీసుకుంటారు. ఈ ఆదేశాలపై అన్ని డిపోల వద్ద శుక్రవారం గేట్ మీటింగ్స్ ఏర్పాటు చేసి ఉద్యోగులకు వివరించాలని ఎన్ఎంయూఏ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో సూచించారు. ఈ ఆదేశాలు జారీ చేసినందుకు ఆర్టీసీ ఎండీకి, ఈడీలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

డాడీ.. భాజపాను మరింతగా టార్గెట్ చేయాల్సిందేమో!

- ఆ పార్టీపై 2 నిమిషాలే మాట్లాడారు
- భవిష్యత్తులో ఆ పార్టీతో పొత్తు ఉంటుందనే ఊహాగానాలు
- మీ ప్రసంగంలో రేవంత్ పేరు ప్రస్తావించకపోవడం ప్రజలకు నచ్చింది
- సభ విజయవంతంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం
- రజతోత్సవ సభ అనంతరం కేసీఆర్‌కు కవిత లేఖ!



ఈనాడు, హైదరాబాద్: భారాస రజతోత్సవ సభలో భాజపా గురించి కేసీఆర్ తక్కువగా మాట్లాడటంతో.. భవిష్యత్తులో ఆ పార్టీతో భారాస పొత్తు పెట్టుకుంటుందనే ఊహాగానాలను కొందరు మొదలుపెట్టారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సభ అనంతరం పార్టీ అధినేత కేసీఆర్‌కు కవిత రాసినట్లు ఒక లేఖ గురువారం బయటకు వచ్చింది. అయితే దీనిపై భారాస వర్గాలు గానీ, కవిత కార్యాలయ వర్గాలు గానీ స్పందించలేదు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న కవిత శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నాక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రజతోత్సవ సభ విజయవంతమైందని కేసీఆర్‌కు అభినందనలు తెలుపుతూ రాసినట్లున్న ఈ లేఖలో పాజిటివ్, నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ పేరిట అంశాలవారీగా పేర్కొన్నారు.

సానుకూల ఫీడ్‌బ్యాక్

■ "సభ విజయవంతమవడంతో పార్టీ శ్రేణులు పూర్తి ఉత్సాహంతో ఉన్నాయి. మీ ప్రసంగం పూర్తయ్యేవరకూ శ్రద్ధగా విన్నారు. ■ మీరు 'ఆపరేషన్ కగార్'పై మాట్లాడటం చాలామందికి నచ్చింది. ■ కాంగ్రెస్ ఫెయిల్.. ఫెయిల్.. అని పార్టీ శ్రేణులతో మీరు చెప్పించిన విధానం బాగుందని అనుకుంటున్నారు. ■ పహల్గాం అమరులకు నివాళిగా మౌనం పాటించడం బాగుంది. ■ వ్యక్తిగతంగా 'రేవంత్‌రెడ్డి' పేరు తీసి తిట్టకపోవడం చాలామందికి నచ్చింది. ఆయన మిమ్మల్ని రోజూ విమర్శిస్తున్నా... మీరు హుందాగా ఉన్నారనే ఫీడ్‌బ్యాక్ వచ్చింది. ■ తెలంగాణ అంటే భారాస... తెలంగాణ అంటే కేసీఆర్ అని మీరు బలంగా చెబుతారని చాలా మంది అనుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడంపై, తెలంగాణ గీతం అంశంపై మాట్లాడతారని ఎదురుచూశారు. ■ మొత్తంగా మీ ప్రసంగంలో ఇంకొంచెం పంచ్ ఆశించారు. అయినా కార్యకర్తలు, నాయకులు సభతో సంతృప్తిగా ఉన్నారు. ■ పోలీసులకు ఇచ్చిన హెచ్చరిక కూడా శ్రేణుల్లోకి బలంగా వెళ్లింది.

ప్రతికూల ఫీడ్‌బ్యాక్

■ ఉర్దూలో మాట్లాడకపోవడం ■ వక్ఫ్ బిల్లుపై మాట్లాడకపోవడం ■ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని విస్మరించడం ■ ఎస్సీ వర్గీకరణ అంశంపై మాట్లాడకపోవడం ■ ఇంత పెద్ద సభ నిర్వహణ బాధ్యతలను మళ్లీ నియోజకవర్గ పాత ఇన్‌ఛార్జులకు ఇవ్వడంతో.. వాళ్లు పాత పద్ధతిలో.. తెలంగాణ ఉద్యమకారులకు సదుపాయాలు కల్పించలేదన్న ఫీడ్‌బ్యాక్ కొన్ని నియోజకవర్గాల్లో వచ్చింది. ■ మళ్లీ పాత ఇన్‌ఛార్జులకే.. స్థానిక సంస్థల ఎన్నికల బీ-ఫాంల బాధ్యతలను పార్టీ అప్పగిస్తుందని ఇన్‌ఛార్జులు చెప్పుకొంటున్నట్లు తెలిసింది. ■ స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలనుకునే వారు రిలాక్స్‌గా ఉన్నారు. కానీ ఎంపీటీసీ, జడ్పీటీసీ నాయకులు, ఎంపీపీలు.. ఇన్‌ఛార్జుల ద్వారా కాకుండా నేరుగా రాష్ట్ర పార్టీ బీ-ఫాంలు ఇవ్వాలని కోరుతున్నారు. ■ మీరు సభా వేదిక మీదకు వచ్చేటప్పుడు 2001 నుంచి మీతో ఉన్న నాయకులకు మాట్లాడే అవకాశం కల్పిస్తే బాగుండేదని చాలా మంది అన్నారు. ■ కార్యకర్తలకు 'ధూం ధాం'... ■ ఆకట్టుకోవడంలో ఫెయిలైంది. ■ భాజపా గురించి మీరు కేవలం రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడటంతో.. భవిష్యత్తులో పొత్తు పెట్టుకుంటారనే ఊహాగానాలు మొదలుపెట్టారు. వ్యక్తిగతంగా నాకు కూడా మీరు ఇంకా బలంగా మాట్లాడాల్సి ఉండె. మీరు భాజపాను ఇంకొంచెం టార్గెట్ చేయాల్సిందేమో డాడీ. ■ కాంగ్రెస్‌పై క్షేత్రస్థాయిలో నమ్మకం పోయింది. దానికి భాజపా ప్రత్యామ్నాయం అవుతుందేమో అనే ఆలోచన మన శ్రేణులు వ్యక్తం చేస్తున్నారు. ■ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనం పోటీ చేయకుండా.. భాజపాకు సహాయం చేశామనే సందేశం కాంగ్రెస్ బలంగా తీసుకెళ్లింది. ■ ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మీరు ప్రత్యేక కార్యాచరణను, మార్గనిర్దేశనం చేస్తారని అందరూ ఆశించారు. ■ మనం ఒకటి రెండు రోజులు ప్లీనరీ నిర్వహించి... శ్రేణుల అభిప్రాయాలు స్వీకరించి, మార్గనిర్దేశం చేయాలి. ఈ విషయంపై కొంచెం సీరియస్‌గా ఆలోచన చేయండి. ■ చాలామంది మీతో ఫొటో దిగాలని, మీతో కలవాలని ఆశపడ్డారు.. ■ జడ్పీటీసీ సభ్యులూ, జడ్పీ ఛైర్మన్‌లూ, ఎమ్మెల్యేలతో పనిచేసిన నాయకులు చాలామంది.. మిమ్మల్ని కలవడానికి అవకాశం లభించడం లేదని బాధపడుతున్నారు. పరిమితంగా, కొద్దిమందికే కలిసే అవకాశం వస్తోంది. ... సుదీర్ఘ లేఖ రాసినందుకు సారీ! ధన్యవాదాలు" అని కవిత లేఖలో పేర్కొన్నారు.

మిస్ వరల్డ్ టాలెంట్ ఛాంపియన్‌గా ఇండోనేసియా సుందరి

- శిల్పకళావేదికపై పోటాపోటీగా సాగిన నైపుణ్య ప్రదర్శనలు
- జానపద గీతానికి నృత్యం చేస్తూ ఉర్రూతలూగించిన అందగత్తెలు

ఈనాడు, హైదరాబాద్: తమ ప్రతిభాపాటవాలను మిస్ వరల్డ్ పోటీదారులు చాటుకున్నారు. పోటాపోటీగా నైపుణ్యాలను ప్రదర్శించారు. గురువారం శిల్ప కళా వేదికగా జరిగిన మిస్ వరల్డ్ టాలెంట్ ఫినాలేలో 24 దేశాల అందగత్తెలు పోటీపడగా ఇండోనేసియా భామ మోనికా కేజియా సెంబిరింగ్ పియానో వాయిస్తూ.. పాటపాడుతూ మైమరిపించి మొదటి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో మిస్ కామెరూన్ ఇస్సే ప్రిన్సెస్ నిలవగా, ఇటలీ భామ చైరా ఎస్పోసిటీ. . తన బ్యాలే నృత్యంతో ఆకట్టుకుని మూడో స్థానం సాధించారు. గురువారం సుమారు మూడు గంటల పాటు హైదరాబాద్ శిల్పకళావేదికలో అద్భుత ప్రదర్శనలు ఇచ్చారు. పోటాపోటీగా సాగిన ఆటపాటలు అందరినీ అలరించాయి.

ప్రతిభతో అలరించారు..

మిస్ వరల్డ్ టాలెంట్ ఫైనల్ ఈవెంట్స్‌లో మిస్ వరల్డ్ నైజీరియా చేసిన ఇండో ఆఫ్రికన్ డాన్స్ అందర్నీ ఆకట్టుకుంది. శ్రీలంక భామ ఆ దేశ సంప్రదాయ నృత్యంతో అలరించారు. ఐస్ స్కేటింగ్‌తో అద్భుత విన్యాసాలు చేసిన మిస్ నెదర్లాండ్స్ ప్రత్యేకంగా నిలిచారు. చెక్ రిపబ్లిక్ సుందరీమణి పియానో ద్వారా చక్కటి సంగీతాన్ని వినిపించారు. మిస్ బ్రెజిల్ తన అభిరుచి అయిన కథల గురించి 'ఐ లవ్ స్టోరీస్' అనే అద్భుత గీతం పాడి ఆకట్టుకున్నారు. అర్జెంటీనా సుందరి అర్బన్ డ్యాన్స్‌తో అలరించగా.. ఫ్లోర్ డాన్స్‌తో మైమరిపించిన ఎస్తోనియా సుందరీమణి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అర్బన్ డ్యాన్స్ మూవ్‌మెంట్స్‌తో మిస్ అర్జెంటీనా ఆకట్టుకున్నారు. వేల్స్ కంటెస్టెంట్. . సీపీఆర్ ఎలా చేయాలో వినూత్నంగా ప్రదర్శించారు. ఆస్ట్రేలియా అందగత్తె తన పాటతో అందర్నీ మైమరిపించారు. కెన్యా పోటీదారు డీజే ప్రదర్శనతో ఉర్రూతలూగించారు. చివరగా.. ఇరవై నాలుగు మంది సుందరీమణులు.. 'రానూ బొంబయికి రానూ..' అంటూ తెలుగు జానపద గీతానికి అద్భుతంగా డ్యాన్స్ చేసి మైమరిపించారు.



జానపద గీతానికి నృత్య ప్రదర్శనలో మిస్ వరల్డ్ ఇండియా నందినీ గుప్తా, ఇతర పోటీదారులు



టాలెంట్ ఛాంపియన్ ఇండోనేసియా భామ మోనికా కేజియా సెంబిరింగ్, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన కామెరూన్ సుందరి ఇస్సే ప్రిన్సెస్, ఇటలీ భామ చైరా ఎస్పోసిటీ

నేడు హెడ్ టూ హెడ్ ఫైనల్..

పోటీల్లో భాగంగా శుక్రవారం ట్రైడెంట్ హోటల్‌లో హెడ్ టూ హెడ్ ఫైనల్ జరగనుంది. టీహబ్‌లో రెండురోజుల పాటు నాలుగు గ్రూపులకు చెందిన అందాల భామలు తమ ప్రదర్శనలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో తదుపరి రౌండ్‌కు ఎంపికైన వారు హెడ్ టూ హెడ్ ఫైనల్‌లో పాల్గొంటారు.

భీమవరం నుంచి బ్రిటన్‌కు

- కెన్సింగ్టన్ ఉప మేయర్‌గా ఎన్నిక



బ్రిటన్ మాజీ ప్రధాని రిషిసునాక్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆర్యన్ ఉదయ్

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం తుందుర్రుకు చెందిన ఆర్యన్ ఉదయ్ ఆరేటి యూకేలోని రాయల్ బరో కెన్సింగ్టన్, చెల్సియా ఉప మేయర్‌గా ఎన్నికయ్యారు. భారత కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 11.30 గంటలకు ప్రమాణ స్వీకారం చేసినట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. భీమవరం యువకుడు యూకేలో ఉన్నత పదవి చేపట్టడంపై అతడి బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్థానం ఇదీ: ఇందుర్రు గ్రామానికి చెందిన ఆరేటి వీరాస్వామి, గొబ్బెళ్లమ్మ మనవడు ఉదయ్. ఈయన తండ్రి వెంకటసత్యనారాయణ భీమవరంలోని ఓ ప్రముఖ విద్యాసంస్థ ప్రధానాచార్యుడిగా పని చేశారు. ఉదయ్ సెయింట్‌మేరీ పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్నారు. టెన్నిస్‌పై ఆసక్తితో హైదరాబాద్ వెళ్లి అక్కడే ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం చేశారు. ఆపై భీమవరంలో డిగ్రీ, నరసాపురంలో ఎంబీఏ విద్యాభ్యాసం పూర్తి చేశారు. లండన్‌లో ఎంఎస్ పూర్తి చేసి, యునైటెడ్ కింగ్‌డమ్ తెలుగు సంఘం కార్యదర్శిగా పని చేశారు.

రాజకీయాల ఆసక్తితో..: రాజకీయాలపై ఆసక్తి పెంచుకొని కన్సర్వేటివ్ పార్టీలో చురుగ్గా వ్యవహరించారు. 2018, 2022లో వరుసగా రెండుసార్లు ఆ పార్టీ తరఫున కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. రాయల్ బరో కెన్సింగ్టన్, చెల్సియా కౌన్సిలర్‌గా పని చేస్తూ.. ప్రస్తుతం ఉప మేయర్‌గా ఎన్నికై అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ పదవిలో 2026 వరకు కొనసాగనున్నారు. ప్రస్తుతం బ్రిటన్‌లో కన్సర్వేటివ్ పార్టీ ఇండియా విభాగానికి ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా, యూరోప్ ఇండియా సెంటర్ ఫర్ బిజినెస్ అండ్ ఇండస్ట్రీకి ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నారు. గత బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌కు నమ్మకస్థుడిగా ఉన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, సినీ కథానాయకుడు చిరంజీవిని లండన్‌లో కలిశారు. హైదరాబాద్‌లో ఏర్పడిన టెన్నిస్ పరిచయాలే తనను లండన్ దిశగా నడిపించాయని ఉదయ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

మందులతో లైంగిక నేరగాళ్ల 'వాంఛ'ను తుంచే ప్రయోగం

లండన్: లైంగిక నేరాలకు పాల్పడిన వారిలో శారీరక వాంఛ నిర్మూలించేందుకు మందులు ప్రయోగించే విధానానికి బ్రిటిష్ ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. లైంగిక నేరగాళ్లు మళ్లీ అదే నేరానికి పాల్పడి జైలుకు తిరిగి రాకుండా నిరోధించేందుకు ఈ చర్య ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.. బ్రిటన్‌లో ఖైదీల సంఖ్య అంతకంతకూ పెరిగి జైళ్లు కిక్కిరిసిపోతున్న పరిస్థితికి ఈ చర్య విరుగుడు కాగలదని భావిస్తున్నారు. రసాయన పద్ధతిలో పుంసత్వ నిర్మూలన (కెమికల్ క్యాస్ట్రేషన్) చేసే ఈ పద్ధతిని రెండు ప్రాంతాల్లోని 20 జైళ్లలో అమలుపరుస్తామని న్యాయశాఖ మంత్రి షబానా మహమూద్ పార్లమెంటుకు తెలియజేశారు. ఈ పద్ధతిని తప్పనిసరి చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని ఆమె అన్నారు. మందులు ప్రయోగించి రసాయన పద్ధతిలో పుంసత్వాన్ని నిర్మూలించడం ద్వారా నేరగాళ్లు 60 శాతం మేరకు తిరిగి అదే నేరానికి పాల్పడే అవకాశం లేకుండా పోతుందని షబానా అన్నారు. జర్మనీ, డెన్మార్క్‌లలో స్వచ్ఛంద ప్రాతిపదికన, పోలండ్‌లో నిర్బంధ ప్రాతిపదికన ఈ ప్రయోగం చేసినట్టు ఆమె తెలిపారు. గడచిన 30 ఏళ్ల కాలంలో ఇంగ్లాండ్, వేల్స్‌లలో ఖైదీల సంఖ్య రెట్టింపై 90 వేలకు చేరింది. నేరాల రేటు తగ్గినా ఖైదీల సంఖ్య పెరిగింది.

ఖండాంతర అణు క్షిపణిని పరీక్షించిన అమెరికా

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అత్యంత శక్తిమంతమైన ఖండాంతర అణు క్షిపణి మినిట్‌మ్యాన్-3ను పరీక్షించింది. ఓ పక్క అధ్యక్షుడు ట్రంప్ క్షిపణి రక్షణ వ్యవస్థ గోల్డెన్‌డోమ్ నిర్మిస్తున్నట్లు ప్రకటించిన వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం విశేషం. కాలిఫోర్నియాలోని వాన్డెన్‌బెర్గ్ స్పేస్ బేస్‌లో ఈ పరీక్ష జరిగింది. ఈ క్షిపణి గంటకు 15,000 మైళ్ల వేగంతో.. 4,200 కిలోమీటర్లు ప్రయాణించింది. చివరికి మార్షల్ ఐల్యాండ్స్‌లోని అమెరికా స్పేస్ అండ్ మిసైల్ డిఫెన్స్ కమాండ్‌కు చెందిన బాలిస్టిక్ డిఫెన్స్ టెస్ట్ ప్రదేశానికి చేరింది.

గుజరాత్‌లో 15 కొవిడ్ కేసులు

అహ్మదాబాద్, ముంబయి: సుదీర్ఘ విరామం తర్వాత గుజరాత్‌లో కొత్తగా 15 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో 13 కేసులను అహ్మదాబాద్‌లోనే గుర్తించారు. బాధితులు ఇళ్ల వద్దనే చికిత్స పొందుతున్నారు. తాజా వేరియంట్ అంత తీవ్రమైనది కానందున ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజారోగ్యశాఖ అదనపు డైరెక్టరు డాక్టర్ నీలం పటేల్ గాంధీనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు.

మహారాష్ట్రలో 22% ఇళ్లలో వైరల్ లక్షణాలు

మహారాష్ట్రలో ఇటీవల నిర్వహించిన ఓ సర్వే ప్రకారం.. 22 శాతం ఇళ్లలో ఒకరు లేదా ఇద్దరు వైరల్ ఫీవర్/కొవిడ్ లక్షణాలతో బాధపడుతున్నట్లు తేలిందని ఒక కమ్యూనిటీ సామాజిక మాధ్యమ వేదిక గురువారం వెల్లడించింది. బుధవారం నాటికి మహారాష్ట్రలో 26 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి నమోదైన ఈ కేసుల మొత్తం సంఖ్య 132గా రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

దిల్లీలో భారీ ఉగ్రదాడికి ఐఎస్ఐ కుట్ర

- భగ్నం చేసిన నిఘా సంస్థలు

దిల్లీ: పహల్గాం ఘటన కంటే కొన్ని వారాల ముందే దిల్లీలో భారీ ఉగ్రదాడికి పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ కుట్ర పన్నినట్లు తాజాగా బయటికొచ్చింది. నేపాల్ గూఢచారితో ఐఎస్ఐ పన్నిన ఈ కుట్రను మన నిఘా సంస్థలు సీక్రెట్ ఆపరేషన్‌తో భగ్నం చేశాయి. భారత సాయుధ దళాలకు సంబంధించిన రహస్య పత్రాలు, కీలక ప్రదేశాల ఫొటోలను సేకరించడం కోసం పాక్ ఐఎస్ఐ తమ గూఢచారిని నేపాల్ మీదుగా దిల్లీకి పంపించినట్లు ఈ ఏడాది జనవరిలో ఇంటెలిజెన్స్ ఏజెన్సీలకు సమాచారం అందింది. కేంద్ర సంస్థలతో కలిసి దిల్లీ పోలీసులు సీక్రెట్ ఆపరేషన్ ప్రారంభించారు. అప్పటికే ఆ గూఢచారి అన్సారుల్ మియాన్ అన్సారీ దిల్లీకి చేరుకొని కొన్ని మిలిటరీ డాక్యుమెంట్లను సంపాదించాడు. ఫిబ్రవరి 15న దిల్లీలో అతడిని అరెస్టు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నేపాల్ మీదుగా పాకిస్థాన్‌కు తిరిగివెళ్లేందుకు అన్సారీ ప్రయత్నిస్తుండగా పోలీసులకు చిక్కాడు. అన్సారీకి సాయం చేసిన రాంచీకి చెందిన అజామ్ అనే వ్యక్తిని కూడా పట్టుకున్నారు. వీరిద్దరూ పాక్‌లోని ఐఎస్ఐ హ్యాండ్లర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపినట్లు గుర్తించారు. అనంతరం వీరిద్దరి తిహాడ్ జైలుకు తరలించి విచారించారు. ఈ విచారణలో ఐఎస్ఐ గూఢచర్యం చేసే నెట్‌వర్క్ గురించి అన్సారీ కీలక విషయాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. నేపాల్‌కు చెందిన ఇతడు ఖతార్‌లో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా ఐఎస్ఐకు చెందిన ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతడు అన్సారీని పాకిస్థాన్‌కు తీసుకెళ్లాడు. అక్కడ అతడికి కొన్ని రోజుల పాటు శిక్షణ ఇచ్చి దిల్లీ పంపించినట్లు విచారణలో తేలింది. అనంతరం అజామ్‌తో కలిసి మిలిటరీకి సంబంధించిన రహస్య సమాచారాన్ని సేకరించినట్లు అన్సారీ దర్యాప్తులో అంగీకరించినట్లు సమాచారం. దీనిపై మరింత లోతుగా విచారిస్తున్నట్లు దిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి. దిల్లీలో ఐఎస్ఐ సెల్‌ను పట్టుకోవడంతో భారీ ఉగ్ర కుట్ర తప్పిందంటూ నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి.



గాజాపై అణుబాంబులు వేయాలి

- అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రాండీ ఫైన్ వివాదాస్పద వ్యాఖ్యలు

వాషింగ్టన్: గాజాపై అణుబాంబులతో దాడి చేయాలని అమెరికా కాంగ్రెస్ సభ్యుడు, రిపబ్లికన్ చట్టసభ్యుడు రాండీ ఫైన్ పేర్కొన్నారు. బుధవారం వాషింగ్టన్‌లో ఇజ్రాయెల్ దౌత్యవేత్తల హత్యలపై ఆయన స్పందిస్తూ.. పాలస్తీనా డిమాండే దురుద్దేశపూరితమని అన్నారు. "రెండో ప్రపంచయుద్ధంలో నాజీలతో మనం చర్చలు జరపలేదు. జపాన్ వాళ్లతోనూ లొంగుబాటుపై సంప్రదింపులు చేయలేదు. భేషరతుగా లొంగిపోవడానికి జపాన్‌పై రెండు సార్లు అణుబాంబులు వేశాం. గాజాలోనూ అదే చేయాలి" అని ఫైన్ పేర్కొన్నారు.

✦ గాజాలోకి 200 ట్రక్కులు ప్రవేశిస్తే ఇప్పటివరకు 90 ట్రక్కుల మానవతా సాయం మాత్రమే స్వచ్ఛందసంస్థల దగ్గరకు వచ్చిందని ఐక్యరాజ్యసమితి గురువారం తెలిపింది.

✦ ఇజ్రాయెల్‌పై ఇరాన్ మద్దతు ఉన్న యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు రెండు క్షిపణులు గురువారం ప్రయోగించారు. వాటిని నేలకూల్చామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది

✦ గాజాకు మానవతా సాయం చేరాలని, అక్కడ ప్రజలు అనుభవిస్తున్న బాధకు ముగింపు పలకాలని పోప్ లియో-14 పిలుపునిచ్చారు.




ఇజ్రాయెల్‌-గాజా సరిహద్దులోని కెరెమ్ షాలోమ్ వద్ద ట్రక్కు నుంచి మానవతా సాయాన్ని దించుతున్న దృశ్యం

పాక్ ఆట కట్టించిన 3వేల మంది అగ్నివీరులు

ఇంటర్నెట్ డెస్క్: సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాకిస్థాన్‌ను 'ఆపరేషన్ సిందూర్'తో చావుదెబ్బకొట్టింది భారత సైన్యం. శత్రుదేశం ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను ఎక్కడికక్కడ అడ్డుకుంది. అయితే, ఈ ఆపరేషన్‌లో అగ్నివీరులు కీలక పాత్ర పోషించినట్లు తాజాగా తెలిసింది. ఆర్మీలోని కీలక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలో పనిచేసిన వీరు శత్రుదాడిని సమర్థంగా ఎదుర్కొన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఒక్కో గగనతల రక్షణ వ్యవస్థ యూనిట్‌లో దాదాపు 150-200 మంది చొప్పున మొత్తంగా దాదాపు 3000 మంది అగ్నివీరులు 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొన్నట్లు తెలిపాయి. వీరంతా సరిహద్దుల్లో పలు కీలక సైనిక స్థావరాలు, ఎయిర్‌బేస్‌ల్లో విధులు నిర్వర్తించారు. గన్నర్లు, ఫైర్ కంట్రోల్ ఆపరేటర్లు, రేడియో ఆపరేటర్లు, క్షిపణులు-గన్స్ అమర్చిన భారీ వాహనాలకు డ్రైవర్లుగా అగ్నివీరులు ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు తెలిపాయి.

1971 నాటి ఓటమికి భారత్‌పై ప్రతీకారం తీర్చుకున్నాం

- నోరు పారేసుకున్న పాక్ ప్రధాని



ఇంటర్నెట్ డెస్క్: పహల్గాం ఉగ్రదాడి ఘటన దురదృష్టకరమంటూనే పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మళ్లీ నోరు పారేసుకున్నారు. 1971 యుద్ధం నాటి ఓటమికి తాము ప్రతీకారం తీర్చుకున్నామంటూ అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు. భారత్- పాక్ మధ్య ఇటీవల నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రమాదకర మలుపు తీసుకొని ఉండేదన్నారు. భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో ముజఫరాబాద్‌లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. "పహల్గాం ఘటన దురదృష్టకరం. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు ఏ క్షణంలోనైనా తీవ్ర రూపం దాల్చే పరిస్థితులు కనిపించాయి" అని వ్యాఖ్యానించారు. ఉగ్రదాడి ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు జరపాలని కోరినా భారత్ దాన్ని తిరస్కరించిందన్నారు. పహల్గాం ఘటనపై అంతర్జాతీయ స్థాయి దర్యాప్తునకు తాము సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

తానే రాజునని ప్రకటించుకుంటే సరిపోయేది

- మునీర్ 'ఫీల్డ్ మార్షల్' హోదాపై పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్

లాహోర్: పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు అసీమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్ హోదా ఇవ్వడంపై జైల్లో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ స్పందించారు. "జనరల్ అసీమ్ మునీర్ ఫీల్డ్ మార్షల్ అయిపోయారు. అయితే ఆయన ఆ హోదాకు బదులు తనకు తాను రాజునని ప్రకటించుకుంటే సరిపోయేది. ఎందుకంటే ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఆటవిక రాజ్యం నడుస్తోంది. ఈ ఆటవిక రాజ్యంలో ఒకడే రాజు" అని 'ఎక్స్'లో ఇమ్రాన్‌ఖాన్ పోస్టు చేశారు.

పాక్, బంగ్లా పౌరుల చొరబాటు యత్నాలు!

- అప్రమత్తమైన భద్రతా దళాలు

బహరాయిచ్: భారత్- నేపాల్ అంతర్జాతీయ సరిహద్దు గుండా పాకిస్థాన్, బంగ్లాదేశ్ పౌరులు అక్రమంగా దేశంలోకి ప్రవేశించేందుకు యత్నిస్తున్నారని వస్తున్న నిఘా సమాచారంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఇప్పటికే చొరబాటుదారుల బృందం నేపాల్‌కు చేరుకున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు నిర్ధారించారు. 35-37 మంది బంగ్లాదేశ్, పాకిస్థాన్ వాసులు వారివారి దేశాలను దాటి నేపాల్‌కు చేరుకున్నారని వెల్లడించారు. భారత్-నేపాల్ మధ్య తెరచి ఉన్న సరిహద్దు గుండా చొరబడేందుకు వారు ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు... నిరంతరం సరిహద్దుల్లో తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపాయి.

భారత్‌లోకి చొరబడేందుకు 50 మంది ఉగ్రవాదుల యత్నం

ఆపరేషన్ సిందూర్ జోరుగా జరుగుతున్న వేళ పెద్ద సంఖ్యలో ఉగ్రమూకను భారత్‌లోకి పంపేందుకు పాక్ యత్నించింది. ఈ విషయాన్ని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ధ్రువీకరించింది. మే 8వ తేదీన 45-50 మంది ఉగ్రవాదులను సరిహద్దులు దాటించి భారత్‌లోకి పంపించేందుకు పాక్ దళాలు తీవ్రంగా యత్నించాయని, ఇందుకోసం భారీగా షెల్లింగ్ కూడా చేపట్టినట్లు బీఎస్ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్ఎస్ మండ్ ఓ ఆంగ్ల వార్తా సంస్థకు వెల్లడించారు. చొరబాటు విషయమై ముందే సమాచారం ఉండటంతో ఉగ్రమూకలను సమర్థంగా తిప్పికొట్టామని తెలిపారు.

ఉగ్రవాదులతో ఎన్‌కౌంటర్... జమ్మూలో అమరుడైన జవాను

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ జిల్లాలో ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ జవాను అమరుడయ్యారు. ఎన్‌కౌంటర్‌లో తీవ్రంగా గాయపడిన సైనికుడు చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారని అధికారులు వెల్లడించారు. సింహపోరాలోని ఛత్రా ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు, భద్రతా బలగాలు గురువారం ఉదయం ముమ్మరంగా తనిఖీలు జరిపాయి. ఈ క్రమంలోనే నలుగురు ఉగ్రవాదులను సైన్యం చుట్టుముట్టింది. అనంతరం జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ జవాను తీవ్రంగా గాయపడి మరణించారు.

సుప్రీంకోర్టు ఆదేశానుసారం సిట్ ఏర్పాటు: హరియాణా డీజీపీ

చండీగఢ్: అశోకా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మూదాబాద్ కేసు విషయంలో సుప్రీంకోర్టు ఆదేశానుసారం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను నియమించినట్లు హరియాణా డీజీపీ శత్రుజీత్ కపూర్ గురువారం తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అలీఖాన్‌కు అత్యున్నత న్యాయస్థానం బుధవారం మధ్యంతర బెయిలు మంజూరు చేసినప్పటికీ కేసు కొనసాగుతుందని తెలిపింది.

చైనాలో విరిగిపడ్డ కొండచరియలు

- ఇద్దరి మృతి.. చిక్కుకున్న 19 మంది

బీజింగ్: నైరుతి చైనాలో రెండు వేర్వేరు కొండచరియలు విరిగిపడటంతో ఇద్దరు పౌరులు మృతి చెందారు. మరో 19 మంది చిక్కుకొన్న ఘటన దఫాంగ్ కౌంటీలో చోటు చేసుకుంది. మృతులిద్దరూ చాంగ్షి ప్రాంతానికి చెందినవారు. తెల్లవారుజామున 3 నుంచి 8 గంటల మధ్య 6 నివాసిత భవనాలు, 8 గృహాలపై కొండ చరియలు విరిగిపడినట్లు సమాచారం. పోలీసులు, అత్యవసర సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది బాధితులను కాపాడటానికి సహాయక చర్యలు చేపట్టారు. జాగిలాలు, డ్రోన్లను సైతం వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భౌగోళిక విపత్తుల కింద లెవల్ - 2 ఎమర్జెన్సీని ప్రభుత్వం ప్రకటించింది. చైనా సహజ వనరుల మంత్రిత్వ శాఖ రెస్క్యూ అధికారులకు సహాయకులుగా వర్కింగ్ టీంను పంపింది.